గొప్ప నామము గల, వైభవోపేతుడైన

# అల్లాహ్ తఆలా

('హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ అలైహిస్సలాం
తమ రచనల రూపంలో' అను పుస్తకము నుండి సేకరణ)

*"ప్రాణమిచ్చి తీసుకోవలసి వచ్చినను ఈ ధనము తీసుకోదగినది."*

**అనువాదము**

హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్


**ప్రచురణ**

మన్సూబ బందీ కమిటీ భారత్

(ఖాదియాన్–పంజాబ్)

اللہ تعالیٰ
جَلَّ شَانُہٗ وَعَزَّ اِسْمُہٗ

**Allah Ta'ala**

Jalla Shanuhu wa Azza Ismuhu
(Excerpted from the book
'Hazrat Mirza Ghulam Ahmad Qadiani [as]
apni tahriron ki ru sey')
Urdu

Goppa Naamamau gala, Vaibhavopetudaina
**Allah Ta'ala**
(Telugu)

Telugu Translation
Hafiz Syed Rasool Niyaz


First Edition : 2019
Copies : 1000
Printer : Mansuba Bandi Committee Bharat, Qadian
Published by : Nazarat Nashr-o-Isha'at,
Sadr Anjuman Ahmadiyya Qadian
Dist: Gurdaspur, Punjab, India,143516
Printed at : Fazl-e-Umar Printing Press Qadian


**ఇతర వివరములకు సంప్రదించగలరు**
www.alislam.org
www.ahmadiyyamuslimjamaat.in
Toll Free No: 1800-3010-2131

## తొలి పలుకులు

సుల్తానుల్ కలమ్ (రచనా చక్రవర్తి) హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ 80 కంటే అధిక పుస్తకములు, ప్రవచనముల రూపంలో విద్యా, విజ్ఞానము, వివేకముతో పరిపూర్ణమైన విద్యా నిధిని ప్రపంచమునకు అందించిరి. వీటితో లబ్ధి పొందనిదే ఎవరైనా సరే నిజమైన రీతిలో దైవ ఉనికి జ్ఞానము, హజ్రత్ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం మహా గొప్ప స్థాయి, పవిత్ర ఖుర్ఆన్ వాస్తవములు, విజ్ఞానము, వివేకములను పొందలేరు. అంతేకాక అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం, అతని గ్రంధము పవిత్ర ఖుర్ఆన్ పట్ల స్వచ్ఛమైన ప్రేమ హృదయములో ఏర్పడలేదు. కనుక ఈ ఉద్ధేశములను పొందుటకు వారి పుస్తకములను వివరముగా పఠించుట అత్యంత ఆవశ్యకము.

ఈ పుస్తకము "గొప్ప నామము గల, వైభవోపేతుడైన అల్లాహ్ తఆలా" కీర్తి శేషవులు గౌ॥ సయ్యద్ దావూద్ అహ్మద్ గారి కూర్పు 'హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని తమ రచనల ఆధారముగా' లో గల వివిధ శీర్షికలలోని ఒక శీర్షిక. వారు దీనిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వివిధ పుస్తకముల నుండి పంక్తులను సేకరించి ఎంతో శ్రమ, ప్రయత్నముతో రచించారు. అనగా ఇందులో ముఖ్యమైన శీర్షికల గురించి హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం కాంతివంతమైన పంక్తులను ఒక చోట సమకూర్చినారు. ఉదాహరణకు అల్లాహ్ తఆలా జ్ఞానము, అతని లక్షణములు, అతని సంపూర్ణ విధి నిర్ణయములు, అతని ఉనికిపై సంపూర్ణ విశ్వాసము, ఇస్లాం దృష్టిలో సజీవ దేవుడు. మొ॥. ఇవి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు అల్లాహ్ తఆలాతో గల గొప్ప ప్రేమ, వ్యక్తిగత సంబంధమును సూచించడమే కాక దీనిని చదివిన ప్రతి సత్య స్వభావికునికి అల్లాహ్ తఆలా విజ్ఞానమును

పొందు, అతనితో వ్యక్తిగత సంబంధమును ఏర్పరచుకొనుటకు ప్రోత్సాహము కలుగును. ఈ ప్రాపంచిక, నాస్తిక భయానక కాలములో దేవునితో దూరము, అతని ఉనికి నిరాకరణ సర్వ సాధారణమై పోయిన తరుణంలో అల్లాహ్ తఆలా తన సంపూర్ణ అస్థిత్వము, ఉనికిని తన సృష్టికి పరిచయం చేయుటకు సయ్యద్నా హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను పంపెను. ప్రకాశించుచున్న సూర్యుని వలె ఏకేశ్వరుడైన, సాటిలేని దేవుని వైపు వారు ప్రపంచాన్ని పిలిచి, అతని విజ్ఞాన పద్ధతులను సూచించుచు అతని అస్థిత్వముపై సంపూర్ణ నమ్మకము కలిగించుటకు సజీవ సంకేతములు ప్రదర్శించారు. ఇతరులు కూడ వీటికి సాక్ష్యులుగా యున్నారు. ఈ విషయము కొరకు హుజూర్ అనేక గొప్ప పుస్తకములను రచించినారు. అందుకే దైవ ఉనికి శీర్షికను తెలుసు కొనుటకు, అర్థము చేసుకొనుటకు, అల్లాహ్ తఆలా అస్థిత్వముపై పరిపూర్ణ నమ్మకము, విశ్వాసము కలిగించు కొనుటకు వారి పుస్తకముల పఠన అనివార్యము.

ఇదే ఉద్దేశముతో మజ్లిసె శూరా భారత్ 2015లో ప్రతిపాదించగా హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా ఆమోదముతో మన్సూబ బందీ కమిటీ ఇండియా ఈ పుస్తకమును ప్రచురించుచున్నది. ఈ పుస్తకమును హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ గారు అనువదించగా, షేక్ ఇబ్రాహీం నాసిర్, ముహమ్మద్ అక్బర్ ముబల్లిఘ్ గారలు పునఃపరిశీలించి, ప్రూఫ్ రీడింగ్ చేసిరి. వారికి అల్లాహ్ తఆలా సత్ఫలితము ప్రసాదించుగాక! దీనిని అన్ని విధాలా పాఠకులందరికి లాభదాయకము, శుభదాయకము చేయుగాక! ఆమీన్

ఇట్లు

*హాఫిజ్ మఖ్దూమ్ షరీఫ్*

*నాజిర్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్*

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | అల్లాహ్ తఆలా | I |
| 2. | తొలి పలుకులు | III |
| 3. | అల్లాహ్ తఆలాతో స్వంత అనుభవము | 1 |
| 4. | అల్లాహ్ తఆలా దయానుగ్రహము అందరికి కలుగును | 2 |
| 5. | ఇస్లాం దేవుణ్ణి ప్రకృతి రూపంలో చూడవచ్చును, మానవ హృదయము ద్వారా కనుగొనవచ్చును | 3 |
| 6. | అల్లాహ్ తఆలా ఉనికి అందము, ప్రయోజనము, ఏకత్వమును పవిత్ర ఖుర్ఆన్ బోధించెను | 7 |
| 7. | రెండు రకాల దైవ కరుణలు | 8 |
| 8. | అల్లాహ్ ప్రతి లోపమునకు అతీతుడు | 8 |
| 9. | అల్లాహ్‌కే సకల సంకీర్తనములు | 13 |
| 10. | హిందువుల, ఆర్య సమాజీల భావనలు | 14 |
| 11. | క్రైస్తవుల భావనలు | 16 |
| 12. | అల్లాహ్ తఆలా సహజ గుణములు | 18 |
| 13. | అల్లాహ్ తఆలా శుభములకు కృతజ్ఞతలు (ఉర్దు పద్యము) | 19 |
| 14. | అల్లాహ్ తఆలా గుణములు రెండు రకాలు ఒకటి అంతర్వర్తిత్వ రెండవది సర్వోత్కృష్టమైనది | 20 |

| | | |
|---|---|---|
| 15. | అల్లాహ్ తఆలా సింహాసనమనగా అతని ఏకత్వము, ఉన్నత స్థాయి | 23 |
| 16. | అల్లాహ్ గుణములు మానవ గుణముల వలె కావు | 24 |
| 17. | అల్లాహ్ తఆలా గుణములు శాశ్వతమైనవి | 25 |
| 18. | పవిత్ర ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన కేంద్ర గుణములు | 26 |
| 19. | అల్లాహ్ తఆలా నాలుగు ప్రధాన గుణములు | 32 |
| 20. | అల్లాహ్ తఆలా శక్తి | 63 |
| 21. | అల్లాహ్ తఆలా అనంత గుణములు | 67 |
| 22. | అల్లాహ్ తఆలా సృష్టి, శాసనము | 76 |
| 23. | మానవ విభిన్న ప్రతిభలకు కారణం | 85 |
| 24. | ఆర్యుల తప్పుడు అభిప్రాయముల ఖండన | 91 |
| 25. | క్రైస్తవుల తప్పుడు అభిప్రాయముల ఖండన | 97 |
| 26. | దైవ విజ్ఞానము | 99 |
| 27. | ఖచ్చితమైన నమ్మకము కొరకు ఆసక్తి అవసరము | 106 |
| 28. | పవిత్రత ఎంతో అవసరం | 113 |
| 29. | దైవ శక్తి భూమ్యాకాశములను ఆవహించుకొనుట | 119 |
| 30. | ఇస్లాంలో 'అర్ష్' (సింహాసనము) భావన | 134 |
| 31. | మొదటిది రుబూబియ్యత్ | 138 |
| 32. | రెండవది ప్రత్యక్షమైన అల్లాహ్ తఆలా రహ్మానియ్యత్ | 138 |
| 33. | మూడవది అల్లాహ్ తఆలా రహీమియ్యత్ | 138 |
| 34. | నాలుగవ గుణము మాలికి యౌమిద్దీన్ | 139 |
| 35. | అన్యారాధన వలన కలిగే నష్టములు | 143 |

36. దైవమును స్తుతించు, స్మరించుట గూర్చి పద్యములు
సకల లోకాల సంరక్షకునికి సకల సంకీర్తనములు
(ఉర్దు పద్యము) 152
37. ధార్మికోద్దేశము కొరకు సమర్పణ
(ఉర్దు పద్యము) 154
38. నా సంరక్షకుని గొప్పతనము నిరుపమాణం
(ఉర్దు పద్యము) 154
39. ముబారక్ అహ్మద్ సమాధిపై వ్రాసిన ప్రశంసనీయ
పంక్తులు (ఉర్దు పద్యము) 155
40. ఓ మిత్రులారా! అతణ్ణి ఒంటరిగా అన్వేషించండి
(ఉర్దు పద్యము) 156
41. నా శత్రువులను అవమానపర్చిన అల్లాహ్‌యే పవిత్రుడు
(ఉర్దు పద్యము) 156
42. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కే సకల సంకీర్తనములు
(ఉర్దు పద్యము) 158
43. భూమ్యాకాశముల సృష్టికర్త ఆరాధన
(ఫార్సి పద్యము) 160
44. ఓ అల్లాహ్! నీవే నా కష్టములను తీర్చువాడవు
(ఫార్సి పద్యము) 160
45. ప్రేమ
(ఫార్సి పద్యము) 162
46. ప్రేమ
(ఫార్సి పద్యము) 162

47. సమర్పణ

(ఫార్సి పద్యము) 163

48. అల్లాహ్ వైభవము కొరకు కృషి

(ఫార్సి పద్యము) 164

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

## అల్లాహ్ తఆలాతో స్వంత అనుభవము

ప్రవక్తలందరిపై అవతరించిన అల్లాహ్ తఆలా, హజ్రత్ మూసా అలైహిస్సలాం కలీముల్లాహ్‌పై తూర్ ప్రాంతమున అవతరించిన, హజ్రత్ మసీహ్‌పైన సయీర్ పర్వతమున ఉదయించిన, హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంపై ఫారాన్ పర్వతమున ప్రకాశించిన పవిత్ర సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తఆలా నాపై కూడ ప్రకాశించెను. అతడు నాతో మాట్లాడెను. నాకిట్లు చెప్పెను. ఏ గొప్ప ఉనికి ఆరాధన కొరకు ప్రవక్తలందరు పంపబడినారో ఆ ఉనికి నేను. నేను ఒక్కన్నే పుట్టించువాడను, అధికారిని, నాకు సమానంగా మరెవ్వరు లేరు. నేను పుట్టుక, మరణమునకు అతీతుడను."

*(జమీమ రిసాల జిహాద్ - రూహాని ఖజాయిన్ సంపుటి:17 పుట:29)*

పాపము నుండి దూరమైన తరువాత లభించే జీవితము ఒక ప్రకాశవంతమైన వజ్రము. అది ఎవరి వద్ద లేదు. ఆ ప్రకాశవంతమైన వజ్రమును అల్లాహ్ తఆలా నాకు ప్రసాదించి, ఆ ప్రకాశవంతమైన వజ్రమును పొందు మార్గము చూపాలని నన్ను పంపెను. ఈ మార్గమును అనుసరించిన ప్రతి వ్యక్తి దానిని పొందునని నేను నమ్మకముతో చెప్పగలను. అది లభించే మార్గము ఒక్కటే. అనగా అల్లాహ్ తఆలా నిజమైన జ్ఞానము. వాస్తవానికి ఇదెంతో కష్టమైన, సున్నితమైన సమస్య. ఎందుకనగా ఇదొక కష్టమైన విషయముతో కూడినది. భూమ్యాకాశముల ను చూసి, ఇతర వస్తువుల వివేకవంతమైన, సంపూర్ణ క్రమమును చూసి ఒక సృష్టికర్త వుండవలెనని మాత్రమే తత్వజ్ఞానులు చెప్పగలరు. కాని నేనొక ఉన్నత స్థానమునకు తీసుకెళ్లి, దేవుడున్నాడని స్వంత అనుభవము

లతో చెప్తాను.

*(మల్ఫూజాత్ సంపుటి:2 పుట:112 ముద్రణ 2003)*

మన స్వర్గం మన దేవునిలోనే ఉంది. మేము అతనిలో ప్రతి సౌందర్యాన్నీ సందర్శించినాము కనుకనే మనం అనుభవిస్తున్న నిరతిశయానందం మన దేవునిలోనే ఉంది. ఈ ధనాన్ని సంపాదించ వలసిందే. దీన్ని సంపాదించడానికి జీవితాన్నే వెచ్చించవలసి వస్తుంది. ఈ మాణిక్యం కొనదగినదే. అయితే తనను తానే కోల్పోవలసి వస్తుంది. ఓ దీనులారా! మీరీ చెలిమ వద్దకు చేరండి. అది మీ దాహాన్ని తీరుస్తుంది. నేనేం చెయ్యాలె? ఢంకా మ్రోగించి ఇదిగో ఇతడే మీ దేవుడు అని ప్రకటించవలెనా? ఈ చెవులు వినగలిగే విధంగా ఏ చికిత్స చెయ్యాలె? మీరు అల్లాహ్ వాళ్లు అయితే అల్లాహ్ మీ వాడేనని నమ్మండి ?

*(కష్తీనూహ్ - రూహానీ ఖజాయీన్ సంపుటి:19 పుట:21,22)*

## అల్లాహ్ తఆలా దయానుగ్రహము అందరికి కలుగును

భూమ్యాకాశాలకు దేవుడు జ్యోతి. కనపడే ప్రతి జ్యోతి చిన్నదైనా, పెద్దదైనా ఆత్మలకు సంబంధించింది అయినా, శరీరాలకు సంబంధించింది అయినా స్వతస్సిద్ధమైనదైనా, కల్పితమైనదైనా, గుప్తమైనదైనా, బహిర్గత మైనదైనా, ఆత్మా శ్రయమైనదైనా, పరాశ్రయమైనదైనా అది కేవలం అతని అనుగ్రహ విశేషం. అల్లాహ్ అనుగ్రహం అన్నింటిని మించినదని ఈ లక్షణం సూచిస్తున్నది. అన్ని ప్రసాదాలకు అతడు కారణం. ప్రతి జ్యోతికి అతడు మూల కారణం. అన్ని కృపా విశేషాలకు అతడు స్రోతస్సు. అతని అస్తిత్వమే సకల విశ్వానికి ఆధారం. ఉన్నతులకూ, నిమ్నులకూ అతడే శరణ్యం. శూన్యాంధకారం నుంచి అతడు ప్రతి వస్తువునూ వెలికితెచ్చి దాని ఉనికిని కనపరచే వెలుగును ప్రసాదించినాడు. అతని అస్తిత్వం కంటే భిన్నమైనదేది ఉండదు. శాశ్వతమైనది కాదు. చరాచర పదార్థాలన్నీ అతని అనుగ్రహాన్ని పొందుతున్నవి. భూమి, ఆకాశం, మనిషి, పశువు,

రాళ్లు, చెట్లు, ఆత్మలు, శరీరాలు అతని అనుగ్రహం వల్లనే ఉండగలుగుతున్నవి.

*(బరాహీనె అహ్మదియ్య అధోదీపిక - రూహానీ ఖజాయిన్ సంపుటి:1 పుట:191,192)*

**ఇస్లాం దేవుణ్ణి ప్రకృతి రూపంలో చూడవచ్చును, మానవ హృదయము ద్వారా కనుగొనవచ్చును.**

ప్రకృతి చట్టము, స్వభావ రూపముతో కనిపించే ఇస్లాం దేవుడే నిజమైన దేవుడు. ఏదో క్రొత్త దేవుణ్ణి ప్రవేశపెట్టక మానవ హృదయ జ్యోతి, మానవ స్వభావాము, భూమ్యాకాశములు ప్రవేశపెట్టుచున్న దేవుణ్ణే ఇస్లాం ప్రవేశపెట్టెను.

*(మజ్మూఆ ఇష్తిహారాత్ సంపుటి 2 పుట 12 ద్వితీయ ముద్రణ)*

ఆ సర్వధికారి, నిజమైన, సంపూర్ణ దేవునికి మా ఆత్మ, మా అణువణువు సాష్టాంగము చేయుచున్నది. అతని ద్వారనే ప్రతి ఆత్మ, ప్రాణులలోని ప్రతి అణువు తమ పూర్తి శక్తులతో వెలువడెను. అతని ఉనికి వల్లనే ప్రతి ఒక్కరు మనుగడ సాగించుచుండును. అతనికి తెలియనిది ఏమియును లేదు. అతని అధీనము, అతని పుట్టకకు ఏదియును అతీతము కాదు. తాను స్వయముగా మాట్లాడుచు సంకేతము మాకందించు దేవుణ్ణి మేము ఆ పవిత్ర ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా పొందినందున వారిపై వేలాది శాంతి, ఆశీస్సులు వర్షించుగాక! ఆ (దేవుడు) మహిమాన్విత సంకేతము చూపి తమ ప్రాచీన, సంపూర్ణ శక్తులను, బలముల మెరుపు గల ముఖమును మాకు చూపును. మాకు దేవుణ్ణి చూపించిన ప్రవక్తను మేము పొందినాము. తన సంపూర్ణ శక్తితో ప్రతి వస్తువును సృష్టించిన దేవుణ్ణి పొందినాము. అతని శక్తి ఎంత గొప్పదనగా అతణ్ణి వీడి ఏదియును ఏర్పడలేదు. అతని సహాయము లేనిదే ఏదియును కొనసాగలేదు. ఆ నిజమైన మా దేవుడు అనన్య శక్తులు గల వాడు. అనంత అందము గల వాడు, అనంత ఉపకారము గల

వాడు, అతను తప్ప మరే దేవుడు లేడు.”

*(నసీమె దావత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:19 పుట:363)*

దేవుని ఉనికి పరోక్షమైనది, కనిపించని విధంగా దాగి వున్నది. దానిని మానవులు కేవలం తమ తెలివి తేటలతో అన్వేషించలేరు. ఏ వివేకవంతమైన నిదర్శనము అతని ఉనికి పట్ల స్పష్టమైన నిదర్శనము కాజాలదు. ఎందుకనగా ఈ ప్రపంచ వస్తువులను గమనించి ఒక సృష్టికర్త అవసరమును మాత్రమే తెలివి కనుగొనగలదు. కాని ఒక అవసరమును గుర్తించుట మాత్రమే సరిపోదు. ఎందుకనగా దేవుని అవసరమును గుర్తించి కనులతో చూచి అతడున్నాడని నమ్ముట మరొక విషయము. తెలివితో కూడిన పద్ధతి లోపముతో కూడినది, అసంపూర్ణమై, సందేహాస్పదమైనందున ప్రతి తత్వజ్ఞాని తెలవితో మాత్రమే దేవుణ్ణి గుర్తించలేడు. కేవలం తెలివితో దేవుణ్ణి పొందాలని ఆశించేవారు అనేక మంది తుదకు నాస్తికులుగా మారిపోతారు. భూమ్యాకాశములలోని వస్తువులను గమనించడం వారికి ఎలాంటి ప్రయోజనము కలిగించదు. వారు దేవుని ప్రియుల పట్ల ఎగతాళి చేస్తారు. ప్రపంచములో నిరుపయోగమైన వేలాది వస్తువులను మనము చూడవచ్చునని వారు వాదిస్తారు. మన తెలివినుపయోగించి పరిశోధించినచో సృష్టికర్తను చూపని అనేక వస్తువులు గలవు. వాటి ఉనికి కేవలం వృథా, అనవసరమని తేలును. విచారము! ఒక విషయము తెలియనందున అది లేదని ఋజువు కాదని ఆ అవివేకులకు తెలియదు. తమను తాము గొప్ప వివేకులు, తత్వజ్ఞానులని భావించుచు అల్లాహ్ తఆలా ఉనికిని గట్టిగా నిరాకరించే వ్యక్తులు కొన్ని లక్షల మంది ఈ కాలములో వున్నారు. వారికి ఏదైనా గట్టి వివేకవంతమైన నిదర్శనము లభించినచో దేవుని ఉనికిని నిరాకరించేవారు కాదు. వైభవోపేతుడైన దేవుని ఉనికి పట్ల తెలివి తేటలతో కూడిన ఏదేని నిదర్శనము వారికి లభించినచో వారు ఇంత నిస్సిగ్గు, ఎగతాళి,

అవహేళనతో దేవుని ఉనికిని నిరాకరించేవారు కాదు. తత్వజ్ఞానుల పడవలో కూర్చొని అనుమానాల తుఫానుతో మోక్షము పొందక తప్పక గల్లంతగును. దైవ ఏకత్వ స్వచ్ఛమైన పానీయము అతనికి ఎన్నిటికి లభించదు. నబీ సల్లల్లాహు అలైహి వసల్లంను వీడి దైవ ఏకత్వము లభించవచ్చును, తద్వారా అతను మోక్షము పొందవచ్చుననే ఆలోచన ఎంత బూటకము, దుర్వాసనగలదో ఊహించండి. ఓ అవివేకులారా! దేవుని ఉనికిపై సంపూర్ణ నమ్మకము కలగనంత వరకు అతని ఏకత్వముపై ఎలా నమ్మకము కలుగును. ప్రవక్త సల్లం ద్వారనే నిజమైన దైవ ఏకత్వము లభించునని నమ్మండి. అందుకే మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వేలాది ఆకాశ సంకేతములు చూపి అరబ్‌లోని నాస్తికులు, అధార్మికులతో దైవ ఉనికిని నమ్మించారు. ఇప్పటి వరకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన, పరిపూర్ణ అనుయాయులు ఆయా సంకేతములను నాస్తికుల ముందు ప్రవేశపెట్టుతారు. నిజమైన విషయమేమనగా సజీవమైన దేవుని ప్రత్యక్ష శక్తులను మానవుడు దర్శించనంత వరకు అతని హృదయము నుండి షైతాన్ బయటికి వెళ్లిపోడు, నిజమైన దైవ ఏకత్వము కూడ అతని హృదయములో ప్రవేశించలేదు. అతడు యదార్థముగా దేవుని ఉనికిని నమ్మలేడు, ఈ పవిత్ర, సంపూర్ణ దైవ ఏకత్వము ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వార మాత్రమే లభించును."

*(హఖీఖతుల్ వహీ - రూహాని ఖజాయిన్ సంపుటి 22:పుట:120,121)*

దేవుని అతి సూక్ష్మమైన పనులను కనుగొనుట మానవునికి తగనే తగదని గుర్తుంచుకోగలరు. ఎందుకనగా దేవుని పనులు తెలివి, ఆలోచన, ఊహకందనివి. ప్రపంచ వస్తువుల పూర్వోపరాలు తెలిసినంత మాత్రాన మానవుడు తన విద్యపై గర్వించకూడదు. ఎందుకనగా సముద్రపు ఒక చుక్కలోని కోట్లవ వంతు వలె మానవుని ఆ విద్య చాలా పరిమితమైనది. అల్లాహ్ తఆలాకు అంతు లేనట్లే అతని పనులకు కూడ అంతు లేదు.

అతని ప్రతి పనిలోని వాస్తవికత వరకు చేరుట మానవ శక్తికి అతీతం. అతని ప్రాచీన లక్షణములను చూచి అతని లక్షణములు ఎన్నటికి నిలిచిపోనందున అల్లాహ్ తఆలా ప్రాణులలో ఒక రకమైన ప్రాచీనతత్వము గలదని మనము అనవచ్చును. అనగా ప్రాణులలోని ఏదో ఒక రకము ఆది నుండి కొనసాగుచున్నది. కాని వ్యక్తిగత ప్రాచీనత్వము నిజము కాదు. అయినను అంతము చేయుట, నాశనము చేయుట అను దేవుని లక్షణములు కూడ పనిచేయుచున్నవి, అవెన్నడు నిలిచిపోవు. భూమ్యాకాశములలో గల నక్షత్రములు, గ్రహాల పుట్టుకను తమ శాస్త్రము ప్రకారము అనగా సహజ పద్ధతులలో చేర్చుటకు, ప్రతి పుట్టుకకు కారణములను సృష్టించుటకు చాలా ప్రయత్నించిరి. కాని ఇందులో వారు విఫలమైనారనేదే సత్యము. తమ సహజ అన్వేషణములతో వారు కూడబెట్టిన నిధి మొత్తం అసంపూర్ణమైనది. అందుకే వారు తమ అభిప్రాయాలపై ఎన్నడు నిలువలేక పోయిరి. వారు సృష్టించుకున్న అభిప్రాయాలలో సదా మార్పులు, చేర్పులు జరిగినవి. భవిష్యత్తులో జరుగునది ఎవరికి తెలియదు. వారి పరిశోధలు పూర్తిగా తమ తెలివి, ఆలోచనపై మాత్రమే ఆధారపడి వుండును, దేవుని తరపున ఎలాంటి సహాయము వారికి లభించదు, అందుకే అవి చీకటి నుండి బయటికి రాలేవు. మానవ శక్తి, తెలివి, వివేకమును మించి దేవుని అనేక పనులున్నవను జ్ఞానమును మానవుడు పొంద నంత వరకు ఏ వ్యక్తి కూడ దేవుణ్ణి గుర్తించలేడు. ఈ జ్ఞానపు స్థాయికి చెందక ముందు మానవుడు కేవలం నాస్తికుడగును, దేవుని ఉనికిని నమ్మనే నమ్మడు. దేవుణ్ణి నమ్మినా తాను సృష్టించుకున్న నిదర్శనముల ఫలితముగా తేలిన దేవుణ్ణి మాత్రమే నమ్మును. తన వైభవముతో తనను వ్యక్తపరచే దేవుణ్ణి నమ్మడు. ఆ దేవుని శక్తుల రహస్యములను మానవ తెలివితేటలు కనుగొనలేవు. దేవుని శక్తులు అతి విచిత్రమైనవి, అతి లోతైనవి, అతి సూక్ష్మమైనవని నాకు దేవుడు ఈ

జ్ఞానము ప్రసాదించినప్పటి నుండి తత్వజ్ఞానులని తమను తాము భావించేవారిని నేను పచ్చి అవిశ్వాసులుగా భావిస్తాను. దాగి వున్న నాస్తికులని ఊహిస్తాను. నేను స్వయముగా అనుభవించినదాని ప్రకారము దేవుని అనేక శక్తులను చూచినాను. అవి అస్థిత్వము నుండి ఉనికి దాల్చినవని మాత్రమే మనము చెప్పగలము. ఆయా సంకేతములలోని కొన్ని ఉదాహరణలను నేను వ్రాసినాను. ఆ శక్తి చమత్కారమును చూడని వారు ఏమి చూచినట్లు? మన తెలివి తేటలకు పరిమితమైన శక్తులు మాత్రమే గల దేవుణ్ణి మేము నమ్మము. తన ఉనికి వలె గణనకందని, అనంత, అసమాన్య శక్తులు గల దేవుణ్ణి మేము నమ్ముతాము.

*(చశ్మ మారిఫత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:23 పుట:280-282)*

## అల్లాహ్ తఆలా ఉనికి అందము, ప్రయోజనము, ఏకత్వమును పవిత్ర ఖుర్ఆన్ బోధించెను

దేవుణ్ణి అతి ప్రియమైన ఉనికిగా చేసేందుకు ప్రయత్నించిన బోధనలు పవిత్ర ఖుర్ఆన్‌లో గలవు. ఒక చోట అతని అందము, సౌందర్యమును చూపగా మరో చోట అతని ఉపకారములను గుర్తు చేయించును. ఎందుకనగా ఒకరి ప్రేమ అందము వలన లేదా ఉపకారము వలన హృదయములో నాటుకుపోవును. దేవుడు తన సర్వ విశిష్టతలతో ఒంటరి వాడని వ్రాసివున్నది. అతనిలో ఎలాంటి లోపము లేదు. సర్వ సంపూర్ణ లక్షణములకు అతడు సంకలనం. సకల పవిత్ర శక్తులు అతనిలో కనిపించును. అతడే సర్వ ప్రాణులకు మూలము. మొత్తం శుభములకు చెలిమి. ధర్మ నిర్ణయ దినమునకు అధికారి. అన్ని విషయములు అతని వద్దకే చేరును. దూరమున్నను సమీపములోనే వున్నాడు. సమీపములో వున్నను దూరమున్నాడు. అతడు అందరి కంటే పైన వున్నాడు, కాని అతని కంటే క్రింద మరొకరున్నారని అనలేము. అతడు అన్ని వస్తువుల కంటే గుప్తముగా వున్నాడు, కాని అతని కంటే ఎక్కువ బహిర్గతముగా

మరొక వస్తువున్నదని అనలేము. అతడు స్వయంభువు. అతని వల్లనే ప్రతి వస్తువు గలదు. ప్రతి వస్తువుకు అతను సహాయమందించు చున్నాడు. కాని అతనికి ఏ వస్తువు సహాయమందించలేదు. ప్రతి వస్తువు అతని వల్లనే పుట్టినది. ప్రతి వస్తువు అతని వల్లనే జీవించుచున్నది. అతడు ప్రతి వస్తువును ఆవహించి వున్నాడు. కాని ఎలా ఆవహించాడని అనలేము. భుమ్యాకాశములోని ప్రతి వస్తువునకు కాంతి అతడు. ప్రతి వస్తువు అతని కాంతితోనే ప్రకాశించెను, అతని ఉనికి నీడనే. సకల లోకాలకు అతడే సంరక్షకుడు. ఏ ఆత్మ స్వయముగా పుట్టి, జీవించలేదు. ఆత్మలోని ప్రతి శక్తి అతని నుండి పొందినదే. ఎందుకనగా అది స్వయముగా ఉనికిని పొందలేదు.

## రెండు రకాల దైవ కరుణలు

అతని కరుణ రెండు రకాలు. ఎవరి కర్మలు లేనిదే ఆది నుండి కొనసాగుచున్నది. (1) ఒకటి మన విశ్రాంతి కొరకు సృష్టించబడిన వస్తువులన్నియు ఉదా॥ భూమి, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రము, నీరు, అగ్ని, గాలి. మనకు అవసరమున్న వస్తువులన్ని మనము జన్మించక ముందే మనకు అందించబడెను. మనము ఏ కర్మ చేయక ముందే, మనము పుట్టక ముందే ఇవన్ని సృష్టించబడెను. సూర్యుడు నా కర్మల వలన పుట్టించబడెనని లేదా నా సత్కర్మల వలన భూమి పుట్టించ బడెనని ఎవరు అనగలరు. మానవుడు, అతని కర్మల కంటే ముందే వెలువడిన కరుణ ఇది. ఇదెవరి కర్మల ఫలితము కాదు. (2) రెండవ కరుణ కర్మల వలన ఏర్పడును. దీనిని వివరించవలసిన అవసరం లేదు.

## అల్లాహ్ ప్రతి లోపమునకు అతీతుడు

ఇంకా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇట్లు గలదు. దేవుని ఉనికి ప్రతి లోపమునకు అతీతమైనది. అతని బోధనలను అనుసరించి మానవుడు కూడ లోపముల నుండి పవిత్రునిగా మారాలని అతను ఆశించుచున్నాడు.

అతడిట్లనెను. مَنْ كَانَ فِيْ هٰذِهٖٓ اَعْمٰى فَهُوَ فِي الْاٰخِرَةِ اَعْمٰى وَاَضَلُّ سَبِيْلًا (బనీ ఇస్రాయీల్ 17:73) అనగా ఈ ప్రపంచములో అంధుడైన వాడు, ఆ దేవుణ్ణి దర్శించని వాడు పరలోకములో కూడ అంధునిగా వుండును. అతడు అందరి కంటే ఎక్కువ దారి తప్పిన వాడగును. అంధకారము అతని నుండి దూరము కాదు. ఎందుకనగా దేవుణ్ణి దర్శించుటకు ఈ లోకములోనే భూతములు లభించును. ఈ భూతములను ఈ ప్రపంచము నుండి తన వెంట తీసుకెళ్లని వ్యక్తి పరలోకములో కూడ దేవుణ్ణి చూడలేడు. మానవుడు ఏ ప్రగతి చెందవలెనో, అతని బోధనను అనుసరించి మానవుడు ఎంత వరకు ప్రగతి చెందగలడో అల్లాహ్ తఆలా ఈ సూక్తిలో స్పష్టముగా నచ్చుచెప్పెను. దీని తరువాత అతడు పవిత్ర ఖుర్ఆన్‌లో మరో బోధనను ప్రవేశపెట్టెను. దాని ద్వారా దానిని అనుసరించి ఈ ప్రపంచములోనే దేవుణ్ణి దర్శించవచ్చును. అతడిట్లనెను.

مَنْ كَانَ يَرْجُوْا لِقَآءَ رَبِّهٖ فَلْيَعْمَلْ عَمَلًا صَالِحًا وَّلَا يُشْرِكْ بِعِبَادَةِ رَبِّهٖٓ اَحَدًا (అల్ కహ్ఫ్ 18:111) అనగా ఈ ప్రపంచములోనే నిజమైన దేవుడు, సృష్టికర్తను దర్శించదలచిన వారు ఎలాంటి పీడనము లేని సత్కర్మలు చేయవలెను. అనగా అతని కర్మలు ప్రజలకు చూపించుటకు కాకూడదు. ఆయా కర్మల వలన నేను ఇలాంటి వాడిని, ఇంతటి వాడిననే గర్వము కలుగకూడదు. ఆ కర్మలు లోపము కలిగి వుండకూడదు. అసంపూర్ణముగా వుండకూడదు, స్వంత ప్రేమకు విరుద్ధముగా ఎలాంటి సంజ్ఞ వాటిలో కనిపించకూడదు. అవి సంపూర్ణ సత్యము, విశ్వసనీయత కలిగి వుండవలెను. దీనికి తోడు అన్ని రకాల అన్యారాధన కు అతీతమై వుండవలెను. సూర్యుని కాని, చంద్రున్ని కాని, ఆకాశములో గల నక్షత్రములను కాని, అగ్నిని కాని, నీరు కాని, భూమిలోని మరే వస్తువును కాని ఆరాధించరాదు. ప్రపంచ సామాగ్రికి అంతగా స్థానమివ్వరాదు. వాటిని దేవునికి భాగస్వాములుగా చేయునంతగా గౌరవించరాదు. తమ

ధైర్యము, ప్రయత్నముపై మాత్రమే ఆధారపడకూడదు. ఇది కూడ ఒక రకమైన అన్యారాధనే. అంతా చేసి మేము ఏమియును చేయలేదని భావించవలెను. తమ విద్య పట్ల గర్వపడకూడదు. తమ కర్మను చూచి కూడ గర్వపడకూడదు. తమను తాము ఒక మూర్ఖునిగా మాత్రమే భావించవలెను, సోమరి అని ఊహించుకోవలెను. అల్లాహ్ తఆలా ఆస్థానములో సదా  ఆత్మ సాష్టాంగమై వుండవలెను. దుఆలతో అతని శుభమును తమ కొరకు ఆకర్షించవలెను. అతి దాహము గల, అతి నిస్సహాయుని వలె కావలెను. అప్పుడతని ముందు ఒక పరిశుద్ధమైన, తియ్యని చెలిమ కనబడును. అతి ఉత్సహముతో అతడు ఆ చెలిమ వద్దకు చేరెను. తమ పెదవులను ఆ చెలిమకు ఆనించెను. పుష్టిగా త్రాగనంత వరకు దానిని వీడలేదు. మన అల్లాహ్ పవిత్ర ఖుర్ఆన్‌లో తన విశిష్టతల గురించి ఇట్లనెను.

قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ - اَللّٰهُ الصَّمَدُ - لَمْ يَلِدْ ۙ وَلَمْ يُوْلَدْ - وَلَمْ يَكُنْ لَّهٗ كُفُوًا اَحَدٌ

(ఇఖ్లాస్112:2-5) అనగా మీ అల్లాహ్ తన ఉనికి, లక్షణములపరంగా ఒక్కడే. ఏ ఉనికి అతని వలె ఆది, మొదటి నుండి లేదు అనగా అతడు కాలానికి అతీతుడు. ఎవరి లక్షణములు అతని లక్షణముల వలె లేవు. మానవుని విద్య ఒక శిక్షకునిపై ఆధారపడి వుండడమే కాక పరిమితమైనది. కాని అల్లాహ్ విద్యకు శిక్షకుని అవసరం లేక పోవడమే కాక అది అంతులేనిది. మానువుడు వినుటకు గాలి అవసరమే కాక పరిమితమైనది కూడ. కాని అల్లాహ్ స్వంత శక్తితో వినడమే కాక అంతులేనిది. మానవుడు చూచుటకు సూర్యుని లేదా మరో కాంతి అవసరమే కాక పరిమితమైనది. కాని అల్లాహ్ కాంతి అతని స్వంతమే కాక అపరిమితమైనది. మానవుడు ఏదైనా సృష్టించదలచినచో సామాగ్రి అవసరముండును, సమయము కూడ అవసరముండును, పరిమితమైనది కూడ. కాని అల్లాహ్ పుట్టించు శక్తికి ఏ సామాగ్రి అవసరం లేదు, సమయము అవసరం లేదు,

అపరిమితమైనది. ఎందుకనగా అతని లక్షణములన్నియు సాటిలేనివి, నిరుపమానమైనవి. అతనికి ఎవరు సాటిలేనట్లే అతని లక్షణములకు ఏదియును సాటిలేదు.... ఒక లక్షణములో అతడు లోపము కలిగివున్నచో అతని లక్షణములన్నియు లోపము కలిగివుండును. తన ఉనికి వలె తన లక్షణములన్నిటిలో నిరుపమానము కానంత వరకు అతని ఏకత్వము నిలువదు. ఆ తరువాతి సూక్తి అర్థమేమనగా అల్లాహ్ ఎవరికి కుమారుడు కాడు, అతనికి కుమారుడు లేడు. ఎందుకనగా అతడు స్వయంభువు. అతనికి తండ్రి గాని కుమారుని అవసరం గాని లేదు. విశ్వాసానికి అనుగుణమైన ఈ దైవ ఏకత్వమును పవిత్ర ఖుర్ఆన్ బోధించెను.

*(లెక్చర్ లాహోర్ - రూహాని ఖజాయిన్ సంపుటి:20 పుట:152-155)*

నేను నా జమాఅత్‌నకు ఇట్లు తెలుపవలెనని నన్నుద్దేశించి అల్లాహ్ తఆలా సూచించెను. ప్రాపంచిక కలుషితము లేకుండా, దాంబికము, పిరికితనము లేని విశ్వాసము, సంపూర్ణ విధేయతతో కూడిన విశ్వాసముతో విశ్వసించినవారు అల్లాహ్ తఆలాకు ఎంతగా ఇష్టమైనవారనగా వీరే సత్యమును ఆచరించుచున్నారని అల్లాహ్ తఆలా ప్రకటించును.

ఓ ప్రజలారా! వినండి! మీరు అతనికే పరిమితం కావాలని, భూమ్యాకాశములో ఎవరిని అతనికి భాగస్వాములుగా చేర్చకూడదని మాత్రమే  మీతో అల్లాహ్ తఆలా ఆశించుచున్నాడు. మన దేవుడు గతములో సజీవముగా వున్నట్లే ఇప్పటికి సజీవముగా వున్నాడు. గతములో మాట్లాడినట్లే ఇప్పటికి మాట్లాడుచున్నాడు. గతములో విన్నట్లే ఇప్పటికి వింటున్నాడు. ఈ కాలములో అతడు వింటున్నాడు కాని మాట్లాడడం లేదను ఆలోచన పొరపాటు. అతడు వింటాడు, మాట్లాడుతాడు. అతని లక్షణములన్నియు ప్రాచీనమైనవి, శాశ్వతమైనవి. ఏ లక్షణము రద్దు కాలేదు, ఇక ముందు కాదు. అతడు ఒక్కడే, అతనికి కుమారుడు లేడు, భార్య లేదు. అతడు సాటిలేని నిరుపమానుడు. అతని వలె ఏ వ్యక్తి

ప్రత్యేక లక్షణము కలిగి లేదు. అతనికి సమానముగా మరెవరు లేరు. అతని ఏ శక్తి తక్కువ లేదు. దూరమున్నను అతడు సమీపములోనే వున్నాడు. సమీపములో వున్నను అతడు దూరమున్నాడు. ఉదాహరణలతో అతడు సత్పురుషులకు కనిపించవచ్చును. కాని అతను శరీరము, ఆకృతికి అతీతుడు. అతడు అందరి కంటే పైన వున్నాడు కాని అతని కంటే క్రింద మరొకరున్నారని అనలేము. అతడు సింహాసనముపై వున్నాడు కాని భూమిపై లేడని చెప్పలేము. సర్వ సంపూర్ణ లక్షణములకు కేంద్రమతడు. అతడు నిజమైన పొగడ్తలకు రూపము. అతడు సమస్త విశిష్టతలకు చెలిమ. అతడు సకల శక్తులు గల వాడు. అతడు శుభములన్నిటికి మూలము. ప్రతి వస్తువు తిరిగి అతని వద్దకే చేరును. ప్రతి దేశానికి అతడే యజమాని. ప్రతి పరిపూర్ణత అతనిలో గలదు. అతడు ప్రతి లోపము, బలహీనతకు అతీతుడు. భూమ్యాకాశముల నివాసుల ఆరాధనకు అతడు మాత్రమే అర్హుడు. అతనికి అసాధ్యమైన విషయమేమియును లేదు. సర్వ ఆత్మలు వాటి శక్తులు, మొత్తం వస్తువులు వాటి శక్తులను అతడే పుట్టించెను. అతణ్ణి ఏ వస్తువు ప్రత్యక్ష్యము కాజాలదు. అతడు తన శక్తులు, తన అధికారములు, తన సంకేతములతో తనను తాను వ్యక్తపరచును. అతణ్ణి అతని ద్వారనే మనము పొందగలము. సత్యవంతులకు తాను చేరువగును. తన అధికారములను అతడు వారికి చూపును. అతని సహాయముతోనే అతణ్ణి గుర్తించవచ్చును, అతని ద్వారనే అతని ఇష్టమైన మార్గమును గుర్తించవచ్చును.

అతను శారీరక కనులు లేకుండానే చూడును. శారీరక చెవులు లేకుండానే వినును. శారీరక నాలుక లేనిదే మాట్లాడును. ఇదే విధముగా లేని దానిని సృష్టించుట అతని పనే. స్వప్నములో ఎలాంటి బాహ్యా వస్తువు లేనిదే ఒక ప్రపంచమును సృష్టించునట్లు మీరు చూడగలరు. ప్రతి వినాశన, లేని దానిని వున్నట్లుగా చూపును. ఇదే విధముగా అతని ఇతరత్రా

అధికారములు గలవు. అతని అధికారములను తిరస్కరించువాడు అవివేకి. అతని లోతైన శక్తులు తెలియని వ్యక్తి అంధుడు. అతని స్థాయికి విరుద్ధము కాని లేదా అతని వాగ్దానములకు వ్యతిరేకము కాని విషయములు తప్ప అన్నిటిని అతను చేయును, చేయగలడు. తన ఉనికిలో, లక్షణములలో, పనులలో, శక్తులలో అతడొక్కడే. పవిత్ర ఖుర్ఆన్ తెరిచిన ద్వారము తప్ప అతణ్ణి చేరుటకు ఇతర ద్వారములన్నియు మూయబడినవి.

*(అల్ వసియ్యత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:20 పుట:309-311)*

## అల్లాహ్‌కే సకల సంకీర్తనములు

اَلْحَمْدُ لِلّٰهِ సంపూర్ణ సర్వ లక్షణములకు మూలమైన ఆరాధానార్హుడికే సర్వ సంకీర్తనములు, అతని పేరే అల్లాహ్. నిజమైన ఆరాధ్యదైవము, సంపూర్ణ సర్వ లక్షణములకు మూలము, సకల దుష్టత్వముల నుండి పవిత్రుడు, ఒక్కడు, సాటిలేని వాడు, శుభములన్నిటికి చెలిమ అయిన ఉనికికి పవిత్ర ఖుర్ఆన్ పరిభాషలో పరిపూర్ణ నామము అల్లాహ్. ఎందుకనగా తన వాక్కు అయిన పవిత్ర ఖుర్ఆన్‌లో తన నామము అల్లాహ్‌ను ఇతర సర్వ నామములు, లక్షణములకు నిర్వచనమని సూచించెను. మరే చోట వేరే నామమునకు ఈ స్థానమివ్వలేదు. కనుక అల్లాహ్ అను నామము ఇతర లక్షణములన్నిటిని సూచించును. నామములన్నిటికి, లక్షణములన్నిటికి అది నిర్వచనమైనందున ఇందులో సర్వ సంపూర్ణ లక్షణములున్నవని అర్థము. కావున اَلْحَمْدُ لِلّٰهِ సారాంశమే మనగా బాహ్య రూపములో గాని, అంతర రూపంలో గాని స్వంత పరిపూర్ణత రూపంలో గాని, ప్రకృతి విచిత్ర రూపంలో గాని సకల సంకీర్తనములు అల్లాహ్‌కే ప్రత్యేకించబడినవి. ఇందులో మరెవరు భాగస్వాములు కాలేరు. ఒక వివేకుని తెలివి సరైన ప్రశంసలు, సంపూర్ణ విశిష్టతలను ఆలోచించగలదో లేదా విశ్లేషకుని విశ్లేషణ ఆలోచించగలదో ఆ విశిష్టతలన్నియు అల్లాహ్ తఆలాలో గలవు. ఒక విశిష్టత గలదని

తెలివి సూచించినచో ఒక దురదృష్టవంతుని వలే అది అల్లాహ్‌లో లేనిదేది లేదు. అల్లాహ్ తఆలాలో లేని ఎలాంటి విశిష్టతను ఒక వివేకుని తెలివి సూచించలేదు. మానవుడు ఎంత అధికాధికముగా విశిష్టతలు ఆలోచించగలడో అవన్నియు అతనిలో గలవు. అతడు తన ఉనికి, లక్షణములు, ప్రశంసలన్నిటిలో అన్ని రకాలుగా పరిపూర్ణత కలిగివున్నాడు. దుష్టత్వముల నుండి పూర్తిగా పవిత్రుడు. ఇదెటువంటి సత్యమనగా దీనిచే నిజమైన ధర్మమేదో అసత్య ధర్మమేదో తెలిసిపోవును. ఎందుకనగా అన్ని ధర్మములను గ్రహించినచో సర్వ దుష్టత్వముల నుండి పవిత్రుడైన, సకల సంపూర్ణ సంకీర్తనములు కలిగివున్న అల్లాహ్‌ను ప్రపంచములో నున్న ధర్మములలో ఇస్లాం మాత్రమే సూచించును.

## హిందువుల, ఆర్య సమాజీల భావనలు

సాధారణ హిందువులు తమ దేవతలను పోషకునిలో భాగస్వాములుగా పరిగణిస్తారు. దేవుని పనులలో వారిని శాశ్వతంగా భాగస్వాములని భావిస్తారు. వారు దేవుని ఉద్దేశములను మార్చువారని, అతని నిర్ణయములను తల క్రిందులు చేయగలరని కూడ వారు భావిస్తారు. హిందువులు అనేక మనుషులు, పశువుల పట్లయే గాక మలినము తినే కొన్ని అపవిత్ర పశువులు అనగా పంది మొదలగు వాటి రూపములలో వారి పరమేశ్వరుడు జన్మించి అవి అనుభవించిన మలినములు, చెడులను అనుభవించినాడని, వాటి వలె ఆకలి, దాహము, నొప్పి, బాధ, భయము, దుఃఖము, వ్యాధి, మరణము, అవమానము, అవహేళన, నిరాడంబరత, బలహీనతలకు గురయ్యెనని భావిస్తారు. ఈ విశ్వాసములన్నియు అల్లాహ్ తఆలా విశిష్టతలను అంతము చేసి అతని శాశ్వత, ఆది వైభవము, గొప్పదనమును తగ్గించునని స్పష్టమగును. సమాజపరంగా వారి సోదరులైన ఆర్యా సమాజీలు వేదములను పూర్తిగా ఆచరిస్తారని నమ్ముతారు. అల్లాహ్ తఆలా పుట్టించలేదని కూడ వారందురు. అనగా

ఆత్మలన్ని అతని ఉనికి వలె పుట్టించబడలేదని, ఆది నుండి ఉనికిలో వున్నవని, శాశ్వతంగా కొనసాగుచున్నాయని అంటారు. ప్రపంచానికి యజమాని అయి ఏ వస్తువునకు పోషకుడు లేదా సృష్టి కర్త కాకపోవడాన్ని, ప్రపంచ జీవితము అతని సహాయముతో కాక తన స్వంత ఉనికితో గలదని నిజమైన తెలివి నమ్మదు. అతడు స్వయముగా వస్తువులన్నిటిని సృష్టించి వాటన్నిటికి పోషకుడు, సృష్టికర్త అయినందున ప్రపంచము మొత్తం అతని పోషణ వరకే అంతమగును, సృష్టించే లక్షణము, శక్తి అతని స్వంత ఉనికిలో వున్నను, పుట్టుక, మరణమునకు అతీతుడైనను సృష్టి మొత్తం అతని అధీనములో వున్నను అతను పుట్టించినవి కావనడం, అతని సహాయము లేనిదే జీవించుచున్నవి, తమ ఉనికి, జీవనమునకు అతని అవసరం కలిగి లేవని, అతడు వాటి సృష్టికర్త, యజమాని కాదనక పోవడం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సర్వ సంకీర్తనములకు తగునా అను రెండు ప్రశ్నలు ఉత్పన్నమైనప్పుడు ప్రపంచ యజమాని అయిన అల్లాహ్ ప్రపంచమును సృష్టించలేదనడం, ఆత్మలు, శరీరములలో వున్నటువంటి వివేకవంతమైన లక్షణములు వాటంతట అవే ఏర్పడినవి, వాటిని ఎవరు పుట్టించలేదు, వీటన్నిటి యజమాని అనబడుచున్న అల్లాహ్ ఉత్తుత్తిగానే యజమాని అనబడుచున్నాడని వివేకము నిర్ణయించదు. అతనికి పుట్టించు శక్తి లేదని లేదా బలహీనుడు, అచేతనుడని సూచించడం లేదా అపరిశుభ్రత, మలినమును ఆరగించు అనర్హత, దుష్ట అలవాటును అతనికి అంటగట్టుటకు వివేకము నిర్ణయించదు. అల్లాహ్ తఆలా ఈ మలినములు, నష్టముల నుండి పూర్తిగా పవిత్రుడై వుండాలని, అతనిలో సంపూర్ణత వుండాలని స్పష్టముగా తెలవి సాక్ష్యమిచ్చును. సంపూర్ణ విశిష్టతకు సంపూర్ణ శక్తి అవసరం. అల్లాహ్ తఆలాలో సంపూర్ణ శక్తి లేనప్పుడు, అతడు మరొక వస్తువును పుట్టించ లేనప్పుడు, తన ఉనికిని అన్ని రకాల నష్టము, లోపము నుండి రక్షించుకో లేనప్పుడు అతనిలో సంపూర్ణ విశిష్టత కూడ

లేదు. సంపూర్ణ విశిష్టత లేనందున సకల సంకీర్తనములకు కూడ అతడు అనర్హుడయ్యెను.

**క్రైస్తవుల భావనలు**

ఇది హిందువులు, ఆర్యుల పరిస్థితి. అల్లాహ్ తఆలా వైభవమును క్రైస్తవులు ఏ విధంగా తెలుపుచున్నారనగా దానిని ఒక ప్రశ్నతోనే ఒక మేధావి అర్థము చేసుకోవచ్చును. అనగా ఒక మేధావిని ఇట్లు ప్రశ్నించవలెను. సంపూర్ణమైన ఆ ఉనికి ఆది నుండి వున్న, స్వయంభువుడైన, మరొకరి సహాయం అవసరం లేకున్నా, ఆది నుండి అతను చేయుచున్న తన కార్యములలో అతనికి ఏ తండ్రి లేదా కుమారుని అవసరం లేకుండా సర్వ ప్రపంచాన్ని సృష్టించెను. తాను స్వయముగా సర్వ ఆత్మలు, శరీరములకు వాటికి అవసరమున్న శక్తులు ప్రసాదించెను. తానే సర్వ సృష్టికి రక్షకుణిగా, సంరక్షకుణిగా, ఆలోచనాకర్తగా యుండడమే గాక అవి పుట్టక ముందే వాటి జీవితానికి అవసరమున్న వాటన్నిటిని తన పరమకారుణ్యమూర్తి అను లక్షణముతో పుట్టించెను. ఒకరి కర్మలకు ఎదురుచూడకుండానే సూర్యున్ని, చంద్రున్ని, ఇతర అనన్య నక్షత్రములు, భూమిని, భూమిపై నున్న ఇంకా అనేక వరములను అల్లాహ్ తఆలా కేవలం తన కృపానుసారం మానవుల కొరకు పుట్టించినాడు. ఈ పనులన్నిటిలో ఏ కుమారుని అవసరము అతనికి లేకుండెను. కాని ఆ సంపూర్ణ అల్లాహ్‌యే అంతిమ కాలములో తన సకల వైభవము, అధికారమును పోగొట్టుకొని క్షమించుటకు, మోక్షము ప్రసాదించుటకు ఒక కుమారుని సహాయం ఆశించెను. విచిత్రమేమనగా ఆ కుమారుడు కూడ లోపాల పుట్ట. తండ్రితో అతనికెలాంటి సంబంధము లేదు. తండ్రి వలె అతడు ఆకాశములోని కొంత భాగము లేదా భూమిలోని కొంత భాగమును పుట్టించలేదు. తద్వారా అతని దైవత్వము నిరూపన అగును. ఇంతేకాకా మర్ఖస్‌లోని 8వ అధ్యాయము, 12వ సూక్తిలో అతని బలహీన

స్థితిని ఇట్లు తెలుపబడెను. అతడు తన హృదయములో విచారము వ్యక్తము చేయుచు ఈ కాలపు ప్రజలు సంకేతమునెందుకు అడుగుచున్నారు. నేను మీతో నిజముగా చెప్పుచున్నాను. ఈ కాలపు ప్రజలకు ఎలాంటి సంకేతము ఇవ్వబడదు. అతన్ని శిలువపై ఎక్కించబడినప్పుడు కూడ ఇప్పుడతను మా కనుల ముందు మరల బ్రతికినచో మేము విశ్వసింతుమని యూదులు అనిరి. కాని అతడు తాను మరల బ్రతికినట్లు చూపలేకపోయెను. తన దైవత్వము, సంపూర్ణ శక్తికి సంబంధించిన చిన్న నిదర్శనము కూడ చూపలేదు. కొన్ని మహిమలు చూపినను వాటిని గతములో ప్రవక్తలు తరచుగా చూపడమే కాక ఆ కాలములోనే ఒక హౌజు నీటితో కూడ ఇటువంటి మహిమలు వెలువడినవి. (క్రొత్త నిబంధనలోని యుహన్నా 5వ అధ్యాయము చూడగలరు) సారాంశమేమనగా తాను దేవుడనని ఎలాంటి సంకేతము చూపలేక పోయెను. పైన సూచించిన సూక్తిలో ఈ విషయమును తాను స్వయముగా అంగీకరించిరి. (క్రైస్తవుల కథనము ప్రకారము) ఒక బలహీన స్త్రీ గర్భము నుండి జన్మించి దురదృష్టులు, అభాగ్యుల వలె అవమానము, అమర్యాద, అగౌరము, బలహీనతను జీవితాంతం చూసెను. ఒక సుదీర్ఘ కాలము వరకు అంధకారములో అనగా గర్భములో బంధించబడి మూత్ర విసర్జన చోటు అయిన అపవిత్ర ద్వారము నుండి పుట్టెను. తద్వారా అన్ని రకాల మలినములకు గురయ్యెను. మానవత్వ మలినములు, నష్టములన్నిటిని అపవాదమునకు గురైన ఆ తండ్రి కుమారుడు లోనయ్యెను. అనంతరం అతడు తన మూర్ఖత్వము, అజ్ఞానము, అశక్తిని, తాను సత్యవంతున్ని కాదని తన పుస్తకములో కూడ అంగీకరించెను. అనవసరంగా అ బలహీన దాసుడు దేవుని కుమారునిగా చిత్రీకరించ బడెను. విజ్ఞాన, ఆచరణ ప్రత్యేకతలో కొందరు ఉన్నతులైన ప్రవక్తలకంటే తక్కువ స్థాయి కలిగి వుండెను. అతని బోధన కూడ అసంపూర్ణమైనది. ఎందుకనగా అది మూసా శాసనములోని

ఒక భాగము. కనుక అతడు సర్వ శక్తిమంతుడు, అతడే మొదలు, అతడే శాశ్వతము, తన ఉనికిలో సంపూర్ణము, స్వయంభువుడు, సర్వాధికారాలు కలిగిన అల్లాహ్‌కు తుదకు ఇటువంటి బలహీన కుమారుని అవసరమెందుకు ఏర్పడినది. ఇలా తన వైభవము, గొప్పతనమును ఒక్కసారిగా కోల్పోయెను. అతనిపై ఇదొక ఆరోపణే. సకల సంకీర్తనములకు నిలయమైన ఆ సంపూర్ణ ఉనికి గురించి ఇటువంటి అవమానములను అంటగట్టుటను నేను ఎన్నటికి నమ్మలేను.

*(బరాహీనె అహ్మదియ్య 4 భాగములు-రూహాని ఖజాయిన్*

*సంపుటి:1 పుట:435-441 అథోదీపిక 11)*

## అల్లాహ్ తఆలా సహజ గుణములు

కావున నిజమైన. సంపూర్ణ దేవుడే సకల లోకాల సంరక్షకుడని వాదనలకతీతంగా ప్రతి మానవుడు విధిగా విశ్వసించవలెను. అతని సంరక్షణ ఏ ఒక్క జాతికి పరిమితం కాదు. ఒక నిర్ణీత కాలము లేదా ప్రత్యేక దేశము కొరకు కాదు అతడు సర్వ జాతుల సంరక్షకుడు. అతడే అన్ని కాలములకు, సర్వ లోకాలకు, అన్ని దేశాలకు పోషకుడు. సర్వ శుభములకు మూలము అతడే. ప్రతి శారీరక, ఆధ్యాత్మిక శక్తి అతని నుండే వెలువడును. సృష్టి మొత్తం అతని సంరక్షణే పొందుచున్నది. ప్రతి ఉనికికి ఆధారం అతడే.

అల్లాహ్ అనుగ్రహము (అందరికి సమానమే) సామాన్యమైనది. అది సర్వజాతుల, సర్వదేశాల, సర్వకాలములకు విస్తరించియున్నది. ఏ జాతికి కూడ అభ్యంతరము తెలిపే అవకాశమివ్వకూడదనే ఇట్లు జరిగింది. దేవుడు ఫలానా ఫలానా జాతిని కనికరించెను, కాని మమ్ములను అనుగ్రహించలేదు. సన్మార్గము పొందుటకు ఫలానా జాతికి గ్రంథము లభించినది. కాని మాకు లభించలేదు. ఫలానా కాలములో అల్లాహ్ తఆలా తన దైవవాణి, సువార్తవాణి, మహిమలతో ప్రత్యక్షమయ్యెను. కాని మా

కాలములో అతడు అదృశ్యమయ్యెను. సామాన్య అనుగ్రహమును చూపించి ఇటువంటి అభ్యంతరాలను రూపుమాపెను. అతడు తన విశాల ప్రవర్తనలను చూపి ఏ జాతిని కూడ శారీరక, ఆధ్యాత్మిక అనుగ్రహముల నుండి దూరముంచలేదు. ఏ కాలమును దురదృష్టముగా వదలలేదు.

*(పైఘామె సులహ్ - రూహాని ఖజాయిన్ సంపుటి:23 పుట:442)*

**అల్లాహ్ తఆలా శుభములకు కృతజ్ఞతలు (ఉర్దు పద్యము)**

1. ఓ అల్లాహ్! ప్రతి పనికి మూలము, లోపరహితుడవు నీవే. ఓ నా ప్రియమైన ఉపకారి, నా పోషకుడా!

2. ఓ ఉపకారి! నేను నీకెలా కృతజ్ఞతలు తెలుపగలను. ఈ వ్యాపారము చేయుటకు (కృతజ్ఞతలు తెలుపుటకు) తగిన నాలుక ఎక్కడి నుండి తేగలను.

3. నన్ను ఇష్టపడడము కేవలం నీ కరుణ, అనుగ్రహమే. వాస్తవానికి సేవకుల సంఖ్య నీ ఆస్థానములో తక్కువేమి లేకుండెను.

4. స్నేహితులమని పగల్బాలు పలికే వారందరు శత్రువులైరి. కాని నీవు నన్ను వీడలేదు, నీవే నిజమైన (మిత్రుడవు) అవసరాలు తీర్చువాడవు.

5. ఓ నా సమీప మిత్రుడా! నా ప్రాణ స్నేహితుడా! నీ తోడు నాకు సరిపోవును. నీవు లేనిదే నేను జీవించలేను.

6. నీ ఉపకారము లేనిచో నేను మరణించి మట్టి అయ్యేవాడిని. అనంతరం ఈ ధూళిని ఎక్కడ పడేసేవారో దేవునికే తెలుసు.

7. నీ మార్గములో నా శరీరము, ప్రాణము, హృదయము బలిఅగుగాక! నీ వలె ప్రేమించు మరొకరిని నేను చూడలేదు.

8. ఆరంభము నుండి నీ నీడలోనే నా రోజులు గడిచినవి. బాలింత వలె నేను నీ సహాయ సహకారాలు పొందితిని.

9. నీలో వున్నటువంటి విశ్వసనీయత మానవులలో నేను చూడలేదు. నీ వలె పరామర్శించువానిని నేనెక్కడ చూడలేదు.

10. అసమర్థుడు ఎంపిక కాడని ప్రజలంటారు. కాని నేను అసమర్థుడనై కూడ ఆస్థానములో ఎంపికైనాను.

11. నీ వరములు, బహుమానములు నాపై ఎంతగా పడినవనగా ప్రళయ దినము వరకు వాటిని గణించుట అసాధ్యమగును.

*(బరాహీనె అహ్మదియ్య 5 - రూహానీ ఖజాయిన్ సంపుటి:21 పుట:127)*

**అల్లాహ్ తఆలా గుణములు రెండు రకాలు**

**ఒకటి అంతర్వర్తిత్వ**

**రెండవది సర్వోత్కృష్టమైనది**

బలహీనులైన మానవులకు అల్లాహ్ తఆలా తన సంపూర్ణ విజ్ఞాన జ్ఞానము ప్రసాదించుటకు తన లక్షణములను పవిత్ర ఖుర్ఆన్‌లో రెండు రకాలుగా తెలిపెను. (1) తన లక్షణములు పరోక్షముగా తన సృష్టి అయిన ప్రాణుల లక్షణములు పోలియున్నట్లు తెలిపెను. ఉదా।। అతడు దయామయుడు, పరమ కారుణ్యమూర్తి. ఉపకారి, అతనికి కోపము వచ్చును, అతనిలో ప్రేమ కూడ గలదు, అతనికి హస్తములున్నవి, అతనికి కనులు కూడ వున్నవి, అతనికి మోకాళ్లు వున్నవి, అతనికి చెవులున్నవి, ఇంకో విషయమేమనగా ఆది నుండి పుట్టించు వ్యవస్థ అతనితో ముడిపడి వున్నది. కాని అతనికి బదులుగా మరొకడు వ్యక్తిగతంగా ఆది నుండి జీవించి లేడు. ఒక విభాగములో ఆది నుండి వుండవచ్చు. అది కూడ దేవుని లక్షణమైన పుట్టించుటకు తప్పనిసరి కాదు. ఎందుకనగా పుట్టించుట అతని లక్షణములలో ఒకటైన విధముగనే ఒకప్పుడు ఒంటరి వైభవము, ఒక్కడే వుండుట కూడ అతని లక్షణములలో ఒకటి. ఒక లక్షణము శాశ్వతముగా ఆగిపోవుట సమంజసము కాదు. కాని నిర్ణీత గడువు వరకు ఆగిపోవుటలో అభ్యంతరమేమియును లేదు.

అల్లాహ్ తఆలా మానవున్ని పుట్టించి అతని ఈ పోలికలు గల లక్షణములు అతనికి ప్రసాదించెను. వాటిలో బాహ్య రూపంలో మానవుడు

భాగస్వామి అయ్యేను. ఉదా॥ సృష్టికర్త అగుట. ఎందుకనగా మానవుడు కూడ పరిమిత రూపంలో కొన్ని వస్తువులను పుట్టించును అనగా ఆవిష్కరించును. ఇదే విధంగా మానవున్ని దయాళువు అని కూడ అనవచ్చును. ఎందుకనగా అతడు కూడ తన పరిధిలో కరుణామయ లక్షణము కలిగి వుండును. ఇదే విధంగా మానవున్ని దయామయుడు అని కూడ అనవచ్చును. ఎందుకనగా అతడు తన పరిధిలో దయాగుణము కూడ కలిగివుండును. ఇంకా ఆగ్రహ శక్తి కూడ అతనిలో గలదు. ఇదే విధముగా కనులు, చెవులు మొదలగునవి అతనికి గలవు. కనుక ఈ పోలివున్న లక్షణముల వలన ఈ లక్షణములలో మానవుడు కూడ అల్లాహ్ కు భాగస్వామి అని, దేవుడు మానవున్ని పోలివున్నాడని కొందరికి అనుమానము కలిగే అవకాశముండెను. అందుకే అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ లక్షణములతో పాటు తన ప్రత్యేక లక్షణములను కూడ ప్రస్తావించెను. అవి ఎటువంటి లక్షణములనగా అల్లాహ్ తన ఉనికి, లక్షణములలో ఏమాత్రం మానవునికి భాగస్వామ్యము కల్పించలేదు. అదే విధంగా మానవునికి కూడ అతనిలో ఎలాంటి భాగస్వామ్యము లేదు. అతని పుట్టించుట మానవుని పుట్టించు వలె కాదు. అతని దయ కూడ మానవుని దయ వలె కాదు. అతని ఆగ్రహము కూడ మానవుని ఆగ్రహము వలె కాదు. అతని ప్రేమ కూడ మానవుని ప్రేమ వలె కాదు. మానవుని వలె అతనికి ఎలాంటి గృహము అవసరం లేదు.

దేవుడు తన లక్షణములలో మానవులకతీతంగా యుండు విషయము పవిత్ర ఖుర్ఆన్‌లో అనేక చోట్ల విస్తారంగా ప్రస్తావించబడెను. ఉదా॥ ఇదొక సూక్తి గలదు.

لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ وَهُوَ السَّمِيعُ الْبَصِيرُ

(అష్షూరా 42:12) అనగా 'ఏ వస్తువు తన ఉనికి, లక్షణములలో అల్లాహ్‌కు భాగస్వామి కాదు. అతడు సర్వ దర్శణ శ్రవణ సమర్థుడు.' మరో చోట

ఇట్లు తెలిపెను.

اَللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَ ۚ اَلْحَیُّ الْقَیُّوْمُ ۚ۬ لَا تَاْخُذُهٗ سِنَةٌ وَّلَا نَوْمٌ ؕ لَهٗ مَا فِی السَّمٰوٰتِ
وَمَا فِی الْاَرْضِ ؕ مَنْ ذَا الَّذِیْ یَشْفَعُ عِنْدَهٗۤ اِلَّا بِاِذْنِهٖ ؕ یَعْلَمُ مَا بَیْنَ اَیْدِیْهِمْ
وَمَا خَلْفَهُمْ ۚ وَلَا یُحِیْطُوْنَ بِشَیْءٍ مِّنْ عِلْمِهٖۤ اِلَّا بِمَا شَآءَ ۚ وَسِعَ كُرْسِیُّهُ
السَّمٰوٰتِ وَالْاَرْضَ ۚ وَلَا یَـُٔوْدُهٗ حِفْظُهُمَا ۚ وَهُوَ الْعَلِیُّ الْعَظِیْمُ

(అల్ బఖరహ్ 2:256) అనగా ‘నిజమైన ఉనికి, నిజమైన జీవనము, నిజమైన సర్వ లక్షణములు అల్లాహ్‌కే ప్రత్యేకం. ఎవడు వాటిలో అతనికి భాగస్వామి కాదు. అతడే సంపూర్ణ జీవనుడు. ఇతర ప్రాణులన్ని అతని వల్లనే బ్రతికివున్నవి. తన ఉనికికి తానే కారణం. ఇతర వస్తువులన్ని అతని సహాయముతోనే కొనసాగుచున్నవి. మరణము అతని స్థాయికి తగనట్లే చిన్న స్థాయిలో కూడ స్పృహ ఆగుట అనగా నిద్ర లేదా కునుకు అతనికి తగవు. కాని ఇతరులు మరణమునకు గురి అగునట్లే నిద్ర, కునుకుకు గురగుదురు. మీరు భూమ్యాకాశములలో చూచునదంతయు అతని సొంతం. అతని వల్లనే ఏర్పడినవి, అతని వల్లనే కొనసాగుచున్నవి. అతని ఆదేశము అందనిదే అతని వద్ద సిఫారసు ఎవడు చేయగలడు. ప్రజల ముందున్నది ప్రజల వెనుక యున్నదంతయు అతనికి తెలుసు. అనగా అతని జ్ఞానము ప్రత్యక్ష పరోక్ష విషయములను ఆవహించి వున్నది. అతను కోరినది తప్ప మరెవరు అతని జ్ఞానములోని ఏమియును పొందలేరు. అతని శక్తి, జ్ఞానము భూమ్యాకాశమంతటా ఆవహించి వున్నది. అతను అన్నిటికి ఆసరాగా వున్నాడు. అతనికి ఎవరి ఆసరా అసవరం లేదు. అతను భూమ్యాకాశములు, వాటిలోని వస్తువులన్నిటిని మోయుటలో అలసటకు గురికాదు. లోపము, బలహీనత, అచేతనము అతనికి అంటగట్టుట సమంజసము కాదు.’

## అల్లాహ్ తఆలా సింహాసనమనగా అతని ఏకత్వము, ఉన్నత స్థాయి

మరో చోట ఇట్లు నుడివెను.

إِنَّ رَبَّكُمُ اللهُ الَّذِىْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ فِىْ سِتَّةِ اَيَّامٍ ثُمَّ اسْتَوٰى عَلَى الْعَرْشِ

(అల్‌ఆరాఫ్ 7:55) 'మీ పోషకుడైన దేవుడు భూమ్యాకాశములను ఆరు రోజులలో పుట్టించెను. అనంతరం అతడు సింహాసనమును అధిష్టెంచెను. అనగా భూమ్యా కాశములు, వాటిలోని ప్రతి దానిని పుట్టించి పోలివున్న లక్షణములను ప్రత్యక్షపరచి, ప్రత్యేక లక్షణములను నిరూపించుటకు పవిత్ర, ఒంటరి స్థానము వైపు దృష్టి సారించెను. అది చాలా సున్నితమైన స్థానము. ప్రాణుల నుండి చాలా దూరముగా వున్నది. అర్ష్ అని పిలువబడు ఈ స్థానము చాలా గొప్పది. దీని విశ్లేషణ ఏమనగా మొదట ప్రాణులన్ని లేనప్పుడు అల్లాహ్ తఆలా సున్నితమైన అర్ష్ అనబడు తన ప్రత్యేక స్థానములో మహిమలను ప్రదర్శించుచుండెను. అది ప్రతి ప్రపంచము నుండి ఎత్తుగా, ఉన్నతముగా యున్నది. అది అతని ప్రత్యక్ష ఛాయగా వుండెను. అతని ఉనికి తప్ప మరేమియును లేకుండెను. అనంతరం అతడు భూమ్యాకాశములను, వాటిలోని ప్రతి వస్తువును పుట్టించెను. సృష్టి ఏర్పడిన తరువాత అతను తనను గుప్తముగా వుంచెను. ఈ సృష్టి ద్వారా తాను గుర్తించబడాలని అతను ఆశించెను. కాని అల్లాహ్ తఆలా లక్షణములు శాశ్వతంగా ఎన్నడు ఆగిపోవను విషయమును గుర్తుంచుకోవలెను. అల్లాహ్ తఆలా తప్ప మరెవరు వ్యక్తిగతంగా శాశ్వతంగా వుండలేరు. కాని ఒక రకంగా శాశ్వతమును పొందవచ్చును. అల్లాహ్ తఆలా ఏ లక్షణము కూడ శాశ్వతంగా నిలిచిపోక ఒక నిర్ణీత కాలము వరకు నిలిచిపోవుట అనివార్యము. ఎందుకనగా ఆవిష్కరణ లక్షణము ధ్వంసము చేయు లక్షణము పరస్పరం విరుద్ధమైనవి. కనుక ధ్వంసము చేయు లక్షణపు సంపూర్ణ కాలము వచ్చినప్పుడు ఆవిష్కరణ

కాలము ఒక నిర్ణీత గడువు వరకు నిలిచిపోవును. ఆరంభములో అల్లాహ్ తఆలా ఏకాంత లక్షణ కాలముండెను. ఆ కాలము ఎన్ని సార్లు బహిర్గతమైనదో మనము చెప్పలేము. వాస్తవానికి ఇది శాశ్వతమైనది, అంతము కానిది. సారాంశమేమనగా ఏకాంత లక్షణము ఇతర లక్షణముల కంటే ముందున్నది. అందుకే ఆరంభములో అల్లాహ్ వుండెను, అతనికి తోడు మరెవరు లేకుండెను. అనంతరం అతడు భూమ్యాకాశములను, వాటిలోనున్న వాటిని పుట్టించెను. ఆ సంబంధము వల్లనే అతను తన నామములు దయామయుడు, పరమకారుణ్యమూర్తి, క్షమాగుణ ప్రపూర్ణుడు, పశ్చత్తాపమును ఆమోదించువాడని తెలుపెనని అంటారు. కాని పాపములను మొండిగా చేయువాడు, పశ్చత్తాపపడని వానిని అతడు శిక్షించకుండా వీడడు. పశ్చత్తప్తులను ప్రేమించుననే తన పేరును కూడ అతడు బహిర్గత పరచెను. హింస, దుష్టత్వము, పాపమును వీడని వారి పైన మాత్రమే తన ఆగ్రహము వ్యక్తమగును....

## అల్లాహ్ గుణములు మానవ గుణముల వలె కావు

అతని లక్షణములన్నియు అతని ఉనికికి అనుకూలంగా గలవు. మానవుని లక్షణముల వలె కావు. అతని నేత్రము మొదలగునవి శారీరకంగా, వస్తువు వలె కావు. అతని ఏ లక్షణము మానవుని లక్షణమును పోలి లేదు. ఉదా॥ మానవుడు ఆగ్రహానికి లోనైనప్పుడు తన ఆగ్రహ బాధను మొదట తానే భరించును. ఉద్రేకము, ఆగ్రహము వలన తక్షణమే అతని ఆనందము దూరమై ఒక బాధ అతని హృదయములో ఏర్పడును. ఒక పిచ్చితనము వంటిది అతని మెదడు కెక్కును. అతని స్థితిలో ఒక మార్పు ఏర్పడును. కాని అల్లాహ్ తఆలా ఈ మార్పులకు అతీతుడు. అతని ఆగ్రహము ఎలా వుండుననగా ఒక వ్యక్తి దుష్టత్వమును వీడనిచో తన సహాయమును వెనక్కి తీసుకొనును. తన ప్రాచీన పద్ధతి ప్రకారము ఆగ్రహానికి లోనైన మానవుని వలె అతనితో వ్యవహరించును. అందుకే

పరోక్షముగా ఆ విషయము ఆగ్రహమన బడును. ఇదే విధముగా అతని ప్రేమ మానవుని ప్రేమ వలె కాదు. ఎందుకనగా మానవుడు అధిక ప్రేమ వలన బాధకు కూడ గురగును. ప్రియుడు దూరమైనప్పుడు లేదా విడిపోయినచో అతని ప్రాణానికి బాధ కలుగును. కాని అల్లాహ్ తఆలా ఈ బాధలకు అతీతుడు. ఇదే విధముగా అతని సామీప్యము కూడ మానవుని సామీప్యము వలె కాదు. ఎందుకనగా మానవుడు ఒకనికి దగ్గరైనప్పుడు తన మొదటి స్థలమును వీడును. కాని అల్లాహ్ సమీపములో వున్నను దూరముండును. దూరమున్నను దగ్గరుండును. ఉద్దేశమేమనగా అల్లాహ్ ప్రతి లక్షణము మానవుని లక్షణము కంటే భిన్నముగా వుండును. కేవలం పదములలోనే పోలిక గలదు తప్ప ఇంతకు మించి మరేమియును లేదు. అందుకే అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇట్లనెను. لَيۡسَ كَمِثۡلِهٖ شَىۡءٌ (అష్షూరా 42:12) అనగా ఏదియును తన ఉనికి లక్షణములలో అల్లాహ్ తఆలాకు సమానంగా లేదు.

*(చశ్మ మారిఫత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:23 పుట:272-276)*

**అల్లాహ్ తఆలా గుణములు శాశ్వతమైనవి**

అల్లాహ్ ఎన్నడు రద్దు కాడు. సదా సృష్టికర్త, సదా ఆహారము నొసంగువాడు, సదా పోషకుడు, సదా దయామయుడు, సదా పరమ కారుణ్యమూర్తిగా వున్నాడు, వుండును. ఇటువంటి మహా గొప్ప వైభవము గల వాని గురించి చర్చించుట నా దృష్టిలో పాపమగును. ఉదాహరణతో నిరూపించనిదే దేనిని ఒప్పించదలచలేదు.

*(మల్ఫూజాత్ సంపుటి:2 పుట:637 ముద్రణ 2003)*

నక్షత్రములు తరచుగా ఉదయించినట్లే అల్లాహ్ తఆలా లక్షణములు కూడ ఉదయించుచుండును. ఒక్కో సారి మానవుడు అల్లాహ్ తఆలా వైభవ, స్వయంభువు స్వంత నీడ క్రిందికి వచ్చును. మరొక్కసారి ఆప్యాయత లక్షణముల నీడకు చేరుకొనును. దీనిని సూచించుచు అల్లాహ్

తఆలా ఇట్లనెను. كُلَّ يَوۡمٍ هُوَ فِیۡ شَاۡنٍ (అర్రహ్మాన్ 55:30) నేరస్తులు నరకములో పడవేయబడిన తరువాత శాశ్వతంగా అల్లాహ్ తఆలా దయామయ, కరుణామయ లక్షణములు అంతమైపోవును, మరెన్నడు అవి బహిర్గతము కావని భావించుట పూర్తిగా అవివేకమగును. ఎందుకనగా అల్లాహ్ తఆలా లక్షణములు అంతమగుట అసాధ్యము. వాస్తవానికి అల్లాహ్ తఆలా నిజమైన లక్షణములు దయ, కరుణయే. అవే లక్షణములకు మూలము. ఒక్కో సారి మానవుని సంస్కరణ కొరకు అవే వైభవ, ఆగ్రహ లక్షణముల రూపములో ఉద్రేకించును. సంస్కరణ జరిగిన తరువాత ప్రేమ తమ రూపంలో బహిర్గతమగును. అనంతరం దైవ ప్రసాదముగా సదా కొనసాగును. చీదరించుకునే మానవుని వలె దేవుడు లేడు. అనవసరంగా శిక్షించుటను అతడు ఆశించడు. అతడు ఎవరిని హింసకు గురి చేయడు. ప్రజలే తమను తాము హింసించుకుంటారు. మోక్షమంతా అతని ప్రేమలో గలదు. శిక్ష మొత్తం అతణ్ణి వీడుటలోనే గలదు.

*(చశ్మ మసీహీ - రూహానీ ఖజాయిన్ సంపుటి:20 పుట:370)*

### పవిత్ర ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన కేంద్ర గుణములు

అల్లాహ్ ఉనికికి సాక్ష్యాధారాలు కొన్ని వ్రాసినాము. పవిత్ర ఖుర్ఆన్ చూపిన అల్లాహ్ స్వభావమును తెలుసుకొనుట కూడ అవసరము. కనుక అది ఈ విధముగా అల్లాహ్ గుణాలను స్వభావములను చాటుచున్నది.

هُوَ اللّٰهُ الَّذِیۡ لَاۤ اِلٰهَ اِلَّا هُوَ ۚ عٰلِمُ الۡغَیۡبِ وَ الشَّهَادَةِ ۚ هُوَ الرَّحۡمٰنُ الرَّحِیۡمُ

*(అల్ హశ్ర్ 59:23)*

مٰلِكِ یَوۡمِ الدِّیۡنِ *(అల్ ఫాతిహా 1:4)*

اَلۡمَلِكُ الۡقُدُّوۡسُ السَّلٰمُ الۡمُؤۡمِنُ الۡمُهَیۡمِنُ الۡعَزِیۡزُ الۡجَبَّارُ الۡمُتَكَبِّرُ ؕ

*(అల్ హశ్ర్ 59:24)*

هُوَاللّٰهُ الْخَالِقُ الْبَارِئُ الْمُصَوِّرُ لَهُ الْاَسْمَآءُ الْحُسْنٰى ۗ يُسَبِّحُ لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ

*(అల్ హశ్ర్ 59:25)*

عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ *(అల్ బఖరహ్ 2:21)*

رَبِّ الْعٰلَمِيْنَ ۙ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۙ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ *(అల్ ఫాతిహా 1:2-4)*

اُجِيْبُ دَعْوَةَ الدَّاعِ اِذَا دَعَانِ ۙ *(అల్ బఖరహ్ 2:187)*

اَلْحَيُّ الْقَيُّوْمُ *(అల్ బఖరహ్ 2:256)*

قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ ۚ اَللّٰهُ الصَّمَدُ ۚ لَمْ يَلِدْ ۙ وَلَمْ يُوْلَدْ ۙ وَلَمْ يَكُنْ لَّهٗ كُفُوًا اَحَدٌ ۠

*(అల్ ఇఖ్లాస్ 112:2-6)*

అనగా అల్లాహ్ ఒక్కడే. అతనికి భాగస్వామి ఎవరు లేరు. అతనికి తప్ప ఆరాధ్య దైవము గాని, విధేయత తెలుపవలసిన వారు గాని లేడు. అతనికి భాగస్వామి వున్నచో శత్రువు బలము అతనిని వశపరచుకొనునని సృష్టికర్త అపాయములో పడునని తెలుపనైనది. అతడు తప్ప మరో ఆరాధ్య దైవము లేదు. అనగా ఆ సంపూర్ణమైన ఉన్నతమైన అల్లాహ్ గుణములు, స్వభావము, విశేషముగా అత్యుత్తమమైనవి. సృష్టియందుండి దైవమును గుణములను బట్టి ఎన్నుకొనదలచిన లేక ఉన్నతమైన, ఉచ్చకోటి గుణములు. స్వభావము గల దానిని ఊహించినను అతడు అందరిలో ఉన్నతుడుగా గోచరించును. ఉన్నతుడైన అల్లాహ్ ఆరాధనలో మరొకనిని భాగస్వామిగా చేయుట అన్యాయము. కనబడనివన్నియు అతడు ఎరుగును.

అనగా తనను తానే ఎరుగును. ఎవరు కూడ అతనిని ఊహించలేరు. ఉనికిని తెలుపలేరు. మనము సూర్య చంద్రాదులను, ప్రతి ప్రాణిని చూడవచ్చును. కాని అతనిని చూడలేము. అతడు సర్వము చూడును. అనగా అతడు ప్రపంచమునందున్న ప్రతి దానిని చూడును. అతనికి మరుగున వున్నది ఏదియును లేదు. అల్లాహ్ అయికూడ వస్తువులను గుర్తెరగనిచో అతనికిది తగదు. ప్రపంచ అణువణువును అతడు తమ దృష్టియందుంచును. కాని మానవుడు పెట్టలేడు. ఎప్పుడు ఈ పద్ధతిని సమాప్తించేది, పునరుత్థాన దినమెప్పుడొచ్చేది అతనికి తెలుసు. అతనికి తప్ప మరెవరు ఇట్లెప్పుడగునో ఎరుగరు. కనుక ఈ సర్వ సమయాలను ఎరుగువాడే అల్లాహ్. తరువాత అతడే అనుగ్రహి అనెను. అనగా ప్రాణాల ఉనికిని వారి కార్యాల కంటే ముందు స్వార్థముతో గాని, కార్య ఫలితముగా గాని గాక కేవలము తమ అనుగ్రహము, కనికరముతో వారి కొరకు సౌకర్యములు సమకూర్చెను. ఎట్లనగా మా కార్యముల కంటే ముందు మన కొరకు భూమి, సూర్యుణ్ణి, ఇతర వస్తువులను సృష్టించెను. ఈ కానుకను అల్లాహ్ గ్రంథము పవిత్ర ఖుర్ఆన్ రహ్మానియ్యత్‌గా పేర్కొనెను. ఈ కార్యాన్ని బట్టి అల్లాహ్ రహ్మాన్ అనబడును. తరువాత ఇట్లు నుడివెను. అర్రహీమ్ అనగా ఆ అల్లాహ్ పుణ్య కార్యములకు పవిత్ర ఫలితమొసంగును. ఎవరి కష్టమును కూడ వ్యర్థము పోనియ్యడు. కనుక అతడు రహీమ్ అనబడును. ఈ గుణమును రహీమియ్యత్ అను పేరుతో పిలువబడును. తరువాత "మాలికి యౌమిద్దీన్" అనెను. అనగా న్యాయ దినమునకు అధినేత. ప్రతి వాని ఫలితము తాను స్వయముగా నొసంగును. భూమ్యాకాశముల ప్రభుత్వము అతడు ఎవరికి నొసంగలేదు. తానేమియు చేయక తమ కార్యకర్తలపై భారము వేసి వేరొక చోట విశ్రాంతిగా కూర్చోలేదు. పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు ప్రకటించెను. اَلْمَلِكُ الْقُدُّوْسُ (అల్ హశ్ర్ 59:24) అనగా అల్లాహ్ చక్రవర్తి. అతనియందెట్టి లోపము లేదు.

కాని మానవ రాజకీయములో లోపము లేనిది లేదు. ఉదాహరణకు మొత్తము ప్రజలు దేశము నుండి ప్రస్థానము చేసి మరొక దేశము వైపు పలాయనమైనచో రాజరికమే లేదు. లేదా క్షామమేర్పడి ప్రజలు హాహాకారము చేసినప్పుడు ప్రభుత్వ ఆదాయమెక్కడిది. లేదా మా కంటే నీలో అధికముగా నున్నదేమిటి? అని ప్రజలు వాదించినచో తన యోగ్యతనెట్లు ఋజువు చేయగలడు. కనుక అల్లాహ్ ప్రభుత్వము ఈ విధమైనది కాదు. అతడు ఒకే క్షణములో మొత్తం దేశమును నాశనము చేసి వారి స్థానములో మరో ప్రాణులను పుట్టించగలడు. అతడు ఇట్టి సృష్టికర్త కానిచో అన్యాయమే అతని ప్రభుత్వ లక్ష్యమయ్యేది. ఎందుకనగా ప్రపంచమును ఒక పర్యాయము క్షమించి, విముక్తి నొసంగి మరల మరో ప్రపంచమెక్కడి నుండి తెచ్చేవాడు. మోక్షము పొందిన వారిని జగత్తు నందు పంపుటకు మరల పుట్టే వాడా? అన్యాయ మార్గముతో తాను ఒసంగిన క్షమాపణను, మోక్షమును తిరిగి తీసుకొనువాడా? ఇట్లు చేసినచో అతని దైవత్వములో తేడా ఏర్పడేది. ప్రపంచ రాజుల వలె ఒక లోప భూయిష్ట రాజుగా వుండేవాడు. వారు ప్రపంచము కొరకు శాసనాలు చేసి తమ స్వార్థము కొరకు అన్యాయము చేయవలసి వచ్చిన వెనుకాడరు. అన్యాయమును తమ జన్మహక్కుగా భావిస్తారు. ఒక ఓడను రక్షంచుట కొరకు ఒక పడవలో వున్నవారిని నాశనము చేయుట రాజకీయ శాసములో న్యాయమే గదా? కాని అల్లాహ్‌కు అట్టి నిర్బంధమేదియును లేదు. కనుక అల్లాహ్ సృష్టికర్తగా లేనిచో, ఏదియును పుట్టించువాడు కాడు. అల్లాహ్ ఇటులనే వున్నచో అతడు బలహీన రాజుల వలె న్యాయము విడిచి అన్యాయము చేసి వుండేవాడు. లేదా న్యాయాన్ని పాటించి దైవత్వాన్ని వదిలి వుండేవాడు. కాని అల్లాహ్ ఓడ సర్వశక్తులతో న్యాయముగా నిరంతరముగా ప్రయాణించుచున్నది. తరువాత ఇట్లు నుడివెను.

"అస్సలాము" السَّلٰمُ అనగా సర్వలోపాలకు బాధలకు

కాఠిన్యములకు అతీతుడు. శాంతి నొసంగువాడే అల్లాహ్. అతడే బాధలకు గురైనచో మానవులచే చంపబడినచో తమ సంకల్పములలో విఫలమై వుండినచో హృదయాలు తృప్తి చెందేవా? ఇట్టి అల్లాహ్ మమ్ములను తప్పక ఆపదలకే గురి చేయును గాని రక్షించలేడని భావించువారు. అందుకే అల్లాహ్ అసత్య దేవుళ్ళను గురించి ఇట్లు నుడివెను.

اِنَّ الَّذِيْنَ تَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ لَنْ يَّخْلُقُوْا ذُبَابًا وَّ لَوِ اجْتَمَعُوْا لَهٗ ؕ وَاِنْ يَّسْلُبْهُمُ الذُّبَابُ شَيْـًٔا لَّا يَسْتَنْقِذُوْهُ مِنْهُ ؕ ضَعُفَ الطَّالِبُ وَالْمَطْلُوْبُ ○ مَا قَدَرُوا اللّٰهَ حَقَّ قَدْرِهٖ ؕ اِنَّ اللّٰهَ لَقَوِىٌّ عَزِيْزٌ ○

(అల్ హజ్ 22:74,75)

మీరెవరిని దేవుళ్ళుగా చేసికొనినారో వారందరు ఒకరి కొరకు సహాయము చేసికొనినను, ఒక ఈగను కూడ ఎప్పుడు సృష్టించలేరు. మరి ముందున్న ఏదేని వస్తువును ఈగ గొనిపోయినచో దాని నుండి ఆ వస్తువు తీసికొను శక్తి కూడ వారికి లేదు. వారిని పూజించువారు బుద్ధిహీనులు. వారు శక్తి లేని వారు. అల్లాహ్ ఇట్లుండునా? శక్తిమంతులలో అధిక శక్తిమంతుడు. అందరిని వశపరచుకొనువాడు అల్లాహ్. అతనినెవరు పట్టలేరు. అల్లాహ్ ఎట్లుండవలెనో కూడ వారెరుగరు. శాంతిని ప్రసాదించువాడు తమ కనికరమునకు, మహిమలకు నిదర్శనములు తెలుపువాడు అల్లాహ్ అని తెలుపబడెను. నిజమైన దేవుడిని నమ్మినవాడు సమావేశాలలో గాని, సంఘములో గాని కలవరబడి ఇబ్బందులకు గురికాడు. అల్లాహ్ సన్నిధిలో కూడ పశ్చత్తాపబడడు. ఎందుకనగా వారి వద్ద బలమైన సాక్ష్యాధారాలుండును. కాని కృత్రిమ దేవుణ్ణి నమ్మువాడు ఇబ్బందులకు గురై సాక్ష్యాలు ప్రవేశ పెట్టే బదులు పరిహాసము నుండి

తప్పించుకొనుటకు ఒక తప్పుడు, పనికిరాని దానిని గుప్తముగా బెట్టుటకు ప్రయత్నించును. اَلْمُهَيْمِنُ الْعَزِيْزُ الْجَبَّارُ الْمُتَكَبِّرُ (అల్‌హశ్ర్ 59:24) అతడందరిని కాపాడును, సంరక్షకుడు, సర్వాధికారి, అవక తవక కార్యములను సవరించును. సంపూర్ణ స్వయంభువు అతడే.

هُوَ اللّٰهُ الْخَالِقُ الْبَارِئُ الْمُصَوِّرُ لَهُ الْاَسْمَآءُ الْحُسْنٰى (అల్ హశ్ర్ 59:25) అనగా శరీరములనే గాక ఆత్మలను సృష్టించునట్టి వాడు అల్లాహ్. గర్భము నందు రూపకల్పన చేయువాడతడే. సర్వపుణ్య నామములు అతనివే.

يُسَبِّحُ لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ

(అల్ హశ్ర్ 59:25)

అనగా ఆకాశవాసులే గాక, భూవాసులు కూడ అతని నామమును గౌరవముతో తీసికొందురు. ఈ సూక్తి ద్వారా ఆకాశము నందు కూడ నివసించువారు గలరని, వారు కూడ అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడి వున్నారని తెలియుచున్నది. عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ (అల్ బఖరహ్ 2:20) అనగా అల్లాహ్ సర్వాధికారి, అతనిని నమ్మినవారి కొరకిది తృప్తి, లేనిచో వారు అతనితో ఆశించేదేమిటి? తరువాత ఇట్లనెను.

رَبِّ الْعٰلَمِيْنَ ۙ الرَّحْمٰنِ الرَّحِيْمِ ۙ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○

(అల్ ఫాతిహా 1:2-4)

اُجِيْبُ دَعْوَةَ الدَّاعِ اِذَا دَعَانِ (అల్ బఖరహ్ 2:187) అనగా సర్వలోకాల సంరక్షకుడు, న్యాయ నిర్ణయ దినమునకు అధినేత. ఈ అధికారము మరెవరికి హస్తగతము చేయలేదు. ప్రతి వాని పిలుపును వినువాడు సమాధానమిచ్చువాడు, ప్రార్థనలను స్వీకరించు వాడతడే అనబడెను. اَلْحَيُّ الْقَيُّوْمُ (అల్ బఖరహ్ 2:256) అనగా శాశ్వతముగా వుండువాడు. సర్వ ప్రాణులకు ప్రాణం. అన్నిటికి ఆధారమతడే. అతడు శాశ్వతముగా వుండనిచో అతని జీవితకాలము తెలియక మన కంటే ముందే గడిచిపోవునని, భయమేర్పడునని ఈ విధముగా తెలుపబడినది.

ఆ దేవుడు ఏకైక దేవుడని, అతడు ఎవరి కుమారుడు కాడని, అతనికి కుమారుడు లేడని, అతనికి ఎవరు సమానులు కారని, అతని వలె మరెవరు లేరని తెలుపబడినది.

*(ఇస్లామి ఉసూల్ కి ఫిలాసఫి - రూహాని ఖజాయిన్ సంపుటి:10 పుట:372-376)*

## అల్లాహ్ తఆలా నాలుగు ప్రధాన గుణములు

అల్లాహ్ తఆలాకు నాలగు గొప్ప గుణములు గలవు. ఇతర గుణములకు మూలము. ప్రతి గుణము మన మానవత్వముతో ఒక విషయము ఆశించును. ఆ నాలుగు గుణములిట్లు గలవు. సంరక్షకుడు, అపారదయామయుడు, పరమకారుణ్యమూర్తి, అంతిమ దినమున జరుగు ధర్మ నిర్ణయమునకు అధినేత.

(1) సంరక్షకుడు: ఈ గుణముతో లబ్ది పొందుటకు పూర్తిగా శూన్యమై లేదా శూన్యమైన దానితో సమానమై వుండవలెను. సృష్టిలోని ప్రాణులైనను ప్రాణులు కాకపోయినను దీనితో ఉనికిని పొందుతాయి.

(2)దయామయుడు: ఈ గుణముతో లబ్ది పొందుటకు పూర్తిగా లేనిదై వుండవలెను. అనగా ఉనికిపరంగా శూన్యమై వుండవలెను. ఇది ప్రాణులకు మాత్రమే సంబంధించినది.

(3)కారుణ్యమూర్తి: ఈ గుణముతో లబ్ది పొందుటకు ప్రస్తుత తెలివిగల ఉనికి శూన్యము, నిస్సహాయతను అంగీకరించవలెను. ఇది కేవలం మానవునికి మాత్రమే సంబంధించినది.

(4) అంతిమ దినమున జరుగు ధర్మ నిర్ణయమునకు అధినేత: ఈ గుణముతో లబ్ది పొందుటకు నిస్సహాయ ఆవేదన, మనవి చేయవలెను. బిచ్చగాళ్ల వలె అల్లాహ్ తఆలా ఆస్థానములో పడివుండువారు, శుభము పొందుటకు బీద స్థితిలో చేతులు చాపువారు, హృదయపూర్వకముగా తమను తాము అచేతనంగా భావించుచు అల్లాహ్ తఆలా అధినేత అని విశ్వసించు మానవులకు మాత్రమే ఇది సంబంధించినది.

ప్రపంచములో ఈ నాలుగు దైవ గుణములు పనిచేయుచున్నవి. వీటిలోని కారుణ్యమూర్తి అనే గుణము దుఆ (ప్రార్థన)నకు ప్రేరేపించును. అధినేత అను గుణము భీతి, భక్తి ఆగ్నితో వేడెక్కి నిజమైన వినయము, నిరాడంబరతను పుట్టించును. ఎందుకనగా అల్లాహ్ తఆలా ప్రతిఫల మిచ్చుటకు యమజాని అని ఈ గుణముతో ఋజువగును. తన హక్కుగా భావించి అడుగు అర్హత ఎవరికి లేదు. క్షమాభిక్ష, మోక్షము కేవలం అనుగ్రహముపై అధారపడివున్నది.

*(అయ్యాముసుస్సులహ్ - రూహాని ఖజాయిన్ సంపుటి:14 పుట:242,243)*

ఫాతిహా అధ్యాయములో అల్లాహ్ తఆలా తన నాలుగు గుణముల ను ప్రస్తావించెను. అనగా సకల లోకాల సంరక్షకుడు, దయామయుడు, కారుణ్యమూర్తి, అంతిమ దినమున జరుగు ధర్మ నిర్ణయమునకు అధినేత. ఈ నాలుగు గుణములలో 'సకల లోకాల సంరక్షకుడు' అను గుణమును మొదటగా ప్రస్తావించెను. దీని తరువాత దయామయుడు అను గుణమును ప్రస్తావించెను. అనంతరం కారుణ్యమూర్తి అను గుణమును ప్రస్తావించెను. అన్నిటికంటే చివర అంతిమ దినమున జరుగు ధర్మ నిర్ణయమునకు అధినేత అను గుణమును ప్రస్తావించెను. ఈ వరుస క్రమమును అల్లాహ్ తఆలా ఎందుకు అవలంభించినాడో గమనించవలెను. ఇందులో గల వివేకమేమనగా ఈ నాలుగు గుణముల వరుస సహజమైనది. ఆచరణ రూపంలో కూడ ఇదే క్రమములో ఈ గుణములు బహిర్గతమైతాయి. దీని వివరణ ఇట్లు గలదు. ప్రపంచములో అల్లాహ్ తఆలా శుభము నాలుగు రకాలుగా ప్రత్యక్షమగును. ఒక వివేకి గమనించినచో దీనిని అర్థము చేసుకోవచ్చును. మొదటి శుభము అతి సాధారణమైనది. (ఫైజానె అఆమ్) ఈ శుభము ప్రాణులకు, ప్రాణ రహితులకు, ఆకాశము నుండి మట్టి వరకు అందరికి అందుచున్నది. ప్రతి వస్తువు పుట్టుక, పుట్టిన తరువాత సంపూర్ణ దశకు చేరుట ఈ శుభము ద్వారనే జరుగును. ప్రాణి అయినను

ప్రాణము లేనిదైనను దీనికే లోబడి వుండును. సమస్త అత్మలు, శరీరములు దీనితోనే ప్రత్యక్షమైనవి. ప్రతిది సంరక్షణ పొందును, పొందుచున్నది. ఈ శుభమే సర్వ ప్రపంచ సృష్టికి మూలము. ఒక్క క్షణం ఆగిపోయినా ప్రపంచమంతా అతలాకుతలం అగును. ఇది లేకపోయినచో సృష్టియే పుట్టేది కాదు. ఇది పవిత్ర ఖురఆన్‌లో రుబూబియ్యత్ (సంరక్షణ) అనబడెను. దీని వల్లనే అల్లాహ్ తఆలా పేరు రబ్బుల్ ఆలమీన్ (సకల లోకాల సంరక్షకుడు) అయ్యెను. అతడు మరో చూట కూడ ఇట్లనెను. **وَهُوَ رَبُّ كُلِّ شَيْءٍ** (అల్ అన్‌ఆమ్ 6:165) అనగా 'దేవుడు ప్రతి దానికి సంరక్షకుడు. అతని సంరక్షణను దాటి ప్రపంచము లోని ఏ వస్తువు కూడ లేదు. అందుకే అల్లాహ్ తఆలా ఫాతిహా అధ్యాయములో శుభము కలిగించు గుణములలో మొదటి లక్షణము రబ్బుల్ ఆలమీన్‌ను ప్రస్తావించుచు اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ అనెను. ఎందుకనగా శుభము కలిగించు లక్షణములలో సహజంగానే సంరక్షణ అను ఈ లక్షణమునకు ప్రథమ ప్రాధాన్యత గలదు. అనగా ప్రత్యక్షమగు విధానములో శుభము కలిగించు గుణములన్నిటిలో ఈ గుణమే అన్నిటికంటే మొదట ప్రత్యక్షమగును. ఎందుకనగా ప్రాణి అయినను ప్రాణరహితమైనను దీనికే సంబంధించి యుండును.

శుభము కలిగించుటలో రెండవ స్థానములో గలది సాధరణమైన శుభము. **(ఫైజానె ఆమ్)** ఇందులో మరియు అతి సాధారణమైన శుభములో గల భేదమేమనగా అతి సాధారణమైన సంరక్షణ అందరికి చెందినది. దీని ద్వారనే ప్రపంచమంతా సృష్టించబడెను. ఈ (రెండవ) శుభము పేరు సాధారణమైన శుభము. ఆది నుండి ప్రాణులకు మాత్రమే సంబంధించిన ఇదొక ప్రత్యేకమైన శుభము. అనగా ప్రాణుల పట్ల అల్లాహ్ తఆలా ప్రత్యేక శ్రద్ధ. దీని పేరు సాధారణమైన శుభము. దీని వివరణ ఇట్లు గలదు. అర్హత అనర్హతకతీతంగా ఆత్మలన్నిటికి దీని ద్వారా లబ్ది

కలుగును. ఇది ఎవరి కర్మల ప్రతిఫలము కాదు. ఈ శుభము వల్లనే ప్రతి ప్రాణి జీవించును. నిద్రలేచును, తినును, త్రాగును, ఆపదల నుండి రక్షించబడును, అవసరములను తీర్చుకొనును. ప్రతి ప్రాణికి జీవించుటకు గల అవసరాలన్ని దీని ద్వారా లభించును. ప్రాణులకు శారీరకంగా అవసరమైన ప్రతిది దీని వల్లనే నొసంగబడెను. శారీరకంగానే గాక ఆధ్యాత్మిక శిక్షణ అవసరమున్న వారికి అనగా ఆధ్యాత్మిక అభివృద్ధి ప్రతిభ గలవారికి ఆది నుండి అవసరమున్న ప్రతి నిర్ణీత కాలములో దైవ శాసనము అవతరించుచున్నది. ఈ రహ్మానియ్యత్ అను శుభము ద్వారనే మానవుడు తన కోట్లాది అవసరాలను నెరవేర్చుటలో సఫలమగుచున్నాడు. నివాసము కొరకు పరుపు వంటి పృథ్వీ, వెలుతురు కొరకు సూర్య చంద్రాదులు, శ్వాస తీసుకొనుటకు గాలి, త్రాగుటకు నీరు, తినుటకు వివిధ రకాలైన ఆహారము, వ్యాధుల చికిత్స కొరకు లక్షలాది ఔషధములు, ధరించుటకు విభిన్న రకాల వస్త్రములు, సన్మార్గము పొందుటకు దైవ గ్రంథములు గలవు. నా కర్మల వలన ఈ వస్తువులు పుట్టినవని, నేనే గత జన్మలో సత్కార్యములు చేసిన ఫలితంగా ఈ అనన్య వరములను అల్లాహ్ తఆలా నొసంగెనని ఎవరు ప్రకటించలేరు. వేలాది రకాలుగా ప్రాణులకు లభించుచున్న ఈ శుభము అర్హత లేకున్నను లభించిన ప్రసాదము. ప్రతి ప్రాణి తన సహజ ఉద్దేశ్యమును పొందుటకు, అతని స్వభావములో పెట్టబడిన అవసరాలను తీర్చుకొనుటకు ఇది ఒకరి కర్మల ఫలితము గాక దైవ దయానుగ్రహ ఉద్రేకము వలన లభించుచున్నది. ఈ శుభము వల్లనే మానవునితో పాటు ఇతర ప్రాణులన్నిటి అవసరాలను అల్లాహ్ తఆలా తీర్చుచున్నాడు. వారు వృథా కాకుండా యుండుటకు, వారి ప్రతిభ దాగి వుండకూడదని వారి అవసరాన్ని, అనవసరాన్ని గుర్తించును. ప్రకృతి చట్టమును చూచినచో అల్లాహ్ తఆలా ఉనికిలో ఈ శుభము కలిగించు లక్షణము స్పష్టముగా నిరూపితమగుచున్నది. ఎందుకనగా సూర్యుడు,

చంద్రుడు, భూమి, ఇతర వస్తువులు మొదలగు ఇలాగే ప్రపంచములోని ప్రాణులన్నటి జీవిత ఆధారమైన అవసరాలన్ని ఈ శుభము ద్వారనే వెలు వడుచున్నవనుటను ఏ వివేకి తిరస్కరించలేదు. మానవులు, పశువులు, విశ్వాసులు, అవిశ్వాసులు, సత్కార్యులు, దుష్కార్యులు ప్రతి ఒక్కరు తమ తమ అవసరాల మేరకు పైన సూచించిన ఈ శుభములతోనే లబ్ధి పొందు చున్నారు. ఏ ప్రాణి దీనికి దూరంగా లేదు. ఈ శుభము పేరు పవిత్ర ఖుర్ఆన్‌లో రహ్మానియ్యత్ అని తెలుపబడెను. దీని వల్లనే ఫాతిహా అధ్యాయములో రబ్బుల్ ఆలమీన్ అను గుణము తరువాత రహ్మాన్ అని వచ్చెను. అతిడిట్లనెను. اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ఈ గుణము గురించి పవిత్ర ఖుర్ఆన్‌లోని అనేక చోట్ల సూచన గలదు. వాటిలో ఒకటిట్లు గలదు.

وَاِذَا قِيْلَ لَهُمُ اسْجُدُوْا لِلرَّحْمٰنِ قَالُوْا وَمَا الرَّحْمٰنُ اَنَسْجُدُ لِمَا تَاْمُرُنَا وَزَادَهُمْ نُفُوْرًا ○ تَبٰرَكَ الَّذِيْ جَعَلَ فِي السَّمَآءِ بُرُوْجًا وَّجَعَلَ فِيْهَا سِرٰجًا وَّقَمَرًا مُّنِيْرًا ○ وَهُوَ الَّذِيْ جَعَلَ الَّيْلَ وَالنَّهَارَ خِلْفَةً لِّمَنْ اَرَادَ اَنْ يَّذَّكَّرَ اَوْ اَرَادَ شُكُوْرًا ○ وَعِبَادُ الرَّحْمٰنِ الَّذِيْنَ يَمْشُوْنَ عَلَى الْاَرْضِ هَوْنًا وَّاِذَا خَاطَبَهُمُ الْجٰهِلُوْنَ قَالُوْا سَلٰمًا ○

(అల్ ఫుర్ఖాన్ 25:61–64) అనగా అవిశ్వాసులు, అధర్ములు, నాస్తికులను అపారదయామయుని సన్నిధిలో సాష్టాంగము చేయమని అన్నప్పుడు రహ్మాన్ పట్ల ద్వేషమును తెలుపుచు దయామయుడనగా ఏమిటి? అని ప్రశ్నింతురు. (సమాధానము ఇట్లనెను) దయామయుడనగా అతడొక్కడే ఆకాశములో బురుజులు సృష్టించెను. బురుజులలో సూర్యున్ని, చంద్రున్ని పెట్టెను. అవి విశ్వాసాలకతీతంగా ప్రాణులందరికి కాంతిని అందించును. ఆ దయామయుడే మీ కొరకు అనగా మానవుల కొరకు దివారాత్రులను ఏర్పాటు చేసెను. అవి ఒక దాని తరువాత ఒకటి వచ్చును. తద్వారా

విజ్ఞానమునాశించు వ్యక్తి ఈ సూక్ష్మమైన వివేకముతో లబ్ధి పొంద వచ్చును, మూర్ఖత్వము, నిర్లక్ష్య తెర నుండి మోక్షము పొందవచ్చును. ఈ వరముల పట్ల కృతజ్ఞత తెలుపదలచిన వ్యక్తి కృతజ్ఞత తెలుపవచ్చును. భూమిపై విధేయతతో నడుచువారే దయామయుని నిజమైన దాసులు. మూర్ఖులు వారిని సంబోధించినప్పుడు సమాధానముగా శాంతి, దయాను పదాలతో బదులిస్తారు. అనగా కఠినత్వమునకు బదులు మృదువుగా, దూషణకు బదులు ప్రార్థనలతో దీవిస్తారు. దయామయుని ప్రవర్తనలను అనుస రించుటకు ప్రయత్నింతురు. ఎందుకనగా దయామయుడు కూడ మంచి చెడులకతీతంగా తన దాసులందరికి సూర్యుడు, చంద్రుడు, భూమితో పాటు ఇతర వరములన్నిటితో లబ్ధి కలిగించును.' రహ్మాన్ అను పదము దేవుని కొరకు ఎందుకు వచ్చెననగా అతని దయానుగ్రహము సాధారణంగా మంచి చెడులకతీతంగా అందరిని ఆవరించి యున్నదని ఈ సూక్తులలో స్పష్టముగా తెలుపబడెను. మరో చోట కూడ ఈ దయానుగ్రహము గురించే ఇట్లు చెప్పబడెను. عَذَابِيٓ أُصِيبُ بِهِۦ مَنْ أَشَآءُ ۖ وَرَحْمَتِي وَسِعَتْ كُلَّ شَيْءٍ (అల్ ఆరాఫ్ 7:157) అనగా తగిన వ్యక్తిని నేను నా శిక్షకు గురి చేస్తాను. నా దయ, కరుణ ప్రతి వస్తువును ఆవరించియున్నది. ఇంకా మరో చోట ఇట్లనెను. قُلْ مَن يَكْلَؤُكُم بِٱلَّيْلِ وَٱلنَّهَارِ مِنَ ٱلرَّحْمَٰنِ ۗ (అల్అన్బియా 21:43) అనగా ఆ అవిశ్వాసులు, అవిధేయులతో నీవిట్లనుము. దేవునిలో దయ అను గుణము లేనిచో అతని శిక్ష నుండి తప్పించుకోలేరు. అనగా అతని దయానుగ్రహ ప్రభావము వల్లనే తిరస్కృతులకు, అవిశ్వాసులకు గడువు ఇస్తాడు, వెంటనే శిక్షించడు. మరో చోట ఈ దయానుగ్రహమునే సూచించుచు ఇట్లనెను. أَوَلَمْ يَرَوْا۟ إِلَى ٱلطَّيْرِ فَوْقَهُمْ صَٰٓفَّٰتٍ وَيَقْبِضْنَ ۚ مَا يُمْسِكُهُنَّ إِلَّا ٱلرَّحْمَٰنُ (అల్ముల్క్ 67:20) అనగా వారు తమ తలలపై రెక్కలు వ్యాపింపజేయు, ముడుచుకొనుచున్న పక్షులను చూడలేదా? దయామయునికి తప్ప వాటిని ఆపువాడెవడూ లేడు. అనగా దయామయుని శుభము సర్వ ప్రాణులను ఎలా ఆవరించియున్నదనగా

ఒక్క పైసాకు రెండు మూడు దొరికే పక్షులు కూడ ఈ శుభపు విశాల నదిలో సంతోషము, ఆనందముతో జీవించుచున్నవి. సంరక్షణ తరువాత ఈ శుభమే గలదు. కనుక సహజ వరుస క్రమమును దృష్టియందుంచుకొని ఫాతిహా అధ్యాయములో రబ్బుల్ ఆలమీన్ తరువాత ఈ గుణమునే ప్రస్తావించి తాను దయామయుడనను గుణమును ప్రస్తావించెను.

మూడవ రకమైన శుభము ప్రత్యేక శుభము. **(ఫైజానె ఖాస్)** దీనిలో మరియు సాధారణ శుభములో గల తేడా ఏమనగా ఈ సాధారణ శుభములో శుభము పొందువారు శుభము పొందుటకు తమను తాము సత్కార్యులుగా మార్చుకోవలసిన, తమను తాము అంధకార ముసుగుల నుండి బయటికి తీసుకొని పోవలసిన లేక ఎటువంటి ఆసనాలు, ప్రయత్నము చేయవలసిన అవసరం లేదు. మేమిప్పుడే చెప్పినట్లు ఈ శుభములో అల్లాహ్ తఆలా స్వయముగా ప్రతి ప్రాణికి సహజంగా అవసరమున్న అవసరాలన్నిటిని ప్రసాదించును. అడగనిదే, ఎలాంటి ప్రయత్నము చేయనిదే అందించును. కాని ప్రత్యేక శుభములో ప్రయత్నము, శ్రమ, హృదయ పవిత్రత, ప్రార్థన, వినమ్రత, అల్లాహ్ తఆలా వైపు శ్రద్ధ, ఇతర ఆసనాలన్నియు తప్పనిసరి. అన్వేషించువారే ఈ శుభమును పొందుతారు. ఇందుకు ప్రయత్నించిన వారికే ఇది లభించును. కనుక ఈ శుభమును కూడ మనము ప్రకృతిని సందర్శించి గమనించవచ్చును. ఎందుకనగా దైవమార్గములో ప్రయత్నించువారు, నిర్లక్ష్యము వహించు వారు సమానులు కాలేరను విషయము స్పష్టమైనది. మనస్ఫూర్తిగా దైవమార్గములో ప్రయత్నించువారు, ప్రతి అంధకారము, పీడనము నుండి దూరమైన వారు ఒక ప్రత్యేక కరుణకు అర్హులౌతారు. ఈ శుభమును బట్టి పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా నామము రహీమ్ (కారుణ్యమూర్తి) అని గలదు. ఈ కారుణ్యమూర్తి అను గుణము ప్రత్యేకమైనది. కనుక వరుస క్రమంలో దయామయుడు (రహ్మాన్) తరువాత ఈ గుణము

ప్రస్తావించబడెను. ఎందుకనగా రహీమ్ గుణము కంటే ముందే రహ్మాన్ గుణము వెలువడెను. అనంతరం రహీమియ్యత్ ప్రత్యక్షమైనది. ఈ సహజ క్రమము ప్రకారమే ఫాతిహా అధ్యాయములో రహ్మానియ్యత్ గుణము తరువాత రహీమియ్యత్‌ను ప్రస్తావించుచు الرَّحمٰنِ الرَّحيم అనెను. రహీమియ్యత్ గుణము గురించి పవిత్ర ఖుర్ఆన్‌లో అనేక చోట్ల ప్రస్తావన గలదు. ఒక చోట అతడిట్లనెను. وَكَانَ بِالْمُؤْمِنِيْنَ رَحِيْمًا (అల్ అహ్జాబ్ 33:44) అనగా అల్లాహ్ రహీమియ్యత్ విశ్వాసులకు ప్రత్యేకమైనది. తిరస్కృతులు, అవిశ్వాసులు దీని నుండి లబ్ది పొందలేరు.

ఇచట ఎటువంటి రహీమియ్యత్ గుణమును అల్లాహ్ తఆలా విశ్వాసితో జోడించెనో గమనించవలెను. కాని రహ్మానియ్యత్‌ను అల్లాహ్ తఆలా విశ్వాసుల కొరకు ప్రత్యేకమని ఎక్కడా తెలుపలేదు. ఎక్కడ కూడ كَانَ بِالْمُؤْمِنِيْنَ رَحْمَانًا అని సూచించలేదు. విశ్వాసులకు ఏ కరుణ ప్రత్యేకించ బడినదో ప్రతి చోట రహీమియ్యత్ అను గుణముతోనే ప్రత్యేకించబడెను. మరో చోట ఇట్లనెను. اِنَّ رَحْمَتَ اللهِ قَرِيْبٌ مِّنَ الْمُحْسِنِيْنَ (అల్ ఆరాఫ్ 7:57) అనగా అల్లాహ్ తఆలా దయ సత్కార్యులకే ప్రత్యేకం. మరో చోట ఇట్లనెను. اِنَّ الَّذِيْنَ اٰمَنُوْا وَالَّذِيْنَ هَاجَرُوْا وَجٰهَدُوْا فِيْ سَبِيْلِ اللهِ ۙ اُولٰٓئِكَ يَرْجُوْنَ رَحْمَتَ اللهِ ؕ وَاللهُ غَفُوْرٌ رَّحِيْمٌ (అల్‌బఖరహ్2:219) నిశ్చయముగా విశ్వసించినవారు,అల్లాహ్ కొరకు దేశాంతర గతులై లేదా తమ తుచ్ఛ కోరికల నుండి దూరమైనారు, అల్లాహ్ ఆశయము కొరకు యుద్ధములు చేయువారే అల్లాహ్ దయను ఆశింతురు. అల్లాహ్ క్షమాగుణ ప్రపూర్ణుడు, పరమ కారుణ్యమూర్తి. అనగా అతని రహీమియ్యత్ శుభము తప్పక దాని అర్హులకు అందును. దానిని కోరిన వారెవరు నిరాశ పడలేదు.

عاشق کہ شد کہ یار بحالش نظر نہ کرد    اے خواجہ درد نیست وگرنہ طبیب ہست

అనగా ప్రియమైన వాని శ్రద్ధ లేని ప్రియుడుండునా! వైద్యుడు సిద్ధముగా యున్నాడు రోగమే లేనప్పుడు వైద్యుడు చేసేదేమున్నది.

నాలుగవ శుభము అతి ముఖ్యమైనది. **(ఫైజానె అఖస్).** ఈ శుభము కేవలం ప్రయత్నము, కష్టముతో లభించదు. దీనిని పొందుటకు ఒక నిబంధన గలదు. అనగా వస్తువుల ప్రపంచము అంధకారము, చీకటి మయమైనందున పూర్తిగా అంతము కావలెను. వస్తువులను వినియోగించకుండానే అల్లాహ్ తఆలా సంపూర్ణ శక్తి స్పష్టముగా తన కాంతిని చూపవలెను. ఎందుకనగా ఇది చివరి శుభము. అన్ని శుభములకు చివరిది. ఒక తెలివిమంతుని దృష్టిలో గత శుభముల గురించి ఆధిక్యత, పరిపూర్ణత ఆలోచన కలుగవచ్చును. అనగా ఈ శుభము అతి స్పష్టముగా, వివరంగా యుండవలెను. ఇందులో ఎలాంటి సందేహము, రహస్యము లేదా లోపముండకూడదు. అనగా శుభము అందించువాని తరపున ఉద్ధేశపూర్వకంగా ఎలాంటి సందేహము యుండకూడదు. శుభము నిజమైన శుభమై చక్కటి, సంపూర్ణ కరుణ అగుటలో ఎలాంటి అనుమానముండకూడదు. ఏ ప్రాచీన యజమాని తరపున శుభము వెలువడినదో అతని శుభము, ఫలితమిచ్చుట కూడ ప్రకాశించు పగలు వలె స్పష్టము కావలెను. వాస్తవానికి సర్వాధికారి అయిన యజమాని ఉద్ధేశపూర్వకంగా, శ్రద్ధతో, ప్రత్యేక శక్తితో ఒక గొప్ప వరము, ఒక మధురమైన అనుభూతి తనకు ప్రసాదించుచున్నాడని, యదార్థముగనే తనకు తన సత్కర్మల అతి చక్కటి, మహా గొప్ప, ఇష్టమైన, అతి ప్రియమైన సంపూర్ణ, శాశ్వత ప్రతిఫలము లభించుచున్నదని, ఎలాంటి పరీక్ష, ఆపద కాదని శుభము పొందు వ్యక్తికి గట్టి నమ్మకముండవలెను. సంపూర్ణ, పరిపూర్ణ, శాశ్వత, మహా గొప్ప, కాంతివంతమైన ఈ శుభము పొందుటకు దాసుడు లోపముతో కూడిన, మలిన, అపవిత్ర, ఇరుకైన, పరిమితమైన, తాత్కాలికమైన, అనుమానాస్పద ఇహలోకమును వీడి పరలోకము వైపు మరలవలెను. ఎందుకనగా స్పష్టమైన మహిమలు ఈ శుభముతో వెలువడును. ఇందులో నిజమైన ఉపకారి అందము నేరుగా, గట్టి

నమ్మకము కలుగుట, స్పష్టత, నమ్మకములో ఎలాంటి సందేహముండక పోవడం, మధ్యలో ఇహలోక కారణములు వుండకపోవడం అనివార్యము. ప్రతి సంపూర్ణ పరిజ్ఞాన విషయము గుప్తముగా వుండక బహిర్గతము కావలెను. ఇలాగే శుభము కూడ ప్రతి ఆపద, పరీక్ష మలినముతో సమ్మిళితం లేదని అల్లాహ్ తఆలా స్వయముగా బహిరంగంగా ప్రత్యక్ష పరచవలెను. ఆ శుభములో గొప్ప, సంపూర్ణ దశకు చెందిన అభిరుచులు వుండవలెను. వాటి పవిత్ర, పరిపూర్ణ స్థితి మానవుని హృదయము, ఆత్మ, బాహ్యము, అంతరంగికము, శరీరము, ప్రాణము, ప్రతి ఆధ్యాత్మిక, శారీరక శక్తిని తెలివి, ఆలోచనకు, ఊహకందని విధంగా ఆవరించి యుండవలెను. ఇహలోకము వాస్తవరూపానికి తగనిది, మసకబారిన ముఖము, ఉనికిని నాశనము చేయునట్టిది, అనుమానాస్పద స్థితి, ఇరుకైన మనసు ఆ గొప్ప మహిమలు, ప్రకాశవంతమైన కాంతులు, శాశ్వత కానుకలను భరించలేదు. ఆ పరిపూర్ణ, సంపూర్ణ, శాశ్వత కాంతి కిరణాలు అందులో ఒదగలేవు. కనుక ఇది బహిర్గతమగుటకు పరలోకము అవసరముండును. ఎందుకనగా అది బాహ్య కారణముల చీకటితో సంపూర్ణముగా పవిత్రమై, పరిశుద్ధమై, సర్వశక్తిమంతుడు, వైభవోపేతుడైన అల్లాహ్ తఆలా సంపూర్ణ, స్వచ్ఛమైన దర్శనము. సత్య మార్గమున పూర్తిగా విడిచిన మానవులకు ఈ జీవితములోనే ఆ అతి ముఖ్యమైన శుభపు కొంత భాగము లభించును. ఎందుకనగా వీరు తమ సంకల్పములు, కోరికలను వీడి పూర్తిగా అల్లాహ్ తఆలా వైపు మోకరిల్లుతారు. మరణించక ముందే మరణిస్తారు. బాహ్య రూపంలో వారు ఇహలోకములో యున్నను వారు పరలోకములో జీవిస్తారు. వారు తమ హృదయములను ఇహలోక వస్తువుల నుండి దూరము చేసుకుంటారు, మానవ అలవాట్లను వీడి ఒక్క సారిగా దైవేతరులను చీదరించి మహిమాన్వితమైన పద్ధతిని అవలంభిస్తారు. అందుకే అల్లాహ్ తఆలా కూడ వారితో ఇలాగే వ్యవహరిస్తాడు. ఇతరులు

మరణించినిదే పొందని ప్రత్యేక కాంతులను మహిమాన్వితంగా వారికి ప్రసాదిస్తాడు. సారాంశమేమనగా పైన తెలుపబడిన విషయముల వలన వారు కూడ ఈ అతి ముఖ్యమైన (ఫైజానె అఖస్) కాంతి నుండి కొంత భాగము పొందుతారు. ఈ శుభము అన్ని శుభముల కంటే ప్రత్యేకమైనది. అన్ని శుభములను మించినది. దీనిని పొందువాడు మహా గొప్ప అదృష్టము పొందును. సర్వ సంతోషములకు మూలమైన శాశ్వత ఆనందమును పొందును. దీనిని పొందనివాడు శాశ్వతంగా నరకములో పడవేయబడును. ఈ శుభము వల్లనే అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో తన పేరు مَالِكِ يَوْمِ الدِّينِ (ధర్మ నిర్ణయ దినమునకు అధినేత) అని ప్రస్తావించెను. సంపూర్ణ ఫలితమును సూచించుటకే దీన్ అను పదమునకు ముందు అలిఫ్ పెట్టెను. దాని వివరణ పవిత్ర ఖుర్ఆన్‌లో గలదు. ఆ పరిపూర్ణ ఫలితము ప్రాపంచిక వస్తువులన్నిటికి కేంద్రమైన సంపూర్ణ అధినేత మహిమ లేనిదే ప్రత్యక్ష్యము కాదు. ఈ విషయమునే మరో చోట సూచించుచు ఇట్లనెను. لِمَنِ الْمُلْكُ الْيَوْمَ ۖ لِلَّهِ الْوَاحِدِ الْقَهَّارِ (అల్ ముమిన్ 40:17) అనగా ఆ రోజు పోషకుడైన అల్లాహ్ తఆలా ఇహలోక కారణముల అవసరము లేకుండానే తన మహిమను చూపును. దైవ శక్తి, అల్లాహ్ తఆలా సంపూర్ణ శక్తి తప్ప మిగతావన్ని శూన్యమని స్పష్టముగా భావించబడును, నిరూపితమగును. అప్పుడు సమస్త విశ్రాంతి, సంతోషము, సర్వ ఫలితము, బదులు మొత్తం అల్లాహ్ తఆలాకే చెందును. మిగతావన్ని శూన్యమని అనిపించును. ఎలాంటి తెర, ముసుగు మధ్యలో యుండదు. ఎటువంటి సందేహమునకు ఆస్కారముండదు. అతని కొరకు ఎవరైతే కోల్పోయారో తమను తాము అదృష్టవంతులుగా భావింతురు. వారి శరీరము, ప్రాణము, ఇతర భాహ్యాంతరములు సౌభాగ్యవంతమగును. ఈ గొప్ప సౌభాగ్యము లేకుండా ఏ అవయవము ఖాళీగా యుండదు. ఇచట మాలికి యౌమిద్దీన్ అనే పదములో ఆ రోజు మానవునికి లభించే ఆనందము లేదా శిక్ష,

అభిరుచి లేదా నొప్పికి అసలు కారణము అల్లాహ్ తఆలా ఉనికియే అగును. సంభవించే ప్రతి పనికి అతడే నిజమైన యజమాని అగును. అనగా అతనితో భేటి అగుట లేదా దూరమగుట శాశ్వత సౌభాగ్యము లేదా శాశ్వత దౌర్భాగ్యమునకు కారణమగును. ఈ విధముగా అతన్ని విశ్వసించి, దైవ ఏకత్వమును అనుసరించి, అతని స్వచ్ఛమైన ప్రేమతో తమ హృదయము లను అలంకరించుకొన్న వారిపై ఆ సంపూర్ణ ఉనికి స్పష్టమైన కాంతులు పడును. విశ్వాసము, దైవ ప్రేమ లభించని వారు ఈ ఆనందము, అభిరుచిని కోల్పోయి బాధాకరమైన శిక్షకు గురగుదురు.

ఈ నాలుగు శభములను మేము వివరంగా వ్రాసినాము. రహ్మాన్ అను గుణమును రహీమ్ అను గుణము కంటే ముందే ప్రస్తావించుట అతిముఖ్యమని, సాహిత్యపరంగాను అనివార్యమని స్పష్టమయ్యెను. ఎందుకనగా ప్రకృతిని తిలకించినప్పుడు మొదటగా అల్లాహ్ తఆలా పోషణయే కనిపించును. అనంతరం అతని రహ్మానియ్యత్, ఆ తరువాత అతని రహీమియ్యత్. అనంతరం అతని మాలికి యౌమిద్దీన్. ప్రకృతి పద్ధతిలో యున్న క్రమము ప్రకారము దైవవాణిలో వ్యాఖ్యానించుటయే సంపూర్ణ సాహిత్యమనబడును. ఎందుకనగా వాఖ్యానములో ప్రకృతి క్రమమును వీడుట ప్రకృతి క్రమమును కోల్పోవుట, సహజ క్రమమును తలక్రిందులు చేయుటనబడును. గొప్ప సాహిత్యము కొరకు రచనా వ్యవస్థ సహజ వ్యవస్థను పూర్తిగా పోలియుండుట అనివార్యము. సహజ పద్ధతిలో ముందున్న దానిని, ముందు సంభవించిన దానిని ముందే ప్రస్తావించ వలెను. పైన తెలిపిన సూక్తిలో కూడ గొప్ప సాహిత్యము గలదు. గొప్ప సాహిత్యము, మృదుభాషతో పాటు నిజమైన క్రమమును చిత్రీకరించి చూపెను. ప్రపంచ వ్యవస్థలో స్పష్టముగా ప్రతి ఒక్కరికి కనిపించుచున్న పద్ధతినే అవలంభించెను. అనగా ప్రకృతి ఒడిలో గల దైవ వరముల క్రమమునే దవైవాణిలో పాటించుట కూడ ఎంతో చక్కటి మార్గము.

ఇటువంటి గొప్ప, వివేకవంతమైన క్రమమును ఆరోపించుట వాస్తవానికి బాహ్యాంతర చూపులు ఏకకాలంలో పోగొట్టుకున్న అంధుల పని.

چشم بد اندیش کہ برکندہ باد          عیب نماید ہنرش در نظر

అనగా చెడు కోరు వాని కన్ను పగిలిపోవు గాక! నైపుణ్యము కూడ అతనికి లోపముగా కనిపించును.

మరల విషయమును తెలుపుచు మేమిట్లందుము. పైన తెలిపిన అధ్యాయములో రబ్బుల్ ఆలమీన్ గుణము నుండి మాలికి యౌమిద్దీన్ గుణము వరకు అల్లాహ్ తఆలా ప్రస్తావించెను. పవిత్ర ఖుర్ఆన్ వివరణల ప్రకారము ఆ నాలుగు గుణములు గొప్ప నిదర్శనములు. వాటిని ఇచట మరింత విస్తారముగా ప్రస్తావించుట లాభదాయకమగును. అనగా ప్రపంచ వస్తువులలో గల ప్రతి దానికి పోషకుడు, యజమాని అల్లాహ్‌యే. ప్రపంచములో ఉనికి పొందిన, చూడబడుచున్న లేదా పట్టుకోదగిన లేదా తెలివి ఊహించదగినవన్ని పుట్టించబడినవే. నిజమైన ఉనికి అల్లాహ్ తఆలాకు తప్ప మరెవ్వరికి సాధ్యము కాదు. సారాంశమేమనగా ప్రపంచము, అందులో గలదంతా అల్లాహ్ తఆలా పుట్టించినదే. అల్లాహ్ తఆలా పుట్టించనిది ఏమియును లేదు. అల్లాహ్ తఆలా తన పరిపూర్ణ పోషణతో పాటు ప్రపంచములోని అణువణువునకు యజమాని. అతని పోషణ అనుక్షణం పని చేయుచున్నది. అల్లాహ్ తఆలా ప్రపంచమును పుట్టించి దాని నిర్వహణను వీడి కూర్చునాడు, ప్రకృతి చట్టానికి దానిని అప్పగించినాడు, తాను స్వయముగా ఏ విషయములో జోక్యము చేసుకోదని భావించుట సరికాదు. సిద్ధము చేయబడిన మరునాడు ఒకరు సిద్ధము చేసిన వాని నుండి విడిపోయినట్లే సృష్టి మొత్తం సృష్టికర్త నుండి విడిపోయెను. కాని ఆ సకల లోకాల సంరక్షకుడు తమ సంపూర్ణ పోషణతో ప్రపంచాన్ని మొత్తం పోషించుచున్నాడు. అతని పోషణతో కూడిన వర్షము విశ్వమంతా కురుస్తున్నది. అతని శుభపు చుక్కలు లేని ఘడియ లేదు.

ప్రపంచమును సృష్టించిన తరువాత కూడ రవ్వంత తేడా లేకుండా అతను ఇంకా ఏమియును సృష్టించనట్లు అతని అవసరము ప్రతి ఒక్కరికి గలదు. ప్రపంచ ఉనికి, పెరుగుదలకు అతని పోషణ అవసరమున్నట్లే ప్రపంచ మనుగడ, స్థిరత్వము కొరకు అతని పోషణ అవసరమే. క్షణ క్షణం అతడే ప్రపంచాన్ని రక్షించుచున్నాడు. లోకములోని ప్రతి అణువు అతని వల్లనే తాజా అగుచున్నది. అతడు తన ఇష్టము, సంకల్పము మేరకు ప్రతి వస్తువును పోషించుచున్నాడు. అతను సంకల్పించనిదే అతని పోషణతో ఏదియును లబ్ది పొందదు. పవిత్ర ఖుర్ఆన్ ఏ సూక్తుల సారాంశము మేము ప్రస్తావించినామో వాటి నిదర్శన ఉద్ధేశమేమనగా ప్రపంచములో గల ప్రత వస్తువు సృష్టించబడినదే. తమ సమస్త ప్రత్యేకతలు, సకల పరిస్థితులు, అన్ని సమయాలలో అల్లాహ్ తఆలా పోషణ అవసరము వాటికుండును. ఏదేని ఆధ్యాత్మిక, శారీరక విశిష్టతను ఎవరు కూడ తనంతట తానే ఆ సర్వశక్తిమంతుడైన దేవుని ఉద్ధేశము లేనిదే పొందలేరు. ఈ పవిత్ర ఖుర్ఆన్ వివరణ మేరకు ఈ నిదర్శనముతో పాటు ఇతర నిదర్శనముల భావము ప్రకారము రబ్బుల్ ఆలమీన్ వంటి ఏ గుణములు అల్లాహ్ తఆలాలో గలవో ఆ ఏకైక దేవునికి ప్రత్యేకించినవే. వాటిలో మరెవ్వరు భాగస్వాములు కారు. సకల సంకీర్తనములు అల్లాహ్ తఆలాకే ప్రత్యేకమని ఈ అధ్యాయములోని మొదటి వాఖ్యమైన అల్‌హందులిల్లాహ్ లో సూచించబడెను.

రెండవ నిదర్శనము రహ్మాన్ అనునది రబ్బుల్ ఆలమీన్ తరువాత గలదు. మేమింతకు ముందు చెప్పినట్లు రహ్మాన్ అర్థమేమనగా ప్రాణులన్ని మానవులైనను లేదా ఇతర ప్రాణులైనను, పుణ్యులైనను పాపిష్టులైనను అన్నిటి మనుగడ, పెరుగుదల, జీవన, పరిపూర్ణత కొరకు అల్లాహ్ తఆలా తన రహ్మానియ్యత్ ప్రకారము అన్ని రకాల సౌకర్యములను ప్రసాదించెను. సదా ప్రసాదించుచుండును. ఇది పూర్తిగా దైవ ప్రసాదితమే. ఒకరి కర్మ

ఫలితము కాదు.

మూడవ నిదర్శనము రహీమ్ అనునది రహ్మాన్ తరువాత ప్రస్తావించబడెను. దాని అర్థమేమనగా ప్రయత్నము చేయువారి ప్రయత్నమునకు అల్లాహ్ తఆలా తన ప్రత్యేక ఫలితములు అందించును. పశ్చాత్తాపపడువారి పాపములను క్షమించును. అడిగిన వారికిచ్చును. తలుపు తట్టిన వారికి ప్రసాదించును.

ఫాతిహా అధ్యాయములో ప్రస్తావించబడిన **నాలుగవ నిదర్శనము** మాలికి యౌమిద్దీన్. అనగా అన్ని రకాల పరీక్ష, ఆపద, నిర్లక్ష్య కారణములతో పవిత్రమైన సంపూర్ణ, పరిపూర్ణ ప్రతిఫలము. ప్రతి మలినము, చెడు, అనుమానము, సందేహము, నష్టము నుండి పవిత్రమైనది. గొప్ప మహిమల ప్రతిరూపం. దాని యజమాని కూడ సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌యే. తన సంపూర్ణ ఫలితము పగలు వలె ప్రకాశించు విధముగా ప్రత్యక్షపరచుటకు ఎవరు అతణ్ణి ఆపలేరు. ఈ గొప్ప నిదర్శనమును ప్రత్యక్షపరచు ఉద్దేశమేమనగా ప్రతి ఒక్క ప్రాణికి ఈ క్రింది విషయములు నమ్మకముగా తెలియవలెను. (1) ఫలితము లేదా శిక్ష ఒక నమ్మకమైన విషయము. అది నిజమైన యజమాని ద్వారా అతని ప్రత్యేక సంకల్పముతోనే మానవుల పట్ల బహిర్గతమగు చుండును. ఇలా స్పష్టముగా తెలిసిపోవుట ఇహలోకములో సాధ్యము కాదు. ఎందుకనగా మంచి చెడు, దుఃఖము, సుఖము ఎందుకు కలుగుచున్నదో, ఎవరి ఆదేశము, ఎవరి ఆధ్వర్యములో అందుచున్నదో అను విషయము సాధారణ వ్యక్తులకు తెలియదు. తాను తన ఫలితము పొందుచున్నానని లేదా తాను అనుభవించుచున్నది వాస్తవానికి తన కర్మల ఫలితమేనని ఎవరికి అర్థము కాదు.

ఈ నిదర్శనములో రెండవ విషయమేమనగా అలవాటుపడ్డ కారణములు శూన్యమే. అసలైన కర్త అల్లాహ్ తఆలాయే. సర్వ శుభముల

కు మూలము ఆ మహా గొప్ప ఉనికియే. ప్రతి ఫలితము, శిక్షకు యజమాని అతడే.

ఈ నిదర్శనములో మూడవ విషయమేమనగా గొప్ప అదృష్టము, అతి దురదృష్టము ఏమిటో తెలుపుట. కాంతి, ఆనందము, అభిరుచి, విశ్రాంతి, మానవుని బాహ్యాంతరములు, శరీరము, ఆత్మను ఆవరించి, ఏ అవయవము, శక్తిని వీడకుండా యుండు మహా సాఫల్య స్థితియే గొప్ప అదృష్టమనబడును. అవిధేయత, అపవిత్రత, దైవము నుండి దూరమై హృదయముల నుండి వెలువడి శరీరమును ఆవరించినందున ఉనికి మొత్తం అగ్ని, నరకమును తలపించి బాధాకరమైన శిక్షయే అతి దురదృష్టము. ఈ దైవ మహిమలు ఇహలోకములో ప్రత్యక్షము కావు. ఎందుకనగా ఈ అల్ప, మూయబడిన, మలిన ప్రపంచము వస్తువులలో దాగి, ఒక లోపభూయిష్ట స్థితిలో పడి యున్నది. కనుక ఆ దైవ మహిమల ను ఇది భరించలేదు. వాస్తవానికి ఈ ప్రపంచము ముఖ్యోద్ధేశము ఆపద, పరీక్షయే. దీని సుఖ, దుఃఖములు అశాశ్వతమైనవి, లోపముతో కూడినవి. ఇహలోకములో మానవునిపై జరిగేదంతయు వస్తువులలో దాగి యుండును. తద్వారా ఫలితములిచ్చు యజమాని ముఖము ముసుగులో దాగి యుండును. అందుకే ఇది స్వచ్ఛమైన, సంపూర్ణ రీతిలో ఫలితముల దినమనబడదు. అందకే స్వచ్ఛమైన, సంపూర్ణ రీతిలో ఫలితముల దినము అంతిమ ధర్మ నిర్ణయ దినము ఇహలోకము తరువాత సంభవించే పరలోకమే అగును. ఆ పరలోకమే గొప్ప దైవమహిమల ప్రత్యక్ష, వైభవ, సౌందర్యము బహిర్గతమగుటకు సముచిత స్థలము. వాస్తవానికి ఇహ లోకము తన యదార్థ రూపము వలన ఫలితముల స్థలము కాక ఇదొక పరీక్ష స్థలము. అందుకే ఇహలోకములో ప్రజలకు కలిగే ఇబ్బంది, సౌకర్యము, సుఖము, దుఃఖము, కష్టము, ఆనందమును అల్లాహ్ తఆలా ప్రసన్నత లేదా ఆగ్రహానికి తుది ప్రతీక అని అనలేము. ఉదా॥ ఒకరు

ధనవంతులు కావడం అతనితో అల్లాహ్ తఆలా ప్రసన్నుడైనాడని గట్టి నిదర్శనము కాదు. ఒకరు బీదవాడు, నిస్సహాయుడు కావడంతో అల్లాహ్ తఆలా అతనిపై ఆగ్రహముతో యున్నాడనుటకు నిదర్శనము కాదు. ఇవి రెండు రకాల పరీక్షలు. తద్వారా ధనవంతున్ని అతని ధనముతో, బీదవాన్ని అతని నిస్సహాయతతో పరీక్షించబడును. ఈ నాలుగు నిదర్శనములు పవిత్ర ఖుర్‌ఆన్‌లో వివరంగా ప్రస్తావించబడినవి.

*(బరాహీనె అహ్మదియ్య 4 భాగములు - రూహానీ ఖజాయిన్ సంపుటి:1 పుట:444-461 అధోదీపిక 11)*

ప్రపంచములోని ప్రతి వస్తువు వున్నట్లు కనబడుచున్న విషయము స్పష్టముగా ఋజువగును. దాని ఉనికి, స్థిరత్వము వ్యక్తిగతంగా కనిపించుట తప్పనిసరి కాదు. ఉదా॥ భూమి గుండ్రంగా వుంది. కొందరి అభిప్రాయము మేరకు దాని గుండ్రము సుమారు 4 వేల కోస్ గట్టిగా గలదు. కాని ఈ ఆకారమే ఎందుకున్నది, ఈ పరిమాణమే ఎందుకనుటకు ఎలాంటి నిదర్శనము లేదు. ఇంతకంటే ఎక్కువ లేదా తక్కువ ఎందుకు వుండకూడదు? ఈ ఆకారంలో కాక మరో ఆకారంలో ఎందుకు వుండ కూడదు? అనుటకు ఎలాంటి నిదర్శనము లేనందున ఈ ఆకారము, ఈ పరిమాణముతో కూడిన ఉనికి భూమికి అనివార్యము కాదనుట సమంజసము కాదు. ఎందుకనగా ఇలా ఊహించినచో ప్రపంచములోని సమస్త వస్తువుల ఉనికి, మనుగడ నిరర్థకమగును. ప్రతి వస్తువు ఉనికి స్వతహాగా కనిపించుట అనివార్యము కాకపోవడమేకాక కనిపించుచున్న కొన్ని వస్తువులు అదృశ్యమయ్యే కారణములు కూడ కనిపించుచున్నవి. కాని ఆ వస్తువులు నిర్వీర్యం కావు. ఉదా॥ ఘోర కరువు, ప్రకృతి వైపరీత్యము ఏర్పడినను ఆది నుండి ప్రతి వస్తువు విత్తనము మిగిలే వుంటుంది. కాని ఆది నుండి ప్రపంచమును పీడించుచున్న వేలాది కఠిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏదో ఒక సారి ఘోర కరువు సందర్భమున మానవ ఆహారము

పూర్తిగా అంతమగుట లేదా ధాన్యములోని ఏదో ఒక రకము నిర్వీర్యమగుట లేదా కఠిన వైపరీత్యము వలన మానవ జీవనము అంతమగుట లేదా ప్రాణులలోని ఏదో ఒక రకము ఉనికి కోల్పోవుట లేదా అనుకోకుండా ఏదో ఒక సారి సూర్య, చంద్రులు నియంత్రణ కోల్పోవుట లేదా ప్రపంచ మనుగడ కొరకు అవసరమున్న ఇతర అనన్య వస్తువులలో ఏదో ఒకటి క్రమం కోల్పోవుట సమంజసమే కాక అనివార్యముగా భావించబడును. ఎందుకనగా కోట్లాది వస్తువులు తారసపడి నియంత్రణ తప్పక సురక్షితంగా యుండుట, వాటిపై ఎన్నడు ఆపద సంభవించకపోవడం ఊహకందని విషయము. అనివార్యము కాని, జీవనము అవసరము లేని వస్తువులు ఎప్పుడో ఒక సారి క్రమం తప్పుట వాటి జీవనము కంటే ఎక్కువ ఆశించబడును. ఎన్నడు అవి నియంత్రణ కోల్పోకుండా సర్వోత్తమ రీతిలో నిర్ణీత పద్ధతిలో, విధించిన క్రమంలో కొనసాగుట, ప్రపంచములోని కోట్లాది అవసరాలలో ఏదో ఒకటి అంతము కాక పోవడం వీటన్నిటికి ఒక సృష్టికర్త, రక్షకుడు, స్వయంభువు వున్నాడనుటకు గట్టి నిదర్శనము. అతడు సర్వ, సంపూర్ణ లక్షణములకు మూలము. అనగా వివేకి, సర్వజ్ఞుడు, దయామయుడు, పరమ కారుణ్యమూర్తి, తమ ఉనికిలో ఆది నుండి గలడు, అన్ని విధాల లోప రహితుడు. అతను మరణము, వినాశనమునకు అతీతుడు. మరణమును పోలిన నిద్ర, కునుకు అతనికి పట్టదు. ఆ ఉనికే అన్ని సంపూర్ణ లక్షణములకు కేంద్రము. ఈ లోకమును సంపూర్ణ వివేకము, పరిపూర్ణ క్రమములో సృష్టించెను. ఉనికికి అదృశ్యముపై ప్రాధాన్యతనిచ్చెను. అతడే తన సంపూర్ణత, పుట్టుక, పోషణ, స్వయంభువు అయినందున ఆరాధనకు అర్హుడు. ఇప్పటి వరకు

اَللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَۚ اَلْحَيُّ الْقَيُّوْمُ ۚ لَا تَاْخُذُهٗ سِنَةٌ وَّلَا نَوْمٌ ؕ لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ

(అల్ బఖరహ్ 2:256) సూక్తి అనువాదము పూర్తి అయినది. ఎంతటి సాహిత్యము, మృదుత్వము, గొప్పతనము, వివేకముతో ఈ సూక్తిలో

ప్రపంచ సృష్టికర్త ఉనికికి నిదర్శనమును చూపెనో, అతి తక్కువ పదాలలో చాలా పెద్ద అర్థములను, వివేకవంతమైన విషయములను ప్రస్తావించెనో ఇప్పుడు న్యాయంగా గమనించవలెను. مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْأَرْضِ కొరకు గట్టి నిదర్శనముతో సంపూర్ణ లక్షణములు గల సృష్టికర్తను నిరూపించెను. దాని సంపూర్ణ, ఉత్తమ వాఖ్యమునకు సమానంగా ఏ వివేకి నేటి వరకు ఉపన్యసించలేదు. బుద్ధి హీనులైన వివేకులు ఆత్మలు, శరీరములు అంతమగునని కూడ భావించలేదు. నిజమైన జీవితము, యదార్థమైన ఉనికి, వాస్తవ జీవనము కేవలం అల్లాహ్ తఆలా కొరకే పరిమితమను విషయమును వారు తెలుసుకోలేక పోయిరి. ఈ అతి గుప్తమైన విజ్ఞానము మానవునికి ఈ సూక్తితోనే అర్థమగును. ఇందులో అల్లాహ్ తఆలా ఇట్లనెను. నిజమైన జీవితము, యదార్థమైన మనుగడ కేవలం అల్లాహ్ తఆలాకే సొంతం. అతడే సంపూర్ణ లక్షణములకు మూలము. అతనికి తప్ప మరెవరికి నిజమైన ఉనికి, యదార్థమైన జీవితము లభించలేదు. ఈ విషయమునే ప్రపంచ సృష్టికర్త అవసరమునకు నిదర్శనముగా చూపించుచు ఇట్లనెను. لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْأَرْضِ అనగా ప్రపంచమునకు నిజమైన జీవితము, యదార్థమైన మనుగడ లేనందున దాని సృష్టికర్త అవసరము తప్పక ఏర్పడును. ఇటువంటి సృష్టికర్త సంపూర్ణ లక్షణములు, ఉద్ధేశపూర్వక వివేకి, తెలివిమంతుడు, పరోక్ష జ్ఞాని అగుట తప్పనిసిరి. అతడే అల్లాహ్. ఎందుకనగా పవిత్ర ఖుర్ఆన్ పరిభాష ప్రకారము సర్వ విశిష్టతలకు మూలమైన ఉనికి పేరు అల్లాహ్. అందుకే పదే పదే ఇట్లనెను. సర్వ లోకాల సంరక్షకుడు, దయామయుడు, పరమకారుణ్యమూర్తి, ఉద్ధేశ పూర్వక వివేకి, సర్వజ్ఞుడు, పరోక్ష జ్ఞాని, సర్వశక్తిమంతుడు, మొదలు, అంతిమము సర్వము అల్లాహ్‌యే. కనుక సర్వ విశిష్టతలకు మూలమైన ఉనికి పేరు అల్లాహ్ అని పవిత్ర ఖుర్ఆన్ పరిభాషగా నిలిచెను. అందుకే ఈ సూక్తి ఆరంభములోనే అల్లాహ్ నామము వచ్చెను. అనగా ఇట్లనెను.

اَللّٰهُ لَآ اِلٰهَ اِلَّا هُوَ اَلْحَيُّ الْقَيُّوْمُ అనగా ఈ అస్థిర ప్రపంచమును కొనసాగించు ఉనికి సర్వ లక్షణములకు మూలము. ఈ ప్రపంచము ఎలాంటి గొప్ప క్రమంలో, ఎంతటి అద్భుత పద్ధతిలో ఏర్పడినదో చూచి ఇందులోని కొన్ని మరికొన్నిటిని సృష్టించినవని ఊహించుట తగదని తెలుస్తున్నది. అద్భుత వివేకముతో కూడిన ఈ గొప్ప కార్యము కొరకు ఉద్ధేశ పూర్వక వివేకి, సర్వజ్ఞుడు, సర్వజ్ఞాని, పరమ కారుణ్యమూర్తి, వినాశనానికి అతీతుడు, సర్వ లక్షణములకు మూలమైన ఒక సృష్టికర్త తప్పక అవసరముండును. అన్ని రకాల పరిపూర్ణత కలిగివున్న ఉనికి అల్లాహ్ మాత్రమే. ప్రపంచ సృష్టికర్త సాక్ష్యము తరువాత ఒక సత్యాన్వేషుడు ఆ సృష్టికర్తకు మరొకరి అవసరం ఏ విధంగాను లేదని అర్థము చేసుకొనుట అనివార్యము. قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ - اَللّٰهُ الصَّمَدُ - الخ - (ఇఖ్లాస్ 112:2,3) లో ఈ విషయమునే సూచించెను. ఒక్క వరుస కంటే తక్కువ గల ఈ చిన్న పంక్తిలో ఎంత సున్నితంగా, అద్భుతంగా ప్రతి రకమైన భాగస్వామితో అల్లాహ్ తఆలా పవిత్రుడని తెలిపెను. దీని వివరణ ఇట్లు గలదు. వివేకపరంగా భాగస్వామ్యము 4 రకాలుగా యుండును. భాగస్వామ్యము ఒక్కోసారి సంఖ్యాపరంగా యుండును. మరొక్కసారి స్థాయిపరంగా యుండును, మరొక్కసారి వంశములో యుండును, ఇంకో సారి పని, ప్రభావములో యుండును. అల్లాహ్ తఆలా ఈ 4 రకాల భాగస్వాములతో అతీతుడని ఈ అధ్యాయములో తెలిపెను. అతడు సంఖ్యాపరంగా ఒక్కడేనని, ఇద్దరు లేదా ముగ్గురు కారని స్పష్టము చేసెను. అతడు స్వయంభువు. అనగా తన అనివార్య స్థాయిలో, అవసరాలు తీర్చుటకు మూలమైన విధంగా అతడు ఒక్కడు, ఏకేశ్వరుడు. అతడొక్కడు తప్ప మిగతా వస్తువులన్నియు నాశనమగును. అనుక్షణం వాటన్నిటి అవసరాలను తీర్చువాడు అతడే. అతడు لَمْ يَلِدْ (అల్ ఇఖ్లాస్ 112:3) అనగా అతనికి కుమారులెవరు లేరు. తద్వారా ఆ కుమారుడు అతనికి

భాగస్వామిగా కావచ్చును. لَمۡ يُوۡلَدۡ (అల్ ఇఖ్లాస్ 112:4) అనగా అతనికి ఎవరు తండ్రి కారు. తద్వారా తండ్రి అయినందున అతడు భాగస్వామి కావచ్చును. وَلَمۡ يَكُنۡ لَّهٗ كُفُوًا (అల్ ఇఖ్లాస్ 112:5) అనగా అతని పనులలో అతనికి సమానంగా పనులు చేయువాడు మరొకడు లేడు. తద్వారా పనుల వలన అతనికి భాగస్వామి కావచ్చును. ఈ విధంగా 4 రకాల భాగస్వాముల నుండి అల్లాహ్ తఆలా పవిత్రుడు, అతీతుడు, అతనికి భాగస్వామి ఎవడు లేడని స్పష్టము చేయబడెను. అనంతరం అతడు ఒక్కడే అని తెలుపుటకు తెలివికందు ఒక నిదర్శనమును ప్రస్తావించెను. لَوۡ كَانَ فِيۡهِمَاۤ اٰلِهَةٌ اِلَّا اللّٰهُ لَفَسَدَتَا (అల్ అన్బియా 21:23) وَّمَا كَانَ مَعَهٗ مِنۡ اِلٰهٍ ا لخ (అల్ ముమినూన్ 23:92) అనగా భూమ్యాకాశములలో అతడు తప్ప మరెవరు సర్వ సంపూర్ణ లక్షణములు గల దేవుడు మరొకడున్నచో అవి రెండు అస్థవ్యస్థమయ్యేవి. ఎందుకనగా దేవుళ్ళ ఆ పక్షము ఏదో ఒక సారి పరస్పరం ఎదురుపడేవారు. కనుక ఈ విభేదము, వైరుధ్యము వలన ప్రపంచము అతలాకుతలమయ్యేది. సృష్టికర్తలు విడివిడిగా వున్నచో వారి లోని ప్రతి ఒక్కడు తన సృష్టికి మాత్రమే మేలు ఆశించును. వారి సుఖము కొరకు ఇతరులను నాశనము చేయుటకు సిద్ధపడును. ఈ విధంగాను ప్రపంచము తలక్రిందులయ్యేది. ఇప్పటి వరకు తెలివికి చెందిన (లిమ్మి) నిదర్శనముతో అల్లాహ్ తఆలా ఒక్కడు, అతనికి భాగస్వామి ఎవరు లేరని నిరూపించెను. అనంతరం అల్లాహ్ తఆలా ఒక్కడు, అతనికి భాగస్వామి ఎవరు లేరనుటకు (ఇన్ని) చరిత్ర సంఘటనల ఆధారమైన నిదర్శనము ఇట్లు ప్రవేశ పెట్టెను.

قُلِ ادۡعُوا الَّذِيۡنَ زَعَمۡتُمۡ مِّنۡ دُوۡنِهٖ فَلَا يَمۡلِكُوۡنَ كَشۡفَ الضُّرِّ عَنۡكُمۡ وَلَا تَحۡوِيۡلًا (బనీ ఇస్రాయీల్ 17:57) అనగా అల్లాహ్ తఆలా ఉనికి నిరాకరులు, తిరస్కృతులతో ఇట్లనుము. అల్లాహ్ తఆలా పనిలో మరెవరైనా భాగ స్వాములు వున్నచో లేదా ప్రస్తుతమున్న వస్తువులే సరిపోయినచో ఇప్పుడు

మీరు ఇస్లాం సత్య నిదర్శనములు, దాని వైభవము, శక్తిని ఎదుర్కోలేక అవమానానికి గురగుచున్నందున తమ భాగస్వాములను సహాయము కొరకు పిలుచుకొనుము. వారు మీ కష్టములను తీర్చనే తీర్చలేరు, మీ తలపై మోపబడిన ఈ ఆపదను తొలగించలేరని మీరు గుర్తుంచుకోగలరు. ఓ ప్రవక్తా! నన్ను ఎదుర్కొనుటకు మీరు పూజించుచున్న తమ భాగస్వాములను పిలుచుకొనుమని ఈ అన్యారాధకులకు చెప్పుము. నన్ను ఓడించుటకు మీరు చేయగల ప్రణాళికలన్ని రచించగలరు. నాకు ఏమాత్రం వ్యవధి ఇవ్వకండి. పవిత్ర ఖుర్ఆన్ను అవతరింపజేసిన సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తఆలా నా సహాయకుడు, సహాయకారి అని గుర్తుంచుకోగలరు. అతడు తన సత్యమైన, నిజమైన ప్రవక్తలకు స్వయముగా సహకరించును. కాని మీరు ఏ వస్తువులను తమ సహాయము కొరకు పిలుచుచున్నారో వారు మీకు సహాయము చేయుట అసాధ్యమే గాక తమకు తాము కూడ సహాయము చేసుకోలేరు. అనంతరం అల్లాహ్ తఆలా ప్రతి నష్టము, లోపమునకు అతీతుడని ప్రకృతి చట్టము ప్రకారము నిరూపించెను. ఇట్లనెను. تُسَبِّحُ لَهُ السَّمٰوٰتُ السَّبْعُ وَالْاَرْضُ وَمَنْ فِيْهِنَّ ؕ الخ (బనీఇస్రాయీల్ 17:45) అనగా ఏడు ఆకాశములు, భూమి, వాటిలో వున్నదంతయు అల్లాహ్ను కీర్తించును. అతణ్ణి కీర్తించని వస్తువు ఏదియును లేదు. కాని మీరు వాటి కీర్తనను అర్థము చేసుకోలేరు. అనగా భూమ్యాకాశములను గమనించినచో అల్లాహ్ తఆలా సంపూర్ణుడు, పవిత్రుడు, కుమారులు, భాగస్వాములతో అతీతుడని ఋజువగుచున్నది. కాని తెలివిమంతులు మాత్రమే దీనిని అర్థము చేసుకోగలరు. అనంతరం పుట్టించబడిన వారి పూజారులను సాక్షికంగా మందలించెను. వారు తప్పిదములో వున్నారని చూపుచు ఇట్లనెను. قَالُوا اتَّخَذَ اللّٰهُ وَلَدًا سُبْحٰنَهٗ ؕ هُوَ الْغَنِيُّ ؕ (యూనుస్ 10:69) దేవునికి కుమారుడు గలడని కొందరందురు. వాస్తవానికి కుమారుడుంట నష్టము కలిగించును. దేవుడు అన్ని నష్టములకతీతుడు. అతడు

చింతలేనివాడు, స్వయంభువుడు, ఇతరుల అవసరము లేనివాడు. భూమ్యాకాశములలో వున్నదంతయు అతనిదే. మీకెలాంటి జ్ఞానము లేని విషయములో కూడ మీరు దేవునిపై నింద మోపుతారా! దేవునికి కుమారుల అవసరమేమున్నది. అతడు సంపూర్ణుడు, దైవత్వ బాధ్యతలన్నిటిని నర్విహించుటకు అతడొక్కడే సరిపోవును. మరో ప్రణాళిక అనవసరం. దేవునికి కుమార్తెలు గలరని మరికొందరందురు. వాస్తవానికి అతడు ఇటువంటి లోపములన్నిటికి అతీతుడు. మీకు కమారులు వుండగా అతనికి కుమార్తెలున్నారా? ఈ విభజన సమంజసమైనది కాదు. ఓ ప్రజలారా! మిమ్ములను, మీ తాతముత్తాతలను పుట్టించిన ఏకైక దేవుణ్ణి మీరు ప్రార్థించగలరు. భూమిని మీ కొరకు పరుపుగా, ఆకాశమును కప్పుగా చేసిన సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌తో భయపడుము. ఆకాశము నుండి నీటిని అవతరింపజేసి విభిన్న రకాల ఫలముల నుండి ఆహారమును మీ కొరకు పుట్టించెను. కనుక మీ లాభము కొరకు చేయబడిన ఆ వస్తువులనే ఉద్ధేశపూర్వకంగా మీరు అల్లాహ్‌కు భాగస్వామిగా చేయకండి. దేవుడు ఒక్కడే, అతనికి భాగస్వామి మరెవరు లేరు. ఆకాశములో అతడే దేవుడు, భూమిలో కూడ అతడే దేవుడు. అతడే మొదలు అతడే అంతము. ప్రత్యక్షమతడే, పరోక్షమతడే. అతని రహస్యమును కనులు తెలుసుకోలేవు. కాని కనుల లోతు అతనికి తెలుసు. అందరిని అతడే సృష్టించెను. అతని వలె ఏదియును లేదు. ప్రతి వస్తువును పరిమితంగా, ఒక నిర్ణీత పరిమాణం లో అతడు పుట్టించుటయే అతను సృష్టికర్త అనుటకు స్పష్టమైన నిదర్శనము. ఇందుకు ఒక సృష్టికర్త, కారకుడు అవసరమని తేలును. సర్వ సంకీర్తనములు అతనికే చెందునని ఋజువయ్యెను. ఇహపరలోకములో అతడే నిజమైన వరప్రదాత. ప్రతి అధికారము అతని చేతిలోనే గలదు. ప్రతి వస్తువునకు అతడే మూలము, కేంద్రము. కోరిన వాని ప్రతి పాపమును అల్లాహ్ తఆలా క్షమించును. కాని అన్యారాధనను మాత్రము

క్షమించడు. కనుక దేవుణ్ణి కలిసేందుకు ఆసక్తి గల వారు ఎటువంటి పీడనము లేని కర్మలు చేయవలెను, దేనిని కూడ అల్లాహ్‌కు భాగస్వామిగా చేయరాదు. నీవు దేవునితో మరే ఇతర వస్తువును భాగస్వామిగా చేయకనే చేయకు. దేవునికి భాగస్వామి నిర్ణయించడం ఘోరమైన అపరాధం. అల్లాహ్ తఆలా తప్ప మరెవరితో నీవు కోరికలు కోరకుము. అందరు అంతమగుదురు. అతని ఉనికి మాత్రమే మిగిలి యుండును. అతని చేతిలోనే అధికారము గలదు, అతని వద్దకు మాత్రమే మీరు చేరుదురు.

*(బరాహీనె అహ్మదియ్య 4 భాగములు - రూహానీ ఖజాయిన్ సంపుటి:1 పుట:515 నుండి 521 ఉపఅధోదీపిక నం.3)*

ఆది నుండి కొనసాగుచున్న అనగా మానవ జన్మ మొదలైనప్పటి నుండి ఏర్పడిన అల్లాహ్ తఆలా ప్రకృతి చట్టము, ప్రకృతి వాతావరణము దేవునితో ప్రగాఢ సంబంధము ఏర్పడుటకు అతని ఉపకారము, అందము నుండి లబ్ది పొందుట అనివార్యమని మనకు సూచించుచున్నది. ఒక మానవుడు తన ఉనికిలో గల అల్లాహ్ తఆలా ప్రవర్తనల ఆదర్శములను స్వయముగా చూచుటయే **ఇహ్సాన్** (ఉపకారము) అనబడునని మేమింతకు ముందే వ్రాసినాము. ఉదా॥ నిస్సహాయత, బలహీనత, శక్తిహీనత, అనాథ స్థితిలో అల్లాహ్ తఆలా అతణ్ణి ఆదుకొనుట. అవసరములు, ఇబ్బందులున్నప్పుడు అల్లాహ్ తఆలా స్వయంగా అతని అవసరాలను తీర్చుట. నడ్డి విరుచు కఠినమైన బాధల సమయమున అల్లాహ్ తఆలా స్వయంగా అతనికి సహకరించుట. దేవుణ్ణి గుర్తు చేసినప్పుడు మరొక గురువు, మార్గదర్శకుని ప్రమేయం లేకుండానే అతనికి సన్మార్గము చూపెను. **హుస్న్** (అందము) అనగా అతని సత్య గుణములు. అవి ఇహ్సాన్ రూపంలో కూడ దర్శనమిచ్చును. ఉదా॥ దేవునిలో గల సర్వశక్తి, కనికరము, మృదుత్వము, పోషణ, దయ. కనిపించుచున్న అతని సాధారణ పోషణ, మానవుల విశ్రాంతి కొరకు తరచుగా వున్న అధిక

వరములు, ప్రవక్తల ద్వారా మానవుడు పొందు విద్య, తద్వారా మరణము, వినాశనము నుండి తప్పించుకొనును, ఇబ్బందులు, బాధలను ఎదుర్కొను ప్రజల దుఆలను ఆమోదించు అతని గుణము, మానవులు అతని వైపు మోకరిల్లు అతని విశిష్టత, అతడు వారి కంటే ఎక్కువ వారి వైపు వ్రంగును, దేవుని ఈ లక్షణములన్నియు అతని **హుస్న్** (అందము)లో ఒక భాగమే. ఒక వ్యక్తి ఈ గుణములతో ప్రత్యేకంగా ప్రయోజనము పొందినప్పుడు అతని పట్ల అవి (ఇహ్సాన్) ఉపకారముగా మారును. అవి ఇతరులకు హుస్న్ (అందము) గానే యుండవచ్చును. అతని అందము, సౌందర్యమునకు చెందిన దేవుని ఈ లక్షణములను ఇహ్సాన్ రూపంలో కూడ చూచిన వ్యక్తి విశ్వాసము అత్యంత గట్టి దశకు చేరును. ఉక్కు అయస్కాంతము వైపు ఆకర్షించబడినట్లే అతడు దేవుని వైపు ఆకర్షింపబడును. అల్లాహ్ తఆలాతో అతనికి గల ప్రేమ అమాంతం పెరిగిపోవును. దేవుని పట్ల అతని నమ్మకము శక్తివంతమగును. దేవునిలో అతనికి మేలు మొత్తం గలదని అనుభవపూర్వకంగా అతడు తెలుసుకుంటాడు, కనుక దేవుని పట్ల అతని నమ్మకము దృఢమైపోవును. అతడు కృత్రిమంగా గాక సహజంగా దేవుని వైపు మోకరిల్లును. ప్రతి శ్వాసలో తనకు దేవుని సహాయము అవసరమని భావించును. తాను సఫలమగునని అతని సంపూర్ణ లక్షణముల భావనతో నమ్మును. ఎందుకనగా దేవుని శుభము, దయ, కరుణకు చెందిన అనేక సామెతలను అతడు ప్రత్యక్షంగా చూసి వుంటాడు. అందుకే అతని ప్రార్థనలు గట్టి నమ్మకముతో వెలువడును. అతని ధైర్యము ఎంతో గట్టిగా దృఢమగును. దైవ బహుమానములు, వరములను తిలకించినందున తుదకు నమ్మక కాంతి అతి వేగంగా అతనిలో ప్రవేశించును. అతని అహం పూర్తిగా దహనమైపోవును. దైవ వైభవము, శక్తిని అధికంగా భావించినందున అతని హృదయము దైవ గృహముగా మారును. మానవుడు జీవించి వున్నంత కాలము అతని

ఆత్మ అతని శరీరము నుండి దూరము కానట్లే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తఆలా తరపున అతనిలో ప్రవేశించిన నమ్మకము అతని నుండి దూరము కాదు. పవిత్ర ఆత్మ అనుక్షణం అతన్ని ఉత్తేజపరచును. ఆ పవిత్ర ఆత్మతోనే అతడు మాట్లాడును, విజ్ఞానములు, గొప్ప విషయములు అతని ద్వారా వెలువడును. మహా గొప్ప శక్తిమంతుడైన అల్లాహ్ తఆలా వైభవ నివాసము అతని హృదయములో యుండును. దాని సంతృప్తి వలన అతని అణువణువు నీరు పొందును. ఒక ప్రత్యేకమైన సంతృప్తి కనులలో కనిపించును. ఆ సంతృప్తికి చెందిన ఒక కాంతి నుదుట ప్రకాశించుచు కనిపించును. దైవ ప్రేమపు వర్షము ముఖముపై కురుస్తున్నట్లు తెలియును. ఆ కాంతివంతమైన సంతృప్తి నుండి నాలుక కూడ పూర్తిగా భాగము పొందును. ఇదే విధంగా వసంత రుతువు వర్షము కురిసిన తరువాత వసంత రుతువులో ఒక ఆహ్లాదకరమైన తాజాదనము వృక్షముల కొమ్మలు, ఆకులు, పుష్పములు, ఫలములలో కనిపించినట్లే అవయవములన్నిటిపై ఒక మనోహరమైన ఆహ్లాదము కనిపించును. కాని ఏ వ్యక్తిలో ఈ ఆత్మ ప్రవేశించలేదో, ఈ పారుదల ఎవరికి అందలేదో అతని శరీరమంతా నిర్జీవ శవము వలె వుండును. అక్షరాలలో వర్ణించలేని ఆ సంతృప్తి, తాజాదనము, ఆహ్లాదము నమ్మకపు కాంతి చెలిమ పారని ఆ మృత శరీరమునకు లభించనే లభించదు. అతని నుండి ఒక రకమైన ముురిగిన దుర్వాసన వచ్చును. కాని ఈ కాంతి ఇవ్వబడిన వ్యక్తి, ఈ చెలిమ ఏ వ్యక్తి నుండి వెలువడునో అతని లక్షణములలో ఒక లక్షణమేమనగా ప్రతి విషయములో, ప్రతి మాటలో, ప్రతి పనిలో దేవునిచే శక్తి పొందాలని అతని మనసు సదా ఆశించును. ఇందులోనే అతడు ఆనందము, సుఖము పొందును. ఇది లేనిదే అతడు జీవించనే జీవించలేడు.

*(అస్మతె అన్బియా అలైహిముస్సలాం - రూహానీ ఖజాయిన్ సంపుటి:18 పుట:668-671)*

రెండు రకాల విశిష్టతల పరిపూర్ణ సంకీర్తనము గలదు. ఒకటి సంపూర్ణ అందము, మరొకటి సంపూర్ణ ఉపకారము. ఎవరిలోనైనా ఈ రెండు విశిష్టతలు కూడినచో అతని కొరకు మనసు ఉత్సాహంగా సమర్పితమగును. ఆ నిరుపమాణ, సాటిలేని ఉనికి వైపు ప్రజలు ఆకర్షిత మగుటకై సత్యాన్వేషులకు రెండు రకాల విశిష్టతలను అల్లాహ్ తఆలా ప్రత్యక్షపరచునని తెలుపుటయే పవిత్ర ఖుర్ఆన్ అతి పెద్ద ఉద్దేశము. తద్వారా స్ఫూర్తిదాయకంగా, ఆసక్తితో అతనికి బానిసత్వము వహింతురు. అందుకే పవిత్ర ఖుర్ఆన్ ఏ దేవుని వైపు పిలుచుచున్నదో అతడు ఎటువంటి విశిష్టతలు కలిగివున్నాడో తెలుపుటకు మొదటి అధ్యాయములోనే అతి సూక్ష్మమైన చిత్రమును చూపించదలచెను. కనుక ఈ అధ్యాయము అల్‌హందులిల్లాహ్‌తో ప్రారంభించబడెను. సకల సంకీర్తనములు అల్లాహ్ అను నామము గల ఉనికికే ప్రత్యేకమని దాని అర్థము. పవిత్ర ఖుర్ఆన్ పరిభాషలో అందము, ఉపకారపు సర్వ విశిష్టతలు సర్వోన్నత స్థాయికి చేరి, ఎలాంటి లోపము లేని ఉనికికి అల్లాహ్ అను నామము గలదు. సకల లక్షణములకు మూలము అల్లాహ్ అను నామమే అని పవిత్ర ఖుర్ఆన్‌లో తెలుపబడెను. సకల సంపూర్ణ లక్షణములు వున్నప్పుడే అల్లాహ్ అను నామము వర్తించునని ఇందులో సంజ్ఞ గలదు. ప్రతి రకమైన విశిష్టత అతనిలో వున్నప్పుడు అందము బహిర్గతమగును. ఈ అందము వల్లనే పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ నామము జ్యోతి అని వచ్చెను. ఇట్లనెను. اَللّٰهُ نُوْرُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ط (అన్నూర్ 24:36) అనగా అల్లాహ్ భూమ్యాకాశముల కు జ్యోతి. ప్రతి జ్యోతి అతని జ్యోతి వల్లనే ప్రకాశించును.

అల్లాహ్ తఆలా ఉనికిలో **ఇహ్‌సాన్** (ఉపకార) విశిష్టతలు అనేకములున్నవి. వాటిలోని నాలుగు సూత్రములకు మూలముగా నున్నవి. వాటి క్రమము ప్రకారము మొదటి విశిష్టతను ఫాతిహా అధ్యాయములోని రబ్బుల్ ఆలమీన్ అను వాఖ్యములో ప్రస్తావించబడెను. అదేమనగా

అల్లాహ్ తఆలా పోషణ అనగా పుట్టించి, పరిపూర్ణ దశకు చేర్చుట సర్వ లోకాలలో కొనసాగుచున్నది. అనగా ఆకాశ లోకం, భూ లోకం, శరీరముల లోకం, ఆత్మల లోకం , వజ్రముల లోకం, అనిశ్చితి లోకం, పశువుల లోకం, మొక్కల లోకం, ప్రాణరహిత వస్తువుల లోకం, ఇతర అన్ని రకాల లోకాలు అతని పోషణతో మనుగడ సాగించుచున్నవి. తుదకు మానవుడు వీర్య దశ కంటే ముందు నుండి కూడ మరణించేంత వరకు లేదా పరలోక జీవితము వరకు దైవ పోషణతోనే లబ్ది పొందును. దైవ పోషణ సకల ఆత్మలు, శరీరములు, పశువులు, మొక్కలు, ప్రాణరహిత వస్తువులు మొ॥ వాటన్నిటికి అందుచున్నందున **ఫైజానె అఅమ్** (అతి సాధారణ శుభము) అనబడును. ఎందుకనగా ఉనికి గల ప్రతిది అతని నుండే ప్రయోజనము పొందును. అతని వల్లనే ప్రతి ఒక్క వస్తువులు ఉనికి పొందెను. దైవ పోషణ ప్రతి ఒక్కరి ఉనికికి కారణము, ప్రతి ఒక్కరి ప్రత్యక్షమునకు సంరక్షణ అయినను ఉపకారము వలన మానవునికి అందరి కంటే ఎక్కువ లభించును. ఎందుకనగా అల్లాహ్ తఆలా సృష్టి మొత్తం నుండి మానవుడు లబ్ది పొందుతాడు. అందుకే మీ దేవుడు రబ్బుల్ ఆలమీన్ అని మానవునికి గుర్తు చేయబడెను. తద్వారా మానవుని ఆశలు అధికమై మా లాభము కొరకు అల్లాహ్ తఆలా శక్తులు విశాలమైనవి, విభిన్న వస్తువుల ప్రపంచమును సృష్టించగలడని నమ్మగలడు. రెండవ విశిష్టత ద్వితీయ దశలో గల ఉపకారమును **ఫైజానె ఆమ్** (సాధారణ శుభము) రహ్మానియ్యత్ అందురు. దీనిని ఫాతిహా అధ్యాయములో రహ్మాన్ అను వాఖ్యములో ప్రస్తావించబడెను. పవిత్ర ఖుర్ఆన్ పరిభాషలో అల్లాహ్ తఆలాకు రహ్మాన్ అను నామము ఎందుక వచ్చినదనగా అతడు ప్రతి ప్రాణికి తగ్గట్టు ముఖము, జీవితము ప్రసాదించెను. ఇందులో మానవుడు కూడ గలడు. అనగా ఏ రకమైన జీవితము అతని కొరకు ఉద్దేశించబడెనో అతని జీవితమునకు తగ్గట్టు అవసరమున్న శక్తులు, సామర్థ్యములు లేదా

ఏ రకమైన శరీరము, అవయవములు అవసరముండెనో అవన్ని అతనికి ప్రసాదించెను. అనంతరం అతని మనుగడ కొరకు అవసరమున్న వస్తువులన్నియు అతనికి అందుబాటులో వుంచెను. పక్షులకు పక్షుల ప్రకారము, పశువులకు పశువుల ప్రకారము, మానవునికి మానవుని ప్రకారము శక్తులు ప్రసాదించెను. ఇంత వరకే పరిమితం కాక ఆయా వస్తువులు పుట్టక ముందే వేలాది సంవత్సరముల క్రితం తమ గుణము రహ్మానియ్యత్ వలన భూమ్యాకాశములు, నక్షత్రములను పుట్టించెను. తద్వారా అవి ఈ వస్తువులకు అండగా వుండును. అల్లాహ్ తఆలా రహ్మానియ్యత్‌లో ఎవరి జోక్యము లేదని ఈ పరిశోధనతో రుజువైనది. ఆయా వస్తువులు జన్మించక ముందే ఏర్పడినది దయానుగ్రహమే. అల్లాహ్ తఆలా రహ్మానియ్యత్‌తో అందరికంటే ఎక్కువ మానవునికి భాగము లభించుటలో అనుమానం లేదు. ఎందుకనగా అతని సఫలము కొరకే ప్రతి వస్తువు త్యాగమగుచున్నది. అందుకే మీ దేవుడు రహ్మాన్ అని మానవునికి గుర్తు చేయబడెను. అల్లాహ్ తఆలా మూడవ రకమైన విశిష్టత అనగా తృతీయ దశ ఇహ్సాన్ రహీమియ్యత్ అనబడును. దానిని ఫాతిహా అధ్యాయములో అర్రహీమ్ అని వ్యాఖ్యానించబడెను. పవిత్ర ఖుర్ఆన్ పరిభాషలో అల్లాహ్ తఆలా రహీమ్ అని ఎందుకనబడుననగా ప్రజల ప్రార్థన, రోదన, సత్కర్మలను ఆమోదించి ఆపదలు, వైపరీత్యాల నుండి, కర్మలు వృథా కాకుండా రక్షించును. ఈ ఉపకారమును మరో విధంగా **ఫైజె ఖాస్** (ప్రత్యేక శుభము) అని అందురు. ఇది మానవులకు మాత్రమే పరిమితం. ప్రార్థన, రోధన, సత్కర్మల సామర్థ్యము ఇతర వస్తువులకు ఇవ్వక కేవలం మానవునికి మాత్రమే అల్లాహ్ తఆలా ప్రసాదించెను. మానవుడు మాట్లాడగల జంతువు. తన మాటలతో కూడ అల్లాహ్ తఆలా శుభమును పొందగలడు. ఇతర వస్తువులకు మాట్లాడు శక్తి నొసంగబడ లేదు. ప్రార్థన చేయుట మానవుని స్వభావములో పెట్టబడినందున ప్రార్థన

అతని ఒక ప్రత్యేకత అని ఇచట తెలియుచున్నది. అల్లాహ్ తఆలా గుణములు రుబూబియ్యత్, రహ్మానియ్యత్‌తో మానవుడు లబ్ది పొందు చున్నాడు. ఇదే విధంగా రహీమియ్యత్ అను గుణము నుండి కూడ అతను లబ్ది పొందును. వీటిలో గల భేదమేమనగా రుబూబియ్యత్, రహ్మానియ్యత్ అను గుణములు ప్రార్థనను ఆశించవు. ఎందుకనగా ఆ రెండు గుణములు మానవుని వరకే పరిమితం కావు. ఎందుకనగా అవి పక్షులు, పశువులకు కూడ లబ్ది కలిగించుచున్నవి. వాస్తవానికి రుబూ బియ్యత్ అను గుణము పశువులు, మొక్కలు, వస్తువులు, భూమ్యా కాశములలో గల వాటన్నిటికి శుభము కలిగించుచున్నది. ఏదియును అతని శుభమునకు అతీతము కాదు. మానవుని కొరకు ప్రత్యేక కోట అయిన రహీమియ్యత్ అను లక్షణమునకు ఇది (రుబూబియ్యత్) భిన్న మైనది. కనుక మానవుడు దీనితో లబ్ది పొందనిచో అతడు పశువులు, ప్రాణరహిత వస్తువులతో సమానము. శుభము కలిగించు 4 గుణములను అల్లాహ్ తఆలా తన ఉనికిలో కలిగించుకొనెను. మానవుని ప్రార్థనతో ముడిపడి వున్న రహీమియ్యత్ మానవుని కొరకు ప్రత్యేకించ బడెను. దుఆతో ప్రత్యేకించబడిన ఒక గుణము అల్లాహ్ తఆలాలో వున్నదని ఈ విషయము సూచించును. దుఆ చేయనిదే అది లభించనే లభించదు. ఇదే అల్లాహ్ తఆలా పద్ధతి, దైవ చట్టము. దీనిని వీడుట సమంజసం కాదు. ఇందుకే సందేశహరులందరు తమ తమ సమాజము కొరకు దుఆలు చేసిరి. అల్లాహ్ తఆలాను ఆగ్రహానికి గురి చేసి ఇస్రాయీల్ కుమారులు ఎన్ని శిక్షలకు చేరువైనారో తౌరాత్‌లో గమనించండి! నేను వారిని నాశనం చేస్తానని పదే పదే వాగ్దానము చేయబడినను హజ్రత్ మూసా (అ) దుఆ, ఆక్రందన, సాష్టాంగముతో ఆ శిక్ష తప్పిపోయినది.

దుఆ కేవలం ఒక పనికిరాని విషయము కాదని, ప్రార్థన ఎలాంటి శుభము ఆకర్షించదనుట సముచితం కాదని ఈ సంఘటనల ద్వారా

రుజువైనది. ఇది అల్లాహ్ తఆలాను తగిన విధంగా గౌరవించని, అల్లాహ్ తఆలా శాసనమును సూక్ష్మ బుద్ధితో గమనించని, ప్రకృతి చట్టమును పరిశీలించని వారి అభిప్రాయము. దుఆ వలన తప్పక శుభము కలుగునను విషయము వాస్తవం. మనకు మోక్షము కలిగించుదాని పేరే రహీమియ్యత్ శుభము. దాని ద్వారనే మానవుడు అభివృద్ధి చెందును. ఈ శుభము ద్వారనే మానవుడు దైవానికి స్నేహితునిగా మారును. ప్రత్యక్షంగా కనులతో చూచినట్లు అల్లాహ్ తఆలాను విశ్వసించును. సిఫారసు అను విషయము కూడ రహీమియ్యత్ అను గుణము వల్లనే ఏర్పడెను. మంచి వ్యక్తులు చెడు వ్యక్తుల కొరకు సిఫారసు చేయాలని అల్లాహ్ తఆలా రహీమియ్యత్ ఆశించెను.

అల్లాహ్ తఆలా ఉపకారములోని 4వ విశిష్టతను **ఫైజానె అఖస్** (ప్రత్యేక శుభము)గా నామకరణం చేయబడును. అంతిమ ధర్మ నిర్ణయ దినమున యాజమాన్యమును ఫాతిహా అధ్యాయములోని మాలికి యౌమిద్దీన్ అను వాక్యములో ప్రస్తావించెను. ఇందులో మరియు రహీమియ్యత్ అను గుణములో గల భేదమేమనగా రహీమియ్యత్‌లో దుఆ, ప్రార్థన ద్వారా సఫలము లభించే అవకాశమున్నది. అనంతరం మాలికి యౌమిద్దీన్ అను గుణము ద్వారా ఆ సఫల ఫలము ప్రసాదించ బడును. దీని ఉదాహరణ ఇట్లు గలదు. ఒక వ్యక్తి ప్రభుత్వ చట్టమును ఎంతో కష్టపడి, శ్రమించి గుర్తు చేసుకొని పరీక్ష వ్రాసి, అందులో ఉత్తీర్ణు డగును. రహీమియ్యత్ ప్రభావముతో సఫలమగుట, ఉత్తీర్ణత పొందినట్లు అగును. ఏ ఉద్దేశముతో ఆ పరీక్ష వ్రాసెనో ఆ ఫలము లభించు స్థాయి మాలికి యౌమిద్దీన్ గుణముతో లభించునను విషయమును పోల్చి వున్నది. ఈ రెండు గుణములు రహీమియ్యత్, మాలికి యౌమిద్దీన్ గల సంజ్ఞ ఏమనగా రహీమియ్యత్ అల్లాహ్ తఆలా కరుణతో లభించును. మాలికి యౌమిద్దీన్ శుభము అల్లాహ్ తఆలా అనుగ్రహముతో లభించును. మాలికి

యౌమిద్దీన్ గుణము విశాలము, సంపూర్ణముగా పరలోకములోనే ప్రత్యక్షమగును. కాని ఇహలోకములో కూడ ఈ ప్రపంచమును బట్టి ఈ 4 రకాల గుణములు తమ ప్రభావము చూపుచున్నాయి.

*(అయ్యాముస్సలహ్ - రూహాని ఖజాయిన్ సంపుటి:14 పుట:247-251)*

## అల్లాహ్ తఆలా శక్తి

అల్లాహ్ తఆలా ప్రపంచములో మూడు రకాల పనులు చేయును. (1) దేవుని స్థాయిలో (2) ఒక మిత్రునిగా (3) శత్రువుని రూపంలో. సాధారణ సృష్టితో కేవలం దేవుని స్థాయిలో పనులు చేయును. తనకు ప్రీతిపాత్రులైన ప్రియులతో చేయబడు పనులను దేవుని స్థాయిలో చేసినను అందులో మిత్రుత్వ పాత్ర అధికముగా యుండును. ఆ వ్యక్తికి అల్లాహ్ తఆలా మిత్రుని రూపంలో సహాయము చేయుచున్నాడని స్పష్టముగా తెలిసి పోవును. శత్రువుని రూపంలో ఎవరితో వ్యవహరించునో వారికి అది బాధాకరమైన శిక్ష అగును. అల్లాహ్ తఆలా ఆ జాతి లేదా ఆ వ్యక్తి తో శత్రుత్వము నెరపుచున్నాడని స్పష్టమైన సంకేతములతో తెలిసిపోవును. ఒక్కో సారి అల్లాహ్ తఆలా తన మిత్రునితో ఇట్లు కూడ వ్యవహరించును. అనగా ప్రపంచాన్ని మొత్తం అతనికి శత్రువునిగా చేయును. కొంత వ్యవధి వరకు వారి నాలుకలు లేదా వారి చేతులకు అతనిపై ఆధిక్యత కూడ ప్రసాదించును. తన మిత్రున్ని నాశనము చేయుటకు లేదా అతన్ని అవమానము, అమర్యాదకు గురి చేయుటకు అల్లాహ్ తఆలా ఇలా చేయక ప్రపంచానికి తన సంకేతమును చూపుటకు, గర్వితులైన వ్యతిరేకులు చేతనైనంత శత్రుత్వము నెరిపినను ఎంత వరకు నష్టము కలిగించగలిగి నారో తెలుసుటకు ఇలా చేయును.

*(నుజూలుల్ మసీహ్ - రూహాని ఖజాయిన్ సంపుటి:18 పుట:517, 518)*

పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా నామములు కర్మ రూపంలో లేవు. ఉదా॥ ఖుద్దూస్ అను పదము గలదు. కాని మాసూమ్ అనే పదము

లేదు. కర్మ రూపంలో వున్నచో రక్షించువాడెవడుండడు.

*(మల్ఫూజాత్ సంపుటి:2 పుట:447 ఎడీషన్ 2003)*

మన దేవునికి ప్రతి దానిపై సర్వశక్తి గలదు. అతడు ఆత్మను, శరీర అవయవాలను పుట్టించలేదను వారు అసత్యులు. అతను క్రొత్తగా పుట్టించుచున్నట్లు మేమతనిని ప్రతి రోజు చూస్తాము. ప్రగతి ద్వారా క్రొత్త క్రొత్త స్ఫూర్తి అతను మాలో ఊదుచున్నాడు. లేని దానిని అతను పుట్టించువాడు కానిచో మేము బ్రతికుండగానే చనిపోయేవారము. మా దేవుడు మహా గొప్ప దేవుడు. అతనికి సాటి ఎవరున్నారు? అతని పనులు విచిత్రమైనవి. అతని పనులకు ధీటుగా ఎవరి పనులున్నాయి? అతడు సర్వశక్తిమంతుడు.

*(నసీమె దావత్ – రూహాని ఖజాయిన్ సంపుటి:19 పుట:435)*

దైవ గుణములను తిరస్కరించుట, అల్లాహ్ తఆలాలో శక్తివంతమైన అధికారము లేదను భావన దేవతల, పునర్జన్మ నుండి ఏర్పడినది. ఎందుకనగా వివేకవంతమైన పనులు అల్లాహ్ తఆలా చేయలేదని భావించినప్పుడు అవసరాలు తీర్చుకొనుటకు దేవతలను సృష్టించుకొన్నారు, ప్రకృతి మార్పులు, విప్లవములను గత కర్మల ఫలితమని నిర్ణయించుకొన్నారు. కనుక ఈ ఒక్క భావనతోనే పునర్జన్మ, దేవతల పూజ అను రెండు దుష్టత్వములు ఏర్పడినవి.

*(షహ్నయె హఖ్ – రూహాని ఖజాయిన్ సంపుటి:2 పుట:407,408)*

తన ఉనకికి శక్తితో నిదర్శనమిచ్చును
నిరాకారుడైన అతని ప్రదర్శన ఇదే.
ఏ పనిని నేను తప్పక చేయుదునని చెప్పునో
ఆ పని జరిగి తీరుటయే దైవత్వమనబడును.

*(దుర్రె సమీన్ వివిధ పద్యములు,*

*ముద్రణ నజారత్ ఇషాఅత్ సదర్ అన్జుమన్ అహ్మదియ్య రబ్వా)*

మన దేవునిలో అనేక విచిత్ర శక్తులున్నవి. కాని సత్యము, విశ్వసనీయతతో అతనికి అంకితమైన వారు మాత్రమే చూడగలరు. అతని శక్తులను విశ్వసించని, అతని పట్ల సత్యవంతులు, విశ్వసనీయులు కాని వారికి ఆ విచిత్ర శక్తులు కనిపించవు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తఆలా అను దేవుడు తనకున్నాడని ఇప్పటి వరకు తెలియని వ్యక్తి ఎంతో దురదృష్టవంతుడు.

*(కష్తీ నూహ్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:19 పుట:21)*

అతని శక్తులు గణనకందవు. అతని విచిత్ర పనులు అంతము కావు. తన ప్రత్యేక దాసుల కొరకు తన చట్టమును మార్చును. కాని ఈ మార్చుట అనేది అతని చట్టములో ఒక భాగమే. ఒక వ్యక్తి నూతనోత్తేజంతో అతని ఆస్థానములో హాజరైనప్పుడు, అతని ప్రీతి కొరకు తనలో ఒక ప్రత్యేక మార్పు కలిగించుకొన్నప్పుడు అల్లాహ్ తఆలా కూడ ఒక మార్పును సృష్టించుకొనును. ఆ దాసునిపై ప్రత్యక్షమైన దేవుడు మరో దేవునిలా భావించబడును. ఆ దేవుడు సాధారణ ప్రజలకు తెలిసిన వాడు కాడు. బలహీనమైన విశ్వాసము గల వ్యక్తి ఎదుట అతడు బలహీనునిగా ప్రత్యక్షమగును. కాని అతి బలమైన విశ్వాసముతో అతని ఎదుట హాజరైన వ్యక్తికి నీ సహాయమునకు నేను కూడ బలమైన వానినని చూపును. కావున మానవ మార్పుల మేరకు అతని లక్షణములలో కూడ మార్పులు సంభవించుకొనును. విశ్వాస శక్తిలో మృతదేహంతో సమానంగా వున్న వ్యక్తికి సహాయ సహకారము అందించకుండా అల్లాహ్ తఆలా కూడ మరచినట్లు మౌనము పాటించును. నవూజుబిల్లాహ్. కాని తన చట్టము పరిధిలో యుండుచు తన పవిత్రతకనుగుణంగా ఇటువంటి మార్పులు చేసుకొనును. అతని చట్టమును పూర్తిగా ఎవరు పరిమితం చేయలేరు. కనుక స్పష్టమైన, బహిరంగ ఆధారము లేనిదే ఫలానా విషయము దైవ చట్టమునకు విరుద్ధమని విమర్శించుట అవివేకమగును. ఎందుకనగా

ఏ విషయము పూర్తిగా తెలియని, అందుకు ఎలాంటి స్పష్టమైన నిదర్శనము వెలువడని దాని గురించి ఎవరు ఒక అభిప్రాయానికి రావచ్చును?

*(చశ్మ మారిఫత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:23 పుట:104,105)*

అల్లాహ్ తఆలాను సర్వశక్తిమంతుడని నమ్మినచో అతని పట్ల గల ఆశలన్ని ఆవిరై పోవును. ఎందుకనగా అల్లాహ్ తఆలా కోరినప్పుడు ఆయా శక్తులు లేని శరీర కణాలలో లేదా ఆత్మలలో ఆ శక్తులను పుట్టించ గలడనే నమ్మకముపై మన దుఆలు ఆధారపడి వున్నవి. ఉదా॥ ఒక రోగి కొరకు మనము దుఆ చేస్తాము. బాహ్యరూపంలో మరణించే లక్షణములు అతనిలో కనిపించును. అతను మరణించకుండా రక్షింపబడుటకు అవసరమున్న శక్తులు అతని శరీర కణాలలో అల్లాహ్ తఆలా పుట్టించాలని మనము వేడుకుంటాము. అటువంటి దుఆ తరచుగా ఆమోదించబడినట్లు మనము చూస్తున్నాము. ఈ వ్యక్తి మరణించనున్నాడు, అతని జీవితము అంతము అగుచున్నదని మనకు కొన్ని సార్లు తెలుపబడును. కాని అతిగా అధికంగా దుఆ చేయబడినప్పుడు, అనగా కఠిన బాధ, ఆందోళనతో మన స్థితి మరణ స్థితికి చేరినప్పుడు అతనిలో మరల జీవన శక్తులు పుట్టినవని అల్లాహ్ తఆలా తరపున సువార్త వాణి అందును. అప్పుడతడు ఒక్కసారిగా స్వస్థత పొందును. మృతుడై జీవించినట్లు భావించబడును. ఇటువంటిదొక సంఘటన నాకు గుర్తున్నది. ఓ సర్వశక్తిమంతుడైన అల్లాహ్! ఈ ఆపద నుండి మమ్ము రక్షించుము, మహమ్మారి విషం నుండి మేము రక్షింపబడుటకు అవసరమగు ప్రత్యేక ఔషధ శక్తి మా శరీరములో పుట్టించమని మహమ్మారి వ్యాధి సమయమున నేను దుఆ చేసితిని. అప్పుడా ప్రత్యేక శక్తిని అల్లాహ్ తఆలా మాలో పుట్టించి ఇట్లనెను. మహమ్మారి మరణము సంభవించకుండా నేను మిమ్ములను రక్షింతును. నీ గృహపు నాలుగు గోడల పరిధిలో నివసించుచున్న గర్వమునకు

పొల్పడని, దైవ విధేయత పట్ల విముఖులు కాని, నిష్ఠాపరులందరిని నేను రక్షింతును. మహమ్మారిచే ఘోర విపత్తు, అతి వినాశనము నుండి నేను ఖాదియాన్ను రక్షింతును. అనగా ఇతర గ్రామాలను నాశనము చేయునట్టి భీభత్సము ఖాదియాన్‌లో సంభవించదు. మేము ఇలాగే తిలకించితిమి, ఈ అల్లాహ్ తఆలా పనులను దర్శించితిమి. ప్రపంచ వస్తువులలో క్రొత్త క్రొత్త శక్తులు, గుణములు, విశిష్టతలను పుట్టించు దేవుడే మా దేవుడు....ఆ సంపూర్ణ దేవుడు మాకు తెలిపినందున మానవ ప్రయత్నమైన టీకాను వీడినాము. టీకా వేయించుకున్నను చాలా మంది మృతి చెందారు. అల్లాహ్ తఆలా కృపానుసారము మేమిప్పటి వరకు జీవించియున్నాము. అల్లాహ్ తఆలా మన శరీరములో అభివృద్ధికి అవసరమున్న అణువులను పుట్టించినట్లే అణువులను పుట్టించును. నాలో ఒక పరిశుద్ధాత్మ అల్లాహ్ తఆలా పుట్టించినందున నేను జన్మించినాను. ఇదే విధంగా అతడు ఆత్మను పుట్టించెను. అతడు ఆత్మను పుట్టించి మన శరీరమును బ్రతికించడమే మనకు సరిపోదు. మన ఆత్మకు కూడ మరో ఆత్మ అవసరం. తద్వారా ఆ మృత ఆత్మ సజీవమగును. ఈ రెండు ఆత్మలను అల్లాహ్ తఆలాయే పుట్టించును. ఈ రహస్యమును అర్థము చేసుకొనని వ్యక్తి దైవ శక్తులను కనుగొనలేదు, దైవమును తెలుసుకోలేదు.

*(నసీమె దావత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:19 పుట:390,391)*

### అల్లాహ్ తఆలా అనంత గుణములు

అనంత, అనేక రహస్యములతో అల్లాహ్ తఆలా దైవత్వము, అతని శక్తి ముడిపడియున్నది. దైవత్వమును చట్టముగా భావించి ఒక పరిమిత స్థాయిలో నిర్ధారించుట మానవునికి తగదు. వైభవోపేతుడైన అల్లాహ్ తఆలా శక్తులు, వివేకములు అనంతమైనవని విశ్వసించుట దైవ జ్ఞానము పొందుటకు ఒక ప్రాథమిక విషయము. ఈ విషయమును అర్థము చేసుకొని, దాని గురించి లోతుగా గమనించినచో ఆందోళన,

అనుమానాస్పద ఆలోచనలన్ని తొలగిపోవును. అనంతరం సన్మార్గము, సత్యము కనిపించసాగును. అల్లాహ్ తఆలా తన శాశ్వత, ప్రాచీన గుణముల ప్రకారము సదా పనిచేయునను విషయమును మేమిచట తిరస్కరించడం లేదు. ఆయా శాశ్వత, ప్రాచీన గుణములను పాటించుటను మరో విధంగా దైవశాసనమని అన్నచో తప్పేమి లేదు. కాని ఆయా శాశ్వత, ప్రాచీన గుణములను లేదా దైవశాసనమును పరిమితం లేదా లెక్కించుటను మేము నమ్మలేము. అల్లాహ్ తఆలా ఉనికిలో గల గుణముల అనంత ప్రభావములు తమ తమ సమయములో బహిర్గతమగుననే విషయమును మేము నమ్ముతాము, నమ్మవలెను. ఆ గుణములు భూమ్యాకాశములోని ప్రతి ప్రాణిపై ప్రభావము వేయుచున్నవి. ఆయా గుణముల ప్రభావములనే మనము అల్లాహ్ తఆలా సున్నత్ లేదా ప్రకృతి చట్టమని అందుము. కాని తన సంపూర్ణ గుణములతో అల్లాహ్ తఆలా అపరిమితం, అనంతమైనందున అతని గుణముల ప్రభావములు అనగా ప్రకృతి చట్టములు మాకు అనుభవమైన దాని కంటే లేదా మేము తిలకించిన దాని కంటే ఎక్కువ లేవని అనుట అవివేకమగును. ప్రకృతి చట్టమును పూర్తిగా తెలుసుకున్నట్లు భావించుట నేటి తత్వజ్ఞానుల మొదటి భారీ తప్పిదము. కాని దాని తర్వాత సంభవించే విషయమును నమ్మనే నమ్మరు. ఇటువంటి అభిప్రాయము సరియైనది కాకపోవడం విధితమే. ఇదే నిజమైనచో క్రొత్త విషయమును నమ్ముటకు ఎలాంటి మార్గము మిగిలి యుండదు. నూతన విషయములను పరిశోధించుట కూడ అసాధ్యమగును. ఎందుకనగా ఈ పరిస్థితిలో ప్రతి క్రొత్త పని ప్రకృతి చట్టముల లోపముగా కనిపించును. దానిని వీడినచో అనవసరంగా ఒక క్రొత్త సత్యమును వీడవలసి వచ్చును....ఎవరైనా గత చరిత్ర పుటలలోని సంఘటనలను లేదా నాటు వైద్యుల జీవిత చరిత్రలను చదివినచో వారి అభిప్రాయములు ఎంత భిన్నమైన మార్గములలో ప్రవహించెనో, ఎంత

లోపభూయిష్ట అభిప్రాయములు కలిగివుండిరో తెలిసిపోవును. ఎంతో అవమానము, పశ్చత్తాపముతో ఒక అభిప్రాయమును మరో అభిప్రాయము తో మార్చుకొంటూ వచ్చిరో చూడండి. ఒక విషయమును సుదీర్ఘ కాలము వరకు ప్రకృతి చట్టమునకు విరుద్ధమని విశ్వసించుచు వచ్చిన తర్వాత అతి సిగ్గుతో కూడిన స్థితిలో అదే విషయమును ఎందుకు అంగీకరించిరి. అభిప్రాయముల ఈ మార్పునకు కారణమేమిటి ? వారు అర్థము చేసుకున్న విషయమొక అపోహ మాత్రమే అగుట ఇందుకు కారణమయ్యెను. దానిని ఆధునిక అనుభవములు రద్దు చేసెను. ఏ ఏ రూపములు, పరిస్థితులలో ఆ ఆధునిక అనుభవములు వెలువడినవో అదే విధంగా వారి అభిప్రాయముల ప్రవాహము మెలికలు తిరుగుచూ వచ్చెను. ఆధునిక అనుభవములు ఏ దిశకు తిరిగెనో అదే దిశకు వారి ఆలోచనల గాలులు వీచెను. సారాంశమేమనగా తత్వజ్ఞానుల అభిప్రాయముల ముకుతాడు బహిర్గతమైన ఆధునిక అభిప్రాయముల దారిలో నడుచును. ఇప్పటికి చాలా వరకు వారి కంట పడని విషయములున్నవి. భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొని వివిధ రకాల అవమానములు పడిన తర్వాత వాటిని అంగీకరిస్తారని ఆశించబడుచున్నది. ఎందుకనగా ప్రకృతి చట్టములను మానవ మేధస్సు పూర్తిగా ఆవహించలేదు, ఆవహించుట అసాధ్యము. కనుక వాటిని చూచి నూతన పరిశోధనలకు ఇక ఆస్కారం లేదని అనలేము. మానవుడు అతి కొద్ది వయసు పొందినను ప్రపంచ పాఠశాలలో శాశ్వత, ప్రాచీన రహస్యములను పూర్తిగా తెలుసుకొన్నాడని, దైవ మహిమలను అతడు ఎంతగా తెలుసుకున్నాడనగా అతని అనుభవము లో లేని దైవ శక్తి లేదని ఒక వివేకి భావించవచ్చునా. ఇటువంటి ఆలోచన సిగ్గులేని, మూర్ఖుడు తప్ప ఒక వివేకి ఇలా ఆలోచించడని నేను నమ్ముతాను. మా ఆలోచనలు పరిమితం, తక్కువ వున్నందున అల్లాహ్ తఆలా, అతని అనంత రహస్యములు, వివేకములను గుర్తించుటకు

సరిపడవని తత్వజ్ఞానులలోని నిజమైన మేధావులు, వాస్తవమైన ఆధ్యాత్మిక వ్యక్తులు పుణ్యులు స్వయంగా ఒప్పుకొనిరి....దేవుని అపరిమిత శక్తుల నుండి ప్రభావమును స్వీకరించినట్లు ప్రతి వస్తువు ఒక విశిష్టతని కలిగి వున్నదనుట నిరూపితమైన ఒక సత్యము. మనకు తెలిసినా తెలియక పోయినా వస్తువుల విశిష్టత అంతము కాదని దీనితో ఋజువయ్యెను. ఒక గసగసాల గింజ ప్రత్యేకతలను పరిశోధించుటకు గత, రాబోవు తత్వజ్ఞానులందరు తమ మేధా శక్తులను అంతిమ దినము వరకు వినియోగించినను దాని విశిష్టతలన్నిటిని కనుగొన్నారని ఏ వివేకి చెప్పలేడు. కనుక ఖగోళశాస్త్ర లేదా ప్రకృతి శాస్త్రము భూమ్యాకాశ వస్తువులు, శరీరముల విశిష్టతలన్నిటిని పరిశోధించెనని భావించుట కంటే ఘోర అనర్థము మరొకటి లేదు.

ఈ అంశం మొత్తానికి సారంశమేమనగా ప్రకృతి చట్టము ఒక నిరూపితమైన వాస్తవమునకు పరిమితమయ్యే విషయము కాదు. ఎందుకనగా సహజపరంగా వెలువడిన లేదా భవిష్యత్తులో వెలువడే అల్లాహ్ తఆలా పనులను ప్రకృతి చట్టమందురు. అల్లాహ్ తఆలా తన శక్తులను చూపుటలో అలసిపోలేదు. శక్తిని ప్రదర్శించు శక్తి అంతమై అతను నిద్రపోయాడు లేక ప్రక్కకు జారుకున్నాడు లేదా ఏదో ఒక బయటి శక్తి అతణ్ణి విధి లేకుండా చేసెను, లేదా విధిలేక భవిష్యత్తులో మహిమాన్విత పనులు చేయకుండా నిర్ణయించుకున్నాడు కనుక గత పలు శతాబ్దాల (ఇంతకు మించి వుండవచ్చును) కార్యాక్రమములను వీడినాడని భావించుట సబబు కాదు. అందుకే అనభవములోకి వచ్చిన కొన్ని శక్తులను అందులో కూడ ఇంకా అనేక రకాలుగా వివరములు దాగి వున్నందున ప్రకృతి చట్టముల సంకలనమని నిర్ధారించుకోకపోవడములోనే తన వివేకము, తెలివి, తత్వము, మర్యాద, అవగాహన గలదు. మన అనుభవమును మించి అల్లాహ్ తఆలా ఏ కార్యము తప్పిపోలేదని

బుద్ధిహీనుల వలె మొండిగా వ్యవహరించరాదు............ఇటువంటి విషయములను సంపూర్ణ, ఖచ్చితమైన సత్య తీర్పు, న్యాయ తీర్మాణముగా నేనెలా ఆలోచించగలను. ఎందుకనగా అవి స్వయాన బహిర్గతమగుటకు ఇంకా అనేక లక్ష్యములను చేధించవలసి వున్నది. ఈ క్లిష్టమైన సమస్య మేధావులను ఎంత వరకు ఆశ్చర్యమునకు గురిచేసినదనగా వారిలోని కొందరు వస్తువుల విశిష్టతలను నిరాకరించిరి. (విశిష్టతల తిరస్కృతులను సోఫిస్తాయి అంటారు) వస్తువుల విశిష్టతలు నిరూపితమైనను అవి శాశ్వతమని తేలలేదని కొందరన్నారు. అగ్నిని నీరు చల్లార్చును. కాని ఏదో ఒక భూ లేదా ఆకాశ ప్రభావ శక్తి వలన ఒక నీటి చెలిమ ఇందుకు భిన్నముగా తేలవచ్చును. అగ్ని కలపను కాల్చివేయును. కాని ఒక్కో అగ్ని బాహ్యాంతర కారణముల వలన ఈ విశిష్టతను బహిర్గతము చేయక పోవచ్చును. ఎందునగా ఇటువంటి విచిత్ర విషయములు సదా వెలువడు చుండును. భూమ్యాకాశములోని కొన్ని విశిష్టతలు వేలాది లేదా లక్షలాది సంవత్సరముల తర్వాత బహిర్గతమగునని కొందరు మేధావుల అభిప్రాయము. తెలియని వారికి, అమాయక ప్రజలకు అవి మహిమలుగా కనిపించును. పెద్ద పెద్ద తత్వజ్ఞానులను ఆశ్చర్యమునకు గురి చేసే కొన్ని మహిమలు అప్పుడప్పుడు ఆకాశములో లేదా భూమిలో సంభవించును. అప్పుడు తత్వజ్ఞానులు వాటిని గట్టి సాక్ష్యముతో చూచి ఆశ్చర్యానికి గురై పశ్చాత్తాపపడి వారికి తెలిసిన ప్రకృతి చట్టములో తేడా రాకూడదని కొన్ని సాకులు వెతికి వాటిని సహజ లేదా ఖగోళ శాస్త్రములో చేర్చుతారు. వీరు నిలకడ లేని క్రొత్త క్రొత్త విషయములను ఒక విద్యా శిక్షలో బలవంతముగా చేర్చి మనుగడ సాగించుకుంటున్నారు. రెక్కలున్న చాపను చూడనంత వరకు తత్వజ్ఞానులు దానిని నమ్మలేదు. వరుసగా తోక కత్తిరించబడి నందున తోక లేని కుక్కలు పుట్టనంత వరకు ఏ తత్వజ్ఞాని ఈ విశిష్టతను ఒప్పుకోలేదు. కొన్ని భూములలో ఏదో ఒక ఘోర భూకంపం వలన

రాళ్ళను కరిగించగలిగినను కలపను కాల్చలేని అగ్ని వెలువడనంత వరకు తత్వజ్ఞానులు అగ్నిలో ఇటువంటి విశిష్టత యుండుటను ప్రకృతి చట్టానికి విరుద్ధమని భావించేవారు. Aspirator యంత్రము ఆవిష్కరించబడక ముందు వరకు Transfusion of blood (అనగా ఒక వ్యక్తి రక్తమును మరొక వ్యక్తికి ఎక్కించుట) ప్రక్రియను ప్రకృతి చట్టములో ఒక భాగమని ఏ తత్వజ్ఞానికి తెలిసి యుండెను? Electric Machine అనగా విద్యుత్ యంత్రము అవిష్కరణ జరగక ముందు ఆ విద్యుత్తు ఉపయోగ ప్రక్రియను ఏ తత్వజ్ఞాని నమ్మేవాడో అతని పేరు చెప్పగలరా?

మహా గొప్ప వైద్యుడైన పెద్ద తత్వజ్ఞాని అల్లామా షారిహ్ ఖానూన్ తన ఒక పుస్తకములో ఇట్లు వ్రాసెను. యూనానీయులలో ఈ సంఘటనలు చాలా ప్రసిద్ధి చెందినవి. కొందరు స్త్రీలు తమ కాలములో ఎంతో పవిత్రత, పుణ్యమునకు మారు పేరైనను ఒక పురుషునితో సంభోగం చేయకుండానే గర్భవతులై సంతానము పొందినారు. అనంతరం పైన తెలిపిన అల్లామా అభిప్రాయపడుచు ఇట్లు వ్రాసిరి. ఈ సంఘటనలన్నిటిని అసత్యమని మనము భావించలేము. ఎందుకనగా వాస్తవము లేనిదే విభిన్న వ్యక్తులలో, మర్యాద గల జాతులలో ఇటువంటి ప్రకటనలు వెలువడే అవాకశము లేదు.... ఈ సంఘటనలన్నిటిని తిరస్కరించు వ్యక్తులు ఏమైనా అభిప్రాయ పడవచ్చును. కాని అవి అరుదైన సంఘటనలని వాటన్నిటిని రద్దు చేయలేము. వాటిని తిరస్కరించుటకు ఎలాంటి తత్వజ్ఞాన నిదర్శనము చూపలేము.... పైన తెలుపబడిన అల్లామా ఇచట ఎంతో మంచి వ్యాసము వ్రాసినారు. వారింకా ఇట్లు వ్రాసిరి. మానవులందరు ఒకే రకంగా యున్నందున పరస్పరం సానుకూల స్వభావము కలిగివుందురు. అయినను వారిలోని కొందరికి అరుదుగా అప్పుడప్పుడు ఏదో ఒక కాలములో ప్రత్యేకమైన శక్తులు లేదా ఒక గొప్ప స్థాయి శక్తులు ప్రసాదించ బడును. అవి ఇతరులలో లభించవు. అనుభవమైన కొన్ని సంఘటనలు

ఇట్లు గలవు. కొందరు ఈ కాలములో 300 సంవత్సరముల కంటే ఎక్కువ ఆయువు పొందినారు, ఇదొక మహిమ. కొందరికి సాటిలేని మహా అద్భుత జ్ఞాపక శక్తి, దర్శణ శక్తి లభించెను. ఇటువంటి వ్యక్తులు చాలా అరుదుగా వుంటారు. శతాబ్దములో లేదా వేలాది సంవత్సరములలో ఒకరు కనిపింతురు. తరచుగా జరిగే లేదా వరుసగా సంభవించే విషయములనే సామాన్య ప్రజలు చూస్తారు. సామాన్య ప్రజల దృష్టిలో తరచుగా జరిగే లేదా వరుసగా సంభవించే విషయములు ఒక చట్టముగా లేదా ప్రకృతి చట్టముగా నమ్మబడును. వాటి సత్యమునే వారు నమ్ముతారు. అందుకే తరచుగా జరిగే లేదా వరుసగా సంభవించే విషయములకు భిన్నంగా అరుదుగా సంభవించే సంఘటనలు అతి బలహీనంగా, అనుమానాస్పదంగానే గాక అసత్యమని కనిపించును. అందుకే వాటి సంభవం గురించి ప్రజలకే కాక ప్రత్యేకులకు కూడ అనుమానాలు, సందేహాలు కలుగును. తరచుగా సంభవించే విషయములకు భిన్నంగా అవి అరుదుగా జరిగినందున వాటిని పరిశోధించుటకు సంకల్పించక పోవడము వలన వైద్యులు ముందడగు వేయలేక పోతారు, ఇదే వారికి ఎదురగుచున్న పెద్ద తప్పిదము, ఘోరమైన తట్టు. వారికి లక్షణములు చూపినప్పుడు వాటిని కేవలం కథలుగా భావించి విస్మరిస్తారు. తరచుగా జరిగే సంఘటనలతో పాటు అప్పుడప్పుడు అరుదైన సంఘటనలు కూడ సంభవించుట అల్లాహ్ తఆలా ప్రాచీన పద్ధతే. ఇందుకు అనేక ఉదాహరణ లు గలవు. కాని వాటిని ఇచట వ్రాయుట వ్యాసమును పొడిగించుటగును. బుఖ్రాత్ వైద్యుడు ప్రత్యక్షముగా చూచిన కొందరు రోగుల సంఘటనలను తన వైద్యపుస్తకములో వ్రాసెను. వైద్య నిబంధనలు, వైద్యుల అనుభవము ప్రకారము వారు చికిత్సకు అర్హులే కాకుండిరి. కాని ఆయా రోగులు విచిత్రముగా స్వస్థత పొందిరి. భూమ్యాకాశముల కొన్ని ప్రభావముల వలన వారు స్వస్థత పొందినారనే భావన గలదు. తరచుగా సంభవించే

లేదా అరుదుగా సంభవించే సంఘటనల పర్వం కేవలం మానవుల వరకు మాత్రమే పరిమితం కాదని మేమిచట వ్రాయదలచితిమి. గమనించినచో ఈ పర్వం ప్రతి ఒక్కదానిలో కొనసాగుచున్నదని తేలును. ఉదా॥ మొక్కలలో ఆక అను వృక్షమును చూడండి. ఎంతో చేదు, విషము కలిగివుండును. కాని కొంత కాలము లేదా కొన్ని సంవత్సరముల తర్వాత దానిలో కూడ ఒక తియ్యటి రుచికరమైన మొక్క పుట్టును. ఇటువంటి మొక్కను ఎన్నడు చూడని లేదా కొంత చేదు చూచిన వ్యక్తి దీనిని ప్రకృతికి విరుద్ధముగా తప్పక భావించును. ఇదే విధంగా కొన్ని వస్తువులలో కూడ కొంత కాలము తర్వాత ఏదో ఒక ప్రత్యేకత గల విషయము బహిర్గత మగును. కొంత కాలము క్రితమే మేకల వలె పాలిచ్చే మేకపోతు ముజఫ్ఫర్ గఢ్‌లో పుట్టెను. దాని గురించి పట్టణములో చాలా చర్చ జరగగా ముజఫ్ఫర్ గఢ్ డిప్యూటి కమీషనర్ మీకాల్ఫ్ గారికి కూడ సమాచారమందెను. వారు దీనిని ప్రకృతి చట్టమునకు విరుద్ధముగా భావించి ఆ మేకపోతును తన వద్దకు తెప్పించుకొనిరి. ఆ మేకపోతు వారి ఎదుట హాజరపరచబడగా సుమారు సేరున్నర పాలు అదిచ్చెను....

స్త్రీల వలె పురుషులు పాలిచ్చుచుండగా మేము స్వయంగా మా కనులతో చూచినామని ముగ్గురు అతి నమ్మకమైన గౌరవనీయ వ్యక్తులు నాకు తెలిపిరి....పట్టు పురుగులు మగ పురుగులు లేకుండానే గుడ్లు పెట్టుతాయి, వాటికి పిల్లలు కూడ పుడతాయని కొందరికి అనుభవమైనది. ఎండిన మట్టితో ఎలుక పుట్టినట్లు కొందరు చూచినారు. దాని శరీర అర్ధ భాగము మట్టి కాగా మిగతా అర్ధ భాగము ఎలుకగా మారెను. హకీమ్ ఫాజిల్ ఖురైషి లేదా బహుశా అల్లామా ఒక చోట ఇట్లు వ్రాసిరి. చెవి పూర్తిగా పాడై చెవిటివాడిగా మారిన ఒక రోగిని మేము చూచితిమి. అనంతరం చెవి క్రింద ఒక రంధ్రము ఏర్పడెను. ఆ రంధ్రము గుండా అతడు పూర్తిగా వినేవాడు. అనగా అల్లాహ్ తఆలా అతనికి మరో చెవిని

ప్రసాదించెను....మానవుడు కనులతో వినగలడా? అని జాలీనవస్‌ను ప్రశ్నించగా అతడిట్లు సమాధానమిచ్చెను. ఇప్పటి వరకు ఇటువంటి అనుభవము ఎదురు కాలేదు. కాని చెవులు, కనులలో ఏదో ఒక పోలిక రహస్యముగా యుండి ఒకరి ప్రయత్నము వలన లేదా దైవికముగా అది బహిర్గతమై ఈ విశిష్టత ప్రత్యక్ష్యము కావచ్చును. ఎందుకనగా విశిష్టతల విద్యావగాహన ఇంకా అంతము కాలేదు. డా॥ బర్నీ ఆర్నర్ తమ కశ్మీర్ ప్రయాణ వ్యాసములో పీర్ పంజాల్ పర్వతారోహన సంఘటనను తెలుపుచు ఒక విచిత్ర విషయమును వ్రాసిరి. అనువాద పుస్తకములోని 80వ పుటలో ఇట్లు వ్రాయబడెను. ఒక చోట రాళ్ళను కదిలించి కాల్చగా మాకు ఒక పెద్ద నల్లటి తేలు కనిపించెను. దానిని మాకు తెలిసిన ఒక నవయువకుడు తీసుకొని తన అరచేతిలో పెట్టుకొనెను. అనంతరం నా నౌకరుని చేతిలో, నా చేతిలో పెట్టెను. కాని అది మమ్ములెవరిని కుట్టలేదు. ఆ నవయువకుడు దీనికి గల కారణాన్ని ఇట్లు తెలిపెను. పవిత్ర ఖుర్‌ఆన్ లోని ఒక సూక్తిని చదివి నేను దీనిపై ఊదినాను. ఇలా చదివి నేను తరచుగా తేళ్ళను పట్టుకుంటాను. ఒక గొప్ప ప్రఖ్యాత విద్వాంసుదు తత్వజ్ఞానము, సూఫీ విద్యలలో నిపుణుడైన ఫుతూహాత్ పుస్తక రచయిత. అతడు తన పుస్తకము ఫుతూహాత్‌లో ఇట్లు వ్రాసెను. మా గృహములో ఒక సారి ఒక తత్వజ్ఞానికి మరో వ్యక్తికి మధ్య అగ్ని విశిష్టత గురించి చర్చ జరిగెను. ఆ రెండవ వ్యక్తి ఒక విచిత్ర విషయము చూపించెను. మా ఊదు పెట్టెలో గల బొగ్గులతో కాలుతున్న అగ్నిపై తత్వజ్ఞాని హస్తముతో పాటు తన హస్తమును పెట్టెను. కాని వారిద్దరి హస్తములను అగ్ని ఏమాత్రం కాల్చలేక పోయెను. ఈ పుస్తక రచయిత అనగా నేను ఒక సత్యవంతున్ని స్వయంగా చూచితిని. అతడు మండుచున్న వేసవిలో وَإِذَا بَطَشْتُمْ بَطَشْتُمْ جَبَّارِينَ (అష్షుఅరా 26:131) సూక్తిని పఠించి కుట్టే ఈగను పట్టుకునేవాడు. అది అతన్ని ఏమాత్రం కుట్టకపోయేది. పవిత్ర ఖుర్‌ఆన్ సూక్తుల విచిత్ర

ప్రభావములు స్వయంగా నాకు అనుభవమైనవి. వాటి వలన వైభవోపేతుడైన అల్లాహ్ తఆలా ప్రకృతి విచిత్ర విషయములు తెలిసి పోవును. సారాంశమేమనగా ఈ విచిత్ర మహిమలు గల ప్రపంచము అనేక విచిత్ర విషయములతో నిండివున్నది. గతించిన మహా గొప్ప మేధావులు తమ కొన్ని పరిమిత విద్యల వలన ఎన్నడు గర్వించలేదు. తమ పరిమిత అనుభవమును అల్లాహ్ తఆలా ప్రకృతి చట్టముగా పరిగణించుటను వారు నిర్లజ్జ, అవమానముగా భావించిరి....చంద్ర సూర్యులు, నక్షత్రముల దీపములతో అలంకరించబడిన ఈ ఆకాశమును, విభిన్న మనోహర రంగులతో కూడిన ప్రాణులతో జనసంచారముగా మారిన ఈ భూమిని ఎలాంటి కష్టమునకు గురి కాకుండా కేవలం తన సంకల్పముతో పుట్టించిన అల్లాహ్ శక్తుల అంతమును ఎవరు కనుగొనగలరు?

*(సుర్మ చశమ్ ఆరియా - రూహానీ ఖజాయిన్ సంపుటి:2 పుట:90-101)*

## అల్లాహ్ తఆలా సృష్టి, శాసనము

దైవ వాఖ్యములతోనే ప్రాణులు పుట్టుట పోషణలోని ఒక రహస్యము. తమ తమ ప్రతిభను బట్టి ప్రతి ఒక్కరు దీనిని గర్తుంచుకో వచ్చును. ప్రాణులు దైవవాఖ్యముల ఛాయ, నీడ అని కూడ భావించ వచ్చును లేదా దైవ వాఖ్యములు స్వయంగా అల్లాహ్ తఆలా శక్తితో ప్రాణుల రూపంలో వచ్చినవి. దైవశాసనములోని పంక్తి ఈ రెండు రకాల అర్థములకు సరితూగును. పవిత్ర ఖుర్ఆన్‌లో కొన్ని చోట్ల బాహ్యా సూక్తిలో ప్రాణులను దైవవాఖ్యములనబడెను. అవి పోషణ మహిమల నుండి నూతన దైవ ప్రత్యేకతలు, విశిష్టతలను పొంది సంపూర్ణ ఉనికిరూపంలోకి మారెను. జన్మ రహస్యములలోని ఇదొక వాస్తవము. కేవలం తెలివి తేటలతో దీనిని అర్థము చేసుకోలేము. అల్లాహ్ తఆలా పుట్టించదలచినది పుట్టెను, సర్వము అతను పుట్టించినదే, అతని సృష్టియే, అతని

శక్తివంతమైన హస్తముతో వెలువడినదే అని భావించుట సామాన్య ప్రజలు అర్థము చేసుకొనుటకు చక్కటి మార్గము. కాని కొన్ని ఆసనాల తర్వాత ఈ పుట్టుక రహస్యము జ్ఞానులకు తెలిసిపోవును. పరోక్ష చూపులో ఈ సకల ఆత్మలు, శరీరములు దైవవాఖ్యములుగా కనిపించును. సంపూర్ణ దైవ వివేకము వలన ఇవన్ని పుట్టుక, ఉనికి రూపమునకు మారెను. కాని స్థిరంగా అసలు నమ్మవలసిన విషయమమేనగా ఆ పరోక్ష దర్శనములు, వివేకమునకు తెలిసిన వాటిని పరస్పరం పోలినవని భావించవలెను. అనగా అల్లాహ్ తఆలా ప్రతి వస్తువునకు సృష్టికర్త, పుట్టించువాడు. ఆత్మలు అయినా శరీరములు అయినా అతని ప్రమేయం లేనిదే పుట్టవు, పుట్టలేవు. ఎందుకనగా దైవశాసన పంక్తి ఇచట వివిధ అర్థములు కలిగివున్నది. పవిత్ర ఖుర్ఆన్ గట్టిగా, నమ్మకముతో బోధించుచున్నదాని ప్రకారము ప్రతి వస్తువు అల్లాహ్ తఆలా వల్లనే ఉనికిగా మారుచున్నది. ఏ వస్తువు అతని ప్రమేయం లేకుండా పుట్టలేదు లేదా తాను స్వయంగా జీవము పొందలేదు. కనుక ప్రాథమిక దశలో ఇంతటి విశ్వాసము సరిపోవును. అనంతరం విజ్ఞాన మైదానములో విహరించదలచిన వారు ఆసనాలు (ప్రార్థనలు) చేసిన తర్వాత స్వయంగా తెలుసుకొందురు. అల్లాహ్ తఆలా ఇట్లు నుడివెను. وَالَّذِينَ جَاهَدُوا فِينَا لَنَهْدِيَنَّهُمْ سُبُلَنَا (అల్ అన్కబూత్ 29:70) అనగా మా కొరకు ప్రయత్నించు వారికి మేము తప్పక మా మార్గముల వైపు మార్గదర్శనము చేయుదుము.

*(సుర్మ చశమ్ ఆరియా - రూహాని ఖజాయిన్ సంపుటి:2 పుట:173-175 అధోదీపిక)*

ఇచట మరో ముఖ్యమైన విషయమును ప్రస్తావించుట కూడ తప్పనిసరి. సమస్త వస్తువులకు కారకుడైన అల్లాహ్ తఆలాతో సమస్త వస్తువులు సంబంధము కలిగివున్నవి. కనుక అతడు పోషణపరంగా లేదా ఆగ్రహముతో ఏదేని పుట్టించుటకు సంకల్పించి కదిలినప్పుడు ఆ కదలిక సంపూర్ణ, పరిపూర్ణ రీతిలో వున్నచో సర్వ ఉనికిల కదలికకు

అనివార్యమగును. మరికొన్ని పరిమిత అనగా ఒక భాగమునకు చెందిన కదలిక అయినచో దాని ప్రకారమే ప్రపంచములోని కొన్ని భాగములలో కదలిక పుట్టును. యదార్థమేమనగా వైభవోపేతుడైన అల్లాహ్ తఆలాతో పాటు అతని సృష్టి, సకల లోకాల ప్రాంతము అతనితో శరీరము ఆత్మకు గల సబంధమును పోలివుండును. శరీర అవయవములన్నియు ఆత్మకు లోబడి వుండును. ఆత్మ ఎటు వంగునో అవి అటే వంగిపోవును. ఇదే సంబంధము అల్లాహ్ తఆలా అతని సృష్టిలో గలదు. అల్లాహ్ తఆలా గురించి ఫుసూస్ రచయిత చెప్పిన విధంగా خَلَقَ الْاَشْيَآءَ وَهُوَ عَيْنُهَا అని చెప్పలేను. కాని నేనిట్లు తప్పక చెప్పగలను.

خَلَقَ الْاَشْيَآءَ وَهُوَ كَعَيْنِهَا ۔ هٰذَا الْعَالَمُ كَصَرْحٍ مُّمَرَّدٍ مِنْ قَوَارِيْرَ وَمَا
الطَّاقَةُ الْعُظْمٰى يَجْرِىْ تَحْتَهَا وَيَفْعَلُ مَا يُرِيْدُ يُخَيَّلُ فِىْ عُيُوْنٍ قَاصِرَةٍ كَاَنَّهَا هُوَ۔
يَحْسَبُوْنَ الشَّمْسَ وَالْقَمَرَ وَالنُّجُوْمَ مُؤَثِّرَاتٍ بِذَاتِهَا وَلَا مُؤَثِّرَ اِلَّا هُوَ۔

అనగా వివేకవంతుడైన అల్లాహ్ తఆలా నాకీ రహస్యమును తెలిపెను. ఈ ప్రపంచమంతా, తనలో గల సర్వముతో పాటు ఆ సమస్త వస్తువులకు గల కారకుని పనులు, ఉద్ధేశములను పూర్తి చేయుటకు వాస్తవముగా తమంత తాముగా లేని అవయవములుగా గలదు. అది (ప్రపంచము) అనుక్షణం ఆ అతిగొప్ప ఆత్మతో శక్తిని పొందును. ఉదా॥ శరీర శక్తులన్నియు ఆత్మ వల్లనే మనుగడ సాగించుచున్నవి. ఈ ప్రపంచమంతా ఆ మహా గొప్ప ఉనికి కొరకు తాత్కాలిక అవయవములుగా గలదు. ఇందులోని కొన్ని వస్తువులు అతని ముఖ కాంతి వలె గలవు. అవి భాహ్యంతరముగా అతని సంకల్పముల మేరకు జ్యోతిగా పని చేయును. కొన్ని వస్తువులు అతని హస్తముగా గలవు. మరికొన్ని వస్తువులు అతని కాళ్లుగా గలవు. ఇంకొన్ని వస్తువులు అతని శ్వాస వలె గలవు. సంక్షిప్తముగా చెప్పాలంటే ఈ ప్రపంచమంతా అతని కొరకు ఒక శరీరము వలె గలదు. ఈ శక్తియుక్తులు, ఈ శరీర జీవితమంతా ఆ మహా గొప్ప

ఆత్మ వల్లనే ఏర్పడెను. అతడు ప్రపంచ సర్వస్థితికి కారణుడు. సర్వస్థితికి కారకుడైన అల్లాహ్ తఆలాలో ఏర్పడిన సంకల్పము ఆయా శరీరములోని అవయవములన్నిటిలో లేదా ఆ అల్లాహ్ తఆలా ఆశించిన విధంగా కొన్నిటిలో సంకల్పము ఏర్పడును.

పైన తెలిపిన చిత్రమును చూపించుటకు మనము ఊహాజనితంగా సకల లోకాలకు కారకుడైన అల్లాహ్ తఆలాను ఒక అతి పెద్ద ఉనికిగా భావించవచ్చును. అతనికి అనన్య చేతులు, కాళ్లు గలవు. ప్రతి అవయవము గణనకందని సంఖ్యలో అంతులేని వెడల్పు, పొడుగు కలిగివున్నది.

*(తౌజీహ్ మరామ్ - రూహాని ఖజాయిన్ సంపుటి:3 పుట:88-91)*

ప్రపంచములోని భూమ్యాకాశ వస్తువులలో శారీరక నాశనమగు లక్షణములు గలవనుటలో సందేహం లేదు. అవి ఆధ్యాత్మికంగా, శాశ్వతంగా అల్లాహ్ తఆలా ఉనికిలో యున్నవి. సూర్యుడు మొదలగు వస్తువులు స్వతహాగా శూన్యమని కూడ అల్లాహ్ తఆలా మనకు స్పష్టము చేసెను. తెరచాటున అతని గొప్ప శక్తియే ప్రతి పని చేయుచున్నది. చంద్రుణ్ణి తన ఉనికికి నిదర్శనంగా చీకటి రాత్రులలో జ్యోతితో అతడే వెలిగించు తాడు. ఇలాగే అంధకారముతో కూడిన హృదయములలో స్వయంగా ప్రవేశించి వాటిని ప్రకాశవంతం చేస్తాడు. అతనే స్వయంగా మానవుని లోపల మాట్లాడుతాడు. అతడే తన శక్తులపై సూర్యుని ముసుగు వేసి పగలును మహాగొప్ప కాంతిమయం చేస్తాడు. వివిధ కాలములలో తన విభిన్న పనులను బహిర్గతం చేస్తాడు. అతని శక్తియే ఆకాశము నుండి వర్షము రూపంలో కురుస్తుంది. అది దాహంతో వున్న వారి దాహం తీర్చును. అతని శక్తియే అగ్ని రూపంలో కాలుతుంది, గాలిలో కలిసి తాజాదనము ప్రసాదిస్తుంది, పుష్పములను అందముగా మార్చుతుంది, మేఘాలను మోస్తుంది, ధ్వనిని చెవుల వరకు చేర్చుతుంది. అతని శక్తియే పృథ్వి ఆకారంలో మారి మానవ జాతిని, పశు పక్ష్యాదులను తన వీపుపై

మోస్తుంది. కాని ఈ వస్తువులను దేవుడనవచ్చునా ? అనలేము ఎందుకనగా ఇవి పుట్టించబడినవి. ఉదా॥ కలముతో హస్తము కలిసివున్నట్లే ఈ వస్తువులలో అల్లాహ్ తఆలా శక్తి కలిసి వున్నది. కలము వ్రాయు చున్నదని మనము అనవచ్చును. కాని కలము వ్రాయదు హస్తము వ్రాయును. లేదా ఒక ఇనుప ముక్కను అగ్నిలో వేయగా అగ్ని వలె మారుతుంది. అది కాల్చుతుందని, జ్యోతి ప్రసాదిస్తుందని మనము అనవచ్చును. కాని వాస్తవానికి ఆ లక్షణములు దానిలో లేవు అగ్నిలో వున్నవి. పరిశోధనపరంగా భూమ్యాకాశములోని వస్తువులు లేదా ప్రపంచములోని ప్రతి పెద్ద చిన్న అణువులో వున్న చూడదగ్గ, భావించదగ్గ విభిన్న ప్రత్యేకతలన్నియు దేవుని నామములు, దేవుని లక్షణములని కూడ మనము అనవచ్చును. వాటిలో దేవుని శక్తియే దాగి వున్నది. ఆరంభములో ఇవన్నియు దైవ వాఖ్యములుగా యుండెను. అతని శక్తి వాటిని విభిన్న రంగులలో ప్రత్యక్షపరచెను. దేవుని వాఖ్యములు ఎలా శరీరము దాల్చెనని, అవి విడిపోయినచో దైవత్వము క్షీణించినదా? అని అవివేకుడు ప్రశ్నించ వచ్చును. సూర్యుని నుండి ఒక వేడి అద్దము అగ్నిని పొందినప్పుడు ఆ అగ్ని సూర్యునిలో ఏమియును తగ్గించలేదు. చంద్రుని ప్రభావము వలన ఫలములు పెరుగునో అవి చంద్రుని ఆకారమును తగ్గించవు. దేవుని వాఖ్యముతోనే ప్రపంచము పుట్టినదనే విషయము దైవ విజ్ఞాన రహస్యము, ఆధ్మాతిక వ్యవస్థ మంతటికి కేంద్రము.

*(నసీమె దావత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:19 పుట:423,424)*

నేను ఆయా పెద్ద పెద్ద ఆకారములను చూచినప్పుడు, వాటి గొప్పతనము, ప్రత్యేకతలను గమనించినప్పుడు నా ఆత్మ అనుకోకుండానే ఇట్లనును. ఓ సర్వశక్తిమంతుడైన మా అల్లాహ్! నీవు ఎన్నో శుభకరమైన శక్తులు కలిగివున్నావు. నీ పనులు ఎంతో విచిత్రమైనవి, దాగివున్నవి. నీ శక్తులను నిరాకరించువాడు అవివేకుడు. దేవుడు ఈ వస్తువులను ఏ

పదార్థముతో పుట్టించినాడు? అని విమర్శించే వ్యక్తి బుద్ధిహీనుడు.

*(నసీమె దావత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:19 పుట:425 అధోదీపిక)*

అల్లాహ్ తఆలా అనబడు మన దేవుని అసలు వాస్తవికత ఏమనగా శుభములకు అతడు మూలము. అతని చేతనే అందరు ఉనికి పొందుతారు. దీని వల్లనే అతడు ఆరాధనకు అర్హుడగును. మా శరీరము, హృదయము, ప్రాణముపై అతనికి హక్కు వున్నందున అధికారము కలిగివున్నాడని మేము ఆనందముతో అంగీకరిస్తాము. ఎందుకనగా మేము శూన్యముగా వుండగా అతడు మాకు ఉనికి ప్రసాదించెను. శూన్యము నుండి మమ్ములను పుట్టించిన హక్కుతో అతడే మాకు అధికారుడయ్యెను.

*(షహ్నా హఖ్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:2 పుట:428,429)*

అసలు విషయమేమనగా ఆధ్యాత్మిక, శారీరక శక్తులను పుట్టించు విశిష్టత దేవునిలో యున్నందుకే అతడు దేవుడు అని అనబడును. ఉదా॥ ప్రాణుల శరీరమునకు అతడు నేత్రములు ప్రసాదించెను. అతడు నేత్రములను పుట్టించుట మాత్రమే అతని విశిష్టత కాదు. చూచుటకు కాంతి పుట్టుటకు శరీర అణువులలో అతడు ముందుగానే రహస్య శక్తులను పుట్టించుటలో అతని ప్రత్యేకత గలదు. ఎందుకనగా ఒక సామెత ప్రకారం 'సొమ్మొకరిది సోకొకరిది' అన్నట్లు ఆ శక్తులు వాటంతట అవే వున్నచో దేవుని అవసరమేమియును లేదు. ఆ చూపుకు ఆ శక్తులు వాటంత అవే వున్నప్పుడు ఇందులో దేవుని జోక్యమునకు అవసరమేమి? ప్రపంచ అణువులలో వాటి శక్తులు వాటంతట అవే వున్నచో దైవత్వము నిరుపయోగమయ్యేది. ఆత్మల, ప్రపంచ అణువుల శక్తులన్నిటిని తాను స్వయంగా పుట్టించినందున, పుట్టించుచున్నందున, స్వయంగా విభిన్న రకాల ప్రత్యేకతలు కల్పించినందుననే అతడు దేవుడనబడును. ఆ విశిష్టతలను కలిపినప్పుడు అవి తమ మహిమ ప్రదర్శించును. ఒక పరిశోధకుడు దేవునితో సమానం కాలేదు. ఎందుకనగా ఒక వ్యక్తి రైలు

బండి లేదా తంతివార్త (టెలిగ్రామ్) లేదా ఫోటోగ్రాఫ్ లేదా ముద్రణ యంత్రము (ప్రెస్) లేదా మరో వస్తువును ఆవిష్కరించినచో ఏ ఏ శక్తులను ఉపయోగించి అతడు ఆ యంత్రమును తయారు చేసెనో ఆయా శక్తులను తాను పుట్టించినాడని అతడు ప్రకటించలేడు. ఈ ఆవిష్కర్తలందరు ముందుగానే సిద్ధముగా వున్న శక్తులను ఉపయోగిస్తారు. ఉదా॥ ఇంజిన్ నడుపుటకు ఆవిరి శక్తులను ఉపయోగిస్తారు. కనుక తేడా ఏమనగా అల్లాహ్ తఆలా స్వయంగా ప్రకృతి శక్తులలో ఈ శక్తులను పుట్టించెను. కాని వీరు స్వయంగా ఆయా శక్తులు, యుక్తులను పుట్టించలేరు. ప్రపంచ అణువులు, ఆత్మల శక్తులన్నిటికి అల్లాహ్ తఆలాను ఆవిష్కర్తగా భావించనంత వరకు అతని దైవత్వము ఋజువు కానే కాదు. లేనిచో అతని స్థాయి ఒక నిర్మాణకర్త లేదా వడ్రంగి లేదా కంసాలి లేదా కుమ్మరి వాని కంటే ఎక్కువ కానే కాదు. ఇటువంటి విషయము రద్దు చేయబడుననేది విధితమే.

*(నసీమె దావత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:19 పుట:383,384)*

ఆత్మలు, అణువులు తమ శక్తులన్నిటితో ఆది నుండి గలవు, అవి పుట్టించబడలేదని తెలిపే ఆర్యా సమాజీల సూత్రము సముచితమైనది కాదని మేము సంపూర్ణ విశ్వాసము, పూర్తి జ్ఞానముతో సాక్ష్యమిచ్చు చున్నాము. దీని వలన దేవుని, అతని దాసుల మధ్యలో గల బంధుత్వము మొత్తం తెగిపోవును. ఒక క్రొత్త, అసహ్యమైన సిద్ధాంతమును పండిత్ దయానంద్ ప్రవేశపెట్టెను. వేదాలతో ఈ సిద్ధాంతము ఎంత వరకు రుజువగునో మాకు తెలియదు. కాని ఆర్యా సమాజీలు స్వయంగా ముద్రించిన ఈ సిద్ధాంతముల గురించి సంపూర్ణ విజ్ఞానము, పరిపూర్ణ అవగాహనతో గ్రహించిన తర్వాత నిజమైన వివేకముతో కూడిన దృష్టిలో సరియైనవి కావు. వీటికి బదులుగా గల సనాతన ధర్మ సిద్ధాంతములను వేదాల అనవసర అతిశయోక్తి చెడగొట్టెను. వేదాంతుల అతిశయోక్తి వలన

అనేక విమర్శలు తెలెత్తినవి. కాని వీటిలో ఒక సత్యపు తేజస్సు వున్నది. ఈ విశ్వాసమును అనవసర విషయముల నుండి శుద్ధి చేసినచో దాని అసలు వాస్తవమేమనగా పరమేశ్వరుని హస్తముతోనే పుట్టెను. కనుక సనాతన ధర్మ సిద్ధాంతముల ప్రకారము సకల ఆత్మలు, శరీర అణువులు, వాటి శక్తి యుక్తులు, గుణములు విశిష్టతలన్ని దేవుడు పుట్టించినవేనని వేదాల విశ్వాసము.

*(నసీమె దావత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:19 పుట:387)*

మానవుడు తమ ఆత్మ, సర్వ శక్తులు, అణువణువు దేవుని సృష్టి అని పవిత్ర ఖుర్ఆన్ మనకు బోధించెను. అనగా దేవుడు వాటిని పుట్టించెను. కనుక పవిత్ర ఖుర్ఆన్ బోధనానుసారము మనము దేవుని పూర్తి యాజమాన్యములో వున్నాము. కాని మనము అతనితో అడిగేందుకు లేదా తాను చెల్లించనందుకు నిందించబడుటకు అతనిపై మనకు ఎలాంటి హక్కు లేదు. అందుకే మనము మన వలె దేవుని పేరు న్యాయమూర్తి అని పెట్టలేము. మనము పూర్తిగా అసహాయులమైనందున అతణ్ణి రహీమ్ అని అంటాము. అతణ్ణి న్యాయమూర్తి అన్నచో అతనితో మనము ఏదో ఒక హక్కు కలిగివున్నామనే భావన కలుగును. దానిని అతడు చెల్లించ నందుకు మనము అతన్ని హక్కులు హరించినాడని అనవచ్చును.

*(చశ్మ మారిఫత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:19 పుట:387)*

వేదాల మాదిరిగా అనవసరంగా, బలవంతంగా సర్వ ఆత్మల, శరీరముల అణువణువునకు అల్లాహ్ తఆలాను యాజమానిగా పవిత్ర ఖుర్ఆన్ నిర్ధారించలేదు. దానికి ఒక కారణమును తెలుపుచు పవిత్ర ఖుర్ఆన్ ఇట్లనెను. لَهٗ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ (అల్ హదీద్ 57:3) خَلَقَ كُلَّ شَيْءٍ فَقَدَّرَهٗ تَقْدِيْرًا (అల్ ఫుర్ఖాన్ 25:3) అనగా భూమ్యా కాశములలో గల దంతటికి అల్లాహ్ తఆలా యజమాని. ఎందుకనగా వాటన్నిటిని అతడే పుట్టించెను. నిర్ధారించు శక్తిని అనగా అల్లాహ్ తఆలాను

సూచించుటకు ప్రతి సృష్టికి ఒక నిర్ణీత శక్తి, పనిని నిర్ణయించెను. శరీరములు తమ తమ పరిధిలో ఒక నిర్ణీత హద్దు కలిగివున్నాయి. అవి ఆ హద్దును దాటలేవు. ఇదే విధంగా ఆత్మలకు కూడ హద్దులు నిర్ణయించ బడెను. తాము నిర్ధారించిన శక్తి కంటే ఎక్కువ ఏ శక్తిని పుట్టించలేవు. శరీరములు ఒక ఆకారమునకు పరిమితమని మొదటగా మేము తెలుప దలచితిమి. ఉదా॥ ఒక చంద్రుడు ఒక నెలలో అనగా 29 రోజులు లేదా 30 రోజులలో తమ భ్రమణమును పూర్తి చేసుకొనును. కాని సూర్యుడు 364 రోజులలో తన భ్రమణమును పూర్తి చేసుకొనును. తన భ్రమణమును చంద్రుని కాలము ప్రకారము తన భ్రమణ కాలమును తగ్గించుకొను శక్తి సూర్యునికి లేదు. సూర్యునికి కేటాయించిన విధంగా తన భ్రమణ రోజులను పెంచుకొను శక్తి చంద్రునికి లేదు. ఈ రెండు గ్రహాల భ్రమణ కాలమును తగ్గించాలని లేదా పెరగాలని ప్రపంచ వాసులందరు ఏకమైనా వారికి సాధ్యము కానే కాదు. తమ తమ భ్రమణముల కాలములో మార్పులు చేర్పులు చేసుకొను శక్తి సూర్య చంద్రాదులకు లేదు.

ఈ గ్రహాలకు తమ తమ నిర్ణీత హద్దులు నిర్ణయించిన ఉనికి అనగా వాటికి హద్దులు నిర్ధారించు వాడే అల్లాహ్ తఆలా. ఇలాగే మానవుని శరీరములో ఏనుగు శరీరములో ఎంతో వ్యత్యాసము గలదు. మానవుడు కూడ తన శరీర శక్తులు, శరీర ఆకారములో ఏనుగుకు సమానం కావాలని వైద్యులందరు ఏకమైనా ఇది వారికి సాధ్యము కాదు. ఏనుగు కేవలం మానవ శరీర ఆకారమునకు పరిమితం కావాలని వారందరు తలచినా అది సాధ్యము కాదు. ఎందుకనగా ఇక్కడ కూడ హద్దులు నిర్ధారించబడెను. సూర్య చంద్రాదులలో ఒక హద్దు వున్నది. అది హద్దులు నిర్ణయించువానిని సూచించును. అనగా ఏనుగుకు ఆకారము ప్రసాదించిన ఉనికి, మానవునికి ఆకారము నొసంగిన ఉనికి గలదు. శ్రద్ధతో చూచినచో ఈ శారీరక వస్తువులన్నిటి పట్ల అల్లాహ్ తఆలా చేతిలో

ఒక విచిత్రమైన రహస్య అధికారము గలదు. విచిత్రంగా అతని హద్దుల నిర్ధారణ కనిపించును. సూక్ష్మదర్శిని లేనిదే చూడలేని కీటకముల ఆకారము నుండి పెద్ద పెద్ద పడవలను ఒక బుక్కలో మ్రింగివేయగల చేపల ఆకారము వరకు పశువుల శరీరములలో హద్దుల నిర్ధారన పట్ల ఒక విచిత్ర దృశ్యము కనిపించును. ఏ జంతువు కూడ తన శరీరములో తనకు నిర్ధారించిన హద్దును దాటలేదు. ఈ హద్దుల నిర్ధారణ వలన తెర వెనుక ఎవరో ఒకరు హద్దులు నిర్ధారించువాడున్నాడని తెలియును. పైన తెలిపిన సూక్తి خَلَقَ كُلَّ شَيْءٍ فَقَدَّرَهُ تَقْدِيرًا (అల్ ఫుర్ఖాన్ 25:3) కి ఇదే భావము గలదు.

శరీరములలో ఈ హద్దుల నిర్ధారణ యున్నట్లే ఆత్మలలో కూడ ఈ హద్దుల నిర్ధారణ గలదని స్పష్టముగా తెలుపుచున్నాను. మానవుని ఆత్మ ఎంత వరకు తన విశిష్టతలను బహిర్గతపర్చగలదో లేదా ఎంత వరకు విశిష్టతల వైపు ప్రగతి చెందగలదోనని కూడ మీరు అనవచ్చును, ఆ విశిష్టతలు పెద్ద శరీరము, ఆకారము కలిగివున్నను ఒక ఏనుగుకు లభించలేవు. ఇదే విధంగా ప్రతి జంతువు ఆత్మ తమ శక్తి యుక్తుల ప్రకారము తన పరిధిలో పరిమితమై వున్నది. తన రకమునకు విధించబడిన విశిష్టతలను మాత్రమే పొందగలదు. శరీరముల ఆకార హద్దులు నిర్ధారించు ఒక ఉనికికి, సృష్టికర్తకు నిదర్శమైనట్లే ఆత్మల శక్తుల హద్దుల నిర్ధారణ కూడ హద్దులు నిర్ధారించు ఒక ఉనికికి, సృష్టికర్తకు నిదర్శనమగును.

*(చశ్మ మారిఫత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:23 పుట:17-19)*

## మానవ విభిన్న ప్రతిభలకు కారణం

దేవుడు వివిధ స్వభావములను ఎందుకు పుట్టించాడు, సంపూర్ణ విజ్ఞానము, పరిపూర్ణ ప్రేమ స్థాయికి చేరుటకు అవసరమున్న శక్తులను అందరికి ఎందుకు ప్రసాదించలేదనే ప్రశ్న ఒకరి హృదయములో ఉత్పన్నమైనచో ఈ ప్రశ్న కూడ దైవ కార్యములలో వృథా జోక్యమనబడును.

కనుక ఇది సమంజసము కానే కాదు. అందరిని ఒకే స్థాయిలో నిలుపుట, అందరికి గొప్ప విశిష్టతల శక్తులు ప్రసాదించుటకు దేవుడు బద్ధుడు కాదని ప్రతి వివేకి అర్థము చేసుకోవచ్చును. ఇది అతని శుభము మాత్రమే. అతని ఇష్టమైనందున తలచిన వానిపై చేయును, తలచిన వానిపై చేయక పోవును. ఉదా॥ మిమ్ములను అల్లాహ్ తఆలా మానవులుగా పుట్టించెను కాని గాడిదను మానవునిగా పుట్టించలేదు. మీకు తెలివి తేటలు ప్రసాదించెను కాని దానికి ప్రసాదించలేదు లేదా విద్య లభించెను కాని దానికి లభించలేదు. ఇదంతా యజమాని ఇష్టము, ఏదియును మీ హక్కు కాదు, గాడిదది కూడ కాదు. కావున దైవ సృష్టిలో స్పష్టమైన వ్యత్యాసము కనిపించును. దీనిని వివేకులైన వారెవరు తిరస్కరించలేరు. సర్వాధికారి అయిన యజమాని ఎదుట తమ ఉనికి హక్కు కూడ లేనివారు తాము పెద్దవారు కావాలని ఎలా హక్కు కలిగివుందురు. అల్లాహ్ తఆలా దాసులను పుట్టించుటయే ఒక వరము, ఉపకారము. కనుక దాత ప్రసాదించే సమయమున హెచ్చుతగ్గులకు సర్వాధికారము కలిగివుండును. తక్కువ ఇచ్చే అధికారము అతనికి లేనప్పుడు ఎక్కువ ఇచ్చే అధికారము కూడ అతనికి వుండకూడదు. అటులైనచో యాజమాన్య అధికారములను జారీచేయుటలో అతడు విఫలమగును. సృష్టికి సృష్టికర్తపై అనవసరంగా హక్కులు ఒప్పుకొనుటలో విమర్శల పర్వం మొదలగును. ఎందుకనగా సృష్టికర్త ఒక దానిని సృష్టించినప్పుడు నాకు అధిక హక్కులు గలవని సృష్టి అడగవచ్చును. అల్లాహ్ తఆలా అనంత స్థాయి అంతస్తు గలదానిని సృష్టించవచ్చును. అతడు అనంత శక్తులు కలిగివున్నందున మానవుణ్ణి మాత్రమే పుట్టించుటతో అతని పుట్టించు విశిష్టత అంతము కాలేదు. ఇటులైనచో సృష్టి ద్వారా ప్రశ్నల పర్వం ఎన్నడు అంతము కాదు. ప్రతిసారి అనంత శక్తులు గల అల్లాహ్ తఆలాపై సృష్టికి తమ హక్కులు అడిగే అర్హత కలుగును. ఇదొక అంతము కాని విషయముగా మారును.

స్థాయి అంతస్తులలో ఇటువంటి వ్యత్యాసము పెట్టడానికి గల కారణమేమి అని తెలుసుకోదలచినచో ఇందుకు పవిత్ర ఖుర్‌ఆన్ మూడు కారణములను తెలిపినదని గ్రహించవలెను. తెలివితో ఆలోచించినచో ఇవి ఎంతో స్పష్టమైనవి, కాంతివంతమైనవి. వీటిని ఒక వివేకి నిరాకరించ లేడు. వాటి వివరములిట్లు గలవు.

**ప్రథమ విషయము:** ప్రపంచ కార్యక్రమాలు అనగా సమాజ విషయములు ఉత్తమ రీతిలో కొనసాగుటకు. అతడిట్లు తెలిపెను.

وَقَالُوْا لَوْلَا نُزِّلَ هٰذَا الْقُرْاٰنُ عَلٰى رَجُلٍ مِّنَ الْقَرْيَتَيْنِ عَظِيْمٍ ۔ اَهُمْ يَقْسِمُوْنَ رَحْمَتَ رَبِّكَ نَحْنُ قَسَمْنَا بَيْنَهُمْ مَّعِيْشَتَهُمْ فِى الْحَيٰوةِ الدُّنْيَا وَرَفَعْنَا بَعْضَهُمْ فَوْقَ بَعْضٍ دَرَجٰتٍ لِّيَتَّخِذَ بَعْضُهُمْ بَعْضًا سُخْرِيًّا

(అజ్జుఖ్రుఫ్ 43:32,33) భాగము 25. అనగా అవిశ్వాసులు ఇట్లందురు. ఈ ఖుర్‌ఆన్ ప్రసిద్ధమైన మక్కా, తాయిఫ్ అను రెండు పురములలోని ఏ ఒక్క గొప్ప ధనవంతుని, నాయకుని పై ఎందుకు అవతరించలేదు. తద్వారా అతని నాయకత్వమునకు తగ్గట్టుగా యుండేది. అతని వైభవము, రాజకీయము, ధనమును వినియోగించినందున ధర్మము త్వరగా వ్యాపించేది. ప్రాపంచిక ధన సంపత్తి ఏమియును లేని నిరుపేదను ఈ పదవితో ఎందుకు సత్కరించెను? (అనంతరం సమాధానముగా ఇట్లనెను) اَهُمْ يَقْسِمُوْنَ رَحْمَتَ رَبِّكَ పంచి పెట్టువాడైన దేవుని కరుణలను పంచి పెట్టుటకు వారు అధికారము కలిగివున్నారా! అనగా ఇది గొప్ప వివేకవంతుడైన అల్లాహ్ తఆలా పని. కొందరికి శక్తి సామర్థ్యములు తక్కువ ప్రసాదించెను. వారు ప్రపంచ ఆడంబరాలలోనే చిక్కుకొని వుండిరి. నాయకుడు, ధనవంతుడు, ఆస్తిపరుడు అనిపించుకొని సంతోషపడిరి. అసలు ఉద్దేశమును మరచిపోయిరి. మరికొందరికి ఆధ్యాత్మిక ప్రత్యేకతలు, పవిత్ర విష్టతలు ప్రసాదించెను. అటువంటివారు ఈ నిజమైన ప్రియుని ప్రేమలో లీనమై సమీపులలో చేరిపోయిరి. దేవుని ఆమోదముద్ర పడిన వారిగా మారిరి. (అనంతరం శక్తి సామర్థ్యములు, ఆలోచనలలో గల

వ్యత్యాసములో గల వివేకమును తెలిపెను.) نَحْنُ قَسَمْنَا بَيْنَهُمْ مَّعِيشَتَهُمْ الخ అనగా కొందరిని ధనవంతులుగా, మరికొందరిని యాచకులుగా, కొందరిని సూక్ష్మ స్వభావికులుగా, మరికొందరిని బద్ధంగా, కొందరి స్వభావములను ఏదో ఒక వృత్తి వైపు ఆకర్షింపబడు మరికొందరిని మరో వృత్తి వైపు ఆకర్షింపబడు విధంగా చేసితిమి. తద్వారా కొందరు కొందరికి సేవకులుగా అగుదరు. కేవలం ఒకరిపై భారము పడదు. ఈ విధంగా మానవ పనులు సులభంగా కొనసాగును. మరల ఇట్లనెను. ఈ తరుణం లో ప్రాపంచిక ధనము, ఆస్తుల కంటే అల్లాహ్ తఆలా గ్రంథము అధిక లాభము కలిగించునట్టిది. దైవవాణి అవసరాన్ని అతి సున్నితంగా ఇందులో ప్రస్తావించెను. దీని వివరణ ఇట్లు గలదు. మానవుడు ఒక సామాజిక జీవి. ఒకరు మరొకరికి సహకరించుకొననిదే అతని ఏ పని పూర్తి కాలేదు. ఉదా॥ జీవితమునకు ఆధారమైన ఒక రొట్టెను చూడండి! దీనిని తయారు చేయుటకు (వండుటకు) ఎంతో సామాజికత, సహాయము అవసరముండును. వ్యవసాయ దశ నుండి రొట్టె తినుటకు సిద్ధమయ్యేంత వరకు పాతిక వృత్తిపరమైన సహాయములు అవసరముండును. సాధారణ సమాజ విషయములో కూడ ఎంత వరకు సహాయ, సహకారము అవసరమో దీనితో తెలిసిపోవును. ఈ అవసరము వల్లనే గొప్ప వివేకవంతుడైన అల్లాహ్ తఆలా మానవులను వివిధ స్వభావములు, సామర్థ్యములతో పుట్టించెను. తద్వారా ప్రతి ఒక్కరు తమ ప్రతిభ, తమ స్వభావ ఆకర్షణ మేరకు ఏదో ఒక పనిలో ఉత్తమ రీతిలో నిమగ్నమై యుండును. ఒకరు వ్యవసాయము చేయును, మరొకరు వ్యవసాయ పనిముట్లు సిద్ధము చేయును. ఒకరు పిండి రుబ్బును, మరొకరు నీళ్లు తెచ్చును. ఒకరు రొట్టెలు చేయును, మరొకరు దారము అల్లును, ఒకరు వస్త్రములు సిద్ధము చేయును. మరొకరు దుకాణము తెరుచును. ఒకరు వ్యాపార వస్తువులు తెచ్చును. మరొకరు ఉద్యోగము చేయును. ఈ విధంగా

పరస్పరం సహాయకులుగా మారుదురు. కొందరు కొందరికి సహాయ పడుదురు. ఒకరు మరొకరికి సహకరించుకొనుట అనివార్యమైనప్పుడు ఒకరి అవసరము మరొకరికి కలుగుట కూడ తప్పనిసరి. పని, ప్రతిఫలము వున్నప్పుడు ప్రపంచ విషయముల ప్రత్యేకత అయిన నిర్లక్ష్యము కూడ ఇందులో తప్పక వుండును. కనుక మానవులను హింస, దౌర్జన్యము, ద్వేషము, అశాంతి, అల్లాహ్ తఆలాను విస్మరించు విషయముల నుండి రక్షించుటకు, ప్రపంచ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా వుండుటకు న్యాయ పరమైన చట్టము అవసరముండెను. ఎందుకనగా ఆదాయ వనరులు, పరలోక విషయములన్ని న్యాయము, దైవభీతిపై ఆధారపడివున్నవి. ఈ న్యాయము, దైవభీతి ఒక చట్టమునకు లోబడి యున్నది. అందులో న్యాయ సూత్రములు, దైవజ్ఞాన వాస్తవాలు సరియైన పద్ధతిలో ప్రస్తావించబడినవి. అనుకోకుండా లేదా ఉద్ధేశపూర్వకంగా కూడ అందులో ఎలాంటి హింస లేదా పొరపాటుకు ఆస్కారము లేదు. ఇంకా ఆ ఉనికి తప్పక విధేయత, అనివార్య గౌరవమునకు అర్హత కలిగివుండవలెను. చట్టము ఎంత గొప్పదైనా చట్టమును జారీ చేయువాడు తన స్థాయి పరంగా అందరికంటే ఉత్తముడై అధికారమునకు అర్హుడు కానిచో లేదా అతని ఉనికి ప్రజలందరి దృష్టిలో అన్ని రకాల హింస, దుష్టత్వమునకు అతీతము కానిచో అటువంటి చట్టము మొదట కొనసాగనే కొనసాగదు. ఒక వేల కొన్ని రోజులు కొనసాగినా కొద్ది రోజుల్లోనే అందులో వివిధ రకాల పీడనములు ఏర్పడును. మంచికి బదులు చెడుకు దారి తీయును. ఈ కారణములన్నిటి వలన దైవ గ్రంధము అవసరమయ్యెను. ఎందుకనగా సర్వ సుగుణాలు, అన్ని రకాల విశిష్టత, ప్రత్యేకత దైవ గ్రంధములో మాత్రమే వుండును.

**రెండవ విషయము:** స్థాయి అంతస్థులలో వ్యత్యాసమునకు రెండవ వివేకమేమనగా సత్యవంతుల, పవిత్రుల ప్రత్యేకత బహిర్గత మగును. ఎందుకనగా పోటీ జరిగినప్పుడే ప్రతి విశిష్టత తెలిసిపోవును.

ఇట్లనెను. اِنَّا جَعَلْنَا مَا عَلَى الْاَرْضِ زِيْنَةً لَّهَا لِنَبْلُوَهُمْ اَيُّهُمْ اَحْسَنُ عَمَلًا (అల్ కహ్ఫ్ 18:8) భాగము 15. భూమిపై నున్న ప్రతి దానిని భూమికి మేము అందముగా చేశాము. తద్వారా సత్యవంతులైన వ్యక్తుల విశిష్టత చెడు వ్యక్తులకెదురుగా ప్రతక్ష్యమగును. గట్టిదానిని చూచినప్పుడు సూక్ష్మమైన దాని సూక్ష్మతత్వము స్పష్టమగును. వ్యతిరేకత వాస్తవము విరుద్ధ పరిస్థితులలోనే తెలిసిపోవును. దుష్టులున్నప్పుడే సత్కార్యుల విలువ, స్థాయి తెలిసిపోవును.

**మూడవ విషయము:** స్థాయి అంతస్థులలో వ్యత్యాసమునకు మూడవ వివేకమేమనగా విభిన్న రకాల శక్తులను బహిర్గతపరచుట, తన వైభవమును చాటిచెప్పుట. ఇట్లనెను.

مَا لَكُمْ لَا تَرْجُوْنَ لِلّٰهِ وَقَارًا - وَقَدْ خَلَقَكُمْ اَطْوَارًا -

(నూహ్ 71:14,15) అనగా మీరు అల్లాహ్‌తో ఎట్టి ఘనతను ఆశించరు మీకేమయ్యెను? అతడు తన ఘనతను బహిర్గతపరచుటకు నిజముగా మిమ్ములను వివిధ పద్ధతులలో, విభిన్న జీవిత చరిత్రలతో పుట్టించెను. తన ఘనత, శక్తిని గుర్తించుటకే అల్లాహ్ తఆలా విభిన్న సామర్థ్యములు, స్వభావములను పుట్టించెను. మరో చోట ఇట్లనెను.

وَاللّٰهُ خَلَقَ كُلَّ دَآبَّةٍ مِّنْ مَّآءٍ ۚ فَمِنْهُمْ مَّنْ يَّمْشِيْ عَلٰى بَطْنِهٖ ۚ وَمِنْهُمْ مَّنْ يَّمْشِيْ عَلٰى رِجْلَيْنِ ۚ وَمِنْهُمْ مَّنْ يَّمْشِيْ عَلٰٓى اَرْبَعٍ ؕ يَخْلُقُ اللّٰهُ مَا يَشَآءُ ؕ اِنَّ اللّٰهَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ

(అన్నూర్ 24:46) భాగము 18 అనగా అల్లాహ్ ప్రతి తిరుగులాడు ప్రాణిని నీటితో పుట్టించెను. వాటిలో తమ పొట్టలతో తిరుగులాడు నట్టివి కూడ గలవు. వాటిలో తమ రెండు కాళ్ళపై నడుచు నటువంటివి కూడ యున్నవి. నాలుగు కాళ్ళపై నడుచు నటువంటివి కూడ వున్నవి. అల్లాహ్ కోరినదంతయు పుట్టించును. నిశ్చయముగా అల్లాహ్, తాను కోరిన ప్రతి దానిపై సదా అధికారమున్నవాడు. ఈ విభిన్న ప్రాణులను తన విభిన్న శక్తులను బహిర్గతము చేయుటకు అల్లాహ్ తఆలా పుట్టించెనని ఇందులో

సంజ్ఞ గలదు. ప్రాణులలో వివిధ రకాల స్వభావములకు గల దైవ వివేకము ఈ మూడు వివేకములపై ఆధారపడియున్నది. వాటిని అల్లాహ్ తఆలా పైన సూచించిన సూక్తులలో ప్రస్తావించెను. గమనించగలరు.

*(బరాహీనె అహ్మదియ్య 4 భాగములు - రూహాని ఖజాయిన్ సంపుటి:1 పుట:203-207 అధోదీపిక 11)*

**ఆర్యుల తప్పుడు అభిప్రాయముల ఖండన**

పండిత్ దయానంద్ తన పుస్తకము సత్యార్థ్ ప్రకాశ్ ఉర్దులోని పుట 501లో పరమేశ్వరుడు ఎవరి పాపమును క్షమించలేడు. క్షమించినచో అతడు అన్యాయుడగునని వ్రాసెను. కనుక పరమేశ్వరుని స్థాయి ఒక న్యాయమూర్తిని మించి లేదని, అతనికి యాజమాన్య అధికారము లేదని అతడు అంగీకరించెను. ఇలాగే పండిత్ దయానంద్ తన అనువాద పుస్తకములోని పుట 501లో పరమేశ్వరుడు పరిమిత కర్మలకు అపరిమిత ఫలితము ఇవ్వలేడని వ్రాసెను. అతనికి యాజమాన్య అధికారము యున్నచో పరిమిత కర్మలకు అపరిమిత ఫలితము ఇచ్చుటలో అభ్యంతరమేమి? ఎందుకనగా యజమాని పనులకు సమాన న్యాయము అవసరం లేదు. మనము కూడ ఒక ధనమునకు యజమానులమైనప్పుడు యాచకులకు ఏదైనా ఇవ్వదలచినచో ఫలానాకు ఎక్కువ నాకు తక్కువ ఎందుకు ఇచ్చినావని విమర్శించే హక్కు ఒక యాచకునికి వుండదు. అందుకే దేవునితో సమాన న్యాయమును అడిగే హక్కు దాసునికి లేదు. ఎందుకనగా దాసునిదంతయు అల్లాహ్ తఆలాదే. దేవునితో సమాన న్యాయమును అడిగే స్థాయి దాసునికి లేదు. తను పుట్టించిన తన దాసులకు తనతో సమాన హక్కులు అడిగే అర్హత కలిగించుట కూడ తన దైవ ఘనతకు తగదు. అల్లాహ్ తఆలా దాసునికి అతని కర్మల ఫలితము ప్రసాదించునది కూడ అతని కరుణ, దయ మాత్రమే. వాస్తవానికి కర్మల స్థాయి శూన్యమే. అల్లాహ్ తఆలా సహాయ సహకారము లేనిదే కర్మలు

ఎలా సాధ్యమగును. ఇంతేగాక మనము దైవ ప్రకృతి చట్టమును చూచినప్పుడు అల్లాహ్ తఆలా తన దాసులను ఇచ్చినది లేదా ఇచ్చు చున్నది రెండు రకాల అనుగ్రహమని స్పష్టముగా తెలియును.

అతని మొదటి దయ, కరుణ మానవులు పుట్టకముందటివి. వాటిలో ఇసుమంత కూడ మానవుల కర్మల ప్రమేయం లేదు. ఉదా॥ అతడు మానవుల సుఖము కొరకు సూర్యచంద్రాదులు, గ్రహములు, పృథ్వీ, నీరు, గాలి, అగ్ని మొదలగు వాటిని పుట్టించెను. మానవుల ఉనికి, వారి కర్మల కంటే ముందే ఇవి యున్నవనుటలో ఎలాంటి సందేహం లేదు. వాటి తర్వాత మానువుడు ఉనికిగా మారెను. అల్లాహ్ తఆలా ఈ దయ పవిత్ర ఖుర్ఆన్ పరిభాషలో రహ్మానియ్యత్ అనబడును. అనగా మానవుల కర్మల ఫలితముగా కాక కేవలం అల్లాహ్ తఆలా శుభమిది.

రెండవ రకమైన దయను పవిత్ర ఖుర్ఆన్ పరిభాషలో రహీమియ్యత్ అందురు. అనగా సత్కర్మల ఫలితంగా మానవునికి లభించే దయానుగ్రహము. మానవులు, వారి కర్మల నామరూపాల్లేనప్పుడు ఆయా బలహీన దాసుల కొరకు భూమ్యాకాశములు, సూర్యచంద్రాదులు మొదలగు వాటిని తన దయానుగ్రహ యాజమాన్యముకు ఉదాహరణగా పుట్టించిన దేవుని గురించి దాసులకు ఋణగ్రహీతుడైన వారి హక్కులను మాత్రమే చెల్లించువాడని ఎలా ఆలోచించగలము? దాసుల కొరకు భూమ్యాకాశములు, ప్రకాశించు వేలాది నక్షత్రములు, ఆకాశ గ్రహాలు, సుఖము, విశ్రాంతి కలిగించే వేలాది వస్తువులను పుట్టించుట దాసుల హక్కులునబడునా. ఆ అపారదయామయున్ని కేవలం ఒక న్యాయమూర్తిగా న్యాయము చేయువానిగా నిర్ధారించుట, అతని యాజమాన్య స్థాయి, ఘనతను నిరకారించుట ఎంతో కృతఘ్నత అగును.

*(చశ్మ మారిఫత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:23 పుట:26-28)*

మాలిక్ (యజమాని) పదము ఎటువంటిదనగా దానిలో సర్వ

హక్కులు అంతమైపోవును. ఈ పదము పూర్తి రూపంలో అల్లాహ్ తఆలాకే తగును. ఎందుకనగా అతడు మాత్రమే సంపూర్ణ యజమాని. ఒక వ్యక్తి తన ప్రాణము, ధనము మొదలగు వాటికి ఒకరిని యజమానిగా నిర్ధారించి నప్పుడు తన ప్రాణము, ధనము మొదలగు వాటిపై నాకెలాంటి హక్కు లేదని, నాది ఏమియును లేదు, అంతా యజమానిదేనని అతను ఒప్పుకొనును. ఇటువంటి పరిస్థితిలో ఫలానా ఆర్థిక లేదా ప్రాణ విషయము లో నా పట్ల న్యాయముగా వ్యవహరించమని తన యజమానితో అనుట సమంజసము కాదు. ఎందుకనగా న్యాయము హక్కును ఆశించును. కాని అతడు తన హక్కులను వీడెను. ఇదే విధంగా మానవుడు తన నిజమైన యజమానికెదురుగా తన పేరు దాసుడని పెట్టుకొనెను. إِنَّا لِلَّهِ وَإِنَّا إِلَيْهِ رَاجِعُونَ (అల్‌బఖరహ్ 2:157) అని అంగీకరించెను. అనగా మా ధనము, ప్రాణము, శరీరము, సంతానము అంతయు దేవుని ఆస్థియే. ఇలా అంగీకరించిన తర్వాత తాను అల్లాహ్ తఆలాతో అడుగుటకు అతనికెలాంటి హక్కుండదు. అందుకే నిజమైన జ్ఞానులు వందలాది ఆసనాలు, ప్రార్థనలు, దానములు చేసినను తమను తాము అల్లాహ్ తఆలా దయ, కరుణకు అప్పగిస్తారు. తమ కర్మలను శూన్యమని భావిస్తారు. మాకు హక్కు గలదని లేదా మేము చేసినది సరైనదేనని వారెలాంటి ప్రకటన చేయరు. అసలు పుణ్యుడు అల్లాహ్‌యే. ఎందుకనగా అతని అనుగ్రహముతోనే మానవుడు పుణ్యము చేయగలడు. వాస్తవానికి మానవుడు తన స్వంత ప్రతిభ, పని వలన అల్లాహ్ తఆలాతో న్యాయమును అడుగనే అడుగలేదు. పవిత్ర ఖుర్‌ఆన్ ప్రకారము అల్లాహ్ తఆలా పనులన్ని అధికారము వలననే చేయును. ఒక్కో సారి అతడు పాపము వలన శిక్షించును. మరొక్కసారి పాపము వలన క్షమించును కూడ. అనగా యాజమాన్యమునకు తగ్గట్టు రెండు రకాలుగా అతని శక్తి పనిచేయును. పాపములను ఎల్లప్పుడు శిక్షించినచో మానవునికి మోక్షమెక్కడిది.

వాస్తవానికి అతడు తరచుగా పాపములను క్షమించును. హెచ్చరించుటకు ఒక్కోసారి పాపమునకు బదులు శిక్షించును కూడ. తద్వారా నిర్లక్ష్యము వహించుచున్న వ్యక్తికి శ్రద్ధ కలిగి అతని వైపు దృష్టి సారించును. పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ సూక్తి గలదు. وَمَآ اَصَابَكُمْ مِّنْ مُّصِيْبَةٍ فَبِمَا كَسَبَتْ اَيْدِيْكُمْ وَيَعْفُوْا عَنْ كَثِيْرٍ (చూడుము ఆశ్శూరా 42:31) మీకు అందుచున్న కష్టము మీ దుష్కర్మల ఫలితమే. అల్లాహ్ తఆలా అనేక పాపములను క్షమించును. ఒక్కోసారి పాపమునకు బదులు శిక్షించును. మరల ఇదే అధ్యాయములో ఈ సూక్తి కూడ గలదు. وَهُوَ الَّذِىْ يَقْبَلُ التَّوْبَةَ عَنْ عِبَادِهٖ وَيَعْفُوْا عَنِ السَّيِّاٰتِ (అశ్శూరా 42:26) అనగా మీ పశ్చత్తాపమును స్వీకరించువాడే మీ దేవుడు. వారి పాపములను వారి కొరకు క్షమించును. పవిత్ర ఖుర్ఆన్‌లో గల సూక్తి వలన ఎవరు మోసపోకూడదు. وَمَنْ يَّعْمَلْ مِثْقَالَ ذَرَّةٍ شَرًّا يَّرَهٗ (అజ్జిల్జాల్ 99:9) అనగా ఎవరేని అణుమాత్రము పాపము చేసినను దాని శిక్షను అతడు అనుభవించును. ఈ సూక్తిలో మరియు ఇతర సూక్తులలో ఎలాంటి వైరుధ్యము లేదు. మానవుడు మొండితనముతో పాపము చేయుచు, దానిని వీడుటకు సిద్ధము కాక, పశ్చత్తాపము చేయని పాపము ఇక్కడ ప్రస్తావించబడెను. అందుకే ఇక్కడ జంబ్ అను పదము కాక ష్ర్ అను పదము ఉపయోగించబడెను. దుష్టుడు వీడుటకు సిద్ధము కాని పాపమును ఇక్కడ ప్రస్తావించబడెను. ఎందుకనగా సిగ్గు, పశ్చత్తాపము, మొండితనము ను వీడుట, ఇస్తిఘ్ఫార్ వలన పాపములు క్షమించబడునని పవిత్ర ఖుర్ఆన్‌లో అనేక చోట్ల ప్రస్తావించబడెను. అంతేకాక పశ్చత్తప్తులను అల్లాహ్ తఆలా ప్రేమించును. అందుకే పవిత్ర ఖుర్ఆన్‌లో అతడిట్లనెను. اِنَّ اللّٰهَ يُحِبُّ التَّوَّابِيْنَ وَيُحِبُّ الْمُتَطَهِّرِيْنَ (అల్ బఖరహ్ 2:223) అనగా పశ్చత్తప్తులను నిశ్చయముగా అల్లాహ్ తఆలా ప్రేమించును, పాపముల నుండి పూర్తిగా దూరమై పరిశుద్ధముగా నుండు వారిని కూడ ప్రేమించును. ఉద్దేశమేమనగా ప్రతి పాపమునకు శిక్షించుట అల్లాహ్ తఆలా క్షమాగుణమునకు విరుద్ధము. ఎందుకనగా

అతడు కేవలం న్యాయమూర్తిగా కాక ఒక యజమాని. అతడు పవిత్ర ఖుర్‌ఆన్‌లోని మొదటి అధ్యాయములోనే తన పేరు మాలికియౌమిద్దీన్ అని తెలిపెను. ఇట్లనెను. مٰلِكِ يَوْمِ الدِّيْنِ (అల్‌ఫాతిహా 1:4) అనగా అంతిమ దినమున జరుగు ధర్మ నిర్ణయమునకు అధినేత. రెండు వైపులా అతనికి అధికారము లేని వాడు యజమాని అని ఎలా అనబడును. రెండు వైపులనగా ఇష్టమున్నప్పుడు శిక్షించును ఇష్టమున్నప్పుడు క్షమించును.

*(చశ్మ మారిఫత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:23 పుట:23-24)*

మరల మేము అసలు చర్చ వైపు దృష్టి సారించుచు ఇట్లు వ్రాయుచున్నాము. ఆర్యుల సిద్ధాంతముల ప్రకారము వారి పరమేశ్వరుని పేరు యజమాని పెట్టలేము. ఎందుకనగా తన దగ్గర వున్న దానిని ఒకరి హక్కు కానప్పుడు అతనికి వరముగా ప్రసాదించే అధికారము అతనికి లేదు. కాని ధనమునకు యజమాని అయిన ఒక వ్యక్తి తన దగ్గర వున్న దానిని ఇష్టమున్న వారికి ఇష్టమున్నంత ఇచ్చే అధికారము కలిగివున్నట్లు మనము చూస్తున్నాము. కాని పాపములు క్షమించలేదని, ఒకరికి దానముగా ఏమియును ఇవ్వలేని పరమేశ్వరున్ని ఆర్యుల సిద్ధాంతము ప్రవేశ పెట్టుచున్నది. ఒక వేళ ఇలా చేసినచో అతడు అన్యాయానికి పాల్పడినట్లు అగును. కావున ఆవాగవణము (పునరజన్మ)ను నమ్మేవారు పరమేశ్వరున్ని ఏ విధంగాను ప్రాణులకు యజమానిగా నమ్మలేరు. యజమాని కొరకు న్యాయమును తప్పనిసరి నిబంధనగా విధించడం సరికాదని మేము అనేక మార్లు వ్రాసినాము. కాని యజమాని సుగుణాలలో భాగంగా అతడు దయామయుడు, దానకర్త, శుభముల దాత, పాపములను క్షమించువాడని మనము అనవచ్చును. కాని తాను కొనుగోలు చేసిన బానిసలు, గుర్రము, ఆవుల పట్ల అతను న్యాయమూర్తి అని అనలేము. ఇరు వైపుల స్వతంత్రత వున్న చోట మాత్రమే న్యాయము అనే పదము వాడబడును. ఉదా॥ ప్రపంచములో గల రాజులు న్యాయమూర్తులు,

పౌరులతో న్యాయముగా వ్యవహరిస్తారని అనవచ్చును. పౌరులు వారి విధేయత వహించినంత వరకు రాజులపై కూడ ఈ చట్టము విధించ బడును. అనగా పౌరుల విధేయత, పన్నుల చెల్లింపు వలన వారి ధన, ప్రాణమునకు రక్షణ కల్పించుట, అవసరమున్నప్పుడు వారికి సహకరించుట రాజుల బాధ్యత. ఒక రకంగా రాజులు పౌరులపై అధికారము చలాయించగా మరో వైపు పౌరులు రాజులపై అధికారము చలాయించుచున్నారు. ఈ రెండు వైపులు సమానంగా నడిచినంత వరకు ఆ దేశములో శాంతి కొనసాగుతుంది. పౌరుల తరపున గాని రాజు వైపున గాని ఏదైనా అసమానత ఏర్పడినప్పుడు ఆ దేశము నుండి శాంతి మాయమైపోవును. దీని వలన మనము రాజులను పూర్తిగా యజమానులని అనలేము. ఎందుకనగా పౌరులు రాజులతో, రాజులు పౌరులతో న్యాయమునకు బద్ధులైవుందురు. కాని దేవుణ్ణి అతని యాజమాన్యము వలన దయామయుడు అని అనవచ్చును కాని న్యాయమూర్తి అనలేము. ఒక వ్యక్తి నౌకరుడై యజమానితో న్యాయమును అడగలేడు. కాని వినయము, వినమ్రతతో కరుణించుటకు మనవి చేయవచ్చును. ఇందుకే అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఎక్కడా తన పేరు న్యాయమూర్తి అని ప్రస్తావించలేదు. ఎందుకనగా న్యాయము రెండు వైపులా సమాన హక్కులను ఆశించును. దాసుల పరస్పర హక్కులలో అల్లాహ్ తఆలా న్యాయము చేయునందున అతడు న్యాయమూర్తి అనబడును. కాని ఒక దాసుడు భాగస్వామి వలె అతనితో హక్కును అడిగే విధంగా అతడు న్యాయమూర్తి కాడు. ఎందుకనగా దాసుడు దేవుని ఆస్తి. తన ఆస్తితో ఇష్టమున్నట్లు వ్యవహరించే అధికారము యజమానికి గలదు. అతడు కోరినవానిని రాజుగా నియమించవచ్చును. ఇష్టమున్న వానిని యాచకునిగా చేయవచ్చును. కోరిన వానికి చిన్న వయసులోనే మరణమిచ్చును. ఇష్టమున్న వానికి సుదీర్ఘ ఆయువు ప్రసాదించును. మనము కూడ ఒక

ధనమునకు యజమాని అయినప్పుడు దాని పట్ల పూర్తి స్వతంత్రత కలిగివుంటాము. కాని అల్లాహ్ తఆలా దయామయుడు మాత్రమే కాక అందరికంటే ఎక్కువ దయామయుడు. తన దయ వలన తన సృష్టిని ఎలాంటి న్యాయముగా పోషించడు. ఎందుకనగా యజమాని భావము న్యాయమూర్తి భావము కంటే విరుద్ధమని మేము అనేకసార్లు తెలిపినాము. అతను మనందరిని పుట్టించినప్పుడు అతనితో న్యాయమును అడుగుటకు మనకెలాంటి హక్కు లేదు. కాని అతి వినయంతో కరుణించాలని మనము మనవి చేయవచ్చును. అల్లాహ్ తఆలా తన దాసుల పట్ల వ్యవహరించు విషయములో న్యాయమును అడుగుట దాసుని దురదృష్టము. మానవ స్వభావ పునాదులన్ని అల్లాహ్ తఆలా ప్రసాదమే, ఆధ్యాత్మిక, శారీరక శక్తులన్ని అతను అనుగ్రహించినవే, అతని అనుగ్రహము, సహాయముతోనే ప్రతి సత్కర్మ బహిర్గతమైనప్పుడు తన కర్మలను నమ్ముకొని అతనితో సమానత్వమును అడుగుట ఘోర అవిశ్వాసము, మూర్ఖత్వమగును. ఇటువంటి బోధనను మేము విద్యాబోధన అని అనలేము. ఎందుకనగా ఇది వాస్తవానికి జ్ఞానరహితమైనదే గాక పూర్తిగా అవివేకముతో కూడిన బోధన. దాసుని వలె దేవుని నామము కూడ న్యాయమూర్తి అని నిర్ధారించుట ఘోరమైన పాపమని అల్లాహ్ తఆలా తన పవిత్ర శాసనము అనగా పవిత్ర ఖుర్‌ఆన్‌లో మనకు బోధించెను.

*(చశ్మ మారిఫత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:23 పుట:32-34)*

## క్రైస్తవుల తప్పుడు అభిప్రాయముల ఖండన

న్యాయము శిక్షించుటను కోరును, దయ క్షమించుటను కోరును అందుకే న్యాయము, దయ రెండు అల్లాహ్ తఆలా ఉనికిలో ఏకము కాలేవనే సందేహము అవగాహనరహితమైనందున ఒక మోసమనబడును. ఇందులో అవివేకులైన క్రైస్తవులు చిక్కుకొన్నారు. అల్లాహ్ తఆలా న్యాయము కూడ దయలో భాగమేనని వారు గ్రహించరు. ఎందుకనగా అది పూర్తిగా

మానవుల ప్రయోజనము కొరకే గలదు. ఉదా॥ న్యాయము మేరకు అల్లాహ్ తఆలా ఒక హంతకున్ని చంపివేయాలని తీర్పు నిచ్చును. దీని వలన అతని దైవత్వమునకు ఎలాంటి లాభము కలుగదు. మానవులు పరస్పరం చంపుకోవడంతో మానవజాతి అంతము కాకూడదని ఇట్లు కోరును. కనుక ఇది మానవజాతి పట్ల దయ అగును. శాంతి స్థాపన, ఒక పక్షము మరో పక్షముపై దౌర్జన్యము చేసి అశాంతి సృష్టించకూడదనుటకే దాసుల ఈ హక్కులను అల్లాహ్ తఆలా నిర్ణయించెను. మానవజాతిని కరుణించుట కొరకే ధనము, ప్రాణము, గౌరవము గురించి గల హక్కులు, శిక్షలు విధించబడెను....కనుక న్యాయము, దయలో ఎలాంటి విభేదము లేదు. ఒక రకంగా అవి రెండు తమ తమ చోట ప్రవహించుచున్న రెండు కాలువలు. ఒక కాలువ మరో కాలువకు అటంకం కాదు. నేర చరిత్ర కలిగిన వారిని శిక్షించడమును మనము ప్రాపంచిక ప్రభుత్వములలో కూడ చూడవచ్చును. ఇదే విధంగా మంచి పనులతో ప్రభుత్వమును ఆనందపరిచేవారు బహుమతులు, సత్కారములు పొందుతారు.

అల్లాహ్ తఆలా అసలు గుణము దయ అని కూడ గుర్తుంచుకోవలెను. న్యాయము, వివేకము, చట్టమును ప్రసాదించిన తరువాత పుట్టును. వాస్తవానికి మరో రూపంలో బహిర్గతమైనను అది కూడ ఒక రకంగా దయ మాత్రమే. మానవునికి వివేకము ప్రసాదించినప్పుడు అతడు వివేకముతో అల్లాహ్ తఆలా హద్దులు, చట్టములను తెలుసుకొనును. అనంతరం అతడు న్యాయ చట్టమునకు బద్ధుడగును. కాని దయ కొరకు వివేకము, చట్టము అవసరం లేదు. అల్లాహ్ తఆలా కరుణించి మానవులకు అందరికంటే గొప్ప ప్రాధాన్యత ఇవ్వదలచెను. అందుకే అతడు మానవుల కొరకు న్యాయ నియమ నిబంధనలు రచించెను. కనుక న్యాయము, దయలో వ్యత్యాసమున్నదని భావించుట అవివేకమగును.

*(కితాబుల్ బరియ్యహ్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:13 పుట:73,74)*

## దైవ విజ్ఞానము

అణువణువు బాహ్యాంతరముల సమాచారము అల్లాహ్ తఆలా తన సంపూర్ణ విద్యతో ఎలా తెలుసుకొనును అనే విషయము అతి సూక్ష్మమైన సత్యము. వాస్తవానికి దీని అసలు పరిస్థితిని ఎవరి తెలివి తేటలు తెలుసుకోలేవు. అయినను అది విద్యలలో అన్నిటికంటే గొప్ప, సంపూర్ణ, పరిపూర్ణ విద్య అని మాత్రము మనము తెలివితో ఊహించు కోవచ్చును. మనము మన విద్యాభ్యాస పద్ధతులను చూచినప్పుడు, దాని రకాలను గమనించినప్పుడు మన సామాన్య విద్యలలో అన్నిటి కంటే ఖచ్చితమైన, నమ్మకమైన విద్య తమ ఉనికి గురించి గల విద్య అని తెలియును. మనము గాని లేదా ఒక మానవుడు ఎట్టి పరిస్థితిలోను తన ఉనికిని విస్మరించలేడు, ఇందులో సందేహమునకు పాల్పడలేడు. మన తెలివి స్థోమత మేరకు ఈ విద్యను అన్నిటికంటే గొప్ప, సంపూర్ణ, పరిపూర్ణ విద్య అని భావిస్తాము. తన దాసుల గురించి ఇంత కంటే తక్కువ స్థాయి గల అవగాహన అల్లాహ్ తఆలాకు గలదని మనము సంపూర్ణమైన అల్లాహ్ తఆలా గురించి భావించలేము. ఎందుకనగా ఎటువంటి గొప్ప విద్యను మనము ఊహించగలమో అది అల్లాహ్ తఆలాలో లేదనడం భావ్యము కాదు. లేనిచో అల్లాహ్ తఆలా విద్య ఉన్నతమైన విద్య కంటే తక్కువ వున్నదనే విమర్శ తలెత్తును. ఇది అతని ఉద్ధేశముతో జరిగినదా లేక మరొక ఉన్నతుని బలవంతము వలన జరిగినదా? ఇది అతని ఉద్ధేశము తోనే జరిగినదన్నచో సమంజసము కాదు. ఎందుకనగా ఒకరు ఉద్ధేశ పూర్వకంగా తనకు నష్టము జరుపుకోడు. అలాంటప్పుడు తను స్వయంగా పరిపూర్ణతను కొరుకునే అల్లాహ్ తఆలా తన గురించి ఇటువంటి లోపము ను ఎందుకు ఆశించును. మరొక ఉన్నతుని వలన ఈ లోపము ఎదురైనదని భావించనిచో ఆ ఉన్నతుడు శక్తి యుక్తులలో అల్లాహ్ తఆలా కంటే ఉన్నతుడై వుండవలెను. తద్వారా అతడు తన అధిక శక్తి యుక్తుల

వలన అతణ్ణి తన సంకల్పములలో నివారించవచ్చును. వాస్తవానికి ఇది అసాధ్యము. ఎందుకనగా అల్లాహ్ తఆలాను నిలువరించు స్థాయి గల మరో శక్తిమంతుడు లేనే లేదు. కనుక అల్లాహ్ తఆలా విద్య తప్పక సంపూర్ణమైనదని ఋజువైనది. మానవునికి తన ఉనికి పట్ల విద్య అన్ని విద్యల కంటే గొప్ప, పరిపూర్ణమైనదని మేమింతకు ముందే నిరూపించి యున్నాము. కావున తన సృష్టి పట్ల అల్లాహ్ తఆలా విద్య దీనిని పోలి వుండునని నమ్మవలసి వున్నది. వాస్తవానికి దీని అసలు పరిస్థితిని మన తెలివి తేటలు తెలుసుకోలేవు. కాని సృష్టి, సృష్టికర్తలో ఎలాంటి దూరము, తెర లేని నమ్మకమైన, ఖచ్చితమైన విద్య ఇదేనని మనకు ప్రసాదించబడిన తెలివితో మనము అర్థము చేసుకోగలము. ఒక వ్యక్తి తన ఉనికి గురించి తెలుసుకొనుటకు ఇతర సాధనాలు అవసరం లేనట్లే అనగా ప్రాణి అగుట, తనను తాను ఒక ప్రాణిగా భావించుట రెండు విషయములు ఎంత సమీపము, పోల్చి వున్నవనగా వాటిలో ఎలాంటి తేడా లేదు. ఇదే విధంగా సృష్టిలోని వస్తువులన్నిటి గురించి అల్లాహ్ తఆలాకు తెలిసివుండవలెను. అనగా ఇచట కూడ సృష్టి, సృష్టికర్తలో ఎలాంటి ఎడబాటు, దూరము లేదు. ఈ మహా గొప్ప విద్య తన దైవత్వము కొరకు అల్లాహ్ తఆలాకు ఎంతో అవసరము. ఇంతకు మించి ఊహకందని రీతిలో అతని అవగాహనలో అంతటి సామీప్యము, సంబంధము కలిగివున్నదని అతని గురించి మొదట నమ్మినప్పుడే ఇది అంగీకార మగును. సృష్టిలోని వస్తువులన్ని అతను సృష్టించినవైనప్పుడే, అతని ద్వారా వెలువడిన సృష్టి అయినప్పుడు, అతని ఉనికితో అవి ఉనికిగా ఏర్పడినప్పుడే సృష్టితో ఈ సంపూర్ణ సంబంధము ఏర్పడవచ్చును. అనగా అసలు ఉనికి అతడొక్కడే అయి ఇతరములన్నియు ఆ ఉనికి ద్వారనే పుట్టి వుండవలెను. అతని వల్లనే మనుగడ సాగించవలెను. అనగా పుట్టిన తర్వాత కూడ ప్రతిది తమ ఉనికి మనుగడ కొరకు అతని సహాయముపై ఆధారపడి

వుండవలెను. వాస్తవానికి అన్ని పుట్టిన తర్వాత కూడ అతడొక్కడే నిజమైన జీవితుడు. ఇతర ప్రతి జీవి అతనితోనే పుట్టెను. అతని వల్లనే జీవించును. స్వతంత్రత అతనికొక్కనికే సొంతం. ఇతర వస్తువులన్ని అనగా ఆత్మలు, శరీరములన్నియు అతను విధించిన బంధములలో బందీలై, అతని హస్తములో బంధించబడి, అతను నిర్ణయించిన హద్దులలో పరిమితమై యుండవలెను. అతడు ప్రతి వస్తువును ఆవరించి వుండవలెను. ఇతర వస్తువులన్నియు అతనితో మాత్రమే పోషణ పొందవలెను. అతని అధికారమును వీడి, అతని పోషణ అవసరం లేని ఏ వస్తువు వుండ కూడదు. అతని సహాయము లేనిదే ఏదియును జీవించకూడదు. సంపూర్ణ విద్యకు అవసరమున్న ఇటువంటి సంబంధము సృష్టి మరియు సృష్టికర్త మధ్య వున్నప్పుడే ఇది పూర్తి అగును. ఈ సంపూర్ణ సంబంధము వైపే పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా ఒక చోట ఇట్లు సూచించెను. وَنَحْنُ أَقْرَبُ إِلَيْهِ مِنْ حَبْلِ الْوَرِيدِ (ఖాఫ్ 50:17) అనగా మేము మానవుని ప్రాణ ధమని కంటే దగ్గరగా వున్నాము. ఇదే విధంగా పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా మరో చోట ఇట్లనెను. هُوَ الْحَيُّ الْقَيُّومُ (అల్ బఖరహ్ 2:256) అనగా నిజమైన జీవనుడు, స్వయంభువుడు అతడే, సర్వ వస్తువులు అతనిచే పుట్టినవే, అతని వల్లనే జీవించుచున్నవి. వాస్తవానికి సర్వ ప్రాణులకు ప్రాణము, సర్వ శక్తులకు శక్తి అతడే.

ఆత్మను పుట్టించబడిన, అంతమగునట్టిది అని నమ్మనిచో బలవంతంగా పరమేశ్వరుని పేరు పొందిన సంబంధము లేని ఒకనికి ఆత్మ గురించి ఏదైనా తెలిసివుండుట, అతని విద్య లోతుగా వుండుటకు ఏ కారణము లేదు. ఎందుకనగా ఒక వస్తువు గురించి పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి మాత్రమే దానిని సిద్ధము చేయుటకు శక్తి కలిగి వుండును. అలా శక్తిమంతుడు కానిచో అతని విద్యలో కూడ కొంతైనా లోపముండును. పూర్తి అవగాహన లేనిచో సిద్ధము చేయుట అటుంచితే పోలిక గల

వస్తువులనే విడదీయుట కష్టమగును. అల్లాహ్ తఆలా వస్తువులను పుట్టించినవాడు కానిచో అతడు అవగాహనరహితుడు మాత్రమే కాక కోట్లాది ఆత్మలను గుర్తించుటలో కూడ ప్రతి రోజు మోసపోయే అవకాశమున్నది. సోమయ్య ఆత్మను పొరపాటుగా లింగయ్య ఆత్మగా కూడ కొన్ని సార్లు భావించవచ్చును. ఎందుకనగా అసంపూర్ణ విద్య వలన ఇటువంటి మోసాలకు తప్పక లోనగుతారు. మోసపోవుటకు అవకాశము లేదని వాదించినచో ఇందుకు నిదర్శనము చూపగలరు.

*(సుర్మ చశమ్ ఆరియా - రూహానీ ఖజాయిన్ సంపుటి:2 పుట:221-226 అధోదీపిక)*

ఒక వస్తువు గురించి సంపూర్ణ అవగాహన వున్నచో అది సృష్టించబడినది అగునప్పుడు అల్లాహ్ తఆలాకు తన ఉనికి గురించి కూడ సంపూర్ణ అవగాహన గలదు. అటులైనచో అల్లాహ్ తఆలా తనను తాను పుట్టించుకున్నాడా లేక తనను పోలిన దానిని సృష్టించగలడా? అనే సందేహము ఒకరి మనసులో కలుగవచ్చును. ఈ విమర్శలోని మొదటి భాగమునకు సమాధానిమిట్లు గలదు. అల్లాహ్ తఆలా తన ఉనికికి తానే సృష్టికర్త అయినచో తన ఉనికి కంటే ముందే అతడుంటుట అనివార్య మగును. ఏ వస్తువు కూడ తన కంటే ముందే వుండదను విషయము విధితమే. లేనిచో తన మనసు కంటే ముందే తానుందు సూత్రము తప్పనిసరి అగును. తన ఉనికి గురించి సంపూర్ణ విద్య కలిగిన అల్లాహ్ తఆలా వాస్తవానికి సృష్టి, అవగాహన, సృష్టికర్త అన్ని తానే. ఇందులో ఎడబాటు లేదా రెండవ విషయమునకు ఆస్కారము లేదు. కనుక ఇచట పుట్టించబడిన వేరే విషయమెక్కడున్నది. అల్లాహ్ తఆలా ఉనికి గురించి విద్యను ఇతరములతో పోల్చలేము. సారాంశమేమనగా అల్లాహ్ తఆలా ఉనికి గురించి గల విద్య వలన సృష్టి, సృష్టికర్తను విడదీయలేము. అనగా ఒకరిని సృష్టి మరొకరిని సృష్టికర్త అని భావించలేము. కాని అల్లాహ్ తఆలా ఉనికి గురించి పుట్టించబడినది అని అనే బదులు వేరే ఒకరు

పుట్టించక తనను తానే ప్రత్యక్షపరచకున్నాడని మాత్రము మనము అనవచ్చును. దేవుడు అనే పదానికి అర్థము అతను స్వయంగా ఆది నుండి యుండుటయే.

అల్లాహ్ తఆలా తనకు మరో నకలు సృష్టించు శక్తిగలదని విమర్శలోని రెండవ భాగమని పై సంభాషణతో తెలియును. ఇందుకు సమాధానమేమనగా శాశ్వతమైన, ఆది నుండి గల తన గుణములకు విరుద్ధముగా లేని విషయముల వైపే దైవ శక్తి దృష్టి సారించును. ఏ విషయము గురించి అల్లాహ్ తఆలాకు సంపూర్ణ విద్య గలదో దానిని అతను కోరినచో పుట్టించగలడను విషయములో సందేహము లేదు. కాని తాను చేయగల పనులన్నిటిని తప్పక చేసి చూపుట అనివార్యము కాదు. ప్రతి శక్తిని వెలువడించే ముందు తన సంపూర్ణ గుణములను గమనించి, అది తన సంపూర్ణ గుణములకు విరుద్ధము, వ్యతిరేకంగా వున్నదా అని పరిశీలించును. ఉదా॥ ఒక గొప్ప సత్యవంతుణ్ణి నరకములో పడవేయుటకు అతనికి శక్తి గలదు. కాని ఇలా చేయుట అతని న్యాయ, దయామయ గుణము ఇందుకు ఆటంకముగా మారును. అందుకే అతడిలా చేయడు. ఇలాగే అతను తనను తాను వినాశనము చేసుకోలేడు. ఎందుకనగా శాశ్వత జీవితమనే అతని గుణమునకు ఇది విరుద్ధం. అందుకే అతడు తన వలె మరో దేవుణ్ణి కూడ సృష్టించడని అర్థము చేసుకోవలెను. ఏకత్వ, నిరుపమాణమైన అతని గుణములు అతనిలో శాశ్వతంగా వున్నందున అతడు ఇందుకు సంకల్పించడు. ఒక పని చేయలేకపోవడం వేరే విషయము. చేయగలిగే శక్తి వున్నను తన సంపూర్ణ గుణములకు విరుద్ధంగా భావించి చేయకపోవడం మరో విషయమని స్పష్టముగా అర్థము చేసుకోవలెను.

*(సుర్మ చశమ్ ఆరియా - రూహానీ ఖజాయిన్ సంపుటి:2 పుట:230,233 అధోదీపిక)*

తన స్వంత శక్తి, తన స్వంత విశిష్టత వలన పరోక్ష విషయముల

జ్ఞాని అల్లాహ్ తఆలా ప్రత్యేకతయే. ఆది నుండి శాశ్వత ఉనికి అయిన అల్లాహ్ తఆలా గురించి సత్యవంతులు స్వంత ఉనికి అని నమ్ముచు వచ్చిరి. అల్లాహ్ తఆలా తప్ప ఇతర సాధ్యా సాధ్యముల గురించి స్వంత ఉనికి, స్వంత అధికారము లేదని నమ్ముతారు. పరోక్ష ప్రత్యక్షములను ఎరుగువాడు అను గుణము అల్లాహ్ తఆలాలో తప్పక వుండవలెననే విశ్వాసము మొదటి నుండి కొనసాగుచున్నది. కాని నాశనమగు ఉనికి, అంతమగు ఉనికి అనే గుణములు సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ తఆలాకు తగవు. ఉనికిపరంగా అతనిలో మరొకరు భాగస్వామి అగుట తగనట్లే అతని గుణములలో కూడ మరొకరు భాగస్వామి అగుట తగదు. కావున సందేశహరులైనను, మహా పండితులైనను దైవ మిత్రులైనను సాధ్యా సాధ్యములలో పరోక్ష ప్రత్యక్షములను ఎరుగుట వారికి తగదు. కాని దైవవాణి ద్వారా పరోక్ష రహస్యములు సత్యవంతులకు, సత్పురుషులకు తెలుపు ఆచారము ఆది నుండి కొనసాగుతుంది. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుయాయులలో దానిని ఇప్పటికి మనము పొంద వచ్చును.

*(ఏక్ ఈసాయి కె తీన్ సవాల్ ఔర్ ఉన్‌కె జవాబాత్ – రూహాని ఖజాయిన్ సంపుటి:4 పుట:453,454)*

స్వయంభువుడు, సర్వ స్థితికి కారకుడైన మన దేవుడు మాతో మానవుని వలె మాట్లాడుతాడు. మేము ఒక విషయము అడిగి, దుఆ (ప్రార్థన) చేసినచో శక్తితో నిండిన పదములతో సమాధానిమిస్తాడు. ఈ ప్రశ్నోత్తరాలు వెయ్యి సార్లు జరిగినను అతడు సమాధానమిచ్చుటలో విముఖత ప్రదర్శించడు. అతడు తన వాక్యములో విభిన్న, విచిత్ర పరోక్ష విషయములను తెలుపుతాడు. మహిమాన్విత శక్తుల దృశ్యములను చూపుతాడు. తుదకు తానే దైవమని నమ్మకము కలిగిస్తాడు. దుఆలను ఆమోదిస్తాడు, ఆమోదించుచున్నట్లు సమాచారము కూడ అందిస్తాడు.

అతడు పెద్ద పెద్ద కష్టములను పరిష్కరిస్తాడు. నిర్జీవిగా పడి వున్న రోగులను కూడ అధిక దుఆతో జీవింపజేస్తాడు. తన ఈ ఉద్దేశములన్నిటిని తన వాక్యముతో ముందుగానే తెలుపుతాడు. మా దేవుడే నిజమైన దేవుడు. భవిష్యత్తులో సంభవించే సంఘటనలతో కూడిన తన వాక్యముతో తానే భూమ్యాకాశములకు దేవుడని నిరూపిస్తాడు. అతడే నన్ను సంబోధించుచు ఇట్లనెను. నేను నిన్ను మహమ్మారితో మరణించకుండా రక్షించెదను. నీ గృహములో పుణ్యము, వినమ్రతతో కూడిన జీవితము గడుపుచున్న వారందరిని కూడ రక్షించెదను. ఇటువంటి దైవవాణిని ప్రచురించినవాడు నేను తప్ప మరెవడున్నాడు. నా ప్రాణముతో పాటు నా గృహములో నివసించుచున్న నా భార్యాపిల్లలు, ఇతర సత్యవంతుల రక్షణ బాధ్యత అల్లాహ్ తఆలాయే తీసుకొనెను.

*(నసీమె దావత్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:19 పుట:448,449)*

ఒక ఉన్నత స్థితి, ఘనత గల జీవి అన్వేషణ స్వభావికముగా మానవుని సహజ స్థితులలో ఒకటి. దానికై మానవుని హృదయము నందు ఒక ఆకర్షణ వుండును. ఈ పరిశోధనా గుణము శిశువు పుట్టుక నుండి వుండును. శిశువు జన్మించిన వెంటనే తల్లి వైపు ఆకర్షింపబడి ఆధ్యాత్మిక గుణమును చూపును. వాస్తవికముగా అతడు తల్లి మమత కలిగి వుండును. పెరిగిన కొద్ది ఈ స్వభావము అభివృద్ధి చెందును. దాగి వున్న ప్రేమ బాహ్య రూపము దాల్చును. అప్పుడు శిశువు తమ తల్లిని విడిచి ఎక్కువ సుఖము పొందలేడు. తల్లి ఒడిలోనే అతనికి సుఖము లభించును. తల్లితో వేరు చేయబడి దూరముంచినచో అతని సర్వ ఐశ్వర్యములు చేదగును. వరములు, వివిధ కానుకలు, స్వేచ్ఛ కల్పించినను వాస్తవ ఆనందము, తృప్తి తల్లి ఒడి యందే పొందును. ఆమెను విడిచి ఎట్టి శాంతిని పొందలేడు. తల్లితో ఆకర్షించబడు ఆ ప్రేమ, మమత ఏమిటి?

నిజమైన ఆరాధ్య దైవము కొరకు శిశువు స్వభావములో పెట్టబడిన

ఆకర్షణ ఇదే. ప్రతి రంగమందు సత్సంబంధమేర్పరచుకొనునది ఈ ఆకర్షణయే. ప్రేమ జ్వాల పుట్టించునది కూడ ఈ ఆకర్షణ ఛాయలే. ఇతర వస్తువులలో పొగొట్టుకొనిన వస్తువును వెతుకుతున్నాడు. ఇప్పుడు దాని పేరు కూడ మరచిపోయివున్నాడు. మానవుడు ధనము, సంతానము, భార్యను ప్రేమించుట లేదా మధురమైన గానము వైపు ఆకర్షింపబడుట నిజానికి ఆ పోగొట్టు కొనిన వస్తువు అన్వేషణయే. కనులకు కనబడని అగ్ని వలె ప్రతి దాని యందు గుప్తముగా వుండి మానవుడు దానిని చూడలేడు. అసంపూర్ణమైన తెలివితో దానిని పొందలేడు. అతని అన్వేషణలో మానవుడు పొరపాటులలో చిక్కుకొని వున్నాడు. అందు వలననే అతని స్థానము ఇతరులకు నొసంగబడినది. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇట్లు విశదపరిచెను. ప్రపంచము ఒక గాజు భవనము వలె నున్నది. దాని నేల కూడ గాజుతో చేయబడినది. దాని క్రింద వేగముగా ప్రవహించు నీరును విడువబడెను. గాజుపై దృష్టి పడినప్పుడు దానినే నీరనుకొనును. నీటిలో నడుచుటకు భయపడునట్లు మానవుడు భయపడును. నిజానికి అవి గాజులే. కాని అది నున్నగా ప్రకాశించుచుండును. కనుకనే ప్రకాశించు చున్న సూర్య చంద్రులు మొదలగు వస్తువులను ఆరాధించబడెను. వీటిలో గాజులోని నీటిని వేగముగా ప్రవహింపచేయు ఒక గొప్ప శక్తి పని చేయుచున్నది. ఆ శక్తిని విగ్రహారాధకులు గాజులతో అంటగట్టి తప్పిదములో పడివున్నారు. اِنَّهٗ صَرْحٌ مُّمَرَّدٌ مِّنْ قَوَارِيْرَ (అన్నమల్ 27:45) ఈ సూక్తి దీనినే విశదపరచుచున్నది.

## ఖచ్ఛితమైన నమ్మకము కొరకు ఆసక్తి అవసరము

శక్తిమంతుడైన అల్లాహ్ ప్రకాశించినను గుప్తముగా నుండును. కనుక అతనిని గుర్తించుటకు మనకు కనిపించుచున్న శారీరక నిర్మాణము సరిపోదు. వందలాది మంది ఈ విధమైన పద్ధతిపై ఆధారపడిరి. ఆశ్చర్యకరమైన రహస్యములు తమలో దాచుకొనిన దానిని కనుగొనుటకు

భూమ్యాకాశములలో గాలించిరి. అయినను అనుమానాలు, సంశయాలతో ముక్తి పొందలేక పోయిరి. ఎక్కువ మంది వివిధ అపమార్గములను అవలంభించి, మూఢ నమ్మకాలకు లోనై ఎక్కడో పడిపోయిరి. ఉత్తమమైన ఈ గొప్ప పద్ధతిని తిలకించి దీనిని పుట్టించువాడొకడు తప్పక గలడని వారూహించిరి. కాని వారి ఊహ, ఈ పరిజ్ఞానము అసంపూర్ణమైనది. ఎందుకనగా మొత్తము ప్రక్రియ కొరకు, ఒక సృష్టికర్త అవసరము అనునది, ఒక సృష్టికర్త గలడు అనుదానికి పొత్తు కలువదు. చాలా తేడా గలదు. వారనునది కేవలము వారి ఊహగానమే. వారి హృదయాలకు తృప్తి నొసంగ బడలేదు. అనుమానాలను వారి హృదయముల నుండి పూర్తిగా తొలగించలేదు. మానవుని స్వభావికమైన దప్పికను ఇది ఆర్పలేదు. ఇట్టి జ్ఞానము అపాయకరమైనది. తంటాలు పడినను ఫలితము శూన్యం.

శక్తిమంతుడైన అల్లాహ్ తమ కార్యముతో తెలిపినట్లు, అతను తమ ఉనికిని తెలిపినంతవరకు కేవలము పనిని తిలకించుట తృప్తికరము కాదు. ఎట్లనగా ఒక మూయబడిన గది లోపలి నుండి తలుపులకు గొలుసులు బిగించివున్నవి. ఆ గదిని చూచినప్పుడు లోపల ఎవరో ఒకరున్నారని మనమూహింతుము. ఎందుకనగా బయటి నుండి గొలుసు బిగించుట అసాధ్యము. కాని ఒక సమయము వరకే కాదు సంవత్సరాల తరబడి పిలిచినప్పటికి లోపలి నుండి సమాధానము రానప్పుడు మన ఊహ మారిపోవును. అప్పుడు మనము లోపల ఎవరు లేరు. ఏదో ఒక పద్ధతితో తలుపుల గొలుసులు లోపలి నుండి వేయబడినవని ఊహింతుము. తమ జ్ఞానమును కేవలము అల్లాహ్ కార్యములను తిలకించు వరకే పరిమితము చేసిన తత్వవేత్తల స్థితి ఇదే. అల్లాహ్‌ను శవము వలె భావించి, అతనిని సమాధి నుండి తీయుట కేవలము మానవుని కార్యమేనని ఊహించుట ఘోర తప్పిదము. అల్లాహ్ ఈ విధముగనే వుండినచో, మన ప్రయత్నాలే అతనిని గుర్తించినచో ఇట్లు అల్లాహ్‌పై

ఆధారపడుట వ్యర్థమే అగును. వాస్తవమేమనగా అల్లాహ్ శాశ్వతముగా సదా నుండి వున్నవాడు. నేనున్నానని తెలుపుచు మానవులను తమ వైపు పిలుచుచునే వున్నాడు. అల్లాహ్ తఆలాను గుర్తించుటలో మానవుని ఉపకారము గలదని, తత్వవేత్తలు లేనిచో అల్లాహ్ ఉనికి తెలియక పోయేదని భావించుట పొగరుబోతు తనమగును.

అల్లాహ్ ఎట్లు మాటలాడగలడు? అతనికి నాలుక గలదా? అని భావించుట కూడ తెలివి తక్కువదనము. శారీరక హస్తములు లేనిదే, అల్లాహ్ శారీరక అవయవములను, భూమిని సృష్టించలేదా? శారీరక కన్నులు లేనిదే సర్వ ప్రపంచమును తిలకించడా? శారీరక చెవులు లేనిదే మన పిలుపును వినడా? ఇవన్నియు సాధ్యమైనప్పుడు అతడు మనతో మాటలాడడా? పూర్వము అల్లాహ్ మాటలాడువాడు ఇప్పుడు మాటలాడక పోవడము కూడ అవాస్తవము. అతని సంబోధనను, మాటలాడడమును మేము ఒక కాలము వరకు పరిమితము చేయము. పూర్వముండునట్లు ఇప్పుడు కూడ తమను అన్వేషించు వారికి సువార్త ఊటలు ప్రవహింప చేయుటకు సిద్ధముగా నున్నాడు. పూర్వము వలె ఇప్పుడు కూడ అతని శుభములు, వరముల తలుపులు తెరిచే వున్నవి. అవసరాలు తీరిన తరువాత ధర్మచట్టాల హద్దులు అంతమైనవి. సర్వ ప్రవక్తృత్వములు తమ ఔన్నత్యమును పొంది మన ప్రభువు పవిత్ర ప్రవక్త (అల్లాహ్ ఆశీస్సులు, శుభములు కలుగు గాక) ను చేరి సంపూర్ణత పొందినవి.

*(ఇస్లామి ఉసూల్ కి ఫిలాసఫీ – రూహాని ఖజాయిన్ సంపుటి:10 పుట:363-367)*

తన సన్నిహిత మానవులతో అతి స్పష్టంగా మాట్లాడే, తన వైభవోపేతమైన రమ్యమైన వాక్యముతో వారికి సంతృప్తి, మనశ్శాంతి ప్రసాదించే సజీవమైన దేవుని దరి చేరడంలోనే నిజమైన దైవజ్ఞానము గలదు. ఒక వ్యక్తి మరో వ్యక్తితో మాట్లాడినట్లే నిశ్చయంగా, నిస్సందేహంగా అతడు వారితో సంభాషించును. వారి మాటలను వింటాడు, వారికి

సమాధానమిస్తాడు. వారి దుఆలను విని ఆమోదించుచున్నట్లు ముందస్తు సమాచారమిస్తాడు. ఒక వైపు మనోహరమైన, గొప్ప వాక్యముతో రెండవ వైపు మహిమాన్విత పనులతో, తన శక్తివంతమైన అద్భుత సంకేతములతో నేను దేవుణ్ణి అని వారిని నమ్మిస్తాడు. అతడు మొదటగా భవిష్యవాణి రూపంలో తన సహాయ, సహకార, ప్రత్యేక కరుణామయ వాగ్దానము చేస్తాడు. అనంతరం తన వాగ్దానముల వైభవమును పెంచుటకు కొందరిని అతనికి విరుద్ధంగా నిలుపుతాడు. వారు తమ సకల శక్తి, సమస్త కుట్రలు, మోసములు, అన్ని రకాల ప్రణాళికలతో ఆమోదిత దాసుల సహాయ, సహకారము, విజయమును సూచించు దేవుని ఆ వాగ్దానములను పూర్తి కాకుండా చేయుటకు ప్రయత్నింతురు. అల్లాహ్ తఆలా వారి ప్రయత్నము లన్నిటిని విఫలం చేస్తాడు. వారు దుష్టత్వమునకు మొక్క నాటుతారు. అల్లాహ్ తఆలా దాని ఏరును పెకిలి వేస్తాడు. వారు అగ్నిని రాజేస్తారు. అల్లాహ్ తఆలా దానిని చల్లారుస్తాడు. వారు సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తారు. తుదకు అల్లాహ్ తఆలా వారి ప్రణాళికలను వారిపైనే త్రిప్పికొట్టుతాడు. అల్లాహ్ తఆలా సన్నిహితులు ఎంతో హుందాతనము, నిష్కపట స్వభావము కలిగి వుంటారు. తల్లి ఒడిలో వున్న పిల్లల వలె వారుందురు. వారు ప్రపంచ వాసుల వలె లేనందున ప్రపంచ వాసులు వారితో శత్రుత్వము నెరుపుతారు. వారిని ఓడించుటకు వివిధ రకాల కుట్రలు, మోసాలకు పాల్పడతారు. వారిని దుఃఖమునకు గురి చేయుటకు జాతులు ఏకమైతాయి. అసమర్థులందరు ఒకే ధనుస్సుతో వారిపై బాణములు విసురుతారు. వారు ఏదో ఒక రకంగా నామ రూపాల్లేకుండా నాశనం కావాలని విభిన్న రకాల ఆరోపణలు, నిందలు మోపబడుతారు. కాని చివరికి అల్లాహ్ తఆలా తన మాటలను పూర్తి చేసి చూపుతాడు. ఒక వైపు వారు సరియైన, స్పష్టమైన, ఖచ్చితమైన దైవవాణితో సత్కరించ బడుతారు, మానవుల శక్తికందని పరోక్ష విషయములు దయామయుడైన,

శక్తిమంతుడైన అల్లాహ్ తఆలా తన నమ్మకమైన వాక్యముతో వారికి తెలుపుతాడు, రెండవ వైపు వారి మాటలను నిజము చేయు మహిమాన్విత చర్యలతో వారి సత్యమును ప్రకటిస్తాడు, వారి నమ్మకమునకు ఎంతో దృఢత్వము ప్రసాదిస్తాడు. ఇలా వారి జీవితాంతం కొనసాగుచుండును. మానవుని స్వభావము ఆశించినంత, అల్లాహ్ తఆలాను నమ్మకముతో గుర్తించుటకు కావలసినంత జ్ఞానమును సామ వాచ పరంగా పూర్తి చేయును. తుదకు మధ్యలో ఇసుమంత కూడ అంధకారము మిగిలి యుండదు. వేలాది వరములతో కూడిన, అతిశక్తివంతంగా మానవుని హృదయమును ప్రభావితం చేసే దేవుని ఇటువంటి వాక్య, చర్యల మహిమల తర్వాత మానవునికి నిజమైన, సజీవమైన విశ్వాసము లభించును. దేవునితో ఒక నిజమైన, పవిత్రమైన సంబంధము ఏర్పడి మానసిక మలినములు తొలగిపోవును. బలహీనతలన్ని దూరమై ఆకాశ జ్యోతి వేగ కిరణాలతో అంతర చీకటి వీడ్కోలు పలుకును. ఒక విచిత్ర మార్పు కనిపించును.

ఇటువంటి గుణములతో కూడిన దేవుణ్ణి ప్రవేశపెట్టక, విశ్వాసము ను కేవలం కనిపించని గత కథలు, సంఘటనలు, మాటలకే పరిమితం చేయు ధర్మము వాస్తవానికి సత్యమైన ధర్మమే కాదు. ఇటువంటి నామమాత్రపు దేవుణ్ణి నమ్ముట మృతుడు జీవితుని వలె పని చేయునని నమ్ముటయే అగును. తన ఉనికిని సదా తాజాదనముతో నిరూపించని దేవుడు వున్నా లేకపోయినా ఒకటే. మాట్లాడని, వినని, ప్రశ్నలకు సమాధానం చెప్పని, ఒక గట్టి నాస్తికునికి సందేహం కలుగకుండా తన శక్తివంతమైన పనులను చూపని వాడు ఒక విగ్రహంతో సమానం.

*(బరాహీనె అహ్మదియ్య 5వ భాగము - రూహానీ ఖజాయిన్ సంపుటి:21 పుట:31,32)*

**ఆరవ సందేహం:** మానవుణ్ణి దేవునితో సంభాషించువానిగా గుర్తించుట అమర్యాద అనబడును. నాశనమగు వానికి శాశ్వత ఉనికితో

పోలిక ఏల? మట్టిని మాణిక్యంతో జతకట్టుట సబబేనా?

**సమాధానము:** ఈ సందేహం కూడ నిరాధారమైనది. అపార దయామయుడు పరమకారుణ్యమూర్తి అయిన అల్లాహ్ తఆలా మానవ జాతిలోని సంపూర్ణ మానవులలో తన జ్ఞానమును పొందుటకు అనంత ఆసక్తి కలిగించెనను విషయము ఈ సందేహమును పటాపంచలు చేయును. తన ప్రేమ, తన ఆప్యాయత, తన ఆసక్తి వైపు వారిని ఎంతగా ఆకర్షించెననగా వారు పూర్తిగా తమ ఉనికి కోల్పోయిరి. ఇటువంటి స్థితిలో వారితో అల్లాహ్ తఆలా సంభాషించుటకు ఇష్టపడకపోవడం వారి ప్రేమ, అనురాగము నిరర్థకమై, వారి ఆసిక్తి మొత్తం ఏకపక్ష ఆలోచనలుగా మిగిలిపోవును. కాని ఇటువంటి ఆలోచన ఎంత అవివేకమైనదో గుర్తుంచు కోవలెను. మానవునికి తన సమీపమునకు చేరే స్థోమత ప్రసాదించి, తన ప్రేమానురాగ భావాలతో ఉద్రేకము పుట్టించి తన వాక్యముతో శుభము పొందకుండా చేయగలడా? అల్లాహ్ తఆలా ప్రేమ, దేవుని ఆనురాగము, దేవుని కొరకు అనుకోకుండానే లీనమగుటవన్ని సమంజసమైనను దేవునిలో ఎలాంటి కదలిక కలుగకూడదా! తనను ప్రేమించే నిజమైన వ్యక్తి హృదయమున దేవుని వాణి అతరించుట అసమంజసమై దేవుని గొప్పతనములో తేడా వచ్చునా! మానవుడు దేవుని ప్రేమతో కూడిన అనంత కాలువలో ఎక్కడా ఆగకుండా మునుగుట దేవుని జ్ఞానము పొందుటకు మహిమ గల ఆత్మ పుట్టించబడెనని అర్థమగుతుంది. దేవుని జ్ఞానము కొరకు పుట్టించబడిన మానవునికి జ్ఞానమునకు సంపూర్ణ కారణమైన దివ్వవాణి లభించనిచో దేవుడు తన జ్ఞానము కొరకు మానవుణ్ణి పుట్టించలేదని నమ్మవలసి యుండును. సత్యస్వభావముగల మానవ ఆత్మలో దైవజ్ఞాన ఆకలి, దాహము గలదని బ్రహ్మ సమాజీలు కూడ విశ్వసిస్తారు. మానవుని సత్యస్వభావము స్వయంగా దైవ జ్ఞానమును ఆశించుచున్నది. దైవజ్ఞానమునకు అన్నిటికంటే

సంపూర్ణమైన మార్గము దివ్యవాణి అని ఋజువైనది కూడ. కనుక జ్ఞానము పొందుటకు సంపూర్ణ కారణమైన దివ్యవాణిని అన్వేషించుట అమర్యాద అయినప్పుడు మానవుని అతడు విజ్ఞానమునకు ఉద్రేకము ఇచ్చి అతని ఆకలి, దాహము మేరకు విజ్ఞాన మార్గము చూపలేదని, ఆకలి మేరకు ఆహారము ఇవ్వలేదని, దాహము మేరకు జలం అందించలేదని దేవుని వివేకముపై ఘోర ఆరోపణ పడును. ఇటువంటి ఆలోచన దేవుని గొప్ప కరుణలను అగౌరవపరచడమని వివేకులు అర్థము చేసుకుంటారు. ఇహలోకములోనే దైవ కిరణాలను సంపూర్ణ రీతిలో చూచుట అనగా ఆ అఖండ జ్యోతితో అల్లాహ్‌ను దర్శించుట మానవుని సర్వ శుభమని నిర్ధారించిన అల్లాహ్ తఆలా మానవుణ్ణి తన నిర్దేశిత శుభము, తన సహజ స్వభావము వరకు చేర్చుటకు ఇష్టపడక పోవడమనేది బ్రహ్మ సమాజీల అవివేకమగును.

*(బరాహీనె అహ్మదియ్య 4 భాగములు - రూహాని ఖజాయిన్ సంపుటి:1 పుట:230-232 అధోదీపిక 11)*

మానవున్ని ఏ ఉద్దేశముల కొరకు అల్లాహ్ తఆలా పుట్టించెనో ఆయా ఉద్దేశములను పూర్తి చేయుటకు అవసరమున్న శక్తులన్ని స్వయంగా తానే పుట్టించెను. ఉదాహరణకు మానవ ఆత్మలలో ప్రేమ శక్తి గలదు. ఒక మానవుడు పొరపాటుగా మరొకరిని ప్రేమించవచ్చు, తన ప్రేమను తప్పుడు చోట వినియోగించవచ్చును. కాని తన నిజమైన ప్రేమికుడైన అల్లాహ్ తఆలాను సంపూర్ణ హృదయముతో, సర్వ శక్తితో, పరిపూర్ణ ఉద్రేకముతో ప్రేమించుటకే ఈ ప్రేమ శక్తి మానవునిలో పుట్టించబడెనని ఒక వివేకుడు స్పష్టంగా అర్థము చేసుకోగలడు.

మానవ ఆత్మలో గల ప్రేమ శక్తికి నిరంతర అలలు గలవు, అది శిఖర స్థాయికి ఎగిరి పడినప్పుడు మానవుడు తన ప్రాణమును కూడ త్యాగము చేయుటకు సిద్ధమగును. ఇది ఆత్మలో దానంతట అదే ఆది

నుండి లేనే లేదు. మానవుని మరియు తన ఉనికి మధ్య దేవుడు ప్రేమపూర్వక బంధము స్థాపించుటకు ఆత్మలో స్వయంగా ప్రేమ శక్తి పుట్టించి ఈ బంధమును కల్పించనిచో ఇది అనుకోకుండా పరమేశ్వరుని అదృష్టము కొద్ది ఆత్మలలో ప్రేమ శక్తి ఏర్పడినట్లగును. ఇందుకు భిన్నంగా ఏదేని జరిగినచో అనగా ప్రేమ శక్తి ఆత్మలలో లేకున్నచో పరమేశ్వరుని పట్ల ప్రజలకు ఆలోచన కలిగేదే కాదు. శూన్యము నుండి ఉనికి జరగనందున పరమేశ్వరుడు స్వయాన ఏమియును చేయలేక పోవును. దేవుడు స్వయంగా ప్రేమ, విధేయత శక్తులను మానవ ఆత్మలో పుట్టించినాడనుటకు భక్తి, ప్రార్థన, సత్కర్మల గురించి పరమేశ్వరుడు ప్రశ్నించుట ఒక నిదర్శనము. మానవునిలో స్వయంగా దేవుడు ఈ శక్తులును పుట్టించినందున మానవుడు తన ప్రేమ, విధేయతలో లీనము కావాలని అతడు కోరును. లేనిచో ప్రజలు తనను ప్రేమించాలని, తన విధేయత వహించాలని, తన ఇష్టానుసారము నీతులు, చేతలను మార్చుకోవాలని పరమేశ్వరుడు ఎందుకు ఆశించును.

*(నసీమె దావత్ – రూహాని ఖజాయిన్ సంపుటి:19 పుట:385.386)*

## పవిత్రత ఎంతో అవసరం

قَدْ أَفْلَحَ مَن زَكَّاهَا (అష్షంస్ 91:10) తన మనసును పాప మార్గము నుండి తప్పించుకొను మార్గమును పెంపొందించిన వాడు నిశ్చయముగా జయము నొందును.

کوئی اُس پاک سے جو دل لگاوے کرے پاک آپ کو تب اُس کو پاوے

ఆ పవిత్ర దేవుణ్ణి ప్రేమించదలచిన వ్యక్తి తమను పవిత్రునిగా మార్చుకున్నప్పుడే దేవుణ్ణి పొందును.

మాలో చాలా మంది అల్లాహ్ తఆలాను ప్రేమిస్తారని ప్రతి జాతి ప్రకటించుకొనును. కాని అల్లాహ్ తఆలా కూడ వారిని ప్రేమించుచున్నాడా లేదా అనేది నిరూపించవలసి యుండును. అల్లాహ్ తఆలా ప్రేమ ఋజువు

కావాలంటే వారి హృదయములపై నున్న తెర మొదట తొలగించవలెను. ఆ తెర వలన మానవుడు అల్లాహ్ తఆలా ఉనికిని మంచిగా నమ్మక మసక మసకగా, చీకటితో కూడిన జ్ఞానముతో అతని ఉనికిని నమ్మును. పరీక్ష సమయమున కొన్ని పర్యాయములు అతని ఉనికినే నిరాకరించును. దివ్యవాణితో తప్ప ఈ తెర ఎట్టి పరిస్థితిలోను తొలగదు. అల్లాహ్ తఆలా స్వయంగా మానవున్ని ఉద్దేశించి 'నేనున్నాను' అని శుభవార్త అందించిన రోజున మాత్రమే మానవుడు నిజమైన విజ్ఞానమును పొందును. అప్పుడు మానవుని విజ్ఞానము తన ఊహాజనిత లేదా కథల ఆలోచనలకు పరిమితం కాక అల్లాహ్ తఆలాను దర్శించినట్లు అతని సమీపమునకు చేరును. వైభవోపేతుడైన అల్లాహ్ తఆలా తన ఉనికి గురించి తాను స్వయంగా సమాచారమందించినప్పుడు మాత్రమే అల్లాహ్ తఆలాపై సంపూర్ణ విశ్వాసము లభించుననేది వంద శాతం సత్యము. అల్లాహ్ తఆలా తన ప్రియులకు తన ఉనికి గురించి సమాచారము మాత్రమే అందించక తన కరుణ, శుభ లక్షణములను కూడ ప్రత్యేకంగా వారికి చూపుట అల్లాహ్ తఆలా ప్రేమకు రెండవ లక్షణము. అదెట్లనగా ఊహించని రీతిలో వారి దుఆలను ఆమోదించి తన వాణి, వాక్యముతో వారికి సమాచారము అందించును. మన సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తఆలా మన దుఆలను విని, మనకు సమాచారమందించి, కష్టములతో మనకు మోక్షము కల్పిస్తున్నాడని వారి హృదయములు తృప్తి చెందును. అదే రోజు మోక్షము అనే విషయము కూడ అర్థమగును. అల్లాహ్ తఆలా అతనికి కూడ తెలియును. చైతన్య పరచడానికి, హెచ్చరించుటకు ఒక్కొక్క సారి ఇతరులకు కూడ నిజమైన స్వప్నము రావచ్చును. కాని సమీపుల పద్ధతి గొప్ప స్థాయి, విభిన్న ఔన్నత్యము కలిగివుండును. ప్రత్యేక సమీపులతో మాత్రమే ఈ దైవసంభాషణ జగురును. సమీపుడైన వ్యక్తి దుఆ చేసినప్పుడు అల్లాహ్ తఆలా తన దైవత్వ వైభవముతో అతనిపై ప్రత్యక్షమగును, తన ఆత్మతో

అతనిపై అవతరించును, తన ప్రేమపూర్వక పదాలతో అతని దుఆ ఆమోదించినట్లు శుభవార్త అందిస్తాడు. ఈ దివ్యవాణి ఎవరికి అధికంగా అందునో అతణ్ణి ప్రవక్త, దైవ మిత్రుడని అంటారు."

*(హుజ్జతుల్ ఇస్లాం - రూహానీ ఖజాయిన్ సంపుటి:6 పుట:42,43)*

దాసుడు సత్ప్రవర్తనతో వ్యవహరించి సత్యముతో నిండిన ప్రేమను ప్రదర్శించును కాని అందుకు అల్లాహ్ తఆలా హద్దులు దాటి వ్యవహరించునని గుర్తుంచుకొనుము. దాసుని వేగమునకు బదులు విద్యుత్తు వేగంతో అతని వైపు దేవుడు పరుగెత్తుకొచ్చును. భూమ్యాకాశముల నుండి అతని కొరకు సంకేతము ప్రదర్శించును. అతని మిత్రులకు మిత్రుడు, అతని శత్రువులకు శత్రువగును. 50 కోట్ల మంది కూడ అతనికి వ్యతిరేకంగా నిలబడినను వారందరిని ఒక నిర్జీవ కీటకము వలె ఘోరంగా అవమానపర్చును. కేవలం ఒక వ్యక్తి కొరకు ప్రపంచమును నాశనము చేయును. భూమ్యాకాశములను అతని సేవకులుగా మార్చును. అతని మాటలో శుభము కల్పించును. అతని గృహోపకరణాలలో కాంతిని వర్షింపజేయును. అతని దుస్తులలో, అతని ఆహారములో, అతని పాదాల క్రింది మట్టిలో కూడ ఒక శుభము కల్పించును. అతణ్ణి విఫలము చేసి నాశనము చేయడు. అతనిపై చేయబడు విమర్శలకు తానే సమాధాన మిచ్చును. అల్లాహ్ అతను చూచే కనులైపోతాడు. అతడు అతను వినే చెవులైపోతాడు. అతను మాట్లాడే నాలుకగా మారతాడు. అతడు నడిచే పాదాలైపోతాడు. అతడు శత్రువులపై దాడి చేసే చేతులైపోతాడు. అతడు అతని శత్రువులను స్వయంగా ఎదుర్కొంటాడు. అతణ్ణి బాధించే దుష్టులపై తానే ఖడ్గము లేవనెత్తుతాడు. ప్రతి మైదానములో అతనికి విజయము అందిస్తాడు. తనచే సంభవించబోవు పనులను ముందుగానే అతనికి తెలుపును. సారాంశమేమనగా మనోహర, వ్యక్తిగత ప్రేమ ఏర్పడిన తర్వాత అతని ఆధ్యాత్మిక అందచందాలకు మొదటి కొనుగోలుదారుడు అల్లాహ్‌యే

అగును. ఇటువంటి కాలమును పొందినను, ఇటువంటి సూర్యుడు వారిపై ఉదయించినను అంధకారములో కూర్చొనువారు ఎంతో దురదృష్టవంతులు.

*(జమీమ బరాహీనె అహ్మదియ్య 5వ భాగము - రూహాని ఖజాయిన్ సంపుటి:21 పుట:225)*

ఆధ్యాత్మిక హృదయము సంపూర్ణ దశకు చేరిన తర్వాత అల్లాహ్ తఆలా వ్యక్తిగత ప్రేమ కిరణము మానవుని హృదయముపై ఒక ఆత్మ వలె పడును. శాశ్వత ధ్యాన స్థితి అతనికి ప్రసాదించును, అప్పుడు పరిపూర్ణ దశకు చేరును. అనంతరం ఆధ్యాత్మిక అందము తన వైభవమును చూపును. ఈ ఆధ్యాత్మిక అందమును అందమైన వ్యవహారమని నామ కరణం చేయవచ్చును. ఇది బాహ్య అందము కంటే ఎంతో శక్తివంతమైన ఆకర్షణలతో గొప్పగా వుండును. ఎందుకనగా బాహ్య అందము కేవలం నాశనమగు ఒకరిద్దరి వ్యక్తుల ప్రేమకు కారణమగును. అది త్వరగానే క్షీణించును. దాని ఆకర్షణ అతి బలహీనమైపోవును. కాని సత్ప్రవర్తనగా నామకరణం చేయబడిన ఆధ్యాత్మిక అందము తన ఆకర్షణలలో ఎంతో దృఢమైన, అద్భుతంగా యుండి ఒక ప్రపంచమును తన వైపు ఆకర్షించును. భూమ్యాకాశముల అణువణువు దాని వైపు ఆసక్తితో వచ్చును. ఇటువంటి ఆధ్యాత్మిక అందము గల వ్యక్తిలో దైవ ప్రేమాత్మ ప్రవేశించినప్పుడు అసాధ్యమైన, కష్టతరమైన విషయము కొరకు దుఆ చేయుచు ఆ దుఆపై పూర్తిగా శ్రద్ధ వహించినచో అతడు తన ఉనికిలో ఆధ్యాత్మిక అందము కలిగివున్నందున అల్లాహ్ తఆలా ఆజ్ఞ, అనుమతితో ప్రపంచములోని అణువణువు అతని వైపు ఆకర్షింపబడును. ఇదే దుఆ ఆమోద తత్వజ్ఞానము. అనంతరం అతని సఫలము కొరకు అవసరమున్న మార్గములు సుగమమగును. ప్రపంచములోని ప్రతి వస్తువుకు ఇటువంటి వ్యక్తితో ఒక ప్రేమ వుండునని అనుభవము, దైవ పవిత్ర గ్రంథముతో ఋజువగును. లోహమును అయస్కాంతము తన వైపు ఆకర్షించునట్లు

అతని దుఆలు ఆయా అణువులన్నిటిని తన వైపు ఆకర్షించును. సహజ విద్య, తత్వములో లేని అసాధారణ విషయములు ఈ ఆకర్షణ వలన బహిర్గతమగును. అదే సహజ ఆకర్షణ. సృష్టికర్త అయిన అల్లాహ్ తఆలా శరీరముల ప్రపంచమును అణువులతో సిద్ధము చేసినప్పటి నుండి ప్రతి అణువులో ఆ ఆకర్షణ శక్తి పెట్టెను. ప్రతి అణువు ఆధ్యాత్మిక అందమునకు నిజమైన ప్రేమికునిగా మారెను. ఇదే విధంగా ప్రతి సత్య ఆత్మ కూడ ఆ మహిమ గల అందమునకు నివాసంగా మారును. ఈ అందము కొరకే ఇట్లనబడెను. اسْجُدُوْا لِاٰدَمَ فَسَجَدُوْٓا اِلَّآ اِبْلِيْسَ (అల్ బఖరహ్ 2:35) ఈ అందమును గుర్తించని అనేక ఇబ్లీసులు ఇప్పటికి వున్నారు. కాని ఆ అందము పెద్ద పెద్ద పనులు చేసి చూపెను.

నూహ్ (ప్రవక్త)లో అదే అందముండెను. దానికి గౌరవమివ్వాలని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తఆలా ఆశించెను. కనుక నిరాకరులందరిని వరదతో నాశనము చేసెను. అనంతరం మూసా (అ) కూడ అదే ఆధ్యాత్మిక అందముతో అవతరించిరి. అతడు కొన్ని రోజులు బాధలు అనుభవించి తుదకు ఫిర్ఔన్ జీవితమును ముంచివేసెను. అందరి తర్వాత ప్రవక్తల నాయకులు, సర్వోత్తమ మానవులు మన నాయకులు, మన యజమాని హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ఒక మహా గొప్ప ఆధ్యాత్మిక అందముతో ప్రభవించిరి. వారిని ప్రశంసించుటకు دَنَا فَتَدَلّٰى . فَكَانَ قَابَ قَوْسَيْنِ اَوْ اَدْنٰى (అన్నజ్మ్ 53:9,10) సూక్తులు సరిపోవును. అనగా ఆ ప్రవక్త అల్లాహ్ తఆలాకు అతి సమీపమునకు చేరెను. తర్వాత ప్రాణులను కరుణించెను. ఈ విధంగా రెండు హక్కులు అనగా అల్లాహ్ తఆలా హక్కులు, దాసుల హక్కులను చెల్లించెను. రెండు రకాల ఆధ్యాత్మిక అందమును ప్రదర్శించెను.

*(జమీమ బరాహీనె అహ్మదియ్య 5వ భాగము - రూహానీ ఖజాయిన్ సంపుటి:21 పుట :219-221)*

పరమేశ్వరునికి కోపము, కపటము, ఆగ్రహము, ఈర్ష్య యుండవలెనని సభలో చదవబడిన వ్యాసములో ఉపన్యాసకుడు తెలిపెను. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా కొరకు ఆగ్రహము అనే పదము వచ్చిన దానిని సూచించుట ఈ ఉపన్యాస ఉద్దేశము కావచ్చును. దేవుడు ఆగ్రహానికి లోనగునని తెలుపుచున్న పవిత్ర ఖుర్ఆన్ బోధన వేదాలలో లేనందున దేవునికి ఆగ్రహము రాదని ఆ వ్యాసములో తెలుపుచున్నాడు. కాని ఇది అతని ఘోర తప్పిదము. పవిత్ర ఖుర్ఆన్‌లో అనవసర, దౌర్జన్య పూరిత ఆగ్రహమును అల్లాహ్ తఆలాకు జతపరచలేదు. పవిత్ర ఖుర్ఆన్‌లో చాలా స్పష్టంగా ఇట్లు తెలుపబడెను. అతి పవిత్రత, పరిశుద్ధత కలిగిన అల్లాహ్ తఆలాలో ఆగ్రహము అనే ఒక గుణము కూడ గలదు. దుష్టత్వము ను వీడని అవిధేయుణ్ణి శిక్షించుటను ఆ గుణము ఆశించును. ఇదే విధంగా మరో గుణము కరుణ గలదు. విధేయత వహించిన విధేయునికి ప్రతిఫలమివ్వాలని ఆ గుణము ఆశించును. అర్థము చేసుకొనుటకు మొదటి గుణమును ఆగ్రహము రెండవ గుణమును కరుణ అని చెప్పబడెను. కాని ఆ కోపము మానవుని కోపము వలె కాదు, ఆ కరుణ కూడ మానవుని కరుణ వలె కానే కాదు. దీనిని స్వయంగా అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇట్లు తెలిపెను. لَيْسَ كَمِثْلِهِ شَيْءٌ (అశ్శూరా 42:12) అనగా అల్లాహ్ తఆలా ఉనికి వలె, అతని గుణముల వలె ఏదియును లేదు. పాపిష్టులను దేవుడు ఎలా, ఎందుకు శిక్షిస్తాడని మేము ఆర్యులను ప్రశ్నించదలచితిమి. మానవ జన్మ నుండి అతిగా అవమానపరచి కుక్క, పంది, కోతి, పిల్లిగా పుట్టించును. ఈ పని చేయుటకు సంకల్పించుటకు అతనిలో ఒక గుణము వున్నదని నమ్మవలసి యుండును. ఈ గుణమునే పవిత్ర ఖుర్ఆన్‌లో ఆగ్రహము అని సూచించబడెను....పాపిష్టులను శిక్షించుటకు ప్రేరేపించు గుణము పరమేశ్వరునిలో లేనిచో పరమేశ్వరుని స్వభావము శిక్షించుటకు ఎందుకు దృష్టి సారించును? ప్రతిఫలమిచ్చుటకు శ్రద్ధ కలిగేందుకు అతనిలో

ఒక గుణము యున్నది. ఈ గుణము పేరే ఆగ్రహము. కాని ఈ ఆగ్రహము మానవ ఆగ్రహము వలె కాక దేవుని స్థాయికి తగ్గట్టు గలదు. ఈ ఆగ్రహమునే పవిత్ర ఖుర్‌ఆన్ ప్రస్తావించెను. .... సత్కర్మలు చేయువానికి వరములు, గౌరవము ప్రసాదించినప్పుడు అతడు అతణ్ణి ప్రేమించెనని అందురు. దుష్కర్మలకు పాల్పడిన వానిని శిక్షించినప్పుడు అతడు అతనిపై ఆగ్రహించెనని అందురు. వేదాలలో కూడ ఆగ్రహము గురించి ప్రస్తావన వున్నట్లే పవిత్ర ఖుర్‌ఆన్‌లో కూడ గలదు. తేడా ఏమనగా అతి ఆగ్రహము వలన దేవుడు మానవులను పాపములకు బదులు కీటకాలుగా పుట్టించునని వేదాలు దేవుని ఆగ్రహమును వర్ణించెను. కాని అల్లాహ్ తఆలా ఆగ్రహమును పవిత్ర ఖుర్‌ఆన్ అంతగా దిగజార్చలేదు. అల్లాహ్ తఆలా శిక్షించినను మాననవుణ్ణి మానవునిగా వుంచును, మరో జన్మకు మార్చడని పవిత్ర ఖుర్‌ఆన్‌లో వ్రాసి వున్నది. పవిత్ర ఖుర్‌ఆన్ అనుసారము అల్లాహ్ తఆలా ప్రేమ, కరుణ అతని ఆగ్రహము కంటే అధికమని దీనిచే తెలియును. వేదాల ప్రకారము పాపిష్టుల శిక్ష అంతము కాదు. తద్వారా పరమేశ్వరునిలో ఆగ్రహమే ఆగ్రహముండగా కరుణ నామామాత్రంగా కూడా లేదు. తుదకు నరకవాలసులందరిని కూడ అల్లాహ్ కరుణించే సమయము వచ్చునని పవిత్ర ఖుర్‌ఆన్ ద్వారా స్పష్టంగా తెలుస్తున్నది.

*(చశ్మ మారిఫత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:23 పుట:46-50)*

## దైవ శక్తి భూమ్యాకాశములను ఆవహించుకొనుట

అదే విధముగా మీరు ఈ విధముగా దుఆ చేయగలరని ఇంజీల్ లో గలదు. ఆకాశము మీద ఉన్నటు వంటి ఓ నా తండ్రి! నీ నామముతో పరిశుద్ధము కలుగుగాకా! నీ చక్రవర్తిత్వమే వచ్చును గాకా! ఆకాశము మీద నీకు అధికారము ఉన్నట్లే ఈ భూమండళంపై కూడ నీ అధికారమే కొనసాగును గాకా! మా ప్రతి దినపు రొట్టెలను అదే రోజున మాకు ప్రసాదించుము. మేము ఏ విధముగా మా ఋణగ్రస్థులకు ఋణము

ఇచ్చెదమో నీవు కూడ మాకు ఋణమును ప్రసాదించుము. మమ్ములను పరీక్షించకుము. కేవలం చెడు నుండి రక్షించుము. ఎందుకనగా నీ చక్రవర్తిత్వం, అధికారము, గొప్పదనం మాత్రమే ఎల్లప్పుడు చలామణి అగును. కాని పవిత్ర ఖుర్ఆన్ భూమండళంపై అధికారం లేదని చెప్పకుండా ఆకాశములోనే కాకుండా భూమండళంపై కూడ దేవుని పరిశుద్ధ కీర్తనలు కొనసాగుచున్నాయని ఇట్లు చెబుతుంది.

وَاِنۡ مِّنۡ شَیۡءٍ اِلَّا یُسَبِّحُ بِحَمۡدِهٖ (బనీ ఇస్రాయీల్ 17:45)

یُسَبِّحُ لِلّٰهِ مَا فِی السَّمٰوٰتِ وَمَا فِی الۡاَرۡضِ (జుమా 62:2) అనగా

ఆకాశము మరియు భూమండలంలోని అణువణువు దేవుని పరిశుద్ధతను, స్తోత్రములను కొనియాడుచున్నవి. వాటిలో వున్న దంతయు పరిశుద్ధత, స్తోత్రములలో లీనమై ఉన్నవి. పర్వతాలు అతని స్మరణలో లీనమై ఉన్నవి. నదులు అతని స్మరణలోనే లీనమై ఉన్నవి. వృక్షములు అతని స్మరణలోనే లీనమై ఉన్నవి. ఎందరో సత్పుర్షులు అతణ్ణి స్మరించుటలో నిమగ్నమై యున్నారు. కనుక ఏ వ్యక్తి తమ హృదయము మరియు నోటితో అతనిని స్మరించుటలో లీనము కాకుండా, దేవుని ముందు విధేయతతో కూడిన భక్తిని ప్రదర్శించక యుండునో రకరకాల బంధనాలు, శిక్షలతో దేవుని విధి ధర్మము అతనిచే విధేయత వహింపజేస్తున్నవి. దైవదూతలు చాలా ఉన్నత స్థాయిలో విధేయతను ప్రదర్శిస్తున్నాయని దేవుని గ్రంథములో కొనియాడినట్లుగా భూమండలంపై గల అణువణువును గూర్చి కూడ పవిత్ర ఖుర్ఆన్ కొనియాడుతుంది. ప్రతి వస్తువు అతని పట్ల విధేయతను చూపుతుంది. అతని ఆదేశము లేనిదే ఒక్క ఆకు కూడ రాలిపడదు. అతని ప్రీతి లేనిదే ఏ ఔషధము స్వస్థతను కలిగించదు. ఎటువంటి పోషకాలు శక్తిని సమకూర్చలేవు. ప్రతి ఒక్క వస్తువు అత్యున్నత స్థాయి భక్తి, శ్రద్ధలతో దేవుని ఆస్థానములో మోకరిల్లుతున్నది. అతని పట్ల పూర్తి

విధేయతను ప్రదర్శించుటలో లీనమై ఉన్నది. పర్వతాలు, నదులు, భూమండళపు అణువణువు, సముద్రపు ప్రతి నీటి బొట్టు, వృక్షాలు, మొక్కల ప్రతి ఆకు, వాటి ఒక్కొక్క కాండము, మానవులు, జంతువులకు చెందిన అన్ని రకాలు దేవుణ్ణి గుర్తిస్తాయి, అతని పట్ల పూర్తి విధేయతను ప్రదర్శిస్తాయి. అతని పవిత్రతను, స్తోత్రములను స్మరించుటలో లీనమై ఉంటాయి. అందుకే అల్లాహ్ తఆలా يُسَبِّحُ لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ (జుమా 62:2) అని తెలుపడం జరిగింది. అనగా ఏ విధముగానైతే ఆకాశంలో గల ప్రతీది దేవుణ్ణి స్తుతించుచు అతని పవిత్రతను కొనియాడు తుంటాయో అదే విధముగా భూమండలంలోని ప్రతి వస్తువు అతనిని స్తోత్రించుచు అతని పవిత్రతను కొనియాడుతుంటాయి. అలాంటిది భూమండలంపై దేవుని స్తోత్రము మరియు పవిత్రత కొనియాడబడదా? ఇలాంటి పదాలు ఏ దైవజనుడి నోటి వెంట వెలువడవు. ఒక విధముగా చెప్పదలచినచో భూమండలంపై గల సకల చరాచర ప్రాణులలో కొన్ని ధర్మశాస్త్రపు ఆదేశాలకు లోబడి విధేయతను ప్రదర్శిస్తుండగా మరి కొన్ని దేవుని విధి ధర్మపు ఆదేశాలకు లోబడి యున్నవి. మరి కొన్ని ఈ రెండింటికి లోబడి విధేయతను ప్రదర్శించుట లో నిమగ్నమై ఉన్నవి. మేఘాలైనను, గాలులైనను, నిప్పు అయినను, నేలైనను అన్నియు దేవుని పట్ల విధేయతను ప్రదర్శించుట లో, పవిత్రతను కొనియాడుటలో మునిగి పోయాయి. మానవులలో ఎవడో ఒకడు దైవ ధర్మశాస్త్రపు ఆదేశాలను ధిక్కరించు చున్నచో అతడు దేవుని విధి ధర్మపు ఆదేశాలకు కట్టుబడియే యుండును. ఈ రెండు అధికారాల నుండి ఎవరు కూడ బయట లేరు. ప్రతి ఒక్కరి తల ఏదేని ఆకాశాధికారపు బంధనములో బంధింపబడి ఉన్నది. కాని మానవుని హృదయ సంస్కరణ మరియు అలజడుల కారణముగా నిర్లక్ష్యం, దైవస్మరణ ఒకదాని తరువాత మరొకటి ఈ భూమండలంపై తమ

ఆధిపత్యమును ప్రదర్శిస్తుంటాయి. కాని వివేక, విలక్షణుడైన దైవ అనుమతి లేనిదే ఈ సహాయ సహకారములు స్వయంగా చేకూరలేవు. భూమండలంలో ఈ విధముగా జరగాలని దైవం కోరినచో ఆ విధముగానే జరుగును. కావున మార్గదర్శకం, భ్రష్టత్వ కాలాలు కూడ రాత్రింభవళ్ళ వలే దేవుని ఆదేశం, అనుమతుల కు అనుగుణముగా కొనసాగుతుంటాయి. అంతేగాని స్వయముగా కాదు. ప్రతి ఒక్కటి అతని ఆహ్వానాన్ని ఆలకిస్తూ, అతని పవిత్రతను కొనియాడినప్పటికి భూమండలంపై దేవుని పవిత్రత లేదని ఇంజీల్ పేర్కొంటున్నది. అందుకు కారణం ఆ ఇంజీల్‌లో పేర్కొనబడినటు వంటి ఆ దుఆ తదుపరి వాక్యములే. ఆ వాక్యములేమనగా ఇప్పటి వరకు ఈ భువిపై దేవుని రాజ్యం స్థాపించబడలేదు. రాజ్యం స్థాపించబడ నందున, ఇతర కారణాల వలన ఆకాశంపై దేవుని ఆకాంక్ష నెరవేరినట్లు భూమండలంపై నెరవేరజాలదు. కాని ఖుర్ఆన్ బోధనలు ఇందుకు పూర్తి భిన్నముగా గలవు. అది ఎంతో స్పష్టముగా ఇట్లు ప్రకటన చేస్తుంది. ఏ దొంగ, హంతకుడు, వ్యభిచారుడు, అవిశ్వాసుడు, మోసగాడు, దుర్మార్గుడు, పాపపు పనులు చేయువారందరికి ఆకాశము నుండి స్వయం ప్రతిపత్తి అనుగ్రహించనిదే ఈ భూమండలంలో వారు ఏ పనిని చేయలేరు. అలాంటప్పుడు ఆకాశాధికారం భూమండలంపై లేదని ఎలా చెప్పగలము. దేవుని ఆదేశాలు కొనసాగకుండా ఈ భూమండలంపై ఏదేని ఇతర అధికారములు ఉన్నాయా? అల్లాహ్ పవిత్రుడు. అలాంటిది ఏమి లేదు. అల్లాహ్ తఆలా స్వయముగా ఆకాశంపై దేవదూతల కొరకు వేరొక వ్యవస్థను నిర్ణయించాడు. మానవుల కొరకు భూమండలంపై మరొక వ్యవస్థను ఏర్పాటు చేశాడు. అల్లాహ్ తఆలా తన ఆకాశాధికారంలో దేవదూతలకు ఎలాంటి స్వయం ప్రతిపత్తిని కల్పించలేదు. వారి స్వభావంలోనే విధేయత లక్షణాన్ని చేకూర్చాడు.

వారు వ్యతిరేకించలేరు. మరుపు, బలహీనతలు వారిపై ఏ మాత్రం ప్రభావాన్ని చూపవు. కాని మానవుని స్వభావానికి మాత్రం స్వీకరించు, తిరస్కరించు గుణాన్ని ఆపాదించాడు. కాని ఈ స్వయం ప్రతిపత్తి పైనుండి కల్పించబడినందున దుష్ట మానవుని స్థిరత్వం వలన భూమండలం నుండి దేవుని రాజ్యం కనుమరుగైనదని చెప్పలేము. పైగా దేవుని రాజ్యం అన్ని రూపాలలో నెలకొంటుంది. కాని ధర్మబద్ధతలు మాత్రం కేవలం రెండే. ఒకటి ఆకాశ దేవదూతల కొరకు విధి ధర్మం. వారెన్నడు చెడు తలపెట్టరు. మరొకటి భూమండలంపై గల మానవుని కొరకు దేవుని విధి ధర్మం. పైగా వారికి చెడు తలపెట్టు అవకాశమును కల్పించడం జరిగింది. కాని దేవుణ్ణి శక్తిని ప్రసాదించమని కోరినప్పుడు అనగా క్షమాపణలు వేడుకోగా, పరిశుద్ధాత్మ సహాయ సహకారాలతో బలహీనతలు దూరమవుతాయి. ఫలితముగా దేవుని ప్రవక్తలు, సందేశ హరులు కాపాడబడినట్లుగా చెడు తలపెట్టు తత్వం నుండి వారు రక్షించ బడుదురు. ఒక వేళ పాపాత్ములు క్షమాపణలు కోరుకున్నచో వారికి దక్కే ప్రయోజనం వారి పాపాల ప్రతిఫలాల నుండి అనగా శిక్షల నుండి వారు రక్షించబడుదురు. ఎందుకనగా వెలుగు రావడంతో అంధకారం దూరమవుతుంది. అదే విధముగా దేవుణ్ణి క్షమాపణలు యాచించని అనగా శక్తిని వేడుకోని పాపాత్ములు, తమ పాపములకు బదులు శిక్షలను అనుభవింతురు. చూడండి. నేడు ప్లేగు వ్యాధి కూడ శిక్ష రూపంలో భూమిపై అవతరించినది. దేవుని పట్ల దుష్టత్వం ప్రదర్శించువారు దానితో నాశనమగుదురు. అలాంటప్పుడు దేవుని రాజ్యం భూమిపై లేదని ఎందుకు ప్రకటిస్తారు. భువిపై దేవుని రాజ్యమున్నచో మరి ప్రజలెందుకు నేరాలు చేస్తున్నారనే అనవసర ఆలోచనలను మీ మదిలోకి రానివ్వకండి. ఎందుకనగా నేరాలు కూడ దేవుని విధి ధర్మానికి కట్టుబడి ఉన్నవి. కావున బాహ్యముగా వారు ధర్మశాస్త్ర చట్టాల నుండి వారు

అతీతులుగా వ్యవహరిస్తున్నను సృష్టి ధర్మము అనగా దేవుని విధి ధర్మానికి మాత్రం అతీతులు కారు. అలాంటప్పుడు నేరస్థుల తలలు దైవాధికార బేడీల నుండి ఎలా తప్పించుకోగలవు?. ........ఒకవేళ దేవుని చట్టాలను వెంటనే కఠినముగా మార్చి, వ్యభిచారం చేసే వారందరిపై పిడుగులు పడినచో, దొంగతనాలు చేసే ప్రతి ఒక్కరి చేతులు కుళ్ళి, నశించి ఊడిపోయినచో, ప్రతి దుష్టుడు, దైవాన్ని, అతని ధర్మాన్ని తిరస్కరించు ప్రతి ఒక్కరు ప్లేగు వ్యాధికి గురై చనిపోయినచో ఈ ప్రపంచీకులందరు కేవలం ఒకే ఒక్క వారం పూర్తిగాక ముందే సత్పుర్షులు, పుణ్యాత్ములుగా మారిపోవుదురు. కావున దేవుని రాజ్యం భూమండలంపై గలదు. కాని ఆకాశ ప్రభుత్వ చట్టాల వెసలుబాటు వలన నేరస్థులు త్వరగా పట్టుబడని విధముగా స్వతంత్ర్యమును పొంది యున్నారు. కాని శిక్షలు మాత్రం తప్పకుండా పడును. భూకంపాలు వస్తాయి. పిడుగులు పడుతాయి. పర్వతములు పటాకాలను తలపించే విధంగా భస్మమైనందున వేల మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. పడవలు మునిగిపోతుంటాయి. రైలు ప్రమాదాలు సంభవించి వందల సంఖ్యలో ప్రాణాలు ఆవిరైపోతాయి. ఇంకా తూఫాన్‌లు సంభవించును. భవనాలు కూలిపోవును. కొందరు పాము కాటుకు బలి అగుదురు. అడివి మృగాలు చీల్చివేయును. అంటువ్యాధులు ప్రభలును. నేరస్థులను నామరూపాలు లేకుండా చేయుటకు దేవుని సృష్టి ధర్మం ఒకే ద్వారము కాకుండా అనేక ద్వారములను తెరచి ఉంచినది. అయినా కూడ దేవుని రాజ్యం భువిపై లేదని మీరెందుకు అంటుంటారు. నిజమేమనగా దైవ రాజ్యాధికారం ఉన్నది. నేరస్థులందరి చేతులకు బేడీలు వేసి, కాళ్ళకు గొలుసులు కట్టి ఉన్నవి. కాని దేవుని విజ్ఞత వలన, అతడు చట్టాలను సౌలభ్యముగా రూపకల్పన చేసినందున ఆ గొలుసులు, ఆ బేడీలు ఎలాంటి ప్రభావాన్ని చూపలేవు. కాని మానవుడు తన పద్ధతిని మార్చు

కోక పోయినచో అవి అతణ్ణి నరకం వరకు తీసుకెళ్ళుతాయి. ఆ తరువాత నేరస్థుడు చనిపోకుండా, బ్రతికి వుండకుండా శిక్షకు గురి చేస్తాయి. మొత్తానికి రెండు రకాల చట్టాలు గలవు. ఒకటి దేవదూతలకు సంబంధించిన చట్టం, అనగా అవి కేవలం విధేయత కొరకే సృష్టించ బడ్డాయి. వాటి విధేయత కేవలం వాటి జ్యోతి స్వభావములోని ఒక భాగం. అవి పాపములు చేయలేవు. అదే విధముగా అవి పుణ్యములో కూడ అభివృద్ధిని సాధించలేవు. రెండవ చట్టం మానవుల కొరకు నిర్దేశించినది. అనగా మానవ స్వభావంలో ఉన్నది. వీరు పాపములు చేయవచ్చును, పుణ్యములలో కూడ అభివృద్ధి చెందవచ్చును. ఈ రెండు స్వభావిక చట్టాలు మార్చులేనివి. ఏ విధముగానైతే దేవదూతలు మానవులుగా మారరో, అదే విధముగా మానవులు కూడ దేవదూతల వలే పరివర్తనం చెందలేరు. ఈ రెండు చట్టాలను మార్చలేరు. ఇవి స్థిరమైనవి, నిశ్చలమైనవి. అందుకే ఆకాశ ప్రభుత్వం భువిపై కొనసాగ లేదు, భూమండల ప్రభుత్వాన్ని ఆకాశ ప్రజల కొరకు కొనసాగించలేము. మానవ తప్పిదాలు ఒకవేళ క్షమాపణల ద్వారా అంతమైనచో మానవుడు దేవదూతల కంటే ఉన్నత స్థాయిని పొందగలడు. క్షమాపణల ద్వారా మానవ పాపాల నుండి విముక్తిని పొందవచ్చును. దేవుడు విజ్ఞతతోనే కొందరిలో పొరపాటు పర్వంను మిగిలి ఉండేలా చేసాడు. ఫలితముగా పాపములు వారి బలహీనతలను గూర్చి వారికి జ్ఞప్తి చేస్తుంటాయి. ఆ తరువాత క్షమాపణలు యాచించి కాపాడబడుదురు. ఈ చట్టాన్నే మానవుల కొరకు నిర్ధారించెను. దీనినే మానవ స్వభావం కోరుతుంది. మరిచి పోవడం, తప్పులు చేయడం మానవ నైజం. దేవదూతల నైజం కాదు. అలాంటప్పుడు దేవదూతల కొరకు నిర్ధారించిన చట్టము మానవుల కొరకు ఏ విధముగా అమలు చేయబడుతుంది. దేవుని వైపు బలహీనతలను సూచించడం పాపమవుతుంది. భూమండలంపై

బహిర్గతమయ్యే ఇవన్నియు కేవలం చట్ట ఫలాలు. నవూజు బిల్లాహ్ దేవుని చక్రవర్తిత్వం, అధికారం, గౌరవం ఆకాశం వరకే పరిమిత మవ్వడానికి అతడేమైన బలహీనుడా? లేక భిన్న ఆధిపత్యమును భువిపై చెలాయించడానికి భూమండలానికి మరొక దేవుడు ఉన్నాడా? దేవుని రాజ్యం కేవలం ఆకాశంలోనే ఉన్నది, ఇప్పటి వరకు భువిపై లేదని వాదనలు చేయడం క్రైస్తవులకు సబబు కాదు. ఎందుకనగా వారి దృష్టిలో ఆకాశమంటు ఏమి లేదు. కావున ఈ కోణంలో చూసినచో దేవుని రాజ్యమంటు ఉన్న ఆకాశం ఇప్పుడు లేదు, పైగా భువిపై కూడ దేవుని రాజ్యం ఏర్పడలేదు. మొత్తానికి దేవుని రాజ్యం ఎక్కడా లేదు. ఇవన్నియు ప్రక్కకు పెట్టినచో మనము స్వయముగా దేవుని రాజ్యమును ఈ భువిపై మన కన్నులతోనే చూస్తున్నాము. అతని ధర్మము ప్రకారం మన ఆయుష్షు పూర్తి అవుతుంది. మన స్థితులు మారుతుంటాయి. వివిధ రకాల సౌఖ్యాలను, బాధలను మనము చూస్తూనే ఉన్నాము. దేవుని ఆజ్ఞతోనే వేల మంది మరణిస్తున్నారు. అటులనే వేలాది మంది జన్మించుచున్నారు. దుఆలు ఆమోదింపబడతాయి. సంకేతాలు బహిర్గత మైతాయి. భూమి వేల రకాల జీవరాశులను, ఫలాలను, పుష్పాలను అతని ఆదేశంతోనే బహిర్గతం చేస్తుంది. ఇవన్నియు దేవుని రాజ్యం లేకుండానే జరుగుచున్నాయా? అంతేగాకా ఆకాశపు వ్యవస్థ ఒకే విధము గా ఒకే కక్షలో కొనసాగుతుంది. వాటి కొనసాగింపులో స్పష్టముగా బహిర్గతమయ్యే మార్పులేవి మనకు కనిపించడం లేదు. కాని భువి మాత్రం వేలాది మార్పులు చేర్పులకు, నూతనోత్సవమునకు సంకేతము గా నిలుస్తుంది. ప్రతి రోజు కోట్లాది మంది ఈ ప్రపంచము నుండి వెళ్ళిపోతున్నారు, కోట్లాది మంది పుట్టుకొస్తున్నారు. అన్ని రంగాలు, అన్ని కోణాల ద్వారా ఒక ఆధిపత్యం గల రూపకర్త ఉన్నాడనే భావనను కలిగిస్తున్నాయి. అయినా కూడ ఇప్పటి వరకు భువిపై దేవుని రాజ్యం

స్థిరపడలేదా? దేవుని రాజ్యం భువిపై ఎందుకు స్థిరపడలేదనే విషయంపై ఇప్పటి వరకు ఇంజీల్ ఎలాంటి సాక్ష్యమును ప్రవేశపెట్టలేదు. కాని మసీహ్ తోటలో తనను కాపాడమని రాత్రియంతయు దుఆ చేయడం, ఆ దుఆ ఆమోదించబడడం, (ఇబ్రానియా, అధ్యాయం 5, సూక్తి 7లో తెలిపినట్లుగా) అయినను దేవుడు వారిని విడిపించుటలో సఫలీకృతుడు కాకపోవడం వంటివి ఆ కాలంలో దేవుని రాజ్యం భువిపై స్థిరపడలేదని చెప్పుటకు క్రైస్తవులకు ఒక ఆధారముగా నిలబడవచ్చును. కాని మేము అంతకు మించిన ఎన్నో కష్టాలను చూశాము, వాటి నుండి మోక్షమును పొందాము. దేవుని రాజ్యంను మేము ఎందుకు వ్యతిరేకించెదము. ఏ హత్య చేయకున్నను కేవలం ధార్మిక భేదాభిప్రాయముల వలన నిందారోపణ చేయుచూ పెలాతూస్ న్యాయ స్థానములో యూదులందరు కలసి చేసిన ఫిర్యాదు కన్నా మార్టిన్ క్లార్క్‌ను నేను హత్య చేయించాలని సంకల్పించినట్లుగా అతడే స్వయముగా కెప్టెన్ డగ్లస్ న్యాయ స్థానములో నాపై వేసిన వ్యాజ్యము ఏమైనా చిన్నదా? కాని దేవుడు ఆకాశాధికారి అయినట్లే ఈ భూమండలానికి కూడ రాజుయే కావున ఇలాంటి సంఘటన ఒకటి జరుగబోతుందని నాకు ముందుగానే తెలియజేశాడు. అంతేగాకా అతడే స్వయముగా విముక్తిని కలిగించెదనని శుభవార్తను కూడ అందించాడు. ఆ శుభవార్తను ముందుగానే కొన్ని వందల మందికి వినిపించడం జరిగింది. అలా చివరికి నన్ను విముక్తిడిని చేశాడు. క్రైస్తవులు, ముస్లిములు, హైందవులు సంయుక్తముగా నాపై వేసిన ఈ వ్యాజ్యము నుండి దేవుని చక్రవర్తిత్వమే నన్ను కాపాడింది. ఇలా ఒక్క సారి కాకుండా రెండు పదుల సంఖ్యలో నేను అనేక సార్లు ఈ భువిపై దేవుని చక్రవర్తిత్వమును చూశాను. కనుక దేవుని ఈ సూక్తులను నేను పదే పదే విశ్వసించసాగాను. لَهٗ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ (అల్ హదీద్ 57:3) అనగా దేవుని చక్రవర్తిత్వం భూమిపై, ఆకాశంపై కూడ గలదు.

మరొక సూక్తి إِنَّمَآ أَمۡرُهُۥٓ إِذَآ أَرَادَ شَيۡـًٔا أَن يَقُولَ لَهُۥ كُن فَيَكُونُ (యాసీన్ 36:83) అనగా భూమ్యాకాశములన్నియు అతని విధేయత వహించుచున్నవి. అతడు ఒక పనిని చేయదలచినచో అగుము అని ఆదేశించును, అందుకు తక్షణమే ఆ పని తన పరిపూర్ణతకు చేరుతుంది. మరల ఇట్లనెను. وَٱللَّهُ غَالِبٌ عَلَىٰٓ أَمۡرِهِۦ وَلَٰكِنَّ أَكۡثَرَ ٱلنَّاسِ لَا يَعۡلَمُونَ (యూసుఫ్ 12:22). అనగా దేవుడు తన సంకల్పంపై పూర్తి పట్టు గలవాడు. కాని అనేకులు దేవుని కోపాగ్ని, బంధించు లక్షణాలను గూర్చి ఎమరు పాటులో యున్నారు. మొత్తానికి ఇంజీల్ దుఆ అయిన ఇది దేవుని దయాగుణం నుండి ప్రజలను నిరాశ పరుస్తుంది. అతని సంరక్షణ, శ్రేయస్సు, ప్రళయ దినపు తీర్మాణముల పట్ల క్రైస్తవులను అజ్ఞానంలో పడేస్తుంది. పైగా భూమిపై దేవుని సామ్రాజ్యం స్థిరపడనంత వరకు భూవాసులకు సహాయము అందించలేని విధంగా ఒక నిస్సహాయునిగా చేస్తుంది. కాని అందుకు భిన్నముగా పవిత్ర ఖుర్ఆన్ ముస్లిములకు నేర్పించిన దుఆ మాత్రం దేవుడు భూమండలంలో తిష్ట వేసిన చక్రవర్తుల వలే అప్రయోజకుడిగా లేదని, అతని కరుణా, దయా, సంరక్షణ, ఇతర లక్షణాలన్ని భూమండలంపై ప్రయోజనంను చేకూర్చుతున్నాయని, అతడు తన దాసులకు సహాయము నందించు శక్తిని కల్గి ఉన్నాడని, నేరస్థులను తన ఆగ్రహంతో శిక్షించునని తెల్పుచున్నది. ఆ దుఆ ఈ విధముగా గలదు.

ٱلۡحَمۡدُ لِلَّهِ رَبِّ ٱلۡعَٰلَمِينَ- ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ- مَٰلِكِ يَوۡمِ ٱلدِّينِ-

إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِينُ- ٱهۡدِنَا ٱلصِّرَٰطَ ٱلۡمُسۡتَقِيمَ-

صِرَٰطَ ٱلَّذِينَ أَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ ٱلۡمَغۡضُوبِ عَلَيۡهِمۡ وَلَا ٱلضَّآلِّينَ-

(ఫాతిహా 1:2-7) అనగా ఆ సకల లోకాల సంరక్షకుడికే సకల సంకీర్తనలు. అనగా అతని చక్రవర్తిత్వంలో ఎలాంటి లోపం

లేదు. ఈ రోజు లభించలేనిది రేపు లభించునని అతని విశిష్టతలు తెలుసు కోవడానికి ఏదేని ప్రత్యేక స్థితికోసం ఎదురుచూడవలసిన అవసరం లేదు. అతని చక్రవర్తిత్వపు మాధుర్యంలో ఏది వృధా లేదు. సకల లోకాలను సంరక్షిస్తున్నాడు. ఆచరణల ప్రతిఫలం లేనిదే కరుణించును. ఆచరణల ప్రతిఫలానికి కూడ కరుణించును. నిర్ణీత సమయంలో ప్రళయ దినమును ఏర్పర్చును. అతనినే మేము ఆరాధించెదము. అతనినే మేము సహాయమును కోరెదము. అనుగ్రహపు మార్గము లన్నింటిని చూపమని, నీ కోపానికి కారణమయ్యే, మార్గభ్రష్టులయ్యే మార్గాల నుండి దూరముగా ఉంచాలని దుఆ చేయుదుము.

ఫాతిహా అధ్యాయమనబడు ఈ దుఆ ఇంజీల్ దుఆ కంటే పూర్తి భిన్నము, పవిత్రముగా ఉన్నది. ఎందుకనగా భూమండలంపై ప్రస్థుతం దేవుని సామ్రాజ్యం లేదని తిరస్కరించబడింది. కావున ఇంజీల్ ప్రకారముగా దేవుని కరుణా, దయా, సంరక్షణ, మంచి చెడుల ప్రతిఫలమునిచ్చు ఏ లక్షణము భూమండలంపై పని చేయడం లేదు. అందుకు కారణం ఇప్పటి వరకు భూమండలంపై దేవుని సామ్రాజ్యం విస్తరించలేదు. కాని ఫాతిహా అధ్యాయము ప్రకారము భూమండలంపై కూడ దేవుని సామ్రాజ్యమే కొనసాగుతుంది. అందుకోసమే ఫాతిహా అధ్యాయములో చక్రవర్తిత్వపు విశిష్టతలన్ని తెలుపబడినవి. ప్రజల శ్రేయస్సుకు పాటుపడే ఈ విశిష్టతలన్నియు ఒక చక్రవర్తిలో ఉండ వలెనని తెలుస్తుంది. కావున ఫాతిహా అధ్యాయములో సకల లోకాల సంరక్షకుడు అనే పదం ఈ విశిష్టతకు సాక్ష్యమిస్తుంది. ఒక చక్రవర్తికి ఉండవలసిన మరొక విశిష్ట లక్షణమేమనగా తమ రాజ్య ప్రజలకు, వాస్తవ్యులకు కావలసిన నిత్యవసర వస్తువులను ఎలాంటి ప్రతి ఫలం ఆశించకుండా వారికి అందుబాటులోకి తీసుకొని రావలెను. కావున

"అర్రహ్మాన్ " అనే పదం ఈ విశిష్టతను సూచిస్తుంది. ఒక చక్రవర్తికి యుండ వలసిన మూడవ విశిష్ట లక్షణమేమనగా, తమ రాజ్య ప్రజలు తమ ప్రయత్నాల ద్వారా ఏదేని కార్యక్రమమును పూర్తి చేయనిచో, దానిని పూర్తి చేయుటకు తగిన సహాయ సహకారములను అందించ వలెను. కావున "అర్రహీం" అనే పదం ఈ విశిష్టతను సూచిస్తుంది. ఒక చక్రవర్తికి యుండవలసిన నాలుగో విశిష్టత ఏమిటనగా, ప్రతిఫలం ఇచ్చుటకు, శిక్షించుటకు పూర్తి అధికారము కలిగి ఉండవలెను. తద్వారా అతని రాజకీయ పరిపాలన వ్యవహారములో ఎలాంటి ఆటంకములు ఏర్పడకుండా ఉండును. కావున "మాలికి యౌమిద్దీన్" అనే పదం ఈ విశిష్టతను సూచిస్తుంది. సారంశమేమనగా పైన తెలుపబడిన అధ్యాయములో ఒక చక్రవర్తికి యుండవలసిన విశిష్టతలన్నింటిని ప్రస్తావించడం జరిగింది. వీటి ద్వారా తెలుపునదేమనగా ఈ భూ మండలంపై దేవుని సామ్రాజ్యం, అతని చక్రవర్తిత్వం కొనసాగుతుంది. ..........కావున వినండి, అర్థం చేసుకోండి, ఇందులోనే గొప్ప విజ్ఞత ఉంది. ఏ విధముగానైతే ఆకాశపు అణువణువు దేవుని చక్రవర్తిత్వంలో ఉన్నదో అదే విధముగా భూమండలపు అణువణువు కూడ దేవుని ఆధీనంలో, అధికారంలో ఉన్నది. ఏ విధముగానైతే ఆకాశంలో అతనికి వైభవోపేతమైన ప్రాచుర్యమున్నదో అదే విధముగా ఈ భూమండలంపై కూడ అతనికి వైభవోపేతమైన ప్రాచుర్యమున్నది. ఆకాశపు ప్రాచుర్యం ఒక విశ్వాస ప్రక్రియ. సాధారణ వ్యక్తులెవరు ఆకాశమెక్కి అతణ్ణి వీక్షించ లేదు. కాని భూమండలంపై దేవుని చక్రవర్తిత్వపు ప్రాచుర్యం గలదు. ఇది ప్రతి ఒక్కరి కన్నులకు ఎంతో స్పష్టముగా కనుపించును. ప్రతి వ్యక్తి అతడు ఎంతటి ధనవంతుడైనను, అతని అభిరుచికి భిన్నముగా మరణపు ద్రావణంను త్రాగవలసినదే. ఆ చక్రవర్తి యొక్క స్వచ్ఛమైన ఆదేశపు ప్రభావం ఈ భూమిపై ఏ విధముగా ఉన్నదో చూడండి.

ఆదేశము రాగానే ఏ ఒక్కరు కూడ ఆ ఆదేశాన్ని ఒక్క క్షణం కోసం కూడ తప్పించలేరు. అతి భయంకరమైన, చికిత్స లేని రోగాలు వచ్చినచో వాటిని ఏ వైద్యుడు కూడ దూరం చేయలేడు. కావున ఆదేశము రద్దు కాబడనటువంటి దేవుని చక్రవర్తిత్వపు ప్రభావం ఈ భూమండలం పై ఎంతగా ఉన్నదో ఒక్కసారి ఆలోచించండి. అలాంటప్పుడు దేవుని రాజ్యం ఈ భూమండలంపై ప్రస్థుతం లేదు, కాని రాబోవు రోజులలో ఏర్పడునని ఎందుకు ప్రచారం చేస్తున్నారు. ఈ కాలంలో దేవుని ఆకాశ ఆదేశం ప్లేగ్ వ్యాధి రూపంలో ఏ విధముగా భూమండలమును కుదుపు తుందో చూడండి. ఫలితముగా ఇది అతని మసీహ్ మౌవూద్ కొరకు ఒక సంకేతముగా నిలుచును. అతని ఆకాంక్ష లేకుండానే దీనిని దూరం చేయువారెవరు. అయినా కూడ భువిపై అతని రాజ్య స్థాపన జరగలేదని ఎందుకంటున్నారు. అవును! ఒక దుష్టుడు ఈ భూమండలంపై ఒక ఖైది వలే జీవితమును గడుపును. పైగా ఎన్నడు మరణించ కూడదని కోరుకుంటాడు. కాని దేవుని స్వచ్ఛమైన సార్వభౌమాధికారం అతనిని నాశనం చేస్తుంది. అలా చివరికి ఆ దుష్టుడు మృత్యువు ఒడిలో చిక్కు కొనును. అయినను భువిపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు. దేవుని ఆదేశంతో ఈ భువిపై ఒక్క క్షణంలోనే కొన్ని కోట్ల మంది మానవులు మరణిస్తారు, అతని కోరిక మేరకు కోట్లాది మంది జన్మిస్తుంటారు. కోట్లాది మంది అతని ప్రీతి వలన పేదరికం నుండి సంపన్నులుగా, సంపన్నుల నుండి పేదవారిగా పరివర్తనం చెందుతారు, అయినను భువిపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు. ఆకాశంలో కేవలం దేవదూతలే ఉంటారు. కాని భూమండలంపై మానవులతో పాటు దేవునికి సహాయకులుగా, అతని సామ్రాజ్యంనకు సేవకులుగా మరియు మానవుల వివిధ రకాల పనులను కాపాడుటకు దేవదూతలుంటారు. వారు ఎల్లప్పుడు దేవుని పట్ల విధేయతను

కనబరుస్తారు. వారు తమ నివేదికలను ఎప్పటికప్పుడు దేవుని వద్దకు పంపు తుంటారు. అయినను ఈ భూమండలంపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు. వాస్తవానికి దేవుడు ఈ భూమండలపు చక్రవర్తిత్వంతోనే ఎక్కువగా గుర్తింపబడుతాడు. ఎందుకనగా ఆకాశపు రహస్యము లన్నియు గోప్యముగా ఉంటాయి, ఎవరికి కనిపించవు. ఒక రకంగా చెప్పదలచినచో నేటి కాలపు క్రైస్తవులు, వారి తత్వవేత్తలు ఇంజీల్‌లో పేర్కొనట్లుగా దేవుని సామ్రాజ్యానికి పునాదులైన ఆకాశమనేది ఏది లేదు అనే ఒక అభిప్రాయాన్ని కల్గియున్నారు. కాని ప్రస్తుతం భూగోళపు ఒక భాగం మన కాళ్ల క్రింద గలదు. కొన్ని వేల విధి ధర్మపు సంకేతాలు దానిపై బహిర్గత మగుచున్నాయి. ఈ మార్పులు చేర్పులు, దుర్ఘటనలు, వినాశాలు అన్ని ఏదో ఒక ప్రత్యేక యజమాని ఆదేశముతోనే జరుగు తున్నాయని అర్థం చేసుకోలేరా? అయినను ఈ భూమండలంపై దేవుని చక్రవర్తిత్వం లేదని ఎలా చెప్పగలరు? .......... కాని మన ఆరాధ్య దేవుడు మాత్రం ఫాతిహా ఆధ్యాయములో ఆకాశపు పేరును గాని, భూమండలపు పేరును గాని ఎక్కడా ప్రస్తావించలేదు. పైగా అతడు సకల లోకాల సంరక్షకుడిని అనే వాస్తవాన్ని మనకు అందించాడు. అనగా ప్రాణులున్నంత వరకు, జనులు ఉన్నంత వరకు, భౌతిక కాయాన్ని, ఆత్మలన్నింటిని సృష్టించువాడు, సంరక్షించువాడు అల్లాహ్ యే. అనుక్షణం వాటిని పోషిస్తుంటాడు. వాటికి అనుగుణముగా పరిస్థితులను ఏర్పరుస్తాడు. లోకాలన్నింటిపై అతని సంరక్షణ, కరుణా, దయా, ప్రతిఫల మరియు శిక్ష తత్వాలు ఒకే విధముగా కొనసాగుతాయి. మరల గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, ఫాతిహా ఆధ్యాయములో మాలికి యౌమిద్దీన్ అని తెలిపిన పదం యొక్క అర్థం కేవలం ప్రళయ దినము రోజున తిర్మాణం చేయుటయే కాదు. ప్రళయ దినమనేది వాస్తవానికి ప్రపంచం

అంతరించిన సమయంలో వెలుగులోకి వచ్చేదే అయినప్పటికి దాని ఒక రకం ఈ భూమండలం నుండే ప్రారంభమ గుననే విషయాన్ని పవిత్ర ఖుర్‌ఆన్ పదే పదే స్పష్టముగా తెల్పుతుంది. ఈ విషయం వైపే يَجْعَلْ لَّكُمْ فُرْقَانًا (అల్ అన్‌ఫాల్ 8: 30) అను సూక్తి సూచిస్తుంది.

*(కష్తి నూహ్ - రూహాని ఖజాయిన్ సంపుటి:19 పుట:32-42)*

పవిత్ర ఖుర్‌ఆన్ ప్రకారము అల్లాహ్ తఆలా ఆకాశములో వున్నట్లు భూమిపై కూడ వున్నాడని గుర్తుంచుకోగలరు. అందుకే అతడిట్లనెను. هُوَ الَّذِىْ فِى السَّمَآءِ اِلٰهٌ وَّفِى الْاَرْضِ اِلٰهٌ (అజ్జుఖ్రుఫ్ 43:85) అనగా అతడే ఆకాశములో ఆరాధ్యదైవము, భూమిలో కూడ ఆరాధ్యుడు. ఒక రహస్య విషయములో ముగ్గురు వ్యక్తులుండగా నాలుగవ వాడు అల్లాహ్ వుండును. అతనికి అంతము లేదు. అందుకే పవిత్ర ఖుర్‌ఆన్ సూక్తిలో ఇట్లు వ్రాయబడెను. لَا تُدْرِكُهُ الْاَبْصَارُ وَهُوَ يُدْرِكُ الْاَبْصَارَ (అల్ అన్‌ఆమ్ 6:104) అనగా కన్నులు అతనిని పొందలేవు. కాని అతడు స్వయముగా కనుల వరకు వచ్చును. ఇదే విధంగా అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో మరో చోట ఇట్లనెను. وَنَحْنُ اَقْرَبُ اِلَيْهِ مِنْ حَبْلِ الْوَرِيْدِ (ఖాఫ్ 50:17) అనగా మేమతనికి అతని ప్రాణ ధమని కంటే దగ్గరగా నున్నాము. అల్లాహ్ తఆలా ప్రతి విషయమును ఆవహించియున్నాడని కూడ ఒక చోట వ్రాసెను. మరో చోట ఇట్లు కూడ అనెను. اَنَّ اللّٰهَ يَحُوْلُ بَيْنَ الْمَرْءِ وَقَلْبِهٖ (అల్ అన్ఫాల్ 8:25) అనగా మానవునికి అతని హృదయమునకు మధ్య అల్లాహ్ నుండును. ఇంకా ఇట్లు కూడ అనెను. اَللّٰهُ نُوْرُ السَّمٰوٰتِ وَالْاَرْضِ (అన్నూర్ 24:36) అనగా అల్లాహ్ భూమ్యాకాశములకు జ్యోతి. అది లేనిచో అంతా అంధకారమే అలముకొనును. మరో చోట ఇట్లనెను. كُلُّ مَنْ عَلَيْهَا فَانٍ ۔ وَّيَبْقٰى وَجْهُ رَبِّكَ ذُو الْجَلٰلِ وَالْاِكْرَامِ (అర్రహ్మాన్ 55:27,28) అనగా ప్రతి వస్తువు నాశనమగును, రూపు మార్చు కొనును. శక్తిమంతుడు, వరప్రదాత అయిన నీ ప్రభువు వైభవము మిగిలి వుండును.

అనగా ప్రతి వస్తువు నాశనమునకు గురగును. మార్పును అంగీకరించును. భూమ్యాకాశములలో వున్న సర్వము మార్పునకు గురై, నాశనమగును కాని మార్పునకు గురి కాని, నాశనము కాని ఒక ఉనికి వున్నదని మానవుడు అంగీకరించక తప్పదు. అతను కాలానుగుణంగా మారడు. అతడే అల్లాహ్ తఆలా. భూమిపై పాపములు, నేరములు, అపవిత్ర పనులు కూడ జరుగుతుంటాయి. కనుక అల్లాహ్ తఆలాను కేవలం భూమి వరకు పరిమితం చేసే వారు తుదకు అన్యారాధకులు, విగ్రహారాధకులుగా మారుతారు. హిందువులందరు ఇలాగే మారినారు.

## ఇస్లాంలో 'అర్ష్'
## (సింహాసనము) భావన

అందుకే పవిత్ర ఖుర్‌ఆన్ ఇట్లు సూచించెను. అల్లాహ్ తఆలాకు తన సృష్టితో దగ్గరి సంబంధమున్నది, ప్రతి ఒక్కరికి ప్రాణము అతడే, ప్రతి ఉనికి అతని ఆసరాతోనే మనుగడ సాగించుచున్నది. మరో వైపు మానవునితో దేవునికి గల సంబంధము వలన వేదాలు భావించినట్లు మానవునిని దేవునిగా భావించే తప్పిదము నుండి రక్షించుటకు దేవుడు ప్రాణులకు కనపడని విధంగా అందరికంటే గొప్ప స్థాయిలో వున్నాడని తెలిపెను. దీనినే దైవ శాసన పరిభాషలో సింహాసనమందురు. సింహాసనము ఏదో పుట్టించిన వస్తువు కాదు. కంటికి కనిపించని దేవుని స్థాయికి గల నామము. మానవుని వలె అల్లాహ్ తఆలా కూర్చొను సింహాసనమని భావించకూడదు. సింహాసనమనగా ప్రాణుల నుండి చాలా దూరములో నున్న పవిత్ర, పరిశుభ్రమైన ఉన్నత స్థాయి. అందుకే పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇట్లు వ్రాయబడెను. సృష్టించు, పుట్టించు బంధమును అల్లాహ్ తఆలా అందరితో ఏర్పరచుకొన్న తర్వాత సింహాసనమును అధిష్ఠించెను. అన్ని సంబంధములు ఏర్పడినను అతడు ప్రాణులలో పరిమితం కాక విడిగా వున్నాడు.

సారాంశమేమనగా అల్లాహ్ తఆలా మానవునితో కలిసి వున్నాడనగా, ప్రతి దానిని ఆవహించి వున్నాడని అర్థము. ఇది అల్లాహ్ తఆలా పోలికలు గల గుణము. మానవునితో తనకు గల సమీప సంబంధమును తెలుపుటకు అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ గుణమును ప్రస్తావించెను. అల్లాహ్ తఆలా ప్రాణులకు కనిపించకుండా వుండుట, అందరికంటే ఉన్నత స్థాయిలో, దూరాన వుండుట, ప్రాణులకందని పవిత్ర, పరిశుద్ధత స్థాయిలో వుండుటను పవిత్ర ఖుర్ఆన్ లో సింహాసనమని అనబడెను. ఈ గుణము పేరు పవిత్ర గుణము. తన ఏకత్వము, తనకు ఎవరు భాగస్వామి లేరని, ప్రాణుల గుణములకు అతడు అతీతుడని నిరూపించుటకు ఈ గుణమును ప్రవిత్ర ఖుర్ఆన్‌లో ప్రస్తావించెను. ఇతర జాతులు అల్లాహ్ తఆలా గురించి పవిత్ర గుణములు మాత్రమే ప్రస్తావించినాయి లేదా నిర్గుణమని ఆరాధించెను. లేదా సర్వ గుణములని నమ్మి ప్రాణుల వలె అతనిని పోల్చిరి. అనగా ఈ రెండు గుణములను ఏకము చేయలేదు. కాని అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ రెండు గుణముల రూపంలో తన ముఖమును ప్రదర్శించెను. ఇదే సంపూర్ణ దైవ ఏకత్వము.

*(చశ్మ మారిఫత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:23 పుట:97,99)*

సింహాసనము (ఆర్ష్) ఒక శారీరకంగా పుట్టించబడిన వస్తువు, దానిపై అల్లాహ్ తఆలా ఆసీనుడై వున్నాడని ముస్లిములు విశ్వసిస్తారు. కాని పవిత్ర ఖుర్ఆన్‌ను మొదటి నుండి చివరి వరకు పఠించినను సింహాసనము ఒక పరిమితమైన వస్తువు, పుట్టించబడినదని ఎక్కడా చదవలేరు. అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో పదే పదే ఇట్లు చెప్పెను. ఉనికి గల ప్రతి వస్తువును నేనే పుట్టించినాను. నేనే భూమ్యాకాశముల, ఆత్మల, వాటి సర్వ శక్తులకు సృష్టికర్తను. నేను స్వయంభువుడను, ప్రతి వస్తువు మనుగడకు నేనే కారణం. ఉనికిగా యున్న ప్రతి అణువు, ప్రతి

వస్తువును నేనే పుట్టించినాను. కాని సింహాసనము కూడ ఏదో ఒక పుట్టించబడిన వస్తువు అని ఎక్కడా చెప్పలేదు....పవిత్ర ఖుర్‌ఆన్‌లో సంహాసనము అను పదము ఎక్కడ ఉపయోగించబడినా దానికి అల్లాహ్ తఆలా గొప్పతనము, వైభవము, ఘనత అని భావము గలదు. అందుకే దానిని పుట్టించబడిన వస్తువులలో చేర్చలేదు. అల్లాహ్ తఆలా గొప్పతనము, వైభవమును ప్రదర్శించినట్టివి నాలుగు గలవు. వాటిని వేదాలు నాలుగు దేవతలు అని అనును. కాని పవిత్ర ఖుర్‌ఆన్ పరిభాషలో వాటి పేరు దేవదూతలు కూడ గలదు.

*(నసీమె దావత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:19 పుట:453,456)*

పవిత్ర ఖుర్‌ఆన్‌లో సింహాసనమనగా పోలిక గల స్థాయి కంటే గొప్ప, అన్ని లోకముల కంటే ఉన్నత, ఎంతో పవిత్రమైన, పరిశుద్ధమైన స్థాయి. సింహాసనముపై అల్లాహ్ తఆలా కూర్చొనుటకు అది రాయి లేదా ఇటుక లేదా మరో వస్తువుతో సిద్ధము చేయబడిన వస్తువు కాదు. అందుకే సింహాసనము పుట్టించబడలేదని అంటారు. అల్లాహ్ తఆలా ఇట్లు కూడ తెలిపెను. ఒక్కో సారి విశ్వాసి హృదయంపై అతడు బహిర్గతమగును. ఇలాగే సింహాసనముపై బహిర్గతమగునని అనును. ప్రతి వస్తువును మోయుచున్నది తానేనని అంటాడు. నన్ను మరో వస్తువు మోయుచున్నదని ఎక్కడా అల్లాహ్ సూచించలేదు. లోకము కంటే గొప్ప స్థానమైన సింహాసనము వాస్తవానికి అతని సర్వోత్కృష్టమైన గుణమును ప్రదర్శించును. ఆది నుండి అల్లాహ్ తఆలాలో రెండు గుణములు గలవని మేము పదే పదే వ్రాసినాము. ఒక గుణము పోలికలు గలది. రెండవది సర్వోత్కృష్టమైనది. అల్లాహ్ తఆలా గ్రంథములో రెండింటిని అనగా ఒకటి పోలికలు గల గుణమును, రెండవది సర్వోత్కృష్టమైన గుణమును ప్రస్తావించుట తప్పనిసరి అయినందున పోలికలు గల గుణము కొరకు తన హస్తము, నేత్రము, ప్రేమ, ఆగ్రహము మొదలగు గుణములను

పవిత్ర ఖుర్ఆన్‌లో ప్రస్తావించెను. పోలికలనే నమ్ముకునే సందేహము న్నందున కొన్ని చోట్ల لَيۡسَ كَمِثۡلِهٖ شَىۡءٌ అనెను, మరి కొన్ని చోట్ల ثُمَّ اسۡتَوٰى عَلَى الۡعَرۡشِ అనెను. ఇలాగే అర్రాద్ అధ్యాయము, 11వ భాగములో ఈ సూక్తి గలదు. اَللّٰهُ الَّذِىۡ رَفَعَ السَّمٰوٰتِ بِغَيۡرِ عَمَدٍ تَرَوۡنَهَا ثُمَّ اسۡتَوٰى عَلَى الۡعَرۡشِ (అర్రాద్ 13:3) అనగా మీరు చూచుచున్న ఆకాశములను స్తంబములు లేనిదే ఎత్తుగా చేసినవాడే అల్లాహ్. తదుపరి అతడు సింహాసనము నధిష్ఠించెను. ఈ సూక్తి బాహ్య అనువాదము ప్రకారము గతములో అల్లాహ్ తఆలా సింహాసనమును అధిష్టించలేదా ? అనే సందేహం కలుగును. దీని సమాధానమేమనగా సింహాసనము ఒక శారీరక వస్తువు కాదు. కంటికి కనిపించకుండా యుండే ఒక స్థితి. అది అతని గుణము. అల్లాహ్ తఆలా భూమ్యాకాశములతో పాటు ప్రతి వస్తువును పుట్టించెను. ఛాయ రూపంగా తన కాంతితో సూర్యచంద్రాదులు, నక్షత్రములకు జ్యోతి ప్రసాదించెను. మానవుణ్ణి కూడ పరోక్ష రూపంలో తన ముఖ కవలికలతో పుట్టించెను. తన గొప్ప ప్రవర్తనలు, గుణములు అతనికి ప్రసాదించెను. ఈ విధంగా అల్లాహ్ తఆలా తన పోలికను ఏర్పరచెను. కాని అతడు ప్రతి పోలికకు అతీతుడైనందున సింహాసనమును అధీష్ఠించి తన పవిత్రతను కూడ ప్రస్తావించెను. సారాంశముగా చెప్పాలంటే ఇదంతా పుట్టించినను అతడు పూర్తిగా ప్రాణుల వలె లేడు. అందరి కంటే భిన్నంగా, అతి రహస్య ప్రాంతములో వున్నాడు.

*(చశ్మ మారిఫత్ – రూహానీ ఖజాయిన్ సంపుటి:23 పుట:276,277)*

వ్యతిరేకులు మరో విమర్శ చేస్తారు. అనగా ప్రళయ దినమున సింహాసనమును 8 దేవదూతలు మోయుదురు, ఇహలోకములో నలుగురు దేవదూతలు మోయుచున్నారని పవిత్ర ఖుర్ఆన్‌లోని కొన్ని సూక్తుల ద్వారా స్పష్టంగా తెలుస్తున్నది. అల్లాహ్ తఆలా సింహాసనమును మరొకరు మోయుట అతని స్థాయికి తగదనే విమర్శ ఇచట తలెత్తును. దీని సమాధాన

మేమనగా మోయుటకు లేదా మోయబడుటకు సింహాసనము ఒక శారీరక వస్తువు కాదని ఇప్పుడే మీరు విని వున్నారు. పవిత్ర, పరిశుద్ధ స్థానము పేరు మాత్రమే సింహాసనము. అందుకే అది పుట్టించబడలేదని అందురు. ఎందుకనగా ఇక శరీరము గల వస్తువు అల్లాహ్ తఆలా సృష్టి కంటే బయట ఎలా వుండగలదు. సింహాసనము గురించి ప్రస్తావించబడిన విషయములన్నియు సంజ్ఞలు మాత్రమే. ఈ విషయముతోనే ఇటువంటి విమర్శ మూర్ఖత్వము మాత్రమేనని ఒక వివేకి అర్థము చేసుకోవచ్చును. దేవదూతలు మోయుననే విషయ వాస్తవమును మేమిప్పుడు ప్రేక్షకులకు తెలుపుతాము. అదేమనగా అల్లాహ్ తఆలా తన పవిత్ర స్థానములో అనగా అతని సర్వోత్కృష్టమైన గుణము ఇతర గుణములన్నిటిని ఆవహించుకొని అతనిని కంటికి కనపడని విధంగా చేయును. పవిత్ర ఖుర్ఆన్ పరిభాషలో దాని పేరే సింహాసనము. అప్పుడు అల్లాహ్ తఆలా మానవుల తెలివికంద కుండా ఉన్నత స్థాయికి చేరును. అతనిని కనుగొనుట మానవ తెలివి తేటలకు సాధ్యము కాదు. అతని నాలుగు గుణములనే దేవదూతలుగా నామకరణం చేయబడెను. అవి ప్రపంచములో ప్రత్యక్షమైనవి. అతని రహస్య ఉనికిని బహిర్గతపరచును.

**(1) మొదటిది రుబూబియ్యత్:** దీని ద్వారా అతడు ఆధ్యాత్మిక, శారీరక పరంగా మానవుణ్ణి సంపూర్ణ దశకు చేర్చును. అందుకే ఆత్మ, శరీరము రెండింటి ప్రత్యక్షము రుబూబియ్యత్ వలన జరుగును. ఇంకా దైవ వాక్యము అవతరించుట, అది మహిమాన్విత సంకేతంగాను ప్రత్యక్షమగుట కూడ రుబూబిబయ్యత్ వల్లనే జరుగును.

**(2) రెంవది ప్రత్యక్షమైన అల్లాహ్ తఆలా రహ్మానియ్యత్:** అనగా కర్మల కంటే ముందు అనన్య వరములు మానవుని కొరకు సృష్టించెను. ఈ గుణము కూడ అతని రహస్య ఉనికిని ప్రత్యక్షపరచను.

**(3) మూడవది అల్లాహ్ తఆలా రహీమియ్యత్:** సత్కర్మలు

చేసేవారికి మొదట తన రహ్మానియ్యత్ గుణముతో సత్కర్మల శక్తి ప్రసాదించును. అనంతరం రహీమియ్యత్ గుణముచే ఆయా సత్కర్మలను వారి ద్వార వెల్లడిస్తాడు. ఈ విధంగా వారిని ఆపదల నుండి రక్షిస్తాడు. ఈ గుణము కూడ అతని రహస్య ఉనికిని ప్రత్యక్షపరచును.

**(4) నాలుగవ గుణము మాలికి యౌమిద్దీన్:** ఇది కూడ అతని రహస్య ఉనికిని ప్రత్యక్షపరచును. ఎందుకనగా అతడు సత్యులకు ఫలితము, దుష్టులకు శిక్ష విధించును.

అల్లాహ్ తఆలా సింహాసనమును ఈ నాలుగు గుణములు మోయుచున్నవి. అనగా అతని రహస్య ఉనికి ఈ గుణముల ద్వారా ఈ లోకమునకు తెలుస్తున్నది. ఈ జ్ఞానము పరలోకములో రెట్టింపగును. కావున 4 బదులు 8 దేవదూతలగుదురు.

*(చశ్మ మారిఫత్ – రూహాని ఖజాయిన్ సంపుటి:23 పుట:278,279)*

సమైక్య దైవతత్వం ఒక జ్యోతి. అంతర్ ప్రపంచానికి లేక బహిః ప్రపంచానికి సంబంధించిన సర్వ దేవతలను నిరాకరించినప్పుడే ఆ కాంతి హృదయాన్ని వెలిగిస్తుంది. మనిషి ఉనికికి సంబంధించిన అన్ని కణాలలోకి అది ప్రవేశించి వ్యాపిస్తుంది. దేవుని సహాయం లేనిదే అతని సందేశహరుని సహాయం లేనిదే ఇది ఎలా సాధ్యం. తన అహంకారాన్ని చంపుకోవడమే తన పైశాచిక ప్రవృత్తిని త్రిప్పి కొట్టడమే మానవుని కర్తవ్యం. జ్ఞాన డోలికల్లో తాను ఊగిపోతున్నాడన్న గర్వాన్ని వదులుకొని తాను ఏమి తెలియని వానిగా భావించుకోవడం, ప్రార్థనలో నిమగ్నుడు కావడమే అతడు చేయవలసిన పని. అప్పుడా సమైక్య దైవతత్వం అతనికి లభిస్తుంది. దేవుడు అతనికి ఒక నవ్య జీవితాన్ని ప్రసాదిస్తాడు.

*(హఖీఖతుల్ వహీ – రూహాని ఖజాయిన్ సంపుటి:22 పుట:148)*

దేవుణ్ణి గుర్తించుటకు ప్రవక్తను గుర్తించవలసిన ఆచారము ఆది నుండి అనగా ప్రపంచము ఏర్పడినప్పటి నుండి కొనసాగుచున్నది. కావున

ప్రవక్త లేనిదే దైవ ఏకత్వము ఏర్పడుట సాధ్యము కానే కాదు. దేవుణ్ణి దర్శించుటకు ప్రవక్త ఒక దర్పణం. ఆ దర్పణం ద్వారనే దేవుని ముఖము కనిపించును. తనను తాను ప్రపంచములో బహిర్గతము చేయదలచి నప్పుడు తన శక్తుల రూపమైన ప్రవక్తను ప్రపంచమునకు దేవుడు పంపును. దివ్యవాణి అతనికి ప్రసాదించును, తన రుబూబియ్యత్ శక్తులను అతని ద్వారా ప్రదర్శించును. అప్పుడు దేవుడున్నాడని ప్రజలకు తెలియును. దైవమును గుర్తించుటకు అల్లాహ్ తఆలా ప్రాచీన చట్టము ప్రకారము ఎవరి ఉనికి మార్గముగా నిర్ణయించబడెనో వారిని విశ్వసించుట కూడ దైవ ఏకత్వములోని ఒక భాగమే. వారిని విశ్వసించనిచో దైవ ఏకత్వము పూర్తి కాదు. ప్రవక్త ప్రదర్శించే ఆయా ఆకాశ సంకేతములు, శక్తివంతమైన మహిమలు విజ్ఞానము వరకు చేర్చును. అవి లేనిదే సంపూర్ణ నమ్మకముతో ఏర్పడే స్వచ్ఛమైన దైవ ఏకత్వము ఏర్పడుట సాధ్యము కాదు. అల్లాహ్ తఆలా ఆ ప్రవక్త ద్వారనే అతి సూక్ష్మమమైన, రహస్యమైన, పరోక్షమైన తన ముఖమును చూపును. రహస్య నిధి అయిన అల్లాహ్ తఆలా సందేశహరుల ద్వారనే గుర్తించబడును. అల్లాహ్ తఆలా దృష్టిలో నిజమైన దైవ ఏకత్వమనబడు ఆచరణ రూపంలో గల దైవ ఏకత్వమును ప్రవక్తను విస్మరించి పొందుట తెలివికి విరుద్ధమైనట్లే సత్యవంతుల అనుభవమునకు కూడ విరుద్ధం.

*(హఖీఖతుల్ వహీ – రూహాని ఖజాయిన్ సంపుటి:22 పుట:115,116)*

అల్లాహ్ తఆలా మనతో ఏ నిజమైన దైవ ఏకత్వమును ఆశించుచున్నాడో, దేనిని అంగీకరించినచో మోక్షము లభించుననగా అల్లాహ్ తఆలాను తన ఉనికి పరంగా ప్రతి భాగస్వామి అనగా విగ్రహము కావచ్చును, మానవుడు కావచ్చును, సూర్యుడు కావచ్చును, చంద్రుడు కావచ్చును లేదా తన మనసు లేదా తన ప్రణాళిక, తన కుట్ర, మోసమునకు అతీతుడని భావించుట. అతనికి సమానంగా మరో

శక్తిమంతుడు లేడని నిర్ధారించుట. మరెవరిని ఆహారము నొసంగువానిగా నమ్మకపోవడం. మరొకరిని గౌవరమిచ్చువాడని, అగౌరవపర్చువాడని నమ్మకపోవడం. మరొకరిని సహాయకునిగా, సానుభూతిపరునిగా గుర్తించక పోవడం. తన ప్రేమను అతనికే పరిమితం చేయుట. అతణ్ని మాత్రమే ఆరాధించుట. తన వినయమును అతనికి మాత్రమే తెలుపుట. అతనితో మాత్రమే ఆశలు కోరుట. అతనితో మాత్రమే భయపడుట. ఈ క్రింది **మూడు** ప్రత్యేకతలు లేనిదే దైవ ఏకత్వము సంపూర్ణము కానే కాదు. **ఒకటి** ఉనికిపరంగా దైవ ఏకత్వము. అనగా అతని ఉనికి తప్ప ఇతర ఉనికిలన్నిటిని శూన్యముగా భావించుట. ఇతరులందరిని నాశనమగు, వాస్తవరహితమని భావించుట. **రెండవది** గుణముల పరంగా దైవ ఏకత్వము. అనగా రుబూబియ్యత్, (పోషణ) దైవత్వము గుణములలో మరొకరిని భాగస్వామిగా నమ్మకపోవడం. బాహ్యరూపంలో వివిధ రకాల సంరక్షకులు, శుభదాయకులు వాస్తవానికి దేవుని వ్యవస్థలో భాగమని నమ్ముట. **మూడవది** అతని ప్రేమ, సత్యము, నిష్కపటమైన దైవ ఏకత్వము. అనగా ప్రేమ మొదలగు దాసత్వ లక్షణములలో అల్లాహ్ తఆలాకు మరొకరిని భాగస్వామిగా చేయకుండా అతనిలోనే లీనమగుట.

*(సిరాజుద్దీన్ ఈసాయికె చార్ సవాలోఁకా జవాబ్ - రూహాని ఖజాయిన్ సంపుటి:12 పుట:349,350)*

నేడు దైవ ఏకత్వము, దైవ ఉనికి పట్ల అతి వేగంగా దాడులు జరుగుచున్నవి. క్రైస్తవులు కూడ చాలా వరకు కాళ్లు చేతులు ఆడించి ఎంతో వ్రాసినారు. కాని చెప్పిన, వ్రాసినదంతయు ఇస్లాం దేవుని గురించి మాత్రమే వ్రాసి శిలువపై ఎక్కించబడిన, బలహీన, జీవరహిత దేవుని గురించి వ్రాయలేదు. అల్లాహ్ తఆలా ఉనికి గురించి వ్రాసిన వ్యక్తికి తుదకు ఇస్లాం ప్రవేశ పెట్టిన దేవుని వైపే రావలసి వుండును. ఎందుకనగా సహజ స్వభావములోని ఒక్కొక్క భాగములో అతని చిరునామ లభించును.

సహజంగా ఆ దేవుని పోలికలనే మానవుడు కలిగి వున్నాడు.

*(మల్ఫూజాత్ సంపుటి:1 పుట:52 ఎడీషన్ 2003)*

ఈసా అలైహిస్సలాం గొప్ప ఆదర్శముగా ఋజువు కాలేరని క్రైస్తవ పెద్దలు గుర్తుంచుకోగలరు. క్రైస్తవులు కూడ జీవనము పొందక అందరి కంటే ఘోరంగా మృతుని వలె ఇరుకైన, అంధకార సమాధులలో పడి వున్నారు. అన్యారాధన గుంటలో పడిపోయి వున్నారు. వారిలో విశ్వాస ఆత్తరు లేదు, విశ్వాస ఆత్మ శుభము కూడ లేదు. ఇతర ప్రాణులను ఆరాధించకుండా యుండు క్రింది స్థాయి దైవ ఏకత్వము కూడ వారికి లభించలేదు. తమ లాంటి ఒక శక్తిహీనుడైన మానవుణ్ణి సృష్టికర్తగా భావించి పూజించుచున్నారు. దైవ ఏకత్వమునకు మూడు దశలు గలవని గుర్తుంచుకోగలరు. అన్నిటికంటే క్రింది స్థాయి ఏమనగా తమ లాంటి సృష్టి అయిన రాయిని, అగ్నిని, మానవుణ్ణి, నక్షత్రమును పూజించకూడదు. రెండవ స్థాయి ఏమనగా పోషక, సంరక్షణలో శాశ్వత స్థాయి కలిగించే విధంగా వస్తువులను కూడ నమ్మరాదు. సృష్టి మీద కాక సదా సృష్టికర్తను నమ్మవలెను. దైవ ఏకత్వ మూడవ స్థాయి ఏమనగా దైవ మహిమలను సంపూర్ణ రీతిలో గమనించి తమ ఉనికితో పాటు ఇతర ఉనికిలన్నిటిని శూన్యముగా భావించవలెను. ఉద్దేశమేమనగా సంపూర్ణ లక్షణములు, గుణములు గల అల్లాహ్ తఆలా ఉనికి తప్ప ప్రతి వస్తువు అతనికి నాశనమగునట్టిదిగా కనిపించవలెను. ఈ మూడు దశల దైవ ఏకత్వము లభించుటయే ఆధ్యాత్మిక జీవితము. ఆధ్యాత్మిక జీవిత చెలిమలన్నియు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం వల్లనే ప్రపంచము లో వచ్చినవని గ్రహించగలరు. సందేశహరులు కాకున్నా సందేశహరుల వలె అల్లాహ్ తఆలాతో సంభాషించే పక్షము ఇది మాత్రమే. ప్రవక్తలు కాకున్నా ప్రవక్తల వలె అల్లాహ్ తఆలా ప్రకాశవంతమైన చిహ్నములు దాని ద్వారా ప్రత్యక్షమగుచున్నవి. ఆధ్యాతిక నదులు దీనిలో ప్రవహించు చున్నవి.

దీనిని ఎదురించునదేది లేదు. శుభములు, సంకేతములను చూపుటలో పోటీగా నిలబడి ఈ మా ప్రకటనకు సమాధానమిచ్చే వారెవరైనా వున్నారా!!!

*(ఆయిన కమాలాతె ఇస్లాం - రూహానీ ఖజాయిన్ సంపుటి:5 పుట:223,224)*

**అన్యారాధన వలన కలిగే నష్టములు**

అన్యారాధనలో గల దుష్టత్వములు, లోపములను ప్రస్తావించుటకు నాకు పదములు లభించనందుకు విచారము. ప్రజల వద్దకు వెళ్లి కోరికలు కోరుట అనే విషయము అల్లాహ్ తఆలా ప్రకోపమునకు గురిచేయును. ఎందుకనగా ఈ నమాజ్ ప్రజల కొరకగును. కావున అల్లాహ్ తఆలా అతని నుండి దూరమై, అతణ్ణి తన నుండి దూరము విసిరి వేయును. సాధారణ పదాలలో నేను దీనిని వివరిస్తాను. ఈ విషయము పూర్తిగా ఇలాగే లేకున్నను మంచిగా అర్థము కావచ్చును. తన భార్య పర మనిషితో సంబంధము నెరుపుటను స్వాభిమానుడైన ఒక పురుషుడు భరించలేడు. ఆ పురుషుడు ఇటువంటి స్థితిలో ఆ దౌర్భాగ్యురాలైన స్త్రీని తప్పక హత్య చేయవలసిందిగా కోరును. ఇలాంటి సంఘటనలు కొన్ని సంభవిస్తాయి. ఇలాగే దైవ ప్రకోపము, ఉద్రేకము ఆశించును. ఆరాధన, ప్రార్థన దేవునికి మాత్రమే తగినది. మరొకరిని ఆరాధ్యదైవముగా భావించుట లేదా పూజించుటను అతడు ఇష్టపడడు. కనుక గట్టిగా గుర్తుంచుకోగలరు! మరల జాగ్రత్తగా గుర్తుంచుకోగలరు! అన్యారాధన వలన దేవుని నుండి దూరమగుదురు. నమాజ్ అయినను దైవ ఏకత్వమైనను పేరు ఏదైనా పెట్టవచ్చును. ఎందుకనగా దైవ ఏకత్వమును ఆచరణాత్మకంగా అంగీకరించుటయే నమాజ్ అనబడును. వినయము, వినమ్రత గల ఆత్మ, విధేయత గల హృదయము లేనంత వరకు నమాజ్ అశుభము, నిష్ప్రయోజనమగును.

*(మల్ఫూజాత్ సంపుటి:1 పుట:106,107 ఎడీషన్ 2003)*

అనేక రకాల అన్యారాధన గలదు. ఒకటి స్పష్టమైన పెద్ద

అన్యారాధన యున్నది. ఇందులో హిందువులు, క్రైస్తవులు, యూదులు, ఇతర విగ్రహారాధకులు బందీలైవున్నారు. వారు ఒక మానవుణ్ణి లేదా రాయిని లేదా నిర్జీవ వస్తువులను లేదా శక్తులను లేదా ఊహాజనిత దేవీలను, దేవతలను దేవునిగా మార్చుకున్నారు. ఇప్పటికి ఈ అన్యారాధన ప్రపంచము లో కొనసాగుచున్నది. కాని చైతన్యము, అవగాహన గల ఈ కాలములో ఇటువంటి అన్యారాధనను వివేకులు అసహ్యముగా చూడసాగిరి. తమ జాతీయ ధర్మమైనందున బాహ్య రూపంలో ఆయా అవివేకములను వారు అంగీకరించినను స్వభావపరంగా వాటిని ప్రజలు ద్వేషించుచున్నారు. కాని మరో రకమైన అన్యారాధన కూడ గలదు. అది రహస్యముగా విషము వలె వ్యాపించుచున్నది. ఈ కాలములో ఇది చాలా పెరిగి పోవుచున్నది. అనగా అల్లాహ్ తఆలాపై నమ్మకము పూర్తిగా లేకుండా పోయింది.

వస్తువులను అసలే వాడకూడదని మేము అనము, ఇది మా విశ్వాసము కూడ కాదు. ఎందుకనగా అల్లాహ్ తఆలా వస్తువులను వినియోగించాలని ప్రోత్సహించెను. అవసరమున్న మేరకు వినియోగించ వలెను కూడ. వస్తువులను ఉపయోగించనిచో మానవ శక్తులను అవమానపర్చుట, అల్లాహ్ తఆలా గొప్ప పనిని కించపర్చుటయే అగును. ఎందుకనగా వస్తువులను అసలే వినియోగించనిచో అల్లాహ్ తఆలా మానవునికి ప్రసాదించిన శక్తులన్నిటిని నిరుపయోగంగా విడిచి పెట్టి, వాటితో పని తీసుకోకపోవడమే అగును. వాటితో పని తీసుకోకపోవడం, వాటిని నిరుపయోగంగా విడిచి పెట్టడం అల్లాహ్ తఆలా పనిని వృథా, నిరుపయోగముగా చేయుటయే అగును. ఇదొక పెద్ద పాపము. కనుక వస్తువులను అసలే ఉపయోగించకూడదని మా ఉద్దేశము, విశ్వాసము కాదు. వస్తువులను వినియోగించుట ఎంతో ముఖ్యము. పరలోకము కొరకు కూడ వస్తువులు అవసరమగును. అల్లాహ్ తఆలా ఉద్దేశములను

ఆచరించుట, పాపముల నుండి దూరముండుట, ఇతర పుణ్యములను అవలంభించుట వలన ఇహ పరలోకములో సుఖము కలగును. అనగా ఈ పుణ్యములు వస్తువుల బదులు ఉపయోగపడును.

ప్రాపంచిక అవసరాలను పూర్తి చేసుకొనుటకు వస్తువులను వినియోగించకూడదని అల్లాహ్ తఆలా చెప్పలేదు. తన భార్యా పిల్లలు, తన సంరక్షణలో వున్న ప్రజలు, తన స్వంత అవసరాలను తీర్చుకొనుటకు ఒక ఉద్యోగి ఉద్యోగము చేయవలెను. వ్యవసాయకుడు తన వ్యవసాయ పనులలో నిమగ్నము కావలెను. కూలీ మనిషి కూలీ చేసుకోవలెను. సముచిత మార్గములో ఇవన్నియు సబబే. ఇది నిషేధం కాదు. కాని మానవుడు హద్దులు దాటి వస్తువులనే నమ్ముకొని, వస్తువులపైనే పూర్తిగా ఆధారపడినప్పుడు ఇది అన్యారాధన అనబడును. ఇది మానవుణ్ణి తన నిర్ణీత ఉద్ధేశము నుండి దూరము చేయును. ఉదా॥ ఫలానా వస్తువు లేనిదే నేను ఆకలితో మరణించే వాడిని అని ఒకరన్నచో లేదా ఈ ఆస్తి లేదా ఫలానా పని కానిచో నా పరిస్థితి అతలాకుతలం అయ్యేది, ఫలానా స్నేహితుడు లేనిచో కష్టమయ్యేది అనే విషయములను అనగా ఆస్తి లేదా మరో వస్తువులను, వ్యక్తులను నమ్మి అల్లాహ్ తఆలా నుండి పూర్తిగా దూరమగుటను అల్లాహ్ తఆలా అసలే ఇష్టపడడు. ఇదెంతో ప్రమాద కరమైన అన్యారాధన. ఇది పవిత్ర ఖుర్ఆన్ బోధనకు పూర్తిగా విరుద్ధమైనది. అల్లాహ్ తఆలా ఇట్లనెను. وَفِي السَّمَآءِ رِزْقُكُمْ وَمَا تُوعَدُونَ (అజ్జారియాత్ 51:23) (అనగా ఆకాశములో మీ ఆహారము దీనికి తప్ప వాగ్దానము చేయునదంతయు గలదు) وَمَنْ يَّتَوَكَّلْ عَلَى اللهِ فَهُوَ حَسْبُهُ (అత్తలాఖ్ 65:4) (అనగా అల్లాహ్‌ను నమ్మిన వానికి అతడు (అల్లాహ్) సరి పోవును) وَمَنْ يَّتَّقِ اللهَ يَجْعَلْ لَّهُ مَخْرَجًا ۔ وَّيَرْزُقْهُ مِنْ حَيْثُ لَا يَحْتَسِبُ (అత్తలాఖ్ 65:3,4) (అనగా అల్లాహ్‌కు భయపడు వ్యక్తికి అల్లాహ్ ఏదేని ముక్తి మార్గము చూపును. అతడు ఊహించని స్థలము నుండి అతనికి

ఆహారమొసంగును) وَهُوَ يَتَوَلَّى الصّٰلِحِيْنَ (అల్ఆరాఫ్ 7:197) (అనగా అతడు సన్మార్గులను రక్షించును). ఇటువంటి సూక్తులతో పవిత్ర ఖుర్ఆన్ నిండి వున్నది. అల్లాహ్ తఆలా ధర్మబద్ధులకు సంరక్షకుడు, పోషకునిగా అగును. మానవుడు ఈ వస్తువులు, కారణములను నమ్మినప్పుడు అల్లాహ్ తఆలా ఈ గుణములను నిరాకరించినట్లగును. ఆయా వస్తువులకు ఈ గుణముల నుండి భాగమిచ్చినట్లగును. మరో దేవుణ్ణి తమ కొరకు ఈ వస్తువుల రూపంలో నిర్ణయించుకొన్నట్లు అగును. ఎందుకనగా అతడు వాటి వైపు మోకరిల్లును. ఇలా అన్యారాధన వైపు అడుగు వేయును. పాలకుల వైపు మోకరిల్లిన లేదా బిరుదులు పొందుతారో వారి హృదయములో దేవుని వైభవము వలె వారి వైభవము ప్రవేశించును. తద్వారా వారు వారి పూజారులగుదురు. ఈ విషయమే దైవ ఏకత్వమునకు గొడ్డలి పెట్టు. కావున మానవుణ్ణి అతని అసలు కేంద్రము నుండి దూరము విసిరి వేయును. దైవ ఏకత్వము, వస్తువులలో వైరుధ్యము ఏర్పడకుండా రెండింటిని తమ తమ స్థానములో వుంచుకోవాలని సందేశహరులు అలైహిముస్సలాం బోధిస్తారు. తద్వారా దైవ ఏకత్వమును పాటించును. గౌరవములన్నియు, సుఖములన్నియు, అవసరాలను తీర్చువాడు అల్లాహ్ తఆలాయే. అతనికి పోటీగా మరొకరిని నిలిపినచో ఇద్దరు వ్యతిరేకులు పోటీపడ్డప్పుడు ఒకరు హతమగుట విధితమే. కావున దైవ ఏకత్వమును పాటించుట ముఖ్యము. వస్తువులను వాడవచ్చును. కాని వస్తువులను దేవునిగా భావించరాదు. ఈ దైవ ఏకత్వముతోనే అల్లాహ్ తఆలాతో ప్రేమ పుట్టును. ఎందుకనగా లాభనష్టాలు అతని చేతిలోనే వున్నవని మానవుడు భావించును. నిజమైన ఉపకారి అతడే. అణువణువు అతని అధికారములోనే గలదు. మరొకరు మధ్యలో రాలేరు. మానవుడు ఈ పవిత్ర స్థితిని పొందినప్పుడు అతడు దైవ ఏకత్వ విశ్వాసి అనబడును. మానవుడు రాళ్లను లేదా మానవులను లేదా మరో వస్తువును దేవునిగా

భావించకపోవడమే కాక వాటిని దేవునిగా భావించుటకు విసుగు, ద్వేషమును బహిర్గత పర్చుట ఒక రకమైన దైవ ఏకత్వము. వస్తువులను నమ్మకపోవడం రెందవ రకము. తన మనసు, ఉనికి ఉద్దేశములను కూడ మధ్యలో నుండి తొలగించి, నిరాకరించుట మూడవ రకము. కొన్ని సార్లు మానవుడు ఫలానా పుణ్యము నా శక్తితో చేసినానని తన విశిష్టత, ప్రత్యేకతను కూడ చూడును. మానవుడు తన శక్తిని ఎంతగా నమ్ము కొనుననగా ప్రతి పనిని తన శక్తికి అంటగట్టును. తన శక్తులను కూడ శూన్యమని భావించినప్పుడే మానవుడు దైవ ఏకత్వ విశ్వాసి అనబడును.

*(మల్ఫూజాత్ సంపుటి:2 పుట:56-58 ఎడీషన్ 2003)*

అనగా త్రిమూర్తిత్వ విశ్వాసము లేదా యేసు పరిహారమును విశ్వసించని వారు శాశ్వతంగా నరకములో పడవేయబడుదురని క్రైస్తవ ప్రజల విశ్వాసము.....అపరిమిత దేవుణ్ణి మూడు భాగస్వాములు లేదా నాలుగు భాగస్వాములలో పరిమితం చేయుట, తదుపరి ప్రతి తలను సంపూర్ణమని భావించుట, వరుస క్రమము అవసరమున్నదని, ఆరంభము లో దేవుడు వాక్కుగా వుండెనని, అదే వాక్కు మరియమ్మ గర్భములో పడెను, ఆమె రక్తముతో శరీరము పొందెను, సాధారణ మార్గము నుండి పుట్టెను, మానవునికి బాల్యములో ఎదరయ్యే బాధలన్నిటిని అతడు అనుభవించెను, చివరికి యువకుడై బంధించబడి శిలువపై ఎక్కించబడెను. ఇదెంతో మలినమైన అన్యారాధన. ఇందులో మానవుణ్ణి దేవునిగా చిత్రీకరించబడెను. ఒకరి గర్భములో పుట్టి, శరీర ఆకృతి పొంది, శత్రువుల చేతిలో బంధించబడు విషయములకు అల్లాహ్ తఆలా అతీతుడు. దేవుడు ఇటువంటి దుఃఖములకు గురగుట, ఈ ఆపదలను అనుభవించుట, సర్వ వైభవములకు యజమాని అయిన, సకల మర్యాదలకు చెలిమ అయిన దేవుడు ఈ అవమానములన్నిటికి గురగుటను మానవ స్వభావము అమోదించలేదు. దేవునికిది మొదటి అవమానకరమైన సందర్భము,

ఇంతకు ముందు దేవుడు ఇటువంటి అవమానములను ఎన్నడు ఎదుర్కోలేదని కూడ క్రైస్తవులు విశ్వసిస్తారు. దేవుడు కూడ మానవుని వలె ఒక స్త్రీ గర్భములో ఇంద్రియములో కలిసి ఉనికిగా ఇంతకు ముందెన్నడు మారలేదు. మానవులు దేవుని చర్చ విన్నప్పటి నుండి దేవుడు ఎన్నడు ఒక స్త్రీ గర్భము నుండి జన్మించలేదు. ఈ విషయములన్నిటిని క్రైస్తవులు స్వయాన అంగీకరిస్తారు. ఇంతకు ముందు ఈ ముగ్గురు భాగస్వాములు మూడు వేర్వేరు శరీరములు కలిగి లేకుండిరి, కాని ఈ ప్రత్యేక కాలములో అనగా ఇప్పటికి 1896 సం॥లు గడిచినవి ముగ్గురు వేర్వేరు శరీరములోకి మారిరని క్రైస్తవులు నమ్ముతారు. తండ్రి ముఖము ఆదమ్ వలె నున్నది. ఎందుకనగా అతడు ఆదమ్‌ను తన రూపంలో పుట్టించెను. చూడుము బైబిల్ పైదాయిష్ అధ్యాయము 1 సూక్తి 27. కుమారుడు యేసు రూపంలో ఆకారము పొందెను. చూడుము. యుహన్నా అధ్యాయము 1 సూక్తి 1. పరిశుద్ధాత్మ పావురం రూపంలోకి మారెను. చూడుము మత్తయి అధ్యాయము 3 సూక్తి 16.............దేవుని ఈ మూడు శరీరములు క్రైస్తవుల దృష్టిలో శాశ్వతంగా శరీరము, శాశ్వతంగా విడి విడి ఉనికి కలిగివున్నాయి. అయినను వీరు ముగ్గురు కలిసి ఒకే దేవుడవుతారు. ఈ శాశ్వత శరీరము, మార్పు కలిగినను ఈ ముగ్గురు ఒకే ఉనికి ఎలా అనబడగలరో ఎవరైనా మాకు అర్థమయ్యేటట్లు చెప్పగలరా! వేర్వేరు శరీర ఆకృతి కలిగివున్న డా॥ మార్టిన్ క్లార్క్, పాద్రి ఇమాదుద్దీన్, పాద్రి ఠాకర్‌దాస్‌ను ఒకటి చేసి ఎవరైనా మాకు చూపగలరా! ఈ ముగ్గురిని ముక్కలు చేసి రుబ్బిన తర్వాత ఒకరి మాంసము మరొకరితో కలిపినను దేవుడు ముగ్గురిగా చేసినందున ఒకటి కాలేరని మేము ఖచ్చితంగా చెప్పగలము. కలిపే లేదా విడదీసే అవకాశమున్న శరీరముతో వున్న ఈ నాశనమగు శరీరము గల జీవులను ఒకటి చేయలేనప్పుడు క్రైస్తవుల విశ్వాసము ప్రకారము కలిపే లేదా విడదీసేందుకు వీలు లేని

వారు ఒకటిగా ఎలా మారగలరు?

క్రైస్తవుల ఈ ముగ్గురు దేవుళ్ళు ఒక కమిటీకి ముగ్గురు సభ్యుల వలె వున్నారనుటలో అభ్యంతరమేమియును లేదు. ఈ ముగ్గురు ఏకగ్రీవంగా లేదా అధిక అభిప్రాయముతో ఏదైనా నిర్ణయము తీసుకోవడం జరుగుతుంది. అనగా దేవుని వ్యవస్థ కూడ ఒక లౌకిక రాజ్యమే. అనగా వారి దేవునికి కూడ వ్యక్తిగతంగా నిర్ణయము తీసుకునే అధికారము లేదు. ఆధారమంతా కౌన్సిల్ (సభ) మీదనే వున్నది. క్రైస్తవుల ఈ కల్పిత దేవుణ్ణి ఆసక్తిగల వారు చూడవచ్చును.

*(అన్‌జామె ఆథమ్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:11 పుట:34-36)*

క్రైస్తవ ధర్మములో దైవ ఏకత్వము నామమాత్రంగా కూడ లేదు. వారు నిజమైన దేవుణ్ణి విడిచిపెట్టి ఒక క్రొత్త దేవుణ్ణి తమ కొరకు నిర్ణయించుకొన్నారు. అతడు ఇస్రాయీలి సంతతి స్త్రీ కుమారుడు. వారీ ఈ క్రొత్త దేవుడు సర్వశక్తిమంతుడా? ఈ తీర్పు కొరకు స్వయాన అతని జీవితమే సాక్షి. అతడు సర్వశక్తిమంతుడైనచో యూదుల చేతుల దెబ్బలు తినేవాడు కాదు. రోమీ ప్రభుత్వము అతణ్ణి బంధించేది కాదు. శిలువపై శిక్షించబడకపోవును. శిలువ పై నుండి నీవు స్వయంగా దిగిరా! అప్పుడు మేము నిన్ను విశ్వసిస్తామని యూదులు ప్రతిపాదన చేసిరి. అప్పుడైనా దిగి రానుండెను. కాని అతడే సందర్భమున కూడ తన శక్తిని ప్రదర్శించ లేదు. ఇక అతని మహిమల గురించి మాట్లాడినచో ఇతర ప్రవక్తలతో పోల్చినచో అతని మహిమలు చాలా తక్కువే. ఉదా॥ బైబిల్‌లో వివరంగా ప్రస్తావించబడిన ఏలియా ప్రవక్త మహిమలలో మృతులను బ్రతికించుట అనే మహిమ కూడ వున్నదానిని మరియమ్మ కుమారుడు యేసు మహిమలతో పోల్చి ఒక క్రైస్తవుడు చూచినచో ఏలియా ప్రవక్త మహిమల స్థాయి, గొప్పతనము మరియమ్మ కుమారుడు యేసు మహిమల కంటే ఎంతో అధికమనని తెలుసుకొనును. యేసు మూర్ఛరోగులను నయం

చేసేవారనే మహిమ ప్రస్తావన ఇంజీల్‌లో తరచుగా జరిగినది. దీనిని పెద్ద మహిమ అని వారు గుర్తించినారు. కాని ఇది పరిశోధకుల దృష్టిలో హాస్యాస్పదమైనది. ఈ మూర్ఛరోగము బలహీన మెదడు వలన సోకుతుందని ఆధునిక పరిశోధనతో తేలిపోయినది. లేదా కొన్ని సార్లు మెదడులో ఒక గడ్డ ఏర్పడుతుంది లేదా మరో వ్యాధికి ఇది సూచిక అవుతుంది. కాని ఈ రోగమునకు కారణము జిన్నాతులు కూడ కావచ్చునని ఈ పరిశోధకులందరు ఎక్కడా వ్రాయలేదు.

యేసు మహిమ లేదా అతని పుట్టుక తీరులో అతను దేవుడని ఋజువయ్యే ఎలాంటి నిదర్శనము లేదు. ఈ విషయమును తెలుపుటకే అల్లాహ్ తఆలా యేసు పుట్టుకతో పాటు యహ్యా పుట్టుకను కూడ ప్రస్తావించెను. తద్వారా యహ్యా మహిమాన్విత పుట్టుక అతణ్ణి మానవుని పరిధి దాటించలేదో అలాగే మరియమ్మ కుమారుడు యేసు పుట్టుక కూడ అతణ్ణి దేవుని స్థాయికి చేర్చలేదు............................అతడు ఏ రూపంలోను సర్వశక్తిమంతుడు కానే కాడు. అతనికి పరోక్ష విషయములు అసలే తెలియవని ఇంజీల్‌తో స్పష్టంగా ఋజువైనది. ఎందుకనగా ఒక అంజీర ఫలము తినుటకు అంజీర వృక్షము వద్దకు వెళ్లెను. ఆ అంజీర వృక్షముపై ఎలాంటి ఫలము లేదని అతనికి తెలియ లేదు. ప్రళయ దినము సంభవించు విషయము నాకు తెలియదని స్వయంగా ఒప్పుకొనెను. అతడు దేవుడైనచో అతనికి తప్పక ప్రళయ దినము గురించి తెలిసి యుండవలెను. ఇదే విధంగా దేవుని గుణము ఒక్కటి అతనిలో లేదు. ఇతరులలో లేని విషయమేమియు అతనిలో లేకుండెను. అతను (ఈసా అలైహిస్సలాం) మృతి చెందెనని కూడ క్రైస్తవులు అంగీకరిస్తారు. ఏ జాతి దేవుడు మరణించునో ఆ జాతి ఎంతో దురదృష్టకరమైనది. మరల అతడు బ్రతికెననుటలో ఎలాంటి సంతృప్తి లేదు. తాను మరణించవచ్చునని నిరూపించిన వ్యక్తి జీవితము గురించి

నమ్మకమెలా కలుగును?

*(నసీమె దావత్ - రూహాని ఖజాయిన్ సంపుటి:19 పుట:378-382)*

మానవుని వలె వృద్ధాప్యమునకు చేరిన తర్వాత అతని శక్తులు బలహీనమైనటువంటి దేవుడు దేనికి పనికి వచ్చును. కాలానుగుణంగా అతని కొన్ని శక్తులు నిరుపయోగంగా కూడ మారెను. తనని తాళ్ళతో కట్టి, కొరడా దెబ్బలు కొట్టి, ముఖముపై ఉమ్మి వేసి, కొన్ని రోజులు కారాగారములో బంధించి తుదకు శిలువపై శిక్షించనంత వరకు తన దాసుల పాపములను క్షమించలేని దేవుని అవసరమేమిటి. మేము ఇటువంటి దేవుని పట్ల తీవ్ర విసుగు చెందియున్నాము. ఎందుకనగా తమ ప్రభుత్వ అధికారమును కూడ కోల్పోయిన యూదుల నీచ జాతి కూడ అతనిపై విజయము సాధించెను. మక్కాలోని ఒక నిరుపేద, నిస్సహాయునిని ప్రవక్తగా చేసి తన శక్తి, అధికార మహిమతో అదే కాలములో ప్రపంచానికి చూపిన దేవుణ్ణి మేము నిజమైన దేవుడని నమ్ముతాము. ఒక సారి ఈరాన్ రాజు మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను బంధించాలని తన సైనికులను పంపినప్పుడు ఆ సర్వశక్తి మంతుడైన అల్లాహ్ తఆలా తన ప్రవక్తతో ఇట్లనెను. నేటి రాత్రి నా దేవుడు మీ దేవుణ్ణి హతమార్చెనని సైనికులకు చెప్పుము. ఇచట గమనించవలసిన విషయమేమనగా ఒక వైపు ఒక వ్యక్తి తానే దేవుడనని ప్రకటించుకొనును. కాని చివరికి రోమ్ ప్రభుత్వ సైనికుడొకడు అతణ్ణి (ఈసాను) ఒకటి రెండు గంటల్లో బంధించి కారాగారములో పడవేస్తాడు. రాత్రంతా దుఆ చేసినా ఆమోదించబడలేదు. కాని మరో వైపు ఒక పురుషుడు కేవలం ప్రవక్తనని ప్రకటించుకొనెను. దేవుడు అతనికి పోటీగా నిలబడిన రాజులను హతమారుస్తాడు. ఒక అన్వేషకుని కొరకు "విజయుని వెంట వుంటే వజయుడవుతావు" అనె సామెత ఇచట ఉపయోగపడును. జీవరహిత ధర్మము మాకెందుకు. ప్రాణము లేని గ్రంథముతో మేమెలా

లబ్ది పొందగలము. మృతుడైన దేవుడు మాకెలా ప్రయోజనము కలిగించును.

(చశ్మ మసీహ - రూహాని ఖజాయిన్ సంపుటి:20 పుట:353)

వారే విషయము వైపు పిలుచుచున్నారో అదొక నీచమైన, సిగ్గుమాలిన విశ్వాసము. మానవునికి అవసరమున్న విషయములన్నింటిని కలిగి వున్న ఒక బలహీన మనిషిని దేవునిగా భావించుట ఒక వివేకవంతుడు స్వీకరించదగిన విషయమేనా? పుట్టించబడిన మానవుడు తనను పుట్టించిన దేవుణ్ణి కొరడా దెబ్బలు కొట్టుట, దేవుని దాసులు సర్వశక్తిమంతుడైన తమ దేవుని ముఖముపై ఉమ్మి వేయుట, అతణ్ణి పట్టుకొని సిలువపై ఎక్కించుట, అతడు దేవుడైనను వారిని ఎదుర్కోలేక పోవడమును వివేకము అంగీకరించునా? ఒకడు దేవుడై రాత్రంతా ప్రార్థన చేసినను అది ఆమోదించక పోవడమను విషయము ఎవరికైనా అర్థమగునా? దేవుడు కూడ శక్తిహీన పిల్లల వలె తొమ్మిది నెలలు కడుపులో వుండి, బహిష్టు రక్తము తిన్న తర్వాత రోధించుచు స్త్రీల మర్మాంగము నుండి పుట్టు విషయముతో ఏ హృదయమైనా సంతృప్తి చెందగలదా?

(కితాబుల్ బరియ్యహ్ - రూహాని ఖజాయిన్ సంపుటి:13 పుట:86.87)

## దైవమును స్తుతించు, స్మరించుట గూర్చి పద్యములు

## సకల లోకాల సంరక్షకునికి సకల సంకీర్తనములు

(ఉర్దు పద్యము)

1. కాంతికి స్రోతస్సు ఆ దేవుని కాంతి. విశ్వమంతా అతణ్ణి దర్శించడానికి కావలసిన కన్నుల కోసం ప్రతిబింబిస్తున్న దర్పణంగా రూపొందుతున్నది.
2. నిన్న రాత్రి నేను చంద్రుణ్ణి చూస్తున్నప్పుడు, ఆ చంద్రుని అందం లో నా ప్రియతముని జాడలు కనిపించినందుకు నేను విహ్వాలుణ్ణి అయినాను.
3. ఆ సమగ్ర సౌందర్య ప్రభావానికి నా హృదయమే సంచలించింది. తుర్కీల లేక తర్తారుల అందాల సంగతి ఇక నాకు చెప్పవద్దు.

4. ఓ నా ప్రియతముడా! నీ సృజన శక్తి ఎల్లెడల ఎంత పరమాశ్చర్య కరంగా మూర్తీభవించి ఉంది ? నేను ఏది చూసినా నీ సన్నిధానికి చేర్చే మార్గంగానే కనిపిస్తుంది.

5. సూర్యునిలోని కాంతుల ఊటల్లో నీ శక్తి తరంగాలు కనిపిస్తున్నవి. ప్రతి నక్షత్రం నీ కాంతితో మిల మిలా మెరుస్తున్నది.

6. నీవు నీ చేతులతో గాయపడిన గుండెలపై ఉప్పును చల్లినావు. బాధాతప్తులైన ప్రేమికుల ఆర్థనాదాలను మరింత ఉధృతం చేసినావు.

7. ఒక్కొక్క కణానికి ఎన్నెన్ని అద్భుత లక్షణాలను ప్రసాదించితివయ్యా! ఈ అద్భుత రహస్యాలలో ఇమిడియున్న వివరాలను ఎవరు చదవగలరయ్యా!

8. నీ సృష్టి ఆకృతిని సమగ్రంగా ఎవ్వడు సందర్శించలేడు. రహస్య మయమైన ఈ ప్రహేళికను ఎవడు విప్పగలడు?

9. నీ ఆకర్షణయే ప్రతి సౌందర్యానికి సారం. వికసించే ప్రతి కుసుమం తన రంగును నీ అనుగ్రహం వల్లనే పొందుతుంది.

10. మత్తెక్కించే అందాల కన్నులు ప్రతిక్షణం నిన్నే జ్ఞప్తికి తెస్తాయి. ఉంగురాలు తిరిగిన ప్రతి కబరీభరం నీ వైపు తన చూపుడు వ్రేలును ఎత్తుతున్నది.

11. కనులు లేని అంధులను వంద వంద తెరలు కమ్ముకొన్నవి. వాస్తవానికి నీ ముఖము ప్రతి అవిశ్వాసి, విశ్వాసికి కిబ్లా వలె స్పష్టము గానుండెను.

12. నీ ప్రియమైన చూపులు ఒక పదునైన కత్తి వలె గలవు. దాని ద్వారా అన్యారాధకుల వివాదము తక్షణమే సమసిపోవును.

13. నిన్ను కలిసేందుటకు మేము మట్టిలో కలిసిపోతిమి. తద్వారా ఈ ఎడబాటు బాధ కొంతైనా తగ్గునని భావించితిమి.

14. నీవు లేనిదే ఒక్క క్షణం కూడ నాకు మనశ్శాంతి లభించదు. ఒక

రోగి హృదయము కలత చెందినట్లే నా ప్రాణము కూడ కంపించిపోవును.
15. నీ వీధిలో ఎటువంటి అల్లరి అవుతుందో త్వరగా తెలుసుకో. ఒక ప్రేమ పిశాచి హత్యకు గురికావచ్చును.

*(సుర్మయె చశం ఆరియా - రూహానీ ఖజాయిన్ సంపుటి:2 పుట:52)*

**ధార్మికోద్దేశము కొరకు సమర్పణ**

(ఉర్దు పద్యము)

1. మా సంపద మొత్తం ఇప్పుడు ప్రేమికునిదై పోయినది. నేడు మేము ప్రేమికుని వారము, ప్రేమికుడు మా వాడైపోయెను.
2. అమూల్యమైన వజ్రము మాకు లభించినందున అల్లాహ్‌కు కృతజ్ఞతలు. కనుక జాతి హృదయము రాయి వలె మారినను ఎలాంటి ఇబ్బంది లేదు.

*(ఇజాల ఔహామ్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:3 పుట:459)*

**నా సంరక్షకుని గొప్పతనము నిరుపమాణం**

(ఉర్దు పద్యము)

1. ఆ అనంతునికే శ్లాఘనములన్నీ. అతనికి సముడు లేడు, అతని వంటివాడు ఎవడూ లేడు.
2. అతడు ఎప్పుడూ వుంటాడు. ఇతరులు వస్తారు, పోతారు. అతణ్ణి కాక మరెవ్వరినైనా ప్రేమిస్తే అది మిథ్య.
3. అతడే నా హృదయాకాంక్ష, ఇతరం నేనెరుగను. నా దృష్టిని నిలిపినవాడే పవిత్రుడని నా హృదయం ఘోషిస్తుంది.
4. ఎంతో పవిత్రమైన ప్రకృతి శక్తి, అతని గొప్పతనము సాటిలేనిది. సమీపులు, దూరమున్నవారందరు భయభ్రాంతులైనారు.
5. అతని కరుణ అందరికి అందును, ఈ వరమునకు కృతజ్ఞత ఎలా చెప్పగలము, మనమందరము అతని సృష్టియే, కనుక అతణ్ణే ప్రేమించగలరు.
6. ఇతరులను ప్రేమించుట అతని ప్రకోపము ఎలా భరించును, ఈ

దినము శుభాస్పదమగును గాక! నా దృష్టిని నిలిపినవాడే పవిత్రుడు.

7. మనకు కలిగిన సుఖమంతయు అతని ఉపకారమే, హృదయపూర్వకంగా అతణ్ణి నమ్మినాము, హృదయమంతా అతని వైభవము గలదు.

8. అతని (అల్లాహ్) విధేయతే చాలా మేలైనది, విధేయతలోనే సత్కారము గలదు, ఈ దినము శుభాస్పదమగును గాక! నా దృష్టిని నిలిపినవాడే పవిత్రుడు.

9. అతడు అందరిని అనుగ్రహిస్తాడు. మూర్తీభవించిన అనుగ్రహం అతడు. మనకు అతడే సౌఖ్యాన్ని అందిస్తాడు. అతడే మనకు ప్రేమ మూర్తి.

10. అతడు లేనిదే మనము బ్రతుకలేము. అతడు తప్ప అంతా అసత్యం. ఈ దినము శుభాస్పదమగును గాక ! నా దృష్టిని నిలిపినవాడే పవిత్రుడు.

11. ఓ పోషకుడా! నీ ఉపకారమే గలదు. నీ ఆస్థానములో నేను త్యాగమగుదును. విశ్వాసము నీవే ప్రసాదించితివి, నీవు ప్రతి కాలములో పర్యవేక్షకుడవు.

12. అనుక్షణం నీ దయ గలదు, నీవే దయామయుడవు, పరమ కారుణ్యమూర్తివి. ఈ దినము శుభాస్పదమగును గాక! నా దృష్టిని నిలిపినవాడే పవిత్రుడు.

13. నీకు కృతజ్ఞత ఎలా తెలుపగలను, నాదంతా నీదే, నీవే అన్ని రకాల కరుణతో గృహమంతా నింపివేసితివి.

14. నీ జ్యోతి రాగానే అంధకారమంతా కనుమరుగై పోయెను, ఈ దినము శుభాస్పదమగును గాక! నా దృష్టిని నిలిపినవాడే పవిత్రుడు.

*(మహ్మూద్ కి ఆమీన్ - రూహాని ఖజాయిన్ సంపుటి:12 పుట:319-320)*

**ముబారక్ అహ్మద్ సమాధిపై వ్రాసిన ప్రశంసనీయ పంక్తులు**

(ఉర్దు పద్యము)

1. కాలేయ ముక్క అయిన ముబారక్ అహ్మద్ అందమైన ముఖము, మంచి రూపము కలిగియుండెను, మమ్ములను దఃఖమునకు గురి చేసి

అతడు నేడు మాతో విడిపోయెను.

2. నాకు నిద్ర వచ్చుచున్నదని చివరి మాటలు మాట్లాడెను. కాని అతడు నిద్రకు ఉపక్రమించి మరల లేవ లేదు, ఎన్నో సార్లు నిద్ర లేపి మేమే అలసటకు గురైతిమి.

3. అతణ్ణి దేవుడు పిలిచినప్పుడు అతని వయసు 8 సం॥లు, కొన్ని నెలలు యుండెను, పిలుచువాడు అందరికంటే ప్రియమైనవాడు, ఓ మనసా! నీవు అతనికే ప్రాణమంకితము చేయుము.

*(దుర్రె సమీన్ ఉర్దు)*

**ఓ మిత్రులారా! అతణ్ణి ఒంటరిగా అన్వేషించండి**

(ఉర్దు పద్యము)

1. అతడు చూస్తుండగా ఇతరుల పట్ల ఎందుకు మనసు పెట్టుకుంటున్నారు, అతనిలో లేనిదేది విగ్రహములలో గలదు.

2. సూర్యుని గురించి ఆలోచించి కూడ ఆ కాంతి పొంద లేదు, చంద్రుణ్ణి చూడగా అది మిత్రుని వలె లేకుండెను.

3. అతడొక్కడే, అతనికి భాగస్వామి ఎవరు లేరు, అందరు మరణానికి గురవుతారు, అతడు అంతము కాడు.

4. అతని ద్వారనే మేలు మొత్తం లభించును, అతన్నే వేడుకొనుము, ఓ మిత్రులారా! అతన్నే అన్వేషించడి, విగ్రహములలో విశ్వసనీయత లేదు.

5. శిక్షకు గురి చేసే ఇహలోకమును ఎందుకు ఆశించుచున్నారు, ఈ స్థానము ఒక నరకము, ఇది శాంతి కలిగించే తోట కానే కాదు.

*(తష్‌హీజుల్ అజ్‌హాన్ డిసెంబర్ 1908 పుట 485 - దుర్రె సమీన్ పుట 152)*

**నా శత్రువులను అవమానపర్చిన అల్లాహ్‌యే పవిత్రుడు**

(ఉర్దు పద్యము)

1. ఓ అల్లాహ్! నీవు సర్వశక్తిమంతుడవు, నిన్ను పొందినచో ప్రతి అవసరము నెరవేరును.

2. ప్రతి ప్రేమికుడు ఒక విగ్రహము సిద్ధము చేసుకొనెను, మా హృదయములో ఈ ప్రియుడు (అల్లాహ్) స్థానమేర్పరచుకొనెను.

3. అతడే మనశ్శాంతి అయ్యెను, మనసుకు నచ్చెను, అతణ్ణే మేము సకల లోకాల సంరక్షకుడని అంటాము.

4. అతడు నా పై భహిరంగంగా ప్రత్యక్షమయ్యెను, నా శత్రువులను అవమానానికి గురి చేసిన అల్లాహ్ పవిత్రుడు.

5. ఆ మిత్రునితో నాకు ప్రత్యేక సంబంధము గలదు, అతడే స్వర్గము, అతడే శాంతి నిలయం.

6. అతని గురించి ప్రసంగించుటకు శక్తి ఎక్కడిది, ప్రేమపూర్వక ఒక కాలువ ప్రవహించుచున్నది.

7. ఓ నా మాగర్గదర్శకుడా! నీ ఉపకారములు నాపై అనేకం. నా శత్రువులను అవమానానికి గురి చేసిన అల్లాహ్ పవిత్రుడు.

8. నీ వరములలో ఎలాంటి కొరత లేదు, ఏ ఘడియ కూడ నిన్ను విడిచి వుండలేము.

9. శుభము, అనుగ్రహమును లెక్కించలేము, కనుక నాకిప్పుడు కృతజ్ఞత తెలుపుటకు కూడ శక్తి లేదు.

10. ఓ నా మాగర్గదర్శకుడా! నీ ఉపకారములు నాపై అనేకం. నా శత్రువులను అవమానానికి గురి చేసిన అల్లాహ్ పవిత్రుడు.

11. ఏ మార్గములచే నీ దరి చేరగలను, ఏ సేవ చేసి నిన్ను పొందగలను.

12. ప్రేమతోనే నేను ఆకర్షితుడగుచున్నాను, దైవత్వము వల్లనే నా గర్వము దహనమగుచున్నది.

13. ప్రేమ ఎలాంటిదోనని ఎవరికి చెప్పను, విశ్వసనీయత ఎటువంటి రహస్యమో ఎవరికి వినిపించెదను.

14. నేనీ గాలి దుమారాన్ని గుప్తముగా ఎలా వుంచగలను, నా మట్టిని గాల్లో ఎగిరేయడమే ఇక ఉత్తమం.

15. మేమెక్కడున్నాము, ఈ వస్తుమయమైన ప్రపంచము ఎక్కడున్నది. నా శత్రువులను అవమానానికి గురి చేసిన అల్లాహ్ పవిత్రుడు.

*(దుర్రె సమీన్ ఉర్దు)*

**సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కే సకల సంకీర్తనములు**

(ఉర్దు పద్యము)

1. ఆ సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కే సంకీర్తనము, కృతజ్ఞత అనివార్యము, అతని ఉనికి వల్లనే ప్రతి వస్తువు ప్రత్యక్షమయ్యెను.

2. ఈ ప్రపంచము అతని ముఖమును చూపుటకు ఒక దర్పణం వంటిది, అణువణువు అతని వైపే మార్గము చూపును.

3. అతడు భూమ్యాకాశముల దర్పణములో తన నిరుపమాణ ముఖమును చూపెను.

4. గ్రాసములోని ప్రతి ఆకు అతని స్థాయి, అంతస్తు జ్ఞానము కలిగివున్నది, వృక్షముల ప్రతి కొమ్మ అతని మార్గమునే చూపును.

5. సూర్యచంద్రాదుల కాంతి అతని జ్యోతి వల్లనే ఏర్పడినది. అతని రాజరిక ఆజ్ఞతోనే ప్రతి వస్తువు బహిర్గతమగును.

6. ప్రతి వస్తువు అతని రహస్యముల కర్మాగారములోని ఒక రహస్యము, ప్రతి అడుగు అతని వైభవోపేతమైన ద్వారమును అన్వేషించుచున్నది. (ప్రపంచములోని ప్రతి వస్తువు ద్వారా దైవ ఉనికి గురించి తెలియును)

7. అతని ముఖ అందమును పొందుటయే ప్రతి ఒక్కరి ఉద్ధేశము, దుర్మార్గుడు కూడ అతని ఆస్థానమునే అన్వేషించుచున్నాడు.

8. అతడు చంద్రుడు, నక్షత్రములు, భూమిని సృష్టించడమే కాక లక్షలాది వస్తువులను పుట్టించెను.

9. అతని ఈ వస్తువులన్ని అతని కర్మాగార కార్యాలయము, వాటిలోనే అతని అనంత రహస్యములు గలవు.

10. ఇది ప్రకృతి పుస్తకము, మనము మార్గదర్శనము పొందుటను

గుర్తుంచుకొనుటకు అతడు దీనిని మనముందుంచెను.

11. తద్వారా ప్రపంచ వాసులతో, ప్రపంచముతో పోలికలు లేని అల్లాహ్‌ను మీరు గుర్తుంచుకొందురు గాక!

12. దైవవాణి కొరకు ఇదొక ప్రమాణమగుగాక! వేలాది వాఖ్యానములలో అతని వాఖ్యానమును మీరు గుర్తించుకొందురు గాక!

13. మోసపూరిత ఏ మార్గము తెరిచియుండకుండా, చీకటి నుండి కాంతి దూరమగుగాక!

14. ఆ అల్లాహ్ కోరినదే అయినది, అతని పనులు అతని వాఖ్యానమునకు సాక్ష్యముగా నిలిచినవి.

15. అన్యారాధకులు చూపే సాకులను ఈ సాక్ష్యము (దేవుని మాటలు, చేతలు) బాణములతో ముక్కలు ముక్కలు చేయును.

16. నీవు మరొకరిని దయామయుడైన దేవుడని నిర్ణయించుకొన్నచో భూమ్యాకాశములు నీ ముఖముపై ఉమ్మివేయును.

17. ఆ ఒంటరి వాడైన (అల్లాహ్) కు ఒక కుమారుడున్నాడని నీవు నిర్ధారించుకొన్నచో (విశ్వసించినచో) క్రింది నుండి, పై నుండి నీపై శాపములు పడును.

18. ఆ దేవుడు ఒంటరివాడు, స్వయంభువు అని ఈ ప్రపంచము తన స్థితితో ప్రకటించుచున్నది.

19. అతనికి తండ్రి లేడు, కుమారుడు లేడు, భార్య లేదు, ఆది నుండి అతనిలో ఎలాంటి మార్పు లేదు.

20. ఒక్క క్షణం కొరకు కూడ అతని శుభ వర్షము తగ్గినచో ఈ ప్రాణులు, ప్రపంచము మత్తం తలక్రిందులగును.

21. ఆ సకల లోకాల సంరక్షకుణ్ణి గుర్తించుటకు ఒక సారి నీవు ఈ ప్రకృతి చట్టాన్ని గమనించుము.

*(జియావుల్ హఖ్ – రూహాని ఖజాయిన్ సంపుటి:9 పుట:251,252)*

**భూమ్యాకాశముల సృష్టికర్త ఆరాధన**

(ఫార్సి పద్యము)

1. భూమ్యాకాశములను పుట్టించిన ఓ సృష్టికర్త! నాపై కరుణమాయ ద్వారమును తెరువుము. నేను ఇతరులతో గుప్తముగా నుంచుచున్న బాధ నీకు తెలుసు.

2. ఓ ప్రియుడా! నీవు చాలా మధురం, నా నర నరాలలో ప్రవేశించుము, నిన్ను నాలో పొందినప్పుడు నేను నా హృదయమును తోట కంటే అందముగా పొందుదును గాక!

3. ఓ సద్గుణముల యజమాని! నీవు తిరస్కరించినచో నేను ప్రాణ త్యాగము చేయుదును, ఒక ప్రపంచము ఏడ్చేంత నేను ఏడ్చుదును.

4. నీవు కోపగించుకొని దూరము చేసినా లేదా కనికరించి తమ ముఖము చూపినా, నీవు దండించినా లేదా విడిచినా నేను నీ ఆస్థానమును వీడను.

*(బరాహీనె అహ్మదియ్య 4 భాగములు - రూహానీ ఖజాయిన్ సంపుటి:1 పుట:613 ఉపఅధోదీపిక నం.3)*

**ఓ అల్లాహ్! నీవే నా కష్టములను తీర్చువాడవు**

(ఫార్సి పద్యము)

1. ఓ అల్లాహ్! ఓ మా బాధల ఔషధమా! ఓ మా రోధనల చికిత్స!

2. గాయాలపాలైన మా ప్రాణముపై ఔషధ పట్టి కట్టువాడా! దుఃఖములో మునిగిన మమ్ములను ఆనందపెట్టువాడా!

3. నీవు స్వయంగా కనికరించి మా భారములన్నిటిని ఎత్తుకొంటివి, నీ శుభము వలన మా వృక్షములపై ఫలములు గలవు.

4. నీవే నీ దయతో మాకు రక్షకునిగా, కప్పిపుచ్చువాడవైతివి, అతి కరుణతో నిస్సహాయుల సహకారివైతివి,

5. మానవుడు బాధ, దుఃఖమునకు గురైనప్పుడు నీవే అతనికి పరిష్కారము చూపెదవు.

6. ఒక నిస్సహాయుని మార్గములో చీకటి అలమటించినప్పుడు సత్వరమే నీవు వందలాది సూర్యులు, చంద్రులను పుట్టిస్తావు.

7. ఉత్తమ అందము, సత్ప్రవర్తనలు నీలోనే గలవు, నీతో భేటి అయిన తర్వాత మరొకరిని కలవడం నిషేధమై పోవును.

8. నిన్ను పొందుటకు ప్రయత్నించిన వ్యక్తి వివేకి, నిన్ను పొందిన వ్యక్తి ఇతరులకు ప్రకాశించుచున్న దీపము వలె మారును.

9. నీ ప్రేమ ఏ వ్యక్తి ప్రాణము, హృదయములో ప్రవేశించునో అతని విశ్వాసములో తక్షణమే ప్రాణము ఏర్పడును.

10. నీ ప్రేమ అతని ముఖము నుండి వెలువడును, అతని గృహము, గోడల నుండి నీ సువాసన వచ్చును.

11. నీవు అతనికి తన దయానుగ్రహముతో లక్షలాది వరములు ప్రసాదిస్తావు, సూర్యచంద్రులను అతని ముందు సాష్టాంగము చేయిస్తావు. (అన్ని రకాలుగా అతనికి సహాయమందును)

12. అతని సహాయానికి నీవు స్వయముగా సిద్ధమౌతావు, అతణ్ణి దర్శించినచో నీ ముఖము గుర్తుకు వచ్చును.

13. అతని గౌరవము కొరకు నీవు ఎన్నో విశిష్టమమైన పనులను వెల్లడిస్తావు.

14. నీ ద్వారనే ప్రతి పని జరుగను, నీవే చేయిస్తావు, నీవే ఈ వీధిని ప్రకాశింప జేస్తావు.

15. నీవు మట్టిని సైతం అకస్మాత్తుగా విలువైనదిగా మార్చుతావు, ప్రాణులు కాంతిని పొందుటకు దానిని ప్రత్యక్షపరుస్తావు.

16. నీవు ఒకరిని కరుణించదలచినప్పుడు అతని స్థాయిని పాతాళము నుండి ఆకాశానికి చేరుస్తావు.

*(బరాహీనె అహ్మదియ్య 4 భాగములు - రూహానీ ఖజాయిన్*

*సంపుటి:1 పుట:613 ఉపఅధోదీపిక నం.3)*

**ప్రేమ**

(ఫార్సి పద్యము)

1. నీ ప్రేమ వేలాది వ్యాధులకు ఔషధము, నీ ఉనికి ప్రమాణముగా నీ బందీ అగుటలోనే వేలాది స్వతంత్రతలు గలవు.

2. నీ శరణమును అన్వేషించుట అవివేకుల పద్ధతి కాదు, నీ శరణములో వచ్చుటయే గొప్ప వివేకము.

3. నీ ప్రేమ సంపదను నేను రహస్యముగా వుంచనే వుంచను, ఎందుకనగా నీ ప్రేమను రహస్యముగా యుంచుట తిరుగుబాటగును.

4. నేను నా ప్రాణము, హృదయమును నీ కొరకు త్యాగము చేయుటకు సిద్ధముగా యున్నాను, ఎందుకనగా ప్రాణము ప్రియునికి అప్పగించుటయే నిజమైన స్నేహమనబడును.

*(ఆయిన కమాలాతె ఇస్లాం - రూహానీ ఖజాయిన్ సంపుటి:5 పుట:1)*

**ప్రేమ**

(ఫార్సి పద్యము)

1. నా ముందట ఏ రాజు గురించి ప్రస్తావించకు, ఎందుకనగా నేను మరొకరి ద్వారమును ఆశించుచున్నాను.

2. అనగా ప్రపంచానికి జీవితము నొసంగు అల్లాహ్, ఆరంభించువాడు, సృష్టికర్త, పోషకుడు అతడే.

3. అతడే దానకర్త, ప్రతిదాని పై సంపూర్ణ అధికారము గలవాడు, కష్టములను తీర్చువాడు, కారుణ్యమూర్తి, ఉపకారి, అవసరాలను తీర్చువాడు.

4. నేను అతని ఆస్థానమున పడివున్నాను, ప్రపంచములో ఒక పని చేసినచో మరో పని కూడ పూర్తగునను సామెత గలదు.

5. ఆ మిత్రుడు, విశ్వసనీయుడు నాకు గుర్తుకు వచ్చినప్పుడు ప్రతి బంధువు, మిత్రువున్ని నేను మరచిపోతాను.

6. నేను అతణ్ణి విడిచి మరొకరి పట్ల ఎలా ఆకర్షితుణ్ణి కాగలను, ఎందుకనగా అతణ్ణి విడిచి నాకు శాంతి కలుగదు.

7. గాయపడిన హృదయములో నా హృదయమును అన్వేషించకు, ఎందుకనగా మేము దానిని ఒక ప్రియుని యదకు జత చేసినాను.

8. నా హృదయము ప్రియుని సింహాసనము, నా తల మిత్రుని మార్గములో త్యాగమైనది.

9. నాపై అతని శుభము ఎలాగున్నదో నేనెలా చెప్పగలను, ఎందుకనగా అతని శుభము అంతముకాని ఒక సముద్రము.

10. అతని అనుగ్రహములను నేనెలా లెక్కించగలను, ఎందుకనగా అతని అనుగ్రహములు అనన్యమైనవి.

11. ఆ ప్రియునితో నాకు గల సంబంధము ఎవరికి తెలియదు.

12. ప్రసవ సమయములో గర్భవతి రోధించినట్లు నేను అతని ద్వారమున రోధిస్తాను.

13. అతని ప్రేమతోనే నా సమయము గడిచిపోవును, ఇదెంత మంచి సమయము, ఎంత మధురమైన కాలము.

14. ఓ ప్రియుని పుష్పమా! నీ స్థాయి ఎంతో గొప్పది, ఎందుకనగా నీవు నాకు ప్రపంచ తోటల అవసరము లేకుండా చేసితివి.

*(హుజ్జతుల్లాహ్ - రూహానీ ఖజాయిన్ సంపుటి:12 పుట:149)*

**సమర్పణ**

(ఫార్సీ పద్యము)

1. ఓ నా ప్రియుడా! నీవెంత అందమైనవాడవు, ఓ నా దైవమా! నీ అలవాట్లు ఎంత మధురమైనవి.

2. నేను నీ ముఖమును చూచినప్పుడే నీకు హృదయము సమర్పించితిని, నీవు తప్ప ప్రపంచములో నాకెవరు లేరు.

3. ఇహపరలోకాలను త్యాగము చేయుటకు నేను సిద్ధమే, కాని నీ ఎడబాటు

నా ఎముకలను కూడ దహనం చేయును.

4. శరీరమును అగ్నిలో సునాయసంగా వేయవచ్చును. కాని నీ ఎడబాటు వలన నా ప్రాణము ఆర్తనాదాలు చేయుచు మృతి చెందును.

*(హఖీఖతుల్ వహీ - రూహాని ఖజాయిన్ సంపుటి:22 పుట:355-356)*

**అల్లాహ్ వైభవము కొరకు కృషి**

(ఫార్సి పద్యము)

1. ఎన్నడు అంతము కాని ఓ అల్లాహ్! నీ ముఖము నాకు సరిపోవును, వేలాది స్వర్గముల కంటే నీ వీధి నాకు మేలైనది.

2. ఏదో పని వలన నేను మరో వైపు చూస్తాను, కాని అనుక్షణం నా చూపు నీ వైపే వుంటుంది. (అనగా సదా నిన్నే గుర్తు చేసుకుంటుంటాను.)

3. ఎవరైనా నా గౌరవమును భంగమపర్చినచో నీ వలె నేను కూడ సహనము పాటిస్తాను.

4. నేనెవరిని ? నా గౌరవమేమిటి ? నేను చేయుచున్న యుద్ధమంతా నీ వైభవమును చాటుటకే.

*(జమీమ బరాహీనె అహ్మదియ్య 5 - రూహాని ఖజాయిన్ సంపుటి:21 పుట:153)*